


KANCHARLA

# మనసులో మాట

సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 188 శనివారం 07 మార్చి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు 25 :- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్

## ప్రపంచం దృష్టిని ఆకర్షించే వేదిక



- రేపు ఢిల్లీలో 110 దేశాల ప్రతినిధులతో సదస్సు...
- ఏపీ బ్రాండ్ ఇమేజ్‌పై సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్
- ఢిల్లీలో రైసినా డైలాగ్ 2026 సదస్సు
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- సాంకేతికత వినియోగం మరియు సుపరిపాలనపై కీలక ఉపన్యాసం చేయనున్న ముఖ్యమంత్రి
- సదస్సుకు హాజరుకానున్న 110 దేశాలకు చెందిన 2,700 మంది అంతర్జాతీయ ప్రతినిధులు
- రియల్ టైమ్ గవర్నెన్స్ సహా ఏపీ మోడల్‌ను ప్రపంచానికి వివరించనున్న చంద్రబాబు

**అమరావతి**

ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తిని మరోసారి చాటేందుకు, రాష్ట్రంలో అమలు చేస్తున్న వినూత్న పాలనా విధానాలను అంతర్జాతీయ సమాజానికి వివరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధమ య్యారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరగనున్న అత్యంత ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ఆయన శనివారం హాజరుకా నున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సులో సీఎం పాల్గొని, 'సాంకేతికత – సుపరిపాలన', భవిష్యత్ సవాళ్లు అనే అంశాలపై కీలక ఉపన్యాసం చేయనున్నారు. - మిగతా3లో



## భారత వ్యవసాయ ఉత్పత్తులు ప్రపంచంతో పోటీ పడాలి

- ప్రధాని మోదీ
- వ్యవసాయ ఉత్పత్తుల ప్రమాణాలను, నాణ్యతను, బ్రాండింగ్‌ను ప్రోత్సహించాలి
- భారత వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచ గుర్తింపు రావాలి
- దేశంలోని వైవిధ్యంతో కూడిన వాతావరణ పరిస్థితులను రైతులు తమకు అనుకూలంగా మార్చుకోవాలి

## ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు అస్వస్థత



- చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు
- శాసనమండలిలో మళ్లీ స్వల్ప అస్వస్థత గురైన విపక్ష నేత బొత్స సత్యనారాయణ
- బీపీలో హెచ్చుతగ్గులు
- మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు బొత్స

**అమరావతి**

వైఎస్సార్సీపీ నేత, ఏపీ మండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ అస్వస్థత కు గురయ్యారు. బొత్స సత్యనారాయణ ఆరోగ్యం నిలకడగా లేనట్లు తెలుస్తుంది. ఇటీవల తరుచూ ఆయన అస్వస్తకు గురవ్వడమే దానికి నిదర్శనం. వారం రోజుల క్రితం ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. - మిగతా3లో

## దేశ అభివృద్ధికి అంతర్గత భద్రత ఎంతో ముఖ్యం



- దేశానికి మార్చి చివరికల్లా నక్సలిజం నుంచి విముక్తి
- నక్సలిజం నిర్మూలనలో సీఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషించిది
- రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలనుకున్న వారిని భద్రతాదళాలు ఓడించాయి



## బిహార్‌లో తొలి బీజేపీ సర్కార్

సీఎం, డిప్యూటీ సీఎం పదవులు ఎవరిని వరించొచు?

బిహార్ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు

రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా నీతీశ్ నామినేషన్

సీఎం, డిప్యూటీ సీఎం పదవులు ఎవరిని వరించొచ్చు?

## ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ దూకుడు

- రూ.441.63 కోట్ల విలువైన ఆస్తులు అటాచ్
- కెసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుటుంబం, బూనేటి చాణక్య ఆస్తుల జప్తు
- డిస్టిలరీల నుంచి 15 నుంచి 20 శాతం ముడుపులు వసూలు చేశారని ఆరోపణ
- పారదర్శక విధానాన్ని మార్చి మాన్యువల్ విధానంతో అక్రమాలు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితులుగా ఉన్న కెసిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, ఇతర నిందితులకు చెందిన రూ.441.63 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేస్తున్నట్లు శుక్రవారం ఈడీ అధికారికంగా ప్రకటిం చింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈ ఆస్తులను జప్తు చేశారు. ఈడీ తెలిపిన వివరాల ప్రకారం.. జప్తు చేసిన ఆస్తుల్లో కెసిరెడ్డి రాజశేఖర రెడ్డి, బూనేటి చాణక్య, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి తదితరులకు చెందిన బ్యాంక్ బ్యాలెన్సులు, ఫిక్స్‌డ్ - మిగతా3లో



## లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు

- ఇరాన్ బేషరతుగా లొంగిపోతేనే ఒప్పందం ఉంటుందన్న ట్రంప్
- యుద్ధం ముగిశాక ఇరాన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని హామీ
- ట్రంప్ సరికొత్త నినాదం.. 'మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్'
- హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను ముంచేసిన అమెరికా సబ్‌మెరైన్
- యుద్ధం దెబ్బకు 90 డాలర్లకు చేరిన ముడిచమురు ధరలు

## 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

- కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం
- 90 రోజుల్లోగా చర్యలు చేపడతామన్న సీఎం చంద్రబాబు
- 13 నుంచి 16 ఏళ్ల వయసు వారిపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని వెల్లడి
- జాతీయ స్థాయిలోనూ పాలసీ తేవాలని కోరిన టీడీపీ



**అమరావతి**

ఏపీలో 13 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను బ్యాన్ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మంత్రి నారా లోకేశ్ దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇప్పుడు తాజాగా సీఎం చంద్రబాబు అసెంబ్లీలో పిల్లలు సోషల్ మీడియా వినియోగించకుండా నిషేధం విధించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తమ రాష్ట్రంలోని 16 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధిస్తున్నట్లు తాజాగా వెల్లడించారు. పిల్లలు మొబైల్ ఫోన్ వ్యసనం బారినప డకుండా అడ్డుకోవడానికే ఈ ముందుజాగ్రత్త - మిగతా3లో



## చార్‌ధామ్ యాత్ర రిజిస్ట్రేషన్లు ప్రారంభం

- ఏప్రిల్ 19 నుంచి చార్‌ధామ్ యాత్ర తీర్థయాత్ర ప్రారంభం
- దశల వారిగా తెరుచుకోనున్న ఆలయ తలుపులు

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక

# చార్‌ధామ్ యాత్ర రిజిస్ట్రేషన్లు ప్రారంభం



భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చార్‌ధామ్ యాత్రకు సమయం దగ్గరపడుతోంది. ఉత్తరాఖండ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి తీర్థయాత్ర ఏప్రిల్ 19న ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం యాత్రకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసింది. ఇదే సమయంలో ఆన్?లైన్ రిజిస్ట్రేషన్?? ప్రక్రియను కూడా శుక్రవారం ప్రారంభించింది. ఇక యాత్రికులు తమ తీర్థయాత్ర తేదీలను ప్లాన్ చేసుకుని ఆన్?లైన్?లో రిజిస్ట్రేషన్? చేసుకోవచ్చు. ప్రతి ఏడాది మాదిరిగానే దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు ఈ పుణ్యక్షేత్రాలను సందర్శించడానికి వస్తుంటారు. అయితే, భక్తుల సౌకర్యార్థం ఎప్పటిలాగే ఈసారి కూడా రిజిస్ట్రేషన్?ను తప్పనిసరి చేసింది అధికార యంత్రాంగం. రిజిస్ట్రేషన్ కోసం అధికారిక పోర్టల్, మొబైల్ యాప్?ను ఏర్పాటు చేసింది. అదేవిధంగా యాత్రకు రెండు రోజుల ముందు (ఏప్రిల్ 17)న ఆఫ్?లైన్? రిజిస్ట్రేషన్? కూడా ప్రారంభమవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం రిషికేశ్?, హరిద్వార్, డెహ్రాదూన్‌లో కౌంటర్లు కూడా ఏర్పాటు చేయనున్నారు. అక్షయ తృతీయ సందర్భంగా ఏప్రిల్? 19న గంగోత్రి, యమునోత్రి తలుపులు తెరుచుకోవడంతో తీర్థయాత్ర ప్రారంభమవుతుంది. ఏప్రిల్? 22న కేదార్?నాథ్?, ఏప్రిల్? 23న బద్రీనాథ్?లో తలుపులు తెరుచుకుంటాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న యాత్రికులు ప్రయాణ సమయంలో రిజిస్ట్రేషన్ స్లిప్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు తీసుకెళ్లాలని అధికారులు సూచించారు.

యాత్రకు సంబంధించిన వివరాలు

చార్‌ధామ్ యాత్ర –ఏప్రిల్ 19న ప్రారంభం

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ– మార్చి 6

యమునోత్రి గంగోత్రి ద్వారాలు– ఏప్రిల్ 19

కేదార్‌నాథ్– ఏప్రిల్ 22

బద్రీనాథ్– ఏప్రిల్ 23

ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం 50 కౌంటర్లు ఏర్పాటు

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా ఉచితం

"యాత్రకు ముందు రిజిస్ట్రేషన్? తప్పనిసరి. అదేవిధంగా యాత్రికులు ప్రయాణానికి సంబంధించిన మార్గదర్శకాలను పాటించాలి. యాత్రను సులభతరం చేయడమే ఈ ఆన్?లైన్? ప్రక్రియ ముఖ్య ఉద్దేశం. ఆన్?లైన్?లో నమోదు చేసుకోలేని యాత్రికులు ఆఫ్?లైన్?లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందుకోసం మొత్తం 50 కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. వీటిలో 30 కౌంటర్లు రిషికేశ్?లో మరో 20 వికాస్?నగర్? (డెహ్రాదూన్?)లో ఉంటాయి. యాత్రికులు ఎప్పుడైనా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా ఈ సేవలు 24 గంటలు అందుబాటులో ఉండనున్నాయి."

**తీర్థయాత్ర మార్గాల్లో కనీస సౌకర్యాల ఏర్పాటు**

అదేవిధంగా, చార్‌ధామ్ యాత్రకు భక్తులు భారీ సంఖ్యలో రానున్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని, తీర్థయాత్ర మార్గాల్లో కనీస సౌకర్యాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. భక్తులు వెళ్లే మార్గాల్లో తాగునీరు, మరుగుదొడ్లు ఇతరత్రా సౌకర్యాలు కల్పించనున్నారు. అదేవిధంగా అత్యవసర సమ–యాల్లో యాత్రికులకు తక్షణ వైద్య సహాయం అందేలా ఆరోగ్య సేవలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులకు మార్గనిర్దేశం చేయడానికి స్పష్టమైన సంకేతాలు అందేలా ఏర్పాటు చేస్తున్నారు. యాత్రలో రవాణా సజావుగా జరిగేలా మొత్తం 1880 బస్సులు సిద్ధం చేశారు.

మరో ముఖ్యమైన విషయం ఏంటంటే, చార్?ధామ్? ఆలయాల్లోకి మొబైల్ ఫోన్స్, కెమెరాలు తీసుకెళ్లడంపై పూర్తిగా నిషేధం విధించనున్నట్లు అధికారులు ఇదివరకే ప్రకటించారు. జనవరి 17న జరిగిన రిషికేశ్ ట్రాన్సిట్ క్యాంప్? ప్రాంగణంలో చార్?ధామ్ యాత్ర నిర్వహణ, నియంత్రణ సంస్థ నిర్వహించిన సమావేశంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతేడాది ఆలయ ప్రాంగణంలోకి మొబైల్ ఫోన్స్, కెమెరాలు తీసుకెళ్లడం వల్ల దర్శన నిర్వహణలో అనేక సమస్యలు తలెత్తాయని అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బద్రీనాథ్ ధామ్‌లో సింగ్ ద్వారం దాటిన తర్వాత మొబైల్ ఫోన్లు, కెమెరాలను అనుమతించబోమని గఢ్?వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే పేర్కొన్నారు. అలాగే, కేదార్‌నాథ్‌లో కూడా చబూతర ప్రాంతంలో కెమెరాలు ఉపయోగించడంపై అనుమతి లేదని చెప్పారు.

**రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా**

చార్‌ధామ్ యాత్ర కోసం రిజిస్టర్? చేసుకోవడానికి భక్తులకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం రెండు సదుపాయాలను అందుబాటులోకి తెచ్చింది. వెబ్ పోర్టల్: తీవస్త్రఅర్‌తీఫ్‌అశీఅ–ఖఅస్‌శీబతీఅర్‌ఖ్మతీవ.బఎ.స్త్రశీజ.అఅ సందర్శించి నమోదు చేసుకోవచ్చు. అలాగే, మొబైల్ యాప్: ు‌శీబతీఅర్ ఋతీవ ఛ్–'ఖతీఋఎస్త్రఋఅఎ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేయవచ్చు.

# భారత వ్యవసాయ ఉత్పత్తులు ప్రపంచంతో పోటీ పడాలి



వ్యవసాయ రంగాన్ని ఎగుమతుల ఆధారితంగా, ప్రపంచదేశాలతో పోటీపడే విధంగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు వ్యవసాయ రంగం నిపుణులు, పారిశ్రామికవేత్తలు, రైతులు కలిపి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని వైవిధ్యంతో కూడిన వాతావరణ పరిస్థితులను రైతులు తమకు అనుకూలంగా మార్చుకోవాలని సూచించారు. బడ్జెట్ తర్వాత నిర్వహించిన మూడో వెబినార్‌లో 'వ్యవహాయం, గ్రామీణ పరివర్తన' అనే అంశంపై మాట్లాడుతూ ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. మన దేశ వ్యవసాయ ఉత్పత్తుల ప్రమాణాలను, నాణ్యతను, బ్రాండింగ్‌ను ప్రోత్సహించాలన్నారు. ఎగుమతులే లక్ష్యంగా సేంద్రీయ, సహజ వ్యవసాయాన్ని బలోపేతం చేయాలని ప్రధాని మోదీ అధికారులకు సూచించారు. పంటల వైవిధ్యీకరణపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వ్యవసాయ రంగంపై దృష్టి పెట్టేలా రాష్ట్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రధాని తెలిపారు. "వ్యవసాయం సుదీర్ఘకాలం నుంచి దేశాభివృద్ధికి వ్యూహాత్మక స్తంభంగా ఉంది. ఆ ఆలోచనతోనే మా ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిరంతరం బలోపేతం చేసింది. దాదాపు 10కోట్ల మంది రైతులు 4 లక్షల కోట్లకుపైగా పీఎం కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా లబ్ధి పొందారు. ఎంఎస్‌పీ సంస్కరణల వల్ల రైతులకు ఒకటన్నర రెట్ల ఆదాయం లభిస్తోంది. సంస్థాగత క్రెడిట్ కవరేజీ 75శాతానికి పెరిగింది. పీఎం పసల్ యోజన ద్వారా 2లక్షల కోట్ల మేర బీమా చెల్లింపులు జరిగాయి. అనేక ప్రయత్నాల వల్ల రైతుల చాలావరకు నష్టాలు తగ్గాయి. వారికి ఆర్థిక భద్రత లభించింది. ఫలితంగా వ్యవసాయ రంగం ఆత్మవిశ్వాసం కూడా పెరిగింది."

**ఆ పంటలపై స్పెషల్ ఫోకస్**

2026–27 బడ్జెట్?లో జీడిపప్పు, కోకో, శ్రీగంధం లాంటి అధిక విలువ కలిగిన వ్యవసాయ ఉత్పత్తులపై ప్రత్యేకంగా దృష్టి సారించనట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. వంట నూనెలు, పప్పు ధాన్యాలపై ఒక జాతీయ మిషన్, అలాగే ప్రకృతి వ్యవసాయంపై మరో జాతీయ మిషన్? ఏర్పాటు వంటివి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నాయని ఆయన అన్నారు. "మనం అధిక విలువ కలిగిన వ్యవసాయ ఉత్పత్తులను పెంచినప్పుడే, మన దేశ వ్యవసాయ రంగాన్ని ప్రపంచస్థాయిలో పోటీకి సిద్ధంగా మార్చగలం " అని మోదీ స్పష్టం చేశారు.

**సేంద్రియ వ్యవసాయంపై దృష్టి**

ప్రస్తుత ప్రపంచం ఆరోగ్యం పట్లల మరింత స్పృహతో ఉందని మోదీ అన్నారు. అందుకే సంపూర్ణ ఆరోగ్యం కోసం సేంద్రియ ఆహారంపై ప్రజలు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. "మనం రసాయన రహిత, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే ఈ ప్రకృతి వ్యవసాయమే మన ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు చేరువ అయ్యేలా ఒక రహదారిని నిర్మిస్తుంది" అని మోదీ అన్నారు. భారత సుదీర్ఘ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయం ఒక వ్యూహాత్మక మూలస్తంభమని ఆయన నొక్కి చెప్పారు. తమ ప్రభుత్వం నిరంతరం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా దాదాపు 10 కోట్ల మంది రైతులు రూ.4లక్షల కోట్ల ఎక్కువ మొత్తాన్ని పొందారని మోదీ తెలిపారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ వ్యవసాయ, గ్రామీణ పరివర్తనకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు.

**పాడి పరిశ్రమ పరిస్థితి ఏమిటి?**

ఇక పాడి పరిశ్రమ గురించి కూడా మోదీ కీలక విషయాలు వెల్లడించారు. జంతువులకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీజ్?) నుంచి రక్షించేందుకు, ఇప్పటి వర కు 125 కోట్ల కంటే ఎక్కువ డోసుల టీకాలను అందించామని చెప్పారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద సాంకేతికను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. "మా ప్రభుత్వ హయాంలో పాడి రైతులకు కూడా కిసాన్ క్రెడిట్? కార్డుల ద్వారా లబ్ధి చేకూరుతోంది. ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించేందుకు పశుసంవర్ధక మౌలిక సదు–పాయల అభివృద్ధి నిధిని (ఏహెచ్?ఐడీఎఫ్?)ను ప్రారంభించాం. మేము గోవర్ధన్ యోజనను అమలు చేస్తున్నాం. గోవర్ధన్ యోజనలో భాగంగా పశువ్యర్థాలను, చెత్తను వినియోగించుకుని, మన గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవచ్చు. పాల ద్వారా మాత్రమేకాదు, ఆవు పేడ ద్వారా కూడా ఆదాయాన్ని పొందవచ్చు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దీనికి ప్రాధాన్యతను ఇచ్చి ప్రోత్సహించాలని కోరుతున్నాను." 'కేవలం ఒకే రకమైన పంటపై ఆధారపడడం రైతులకు ప్రమాదకరమని గత అనుభవాల ద్వారా తెలుసుకున్నాం. పైగా ఇది ఆదాయ మార్గాలను కూడా పరిమితం చేసేస్తుంది. అందుకే మేము పంటల వైవిధ్యం (క్రాప్? డైవర్సిఫికేషన్)పై దృష్టి సారించాం. వాస్తవానికి వ్యవసాయం అనేది రాష్ట్రాల పరిధిలోని అంశం. రాష్ట్రాలకు భారీ వ్యవసాయ బడ్జెట్లు ఉన్నాయి. రాష్ట్రాలు వాటి బాధ్యతలను నెరవేర్చడంలో సహాయపడడానికి, మా సూచనలు సద్వినియోగం అయ్యేలా చూడడానికి మేము నిరంతరం వారిని ప్రోత్సహిస్తాం. గ్రామాలకోసం, రైతుల కోసం రాష్ట్రాలు కేటాయించే ప్రతి పైసాను చాలా తెలివిగా వినియోగించాలి' అని అన్నారు.

# లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు



ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం జరగాలన్నా, ఆ దేశం బేషరతుగా లొంగిపోవడం మినహా మరో మార్గం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ చేశారు. "ఇరాన్ బేష–రతుగా లొంగిపోవాలి! ఆ తర్వాత అక్కడ గొప్ప, ఆమోదయోగ్యమైన నాయకత్వం రావాలి. అప్పుడే మేము, మా మిత్రదేశాలు కలిసి ఇరాన్‌ను వినాశనం అంచుల నుంచి బయటకు తీసుకొస్తాం. ఇరాన్‌ను ఆర్థికంగా మునుపటి కంటే బలంగా తీర్చిదిద్దుతాం. ఇరాన్‌కు గొప్ప భవిష్యత్తు ఉంటుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాకుండా తన ఎన్నికల నినాదాన్ని గుర్తుచేస్తూ.. "మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్" అంటూ కొత్త నినాదాన్ని వినిపించారు. మరోవైపు అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. క్షిపణి దాడులు, నావికాదళ దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై దాడులు విస్తృతం చేయగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడుతోంది. కొన్ని రోజుల కిందట హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా సబ్‌మెరైన్ దాడి చేసి ముంచేయడం ఉద్రిక్తతలను పతాక స్థాయికి చేర్చింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌లో వెయ్యి మందికి పైగా మరణించగా, ఇజ్రాయెల్, లెబనాన్‌లలో డజన్ల కొద్దీ ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురుస్తుండటంతో వేలాది మంది రాజధానిని వదిలి పారిపోతున్నట్లు ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా, ట్రంప్ యుద్ధ అధికారాలను నియంత్రించేందుకు చేసిన ప్రయత్నాలను వాషింగ్టన్‌లో సెనేట్ రిపబ్లికన్లు అడ్డుకున్నారు. ప్రస్తుతానికి అమెరికా బలగాలు నేరుగా రంగంలోకి దిగకపోయినా, భవిష్యత్తులో ఆ అవకాశాన్ని వైట్‌హౌస్ కొట్టిపారేయలేదు. ఈ యుద్ధం ప్రభావం ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలపై తీవ్రంగా పడుతోంది. హార్ముజ్ జలసంధిలో దాడుల భయంతో నౌకల రాకపోకలు తగ్గిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరాయి. భద్రతా కారణాల దృష్ట్యా పలు షిప్పింగ్ సంస్థలు తమ సర్వీసులను నిలిపివేస్తున్నాయి.

## దేశ అభివృద్ధికి అంతర్గత భద్రత ఎంతో ముఖ్యం



దేశంలో నక్సలిజాన్ని తుదముట్టించాలని మోదీ సర్కార్ తీసుకున్న సంకల్పాన్ని పూర్తిచేయటంలో సీఐఎస్ఎఫ్ కీలకభూమిక పోషించినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ లేదా తెలంగాణలో నక్సలిజాన్ని నిర్మూలించడంలో సీఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషించిందన్నారు. ఒడిశా కటక్‌జిల్లాలోని ముండలిలో జరిగిన సీఐఎస్ఎఫ్ 57వ వార్షికోత్సవంలో పాల్గొన్న అమిత్ షా తిరుపతి నుంచి పశుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని కలలు కనేవారి కలలను భద్రతా దళాలు కల్లలు చేశాయన్నారు. "ఈ సందర్భంగా దేశప్రజలకు ఒక విషయం స్పష్టం చేయాలనుకుం టున్నా. 2026 మార్చి 31 నాటికి దేశం నక్సల్స్‌రహితంగా మారుతుంది. ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి నుంచి నేపాల్?లోని పశుపతి వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని కలలు కన్నవారిని భద్రతాదళాలు పూర్తిగా ఓడించి తమ ఆధిపత్యం చాటుకోనున్నాయి. ప్రధాని మోదీ సారథ్యంలో భద్రతాదళాలకు ఇది అతిపెద్ద విజయం కానుంది."

**దేశ అభివృద్ధికి అంతర్గత భద్రత ఎంతో ముఖ్యం : షా**

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్? మారాలంటే అంతర్గత భద్రత చాలా కీలకమని అమిత్? షా పేర్కొన్నారు. దేశంలోని కీలక ప్రాంతాల్లో సీఐఎస్ఎఫ్ దళాలు పటిష్ఠ భద్రతను కల్పిస్తూ ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తున్నాయని చెప్పారు. దేశంలోని వివిధ జలాశయాలు, పరిశ్రమలు, విమానాశ్రయాలు, పార్లమెంట్ వంటి ముఖ్యమైన ప్రాంతాలకు రక్షణను అందిస్తున్నాయని చెప్పారు. అయితే, దేశంలో శాంతి వాతావరణం నెలకొన్నప్పుడే ఆర్థిక వృద్ధి సాకారమవుతుందని షా చెప్పుకొచ్చారు. అదేవిధంగా, దేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలంటే పరిశ్రమల అభివృద్ధి అవసరమని షా నొక్కి చెప్పారు. అయితే, ఆ బాధ్యతను సీఐఎస్ఎఫ్ సమర్థంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

**సీఐఎస్ఎఫ్ సేవలను ప్రశంసించిన అమిత్ షా**

ఇదిలా ఉండగా, సీఐఎస్ఎఫ్ స్థాపించి 56 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆ దళాలు సాధించిన పురోగతిని అమిత్ షా ప్రశంసించారు. సీఐఎస్?ఎఫ్? చిన్న స్థాయిలో ప్రారంభమై, ప్రస్తుతం పారిశ్రామిక భద్రత రంగంలో అగ్రస్థానానికి చేరుకుందని కొనియాడారు. దేశ చరిత్రలో ధైర్యం, త్యాగం, అంకితభావంతో ఈ దళం ప్రతి సవాల్‌ను సమర్థంగా ఎదుర్కొందని, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించిందని పేర్కొన్నారు. సీఐఎస్?ఎఫ్? లేకుండా దేశ పారిశ్రామిక అభివృద్ధి దార్శనికతను ఊహించలేమన్నారు. మరోవైపు, దేశంలోని అన్ని ఓడరేవుల భద్రతా బాధ్యతలను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ప్రైవేట్ పరిశ్రమలకు కూడా హైబ్రిడ్ విధానంలో భద్రత అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతాం!**

అదేవిధంగా, 2047 నాటికి భారతదేశాన్ని పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు అమిత్? షా. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రంగంలోనూ అగ్రస్థానాన్ని సాధించడం, అలాగే 2027 నాటికి దేశాన్ని ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలపడం, అనే ఈ తీర్మానాలను ప్రధానమంత్రి ప్రజల ముందు ఉంచారని ఆయన ఎత్తి చూపారు.

**కేంద్ర హోంమంత్రికి ఘన స్వాగతం పలికిన ఒడిశా సీఎం**

ఇదిలా ఉండగా, వివిధ ప్రజా కార్యక్రమాల్లో పాల్గొనడానికి శుక్రవారం ఒడిశాకు చేరుకున్న అమిత్? షాకు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ భువనేశ్వర్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం భువనేశ్వర్‌లో రూ.890 కోట్ల ఖర్చుతో నిర్మించనున్న రెండు నివాస ప్రాజెక్టులను ప్రారంభించారు. దాంతో పాటు మూడు రిజర్వ్ బెటాలియన్‌లకు షా శంకుస్థాపన కూడా చేశారు. ఈ కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్? మాఝీ, అసెంబ్లీ స్పీకర్ సురామ పాఢీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్? తదితరులు పాల్గొన్నారు.

## బిహార్‌లో తొలి బీజేపీ సర్కార్

బిహార్‌లో తొలిసారి బీజేపీ సర్కార్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. సుదీర్ఘకాలం సీఎంగా కొనసాగిన నీతీశ్‌కుమార్ రాజ్యసభకు వెళ్లనుండటంతో కమలం పార్టీకి మార్గం సుగమమైంది. అయితే బీజేపీ నుంచి ముఖ్యమంత్రి పగ్గాలు ఎవరు చేపడ్తారనే విషయమై తీవ్రచర్చ మొదలైంది. సీఎం రేసులో బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, ఒడిశాలో మాదిరిగా అనూహ్యంగా కొత్తవారికి అవకాశం దక్కే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. బిహార్‌లో తమ ప్రభుత్వం ఏర్పడాలన్న బీజేపీ కల ఎట్టకేలకు సాకారం కానుంది. 4నెలల క్రితం జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 89స్థానాలతో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించటంతో సీఎంగా నీతీశ్‌కుమార్‌ను మార్చటం తథ్యమనే విశ్లేషణలు అప్పుడే మొదలయ్యాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండోసారి జేడీయూ కంటే బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుపొందింది. ఈ నేపథ్యంలో గతేడాది జరిగిన ప్రమాణ స్వీకారోత్సవం పూర్తిగా కమలం పార్టీ కార్యక్రమంగానే సాగింది. కొత్త మంత్రివర్గంలో సింహభాగంతో పాటు కీలకమైన హోంశాఖను కాషాయదళం దక్కించుకుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులతో పాటు పలువురు ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఈ పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేసిన ఆర్జేడీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు తేజ–స్వీయాదవ్, బిహార్‌లో బీజేపీ మహారాష్ట్ర తరహా రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. దళితులు, ఓబీసీలను వ్యతిరేకించే కమలం పార్టీ సామాజిక కోణంతో తన అజెండా అమలు చేయాలని చూస్తోందని విమర్శించారు.

1990ల్లో బిహార్ రాజకీయాల్లో అగ్రవర్ణాల ఆధిపత్యానికి ముగింపు పలికిన మండల్ ఉద్యమంతోనే లాలూప్రసాద్ యాదవ్, నీతీష్ కుమార్ కీలక నేతలుగా ఎదిగారు. ఇప్పుడు బీజేపీ కూడా సామాజిక వ్యూహంతోనే బడుగు, బలహీన వర్గాలకే సీఎం పీఠం కట్టబెట్టవచ్చనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. బిహార్ ఉపముఖ్యమంత్రి, హోంశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సామ్రాట్ చౌదరి కోయెరీ– ఓబీసీ సామాజికవర్గానికి చెందినవారు. ఈ వర్గానికి ఇప్పటివరకు సీఎం అయ్యే అవకాశం రాలేదు. ఆయనను పెద్ద నాయకుడిని చేస్తామని ఎన్నికల ప్రచారంలో అమిత్ షా ప్రకటించారు. అయితే సామ్రాట్ చౌదరీ ఆర్జేడీ నుంచి వచ్చి పదేళ్లు కూడా కాకపోవడంతో బీజేపీ అధినాయకత్వం ఆయనపై ఎంతవరకు విశ్వాసం చూపుతుందన్నది ఆసక్తి రేపుతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ అయోధ్య ఉద్యమ సమయం నుంచి ఏబీవీపీలో, ఆరెస్సెస్‌లో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన బిహార్‌లో అత్యధిక జనాభా కలిగిన యాదవ సామాజిక వర్గానికి చెందినవారు. నిత్యానందరాయ్‌కు అవకాశం ఇస్తే అగ్రవర్ణాలు, నీతీష్ కుమార్ వర్గానికి చెందిన కుర్మీలు, ఇతర అత్యంత వెనుకబడినవర్గాల నుంచి వ్యతిరేకత రావచ్చని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి.

**అర్హత ఆధారంగానే సీఎం అభ్యర్థి ఎంపిక**

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, ఒడిశా మాదిరిగా ఎవరూ ఊహించని నాయకుడు లేదా అగ్రవర్ణాలకు చెందిన నేతకు సీఎం పీఠం దక్కే అవకాశం ఉందని కొందరు బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మండల్ ఉద్యమం తర్వాత సీఎం పీఠం అగ్రవర్ణాలకు దూరమనే అనుమానాలను యూపీ, రాజస్థాన్, మహారాష్ట్రల్లో చెరిపేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. బిహార్‌లో కూడా అర్హత ఆధారంగానే సీఎం అభ్యర్థి ఎంపిక జరగొచ్చని బీజేపీ నేతలు అంటున్నారు.

**నీతీశ్ కుమారుడికి డిప్యూటీ సీఎం!**

మరోవైపు బీజేపీ ఆధిపత్యంతో జేడీయూలో తమ ఉనికి పట్ల ఆ పార్టీకి చెందిన కొందరు సీనియర్ నేతల్లో ఆందోళన మొదలైంది. కుటుంబ రాజకీయాలను వ్యతిరేకించే నీతీశ్? కుమార్ తన కుమారుడు నిశాంత్‌ను 2రోజుల క్రితమే రాజకీయరంగ ప్రవేశం చేయించారు. ఆయనకు ఉపముఖ్యమంత్రి పదవి దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది. ఇకముందు పరిస్థితులు పాతరోజుల్లా ఉండకపోవచ్చని, నీతీష్ కుమారుడితో సహా తమ మంత్రులంతా పదవుల్లో కొనసాగాలంటే బీజేపీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిందేనని జేడీయూకు చెందిన ఓ సీనియర్ నేత ఆవేదన వ్యక్తంచేశారు.

# బీసీ కమిటీ నివేదిక తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు



**విజయవాడ :** ఏపీ పాలిటిక్స్‌లో స్థానిక పోరు ఊరిస్తోంది. న్యూఇయర్ స్టార్టింగ్‌లోనే పంచాయతీ ఎలక్షన్స్ పెడతారని ఊహాగానాలు వినిపించినప్పటికీ..ఇప్పటికీ ఓ క్లారిటీ లేదు. జనగణన అడ్డంకిగా మారిందన్న ప్రచారం ఓవైపు.. స్టేట్ ఈసీ రివ్యూస్..లోకల్ బాడీ పోల్స్‌పై సస్పెన్స్‌ను కంటిన్యూ చేస్తున్నాయి. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2న ముగుస్తుంది. మార్చిలో..కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం అయిపోనుంది. అందుకు తగ్గట్లుగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసింది. మార్చిలో టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాక వరుసపెట్టి జూన్ లోపు స్థానిక ఎన్నికలను పూర్తి చేయాలనుకుంది ఏపీ సర్కార్. కానీ ఇంతలోనే ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీ అమలు దిశగా అడుగులు వేసింది. ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ రిపోర్ట్ ఇచ్చాక బీసీ కోటా పెంపుపై ఏదో ఒక నిర్ణయం తీసుకున్నాకే..లోకల్ ఫైట్‌పై ముందడుగు వేస్తారన్న టాక్ బయలుదేరింది.మరోవైపు రాష్ట్ర ఎన్నికల కమిషన్..ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు? ఎంతమంది అనర్హులు ఉన్నారనే వివరాలను సేకరిస్తోంది. ఈ నెల 20 నాటికి ఈ కసరత్తు పూర్తి చేసి..ఓటర్ల జాబితాను ఫైనల్ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. దీని ప్రకారం..ఏప్రిల్ 2వ తేదీతో ముగియనున్న పంచాయతీలకు గడువు ప్రకారం..ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ రెడీగా ఉన్నట్లే. కానీ పల్లె పోరుపై సర్కారు ఆలోచన మాత్రం వేరేగా ఉందట. ఏప్రిల్ 2నే గ్రామాల స్థాయిలో పంచాయతీలకు గడువు ముగిసిపోను న్నా.. ఈ ఎన్నికలకు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.బీసీ రిజర్వేషన్లపై మిశ్రా కమిషన్ అధ్యయనం చేస్తోంది. ఆ రిపోర్ట్ వచ్చిన తర్వాత..ప్రభుత్వం అధ్యయనం చేసి..ఎన్నికలకు వెళ్లనుందని అంటున్నారు. ఈ ప్రాసెస్‌కు కొంత టైమ్ పట్టే అవకాశం ఉంటుంది. ఇక రిజర్వేషన్లపై ఎలాగూ న్యాయపరమైన సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వాటిన్నింటిని సాల్వ్ చేసుకుని..బీసీ కోటాను పెంచే లోకల్ బాడీ ఎన్నికలపై ముందుకెళ్లాలని సర్కార్ భావిస్తోందట.ఇలా స్థానిక పోరుపై ఎప్పటికప్పుడు అప్ డేట్స్ కమింగ్ సూన్ అన్నట్లుగా మారిపోయింది పరిస్థితి. స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసినా..కూటమి ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను కాస్త ఆలస్యంగా నిర్వహించే యోచనలోనే ఉందంటున్నారు. ఏప్రిల్‌లోపు ఎన్నికలకు వెళ్తారని ప్రచారం జరుగుతున్న టైమ్‌లోనే ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. లోకల్ బాడీస్‌లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచాలని డిసైడ్ అయింది. ఈ క్రమంలో సెన్సేషనల్ డెసిషన్ తీసుకుంది కూటమి ప్రభుత్వం.బీసీ కోటా పెంపు సాధ్యాసాధ్యాలు, న్యాయ సమస్యల అధ్యయనానికి కమిషన్ వేసింది సర్కార్. బీసీలకు రాజకీయంగా మేలు చేసే ఉద్దేశంతో ఏకంగా 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు స్టార్ట్ చేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం మాజీ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది సర్కార్. ఈ కమిషన్ పూర్తిగా అధ్యయనం చేసి తన నివేదికను ప్రభుత్వానికి ఇస్తుంది. 45 రోజుల్లో నివేదికను ఇవ్వాలని కూడా ఏకసభ్య కమిషన్‌కు కాల పరిమితిని విధించింది సర్కార్. కమిషన్ ఇచ్చే రిపోర్ట్‌ను బేస్ చేసుకుని బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ప్రభుత్వం డెసిషన్ తీసుకోనుంది.బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. బీసీలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకుని ఎన్నికలకు వెళ్తే తమకు ఇంకా అడ్వాంటేజ్ మారుతుందని..బెటర్ రిజల్ట్స్ వస్తాయని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో ఎలాగూ అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు వస్తుంటాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం ట్రంప్ కార్డుగా వాడుకునేందుకు ప్లాన్ చేస్తోంది ప్రభుత్వం. అయితే రిజర్వేషన్లు పెంపు హామీకి కూటమి సర్కార్ కట్టుబడి ఉన్నప్పటికీ, సుప్రీంకోర్టు నిబంధనలు అడ్డుగా మారే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతో కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పే..బీసీ రిజర్వేషన్ల పెంపునకు సమస్యలు తెచ్చి పెడుతోంది. ఏపీలో ఇప్పటికే బీసీలకు 24 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. దీనిని 34 శాతానికి పెంచితే మొత్తం రిజర్వేషన్లు 60 శాతానికి చేరి సుప్రీంకోర్టు పెట్టిన కోటా దాటిపోనుంది.ఇటీవల తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు పెట్టిన పరిమితిని దాటాలని ప్రయత్నించినా, లీగల్ సమస్యలు వచ్చి కోర్టుల్లోనే ఆగిపోయిన పరిస్థితి. అయితే ఈ సమస్యలన్నింటిని దృష్టిలో పెట్టుకునే బీసీ రిజర్వేషన్ల పెంపునకు ట్రిపుల్ టెస్ట్ ఫార్ములాను ఫాలో అయ్యే ఆలోచనలో ఉందట కూటమి సర్కార్. అందుకే ముందుగా బీసీల వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసేందుకు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని అంటున్నారు.ఎలాంటి చట్టపరమైన సమస్యలు రాకుండా సూచనలు ఇవ్వాలని ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్‌కు సూచించింది ప్రభుత్వం. ఒకవేళ కమిషన్ రిపోర్ట్ బేస్ చేసుకుని జీవోనో ఆర్డినెన్సో జారీ చేస్తే..లీగల్ సమస్యలు వచ్చినా కేంద్రంతో చర్చించి బీసీ కోటా పెంపునకు లైన్ క్లియర్ చేసుకోవాలని భావిస్తున్నారట కూటమి పెద్దలు. ఒకవేళ చట్టపరంగా రిజర్వేషన్ల పెంపునకు సమస్యలు వస్తే..పార్టీపరంగా బీసీలకు అధిక సీట్లు కేటాయించే యోచనలో కూడా ఉన్నారట. ఈ నేపథ్యంలో ఏపీలో పంచాయతీ ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది.

# క్రిస్టియన్ కార్డు ఎవరికి లాభం... ఎవరికి నష్టం



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం 'మతం' చుట్టూ సాగుతున్న రాజకీయం పెను దుమారం రేపుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఒక నిర్దిష్ట మతానికే పరిమితమైన పార్టీగా చిత్రీకరించడంలో తెలుగుదేశం కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందనే చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా శాసనమండలి వేదికగా జరిగిన పరిణామాలు, సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులు వైసీపీని తీవ్రమైన ఆత్మరక్షణలో పడేశాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు అభివృద్ధి, సంక్షేమం నుంచి మతపరమైన అంశాల వైపు మళ్లుతోంది. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి వ్యక్తిగత విశ్వాసాలను ఆసరాగా చేసుకుని, ఆ పార్టీని ఒక క్రిస్టియన్ పార్టీగా ముద్ర వేయడం ద్వారా హిందూ ఓటు బ్యాంకును దూరం చేయాలనేది టీడీపీ పక్కా వ్యూహంగా కనిపిస్తోంది.శాసన మండలిలో మంత్రి అచ్చెన్నాయుడు నేరుగా మండలి చైర్మన్ మోషేన్ రాజు, జగన్మోహన్ రెడ్డిలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి ఆజ్యం పోశాయి. తామంతా హిందువులమని, వారు క్రిస్టియన్లని ఆయన వ్యాఖ్యానించడం సంచలనం సృష్టించింది. దీనిపై మోషేన్ రాజు తాను హిందువునని స్పష్టం చేయడం, అచ్చెన్నాయుడు క్షమాపణలు చెప్పడంతో సభలో ఆ వివాదం ముగిసినట్లు కనిపించినా, అసలు కథ సోషల్ మీడియాలో మొదలైంది.సభలో అచ్చెన్నాయుడు వెనక్కి తగ్గినప్పటికీ, టీడీపీ సోషల్ మీడియా విభాగం మాత్రం మోషేన్ రాజు గతంలో చర్చీల్లో పాల్గొన్న వీడియోలు, ఆయన మతపరమైన నేపథ్యాన్ని సూచించే ఫొటోలను బయటపెట్టింది. "నోటితో హిందువునని చెబుతూ, ఆచరణలో క్రిస్టియానిటీని పాటిస్తున్నారు" అనే అర్థం వచ్చేలా చేస్తున్న ప్రచారం వైసీపీని ఇరకాటంలో పడేసింది. ఈ పరిణామం వల్ల పార్టీ నాయకత్వం సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.గత కొన్ని రోజులుగా తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై చర్చ జరగాలని వైసీపీ పట్టుబట్టింది. ప్రభుత్వం చర్చకు వెనకాడుతోందని ప్రచారం చేసుకున్న వైసీపీకి, తీరా చర్చ మొదలయ్యాక సీన్ రివర్స్ అయ్యింది. చర్చను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైసీపీ సభ్యులు విఫలమయ్యారు. కేవలం సాంకేతిక అంశాల మీద కాకుండా, భావోద్వేగ అంశాల మీద ప్రభుత్వం చేసిన దాడిని వారు తిప్పికొట్టలేకపోయారు. వైసీపీ హయాంలోనే అపవిత్రం జరిగిందని, హిందూ ధర్మంపై ఆ పార్టీకి గౌరవం లేదని మంత్రులు చేసిన ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. జగన్ 'డిక్లరేషన్' అంశాన్ని కూడా దీనికి ముడిపెట్టడంతో, వైసీపీ కేవలం ఒక మతానికే కొమ్ముకాస్తోందనే భావనను కలిగించడంలో టీడీపీ కూటమి సక్సెస్ అయ్యింది.రాజకీయాల్లో ఒకసారి ముద్ర పడితే దాన్ని చెరిపేసుకోవడం చాలా కష్టం. గతంలో బీజేపీపై ఉన్న 'హిందూత్వ' ముద్రను ఆ పార్టీ బలంగా వాడుకోగా, ఇప్పుడు వైసీపీపై పడుతున్న 'క్రిస్టియన్ పార్టీ' ముద్రను టీడీపీ ఎన్నికల అస్త్రంగా మలుచుకుంటోంది. జగన్మోహన్ రెడ్డి తాను అన్ని మతాలను గౌరవిస్తానని చెబుతున్నా, పార్టీలోని కీలక నేతల మతపరమైన నేపథ్యాలను సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టడం ద్వారా వైసీపీని హిందూ వ్యతిరేక పార్టీగా చూపించే ప్రయత్నం ముమ్మరంగా సాగుతోంది. దీనివల్ల తటస్థంగా ఉండే హిందూ ఓటర్లు వైసీపీకి దూరం అయ్యే ప్రమాదం ఉంది. తిరుమల వంటి సున్నితమైన అంశాల్లో తడబడటం, సొంత పార్టీ నేతల మతపరమైన క్లారిటీ లేకపోవడం వైసీపీకి పెద్ద మైనస్ పాయింట్లుగా మారుతున్నాయి.

## ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ దూకుడు...

-మొదటిపేజీ తరువాయి

డిపాజిట్లు, భూములు, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. ఏపీలో 2019కి ముందు మద్యం వ్యాపారం పారదర్శకంగా, డిజిటల్ ట్రాకింగ్‌తో జరిగేదని, అయితే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం కావాలనే ఆటోమేటెడ్ విధానాన్ని రద్దు చేసి మాన్యువల్ విధానాన్ని తీసుకొచ్చిందని ఈడీ పేర్కొంది. ఈ కొత్త విధానం ద్వారా అధికారులకు విచక్షణాధికారాలు కట్టబెట్టి, తమకు నచ్చిన బ్రాండ్లకు అనుకూలంగా వ్యవహరించారని దర్యాప్తులో తేలింది. ఆర్డర్లు ఇవ్వాలంటే 15 నుంచి 20 శాతం ముడుపులు ఇవ్వాలని డిస్టిలరీలను సిండికేట్ సభ్యులు డిమాండ్ చేశారని, నిరాకరించిన వారి చెల్లింపులు నిలిపివేశారని ఈడీ ఆరోపించింది. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.3,500 నుంచి రూ.4,000 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేసింది. వసూలు చేసిన ముడుపులను హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో దాచిపెట్టి, అక్కడి నుంచి తరలించినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో కీలక నిందితులు 'సిగ్నల్ వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా సంభాషణలు జరిపారని, దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని ఈడీ స్పష్టం చేసింది.

## ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు అస్వస్థత

-మొదటిపేజీ తరువాయి

దీంతో ఆయనను హైదరాబాద్‌కు తరలించారు. సిటీ న్యూరో సెంటర్‌లో చికిత్స అందించారు. కాగా ఆ తర్వాత ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కానీ మళ్లీ నేడు మండలిలో మాట్లాడుతున్న బొత్స మరోసారి అస్వస్థతకు గురయ్యారు. మండలిలో మరోసారి అస్వస్థతకు గురైన బొత్స: ద్రవ్య వినిమయ బిల్లు పై ప్రసంగిస్తుండగా బొత్స అస్వస్తతకు లోనయ్యారు. వెనక్కి తుల్లి పడబోతుండగా మరో సభ్యుడు పట్టుకున్నారు. బొత్స ఆరోగ్య పరిస్థితిని గుర్తించిన మండలి ఛైర్మన్ సభను ఓసారి వాయిదా వేశారు. సభ నుంచి తన ఛాంబర్‌కు వచ్చిన బొత్సకు అసెంబ్లీలోని వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. బొత్సకు బీపీ కాస్త ఎక్కువగా ఉన్నట్లు గుర్తించిన వైద్యులు బొత్సకు చికిత్స అందించే వైద్యులతో మాట్లాడి మందులు ఇచ్చి పంపారు.

### హైదరాబాద్‌కు బొత్స

కాసేపటికే తిరిగి సభకు వచ్చిన బొత్స ద్రవ్య వినిమయ బిల్లుపై ప్రసంగించారు. తిరిగి మ-రోసారి స్వల్ప అస్వస్తతకు గురి కావడంతో విశ్రాంతి తీసుకోవాలని సూచించినా వినకుండా ప్రసంగాన్ని ముగించే వరకు ఆయన మాట్లాడారు. అనంతరం అసెంబ్లీ లోని చాంబర్?కు రాగా వైద్యులు మరోసారి పరీక్షించారు. బొత్స ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్?లో రెగ్యులర్?గా చికిత్స అందించే వైద్యులతో మాట్లాడిన బొత్స వారి సూచన మేరకు మరో సారి అక్కడకే బయలు దేరారు. చికిత్స కోసం శాసన సభ నుంచి నేరుగా హైదరాబాద్? కు బయలు దేరారు. పయ్యావుల పరామర్శ: మంత్రి పయ్యావుల కేశవ్? బొత్స ఆరోగ్య పరిస్థితిపై వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బొత్స పరిస్థితి ఎలా ఉందని ఆరా తీశారు. తగినంత విశ్రాంతి తీసుకోవాలని బొత్సకు సూచించారు.

## 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

-మొదటిపేజీ తరువాయి

చర్యను చేపడుతున్నట్లు తెలిపారు. పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. 13 ఏళ్లలోపు వారు సోషల్ మీడియా ఉపయోగించకుండా నిషేధం విధించనున్నట్లు వెల్లడించారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. 13 ఏళ్ల లోపు వారికి సంబంధించి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని ఆ వయసు లోపు వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. 13-16 ఏళ్లలోపు వారికి సంబంధించి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సోషల్ మీడియా వల్ల మన పిల్లలు నష్టపోకూడదని. దానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. టెక్నాలజీని వాడుకుంటే ఆయుధంగా పనిచేస్తుందని, బానిసైతే జీవితాలు నాశనమవుతాయని అన్నారు. దావోస్?లో వెల్లడించిన మంత్రి లోకేశ్: ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంపై మంత్రి నారా లోకేశ్ అభిప్రాయాన్ని వెల్లడించారు. అలానే కొద్ది రోజుల క్రితం సచివాలయంలో నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ బాలబాలికలు సోషల్ మీడియా వినియోగించకుండా నియంత్రించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వినియోగంపై ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ప్రకటించారు. సోషల్ మీడియా అడ్డం పెట్టుకుని అసభ్య దూషణలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. గతంలో అసభ్య పదజాలంతో రెచ్చిపోయిన వారిని వదిలిపెట్టకుండా నియంత్రించగలిగామని గుర్తు చేస్తూ మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, ఏపీని అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు.




## ప్రపంచం దృష్టిని ఆకర్షించే వేదిక

-మొదటిపేజీ తరువాయి

ప్రపంచ రాజకీయాలు, అంతర్జాతీయంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థపై చర్చించేందుకు అత్యున్నత వేదికగా 'రైసినా డైలాగ్'కు గొప్ప పేరుంది. 2016 నుంచి ఏటా నిర్వహిస్తున్న ఈ సదస్సు.. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన 'మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్' తరహాలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈసారి జరుగుతున్న 11వ ఎడిషన్ సదస్సులో దాదాపు 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు పాల్గొంటుండటం విశేషం. వివిధ దేశాల అధినేతలు, మంత్రులు, అత్యున్నత సైనిక అధికారులు, విధానకర్తలు, మేధావులు ఒకే వేదికపై గ్లోబల్ వ్యూహాలను చర్చించనున్నారు. ఈ ఏడాది ఈ సదస్సును సంస్కార, అన్వేషణ, సమన్వయం, పురోగతి అనే ఆసక్తికరమైన థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ ఈ సదస్సులో ప్రధాన ఉపన్యాసం చేయనున్నారు.

### సీఎం పర్యటన వివరాలు

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు రేపు (మార్చి 7) ఉదయం 10.50 గంటలకు విజయవాడ నుంచి విమానంలో ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ వేదికగా జరిగే 'రైసినా డైలాగ్ 2026' సెషన్‌లో పాల్గొంటారు. సదస్సు ముగిసిన అనంతరం ఆయన తిరిగి అమరావతికి పయనమవుతారు.

### ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా ప్రసంగం

దేశంలోనే అభివృద్ధి పథాన నడుస్తున్న రాష్ట్రంగా ఏపీలో అమలు చేస్తున్న సుపరిపాలన, డిజిటల్ విప్లవం గురించి ముఖ్యమంత్రి తన ప్రసంగంలో సవివరంగా చెప్పనున్నారు. ప్రధానంగా రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత నిర్ణయాల ద్వారా సామాన్య ప్రజలకు పౌరసేవలను ఎంత వేగంగా, పారదర్శకంగా అందిస్తున్నారో వివరించనున్నారు. పాలనకు సాంకేతికతను జోడించి ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, సంపద సృష్టి, 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్' వంటి అంశాలపై తన సుదీర్ఘ అనుభవాలను అంతర్జాతీయ ప్రతినిధులతో పంచుకోనున్నారు. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న దార్శనిక నిర్ణయాలను ప్రపంచ దేశాల ముందు ఉంచనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎకోసిస్టమ్, భారీ డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, నెక్ట్స్ జనరేషన్ టెక్నాలజీ కారిడార్ల ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం వివరించనున్నారు. పెట్టుబడులకు స్వర్గధామంగా ఏపీని మార్చేందుకు చేస్తున్న కృషిని, భవిష్యత్ ప్రణాళికలను ఈ వేదిక ద్వారా ప్రపంచానికి తెలియజేయనున్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



సంపాదకీయం

# ఈ యుద్ధం ముగిసేదెలా ?

**పశ్చిమాసియా యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. దీనికితోడు ఇది మూడో ప్రపంచ యుద్ధంగా మారబోతుందా అన్న భయాలు వెల్లడవుతున్నాయి. ఎందుకంటే ఇజ్రాయిల్, అమెరికాల దూకుడు తగ్గడం లేదు. ప్రతిగా ఇరాన్ కూడా విధ్వంసం సృష్టిస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఇరాన్‌ను అమెరికా తక్కువ అంచనా వేసినట్లుగా అర్థం అవుతోంది. మరోవైపు యుద్ధాన్ని ఆపాలని చైనా, రష్యాలు రంగంలోకి దిగాయి. ఇరాన్‌కు ఈ రెండు దేశాలు మద్దతు ప్రకటించాయి. దీంతో ఏంజరగబోతుందో అన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది.తాజాగా చైనా నోరు విప్పడంతో ఈ యుద్ధం కీలకమైన మలుపు తీసుకునే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఇరాన్‌లో రహస్యంగా కొనసాగుతున్న న్యూక్లియర్ రియాక్టర్ ఏ మాత్రం లీక్ అయినా, ఇరాన్, పరిసర ప్రాంతాల్లో ఉన్న దేశాలకు కూడా ముప్పు ముంచుకొస్తుంది. దీనిపై ఇటు ఇరాన్‌కు అటు అమెరికాకు కూడా అవగాహన ఉండివుంటుది. కానీ ఎందుకో ఇరాన్ కూడా తమ దాడుల తీవ్రత పెంచింది.ఈ యుద్ధంతో ఇప్పటికే మధ్య ప్రాచ్యం మండిపోతోంది.**

ఇరాన్ సార్వభౌమత్వాన్ని కాపాడతామంటూ చైనా రంగంలోకి దిగడంతో ప్రపంచ దేశాల్లో మూడో ప్రపంచ యుద్ధ భయాలు కనపడుతున్నాయి. ఇదే సమయం లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరిన్న భీకర దాడుల్ని చేసేందుకు సిద్ధమౌతున్నట్లు ప్రకటించారు. యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదని ట్రంప్ ముందే హెచ్చరించారు. ఆ వెనువెంటనే యుద్ధ తీవ్రత ఎలా ఉంటుందో కూడా చెప్పనే చెప్పారు. ఎనిమిది అరబ్దేశాలు ఇరాన్ దాడులతో విలవిల్లాడు తున్నాయి. ఇరాన్ అమెరికాతో రాజీ చర్చల కోసం ఏవిధంగానూ ప్రయ త్నించడం లేదు. మ-రోవైపు హర్మ్యాజ్ జలసంధి మూసివేయడంతో ప్రపంచం మీద చమురు భారం పడుతోంది. సంక్షోభం తప్పేలా లేదు. అమెరికా మాత్రం చర్చలకు ఆలస్యం అయ్యిందని బెదిరిస్తోంది. ఇరాన్‌లో తదుపరి ఎవరు నేతగా ఉండాలో తామే నిర్ణయిస్తామని కూడా ట్రంప్ ప్రకటించాడు. ఇకపోతే ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలు ముప్పు ముంగిట ఉన్నాయి. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం,రిఫైనపై ఇరాన్ దాడి చేయడంతో చమురు సరఫరా ఆగిపోయింది. ఇరాన్ తన హోర్ముజ్ జలసంధిని మూసి వేస్తే ప్రపంచ దేశాలకు అందే చమురు సరఫరా ఆగిపోగలదని అనుభవంఓలకి వచ్చింది. ఈ క్రమంలో బహ్రెయిన్ పోర్టులో ఆగి ఉన్న అమెరికాకు చెందిన స్టెనా ఇంపరేటివ్ చమురు నౌక పైనా డ్రోన్ దాడులు జరిగి మంటలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా అమెరికా తదితర దేశాల చమురు నౌకలు దెబ్బతింటే ఆయా దేశాలు ఇక చమురుకు కష్టాలు పడాల్సిందే. ఒకవైపు అమెరికా యుద్ధనౌకల మోహరింపు. మ-రోవైపు ఇరాన్, రష్యా యుద్ధ నౌకలు సంయుక్త నావికాదళ విన్యాసాల కవ్వింపుతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

యుద్ధ జ్వాలలు మింటికెగయడంతో భారత్ దేశంతో సహా ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు, పప్పు ధాన్యాలు, నూనెల ధరలపై విపరీతమైన ప్రభావం పడుతోంది. ఇప్పటికే దక్షిణ కొరియా, జపాన్, చైనా స్టాక్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. తాజా పరిస్థితుల రీత్యా యుద్ధ సంకేతాలు విస్తరించి ఆయా దేశాలు ఏదో ఓ పక్కకు చేరిపోవడం ఒక్కటే ప్రత్యామ్నాయంగా ఉన్నందున యుద్ధం మరికొంతకాలం తమ ప్రతాపాలను చూపిస్తుంది. యుద్ధం ఆగినా యుద్ధకాలపు ప్రభావాలు అంతత్వరగా ఉపసంహారణ జరుగదు. ఆ తర్వాత కూడా మార్కెట్లు కోలుకోవడానికి, పెరిగిన ధరలు తగ్గడానికి మరెంతో కాలం పడుతుంది. ఎందుకంటే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసేలా లేదు. ఇరువైపులా భీకర యుద్ధమే సాగుతోంది. ఎవరూ తగ్గేటట్లు లేరు. నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేసాయి. ఈ దాడిలో ఏమరుపాటున ఆ అణుకేంద్రం నుంచి వెలువడే అణుధార్మికత ప్రమాదకరమే. ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అమెరికా అధినేత ట్రంప్ ప్రయత్నిస్తున్న తరుణంలో చైనా ఇరాన్‌తో చేయికల్పడం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనని సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రష్యా కూడా రంగంలోకి దిగితే ఇక అది ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చు. మరోవైపు ఉక్రెయిన్ కూడా ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాతో చేతులు కలిపింది. ఇది సహజంగానే రష్యాకు గిట్టదు. మొత్తంగా ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా ఏర్పడితే వినాశనం తప్పదు. ప్రజలు ఆకలిచావులకు లోను కావాల్సిందే. ఈ క్రమంలో యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నాలు సాగాలి. ఇరు దేశాల మధ్య ఇగోలను చల్లార్చాలి. ఈ దశలో ఎవరు ముందుకు వస్తారన్నదే ముఖ్యం.



**కంచర్ల అచ్యుత రావు**
**ఎడిటర్, మనసులో మాట,**
**తెలుగు దినపత్రిక**

# ఇజ్రాయిల్‌పై తీవ్రమైన ఇరాన్ ప్రతిదాడులు

- **డిమోనా అణు కేంద్రంపై దాడికి ఇరాన్ గురి**

**టెహ్రాన్, మార్చి 6:** ఇజ్రాయిల్ దాడులకు ప్రతిదాడులను ముమ్మరం చేసిన ఇరాన్ ఇజ్రాయెల్ అణు రియాక్టర్‌పై గురిపెట్టిందన్న వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయిల్ అణు కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను డిమోనాకు రక్షణగా మోహరించింది. ప్రపంచంలోనే అత్యంత దుర్భేద్యమైన ప్రదేశంగా మార్చేసింది. ఇక్కడ యారో-2, 3, డేవిడ్ స్లింగ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇటీవల తన అత్యాధునిక ఐరన్ బీమ్‌ను కూడా ఇక్కడికే తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. అంతేకాదు.. భూగర్భంలో కొన్ని అంతస్తుల కింద తన అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ సురక్షితంగా ఉంచినట్లు తెలుస్తోంది. డిమోనాపై దాడి చేయడానికి ఇరాన్ అమ్ములపొదిలో డ్రోన్లు, క్షిపణులు వంటి చాలారకాల ఆయుధాలు ఉన్నాయి. రియాక్టర్ నుంచి ఇరాన్ 1200-1500 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత దూరం ప్రయాణించేందుకు టెహ్రాన్ అమ్ముల పొదిలో షహీన్ 136 డ్రోన్లు భారీ సంఖ్యలో ఉన్నాయి. ఇది దాదాపు 50 కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. ఇక క్షిపణుల విషయానికి వస్తే సాహబ్-3, ఖైబర్‌షేకన్, ఎమాద్, ఖుర్రంషహర్, ఘద్ర, సెజ్జిల్, సుమర్ వంటి క్షిపణులున్నాయి. వీటి రేంజి



1300 కిలోమీటర్ల నుంచి 2500 కిలోమీటర్ల వరకు ఉంది. ఇవికాకుండా ఫతా-2 హైపర్ సోనిక్ క్షిపణి కూడా ఉంది. ఇది ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా తప్పించుకోగలదు. గతంలో సిరియాతో ఘర్షణ వేళ ఈ రియాక్టర్ సమీపంలో కొన్ని క్షిపణులు పడ్డాయి. ఇజ్రాయెల్ ఏర్పడిన తర్వాత పొరుగు దేశాలు వరుసగా దానితో యుద్ధాలకు దిగాయి. అమెరికా సాయంతో.. వాటిని ఓడించినా.. ఎప్పటికైనా తన ఉనికికి ముప్పు తప్పదని గ్రహించింది. దీంతో నాటి ప్రధాని డేవిడ్ బెన్ గురియన్ తమ దేశాన్ని అణుశక్తిగా మార్చాలనే నిర్ణయానికి వచ్చారు. ఫ్రాన్స్ సాయంతో అణు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు నెగెవ్ ఎడారిలో 'డిమోనా' అనే ప్రదేశంలో ఓ భారీ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ నిర్మించింది. ఐరోపా దేశాల టెక్నాలజీ, బ్లూప్రింట్స్, నిపుణుల సాయంతో దీనిని రూపొందించారు. ఇందులోని భూగర్భ బంకర్లలో అణుబాంబులకు వాడే ప్లుటోనియం ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ విషయం అతికొద్దిమందికి మాత్రమే తెలుసు. అలా ఇజ్రాయెల్ అణ్వాయుధం తయారీలో డిమోనా రియాక్టర్ కీలక పాత్ర పోషించింది. ఈ రియాక్టర్‌కు ఉత్తరం వైపు 85 కిలోమీటర్ల దూరంలో జెరూసలెం నగరం ఉంది. ఇక 75 కిలోమీటర్ల దూరంలో ఈజిప్ట్ సరిహద్దులు.. 25 కిలోమీటర్ల దూరంలో జోర్డాన్ ఉన్నాయి. ఒకవేళ దాడి జరిగితే ఇక్కడి నుంచి లీకయ్యే రేడియేషన్ ప్రభావం ఈ దేశాలకు పాకే ప్రమాదం ఉంది.

# అమెరికా ఆస్తులపైనే మా దాడులు

- **అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు**
- **ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే**

**న్యూఢిల్లీ, మార్చి 6:** పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదని ఖతీబ్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా-75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనావర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు. తమ దేశ పాలనా నిర్మాణం వ్యక్తులపై కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉందని స్పష్టంచేశారు. 'ఇరాన్‌లో రాజ్యాంగం ఉంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహించాలనే దానిపై




స్పష్టమైన విభజన ఉంది' అని అన్నారు.




# పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

**200 మంది వరకు చనిపోయినట్లు యూనిసెఫ్ ప్రకటన**

**న్యూఢిల్లీ, మార్చి 6:** అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మూల్యం మాత్రం చెల్లిస్తున్నారు అని వ్యాఖ్యానించింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇదిలాఉండగా.. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు ఆపరేషన్‌లో ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ఓ బాలికల పాఠశాలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 160 మందికి పైగా విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది. ఈ దాడిపై తాజాగా యూఎస్ దళాలు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ అధికారులు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

# ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందే - ట్రంప్



**ఢిల్లీ:** ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం ఉండదని, బేషరతుగా లొంగిపోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఆ తర్వాత ఇరాన్‌కు ఆమోదయోగ్యమైన నాయకుడి ఎన్నిక ఉంటుందన్నారు. వివిధ భాగస్వామ్య పక్షాలతో కలిసి ఇరాన్‌ను సంక్షోభం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు తాము కృషి చేస్తామన్నారు. గతంలో లేని విధంగా ఇరాన్‌ను ఆర్థికంగా మెరుగైన, బలమైన స్థితికి తీసుకువస్తామన్నారు. ఇరాన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొంటూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పోస్టు చేశారు.మరోవైపు పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంపై కొన్ని దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేస్తున్నాయని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ పేర్కొన్నారు. అయితే, ఏయే దేశాలు ప్రయత్నాలు చేస్తున్నాయన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. తమ ప్రాంతంలో శాశ్వత శాంతికి కట్టుబడి ఉన్నామని.. అయినప్పటికీ, తమ దేశ గౌరవం, సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటామనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు.

# యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం

**అసలు యుద్ధం మొదలయ్యిందే ఇప్పుడు**

**అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం**

**వాషింగ్టన్, మార్చి 6:** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం నుంచి వెనక్కి తగ్గేదే లేదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం చేశారు. అమెరికా సైనిక శక్తిని ఇరాన్ తక్కువ అంచనా వేస్తోందన్నారు. ఈ యుద్ధంలో అమెరికా నిలబడలేదని ఇరాన్ అనుకుంటోందని, తాము అసలు పోరాటాన్ని ఇప్పుడే మొదలుపెట్టామని ఆయన పేర్కొన్నారు. ఇక గల్ఫ్ ప్రాంత సముద్ర జలాల్లో అమెరికా నౌకా దళాలు వెనక్కి జరుగుతున్నాయనే ప్రచారాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఖండించింది. యావత్ ఇరాన్ నేవీని సముద్రంలో ముంచేసే వరకు తమ మిషన్ ఆగదని తేల్చి చెప్పింది. గత 72 గంటల్లో ఇరాన్‌లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్ ఫోర్స్ వైమానిక దాడులు చేసిందని సెంట్‌కామ్ వెల్లడించింది. బి-2 స్పిరిట్ బాంబర్ విమానాల నుంచి కేవలం ఒక గంట వ్యవధిలోనే 2వేల పౌండ్ల బరువున్న డజన్ల కొద్దీ పెనెట్రేటర్ బాంబులను బాలిస్టిక్ మిస్సైల్ లాంచ్ ప్యాడ్లపై వేశామని పేర్కొంది. అమెరికా సంకల్పం ఎంత బలమైందో ఇరాన్ అర్థం చేసుకోలేకపోతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ అన్నారు. ఇరాన్‌పై తమ సైనిక చర్యను బలంగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. వాషింగ్టన్‌లో విలేకరుల సమావేశం వేదికగా పీట్ హెగ్సెథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాను ఇరాన్ నేతలు, ఐఆర్‌జీసీ తక్కువ అంచనా వేస్తున్నాయని ఆయన చెప్పారు. తమ సంకల్పానికి కట్టుబడి ఉంటామని, ఇరాన్‌పై పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. పూర్తి శక్తితో అమెరికా ఇప్పుడే దాడులను మొదలుపెట్టిందన్నారు. ఒకవేళ అవసరమైతే దీర్ఘకాలం పాటు ఈ యుద్ధాన్ని చేసేందుకూ అమెరికా సన్నద్ధమై ఉందని పేర్కొన్నారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో అరబ్ దేశాల నుంచి అమెరికాకు శరణార్థులు క్యూ కట్టే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే అరబ్ శరణార్థులకు అమెరికాలో ఆశ్రయాన్ని కల్పించే ఎలాంటి ప్రణాళికలూ ప్రస్తుతానికి తమకు లేవని అమెరికా రక్షణ మంత్రి తేల్చి చెప్పారు.



మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
శనివారం 7 మార్చి 2026


## స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి నర్సీపట్నం అభివృద్ధి నివేదిక అందజేసిన

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**నర్సీపట్నం ,మార్చి 6 (మనసులో మాట)..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు ని శుక్రవారం స్పీకర్ చాంబర్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన శాఖ పరిధిలోని నర్సీపట్నం నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి కి సంబంధించిన సమగ్ర నివేదికను స్పీకర్ కి ఆయన అందజేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఆధ్వర్యంలో నర్సీపట్నంలో మొత్తం రూ. 312 కోట్ల నిధులతో 5,628 పనులు మంజూరు కాగా, ఇప్పటికే రికార్డు స్థాయిలో 4,530 పనులు పూర్తయినట్లు పవన్ కళ్యాణ్ ఈ నివేదికలో స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలైన పల్లె పండుగ, పల్లె పండుగ 2.0, జల జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో రహదారులు, ఇంటింటికీ త్రాగునీరు, ఇంకుడు గుంతలు, మినీ గోకులాలు వంటి మౌలిక సదుపాయాల కల్పన శరవేగంగా జరుగుతోందని డిప్యూటీ సీఎం వివరించారు. కేవలం జల జీవన్ మిషన్, 15వ ఆర్థిక సంఘం ద్వారానే రూ. 173.53 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో పనులు విజయవంతంగా సాగుతున్నాయని, మిగిలిన పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## వెంకటరాజుపురంలో అగ్నిప్రమాదం

**దేవరాపల్లి, మార్చి 6, (మనసులో మాట) :** మండలంలోని వెంకటరాజుపురం గ్రామంలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానిక రాయిపురెడ్డి వారి కల్లాలు వద్ద పశువుల పాకలు, బెల్లం దిమ్మలు, ధాన్యంపురులు, గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదం రాత్రి 10 గంటల ప్రాంతంలో అకస్మికంగా మంటలు చెలరేగి పశువుల పాకలు కాలి బూడిద అయ్యాయి. అగ్ని ప్రమాదం విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పశువులను విప్పి బయటకు పంపేశారు. దీంతో పశువులకు ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు . మంటలను అదుపు చేసేందుకు ఫైర్ స్టేషన్ కు ఫోన్ చేశారు. ఈ అగ్నిప్రమాదంలో రాయిపురెడ్డి పెదశ్రీరామ్, చిన శ్రీరామ్ ఇద్దరు కళ్ళలో పూర్తిగా కాలిపోయాయి. ఈ కల్లాలలో నిల్వ ఉన్న 100 ధాన్యం కట్టల పూరి, 100 బెల్లపు దిమ్మలు కాలి బూడిదయ్యాయి. అకస్మాత్తుగా ఈ ప్రమాదం సంభవించడంతో అగ్ని బాధితులు లబోదిబోమంటున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## భవితకు బాట ఉచిత డ్రైవింగ్ శిక్షణ

- నిరుద్యోగ యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- సమావేశంలో మాట్లాడుతున్న దొన్ను దొర



**పాడేరు రూరల్ / అరకు, మార్చి 6 (మనసులో మాట)** సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) పాడేరు ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ నైపుణ్య శిక్షణ సంస్థ మరియు రిషి నాలెడ్జి హబ్ ఫౌండేషన్ సంయుక్తంగా గిరిజన నిరుద్యోగ యువత కోసం 45 రోజుల ఉచిత డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని అరకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి,
ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర, పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డాక్టర్ పి. రోహిణి తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహిస్తోందన్నారు. యువత శిక్షణను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో నేర్చుకుని భవిష్యత్తులో ఉపాధి పొందాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ అరకు ప్రాంతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో యువత ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని అన్నారు. ముఖ్యంగా మహిళలకు డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడం ఈ ప్రాంతంలో ఇదే మొదటిసారి అని తెలిపారు.

రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువత నైపుణ్య అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన వారికి ట్రైకార్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బొర్రా విజయరాణి, సుబ్బారావు, బీజేపీ నాయకులు పెనుమాక రవి, డోంబు నాయుడు, ఐటిడిఏ ట్రైకార్ అసిస్టెంట్ ఎన్. సీతారామయ్య, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి. చలపతిరావు, వాసవ్య మహిళా మండలి టి. సునీత, రిషి నాలెడ్జి హబ్ ఫౌండేషన్ చైర్మన్ పి. చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబునాయుడు కు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

# ఘన సత్కారం



**అనకాపల్లి, మార్చి 6 (మనసు లో మాట ):** అమరావతిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అనకాపల్లి జిల్లా అభివృద్ధి పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్పీకర్ సిహెచ్ అయ్యన్న పాత్రుడు, అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, అనకాపల్లి జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, చోడవరం శాసనసభ్యులు కె.ఎస్.ఎన్ రాజు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శాలువా తో సత్కరించి, శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిమ ను అందించి గౌరవించడం జరిగింది.

## ఉద్యాన పంటలను సాగుచేయాలి

### - రైతులకు జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి పిలుపు



**విజయనగరం: (మనసులో మాట.. జిల్లా ప్రతినిధి) మార్చ్ 6:** అత్యధిక లాభాలను ఇచ్చే ఉద్యాన పంటలను సాగు చేయాలని జిల్లా రైతాంగానికి కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. భోగాపురం మండలంలో శుక్రవారం కలెక్టర్ పర్యటించారు. కొయ్యపేటలో రైతులు సాగుచేస్తున్న ఉద్యాన పంటలను పరిశీలించారు. పొలాల్లో దిగి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సాగు చేస్తున్న పద్దతులు, మార్కెట్ సదుపాయం తదితర అంశాలను ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి స్థానంలో అత్యధిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటలవైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, పూల సాగు ద్వారా నిరంతరం ఆదాయాన్ని పొందవచ్చునని సూచించారు. ఉద్యాన సాగు వైపు మళ్లే రైతులకు జిల్లా యంత్రాంగం అన్నివిధాలా సహకారాన్ని, ప్రోత్సాహాన్ని ఇస్తుందని హామీ ఇచ్చారు. అలాగే వారు పండించే పంటలకు మార్కెట్ సదుపాయాన్న, సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందిస్తామని అన్నారు. అత్యధిక దిగుబడి కోసం సంప్రదాయ సాగు పద్దతులు బదులు ఆధునిక విధానాలను అవలంభించాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో ఉద్యానశాఖ డిడి చిట్టిబాబు, వ్యవసాయశాఖ ఎడి నాగభూషణరావు, మండల వ్యవసాయాధికారి హైమావతి, ఉద్యాన అధికారి ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రతిపాదిత పరిశ్రమలపై జిల్లా కలెక్టర్ సమీక్ష

### పరిశ్రమలు త్వరితగతిన ఏర్పాటు చేయాలి

### - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం (మనసులో మాట.. జిల్లా ప్రతినిధి) మార్చ్: 6:** జిల్లాలో ప్రతిపాదించిన పరిశ్రమల స్థాపన, వాటి పురోగతి మరియు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి శుక్రవారం తన చాంబర్లో పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతిపాదిత పరిశ్రమలు త్వరితగతిన స్థాపించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, విద్యుత్, నీటి సరఫరా, రహదారి సౌకర్యాలు తదితర అంశాలను ముందుగానే సిద్ధం చేసి పెట్టుబడిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటుతో జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరిగి, స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిపాదించిన వివిధ పరిశ్రమల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.. ఈ సందర్భంగా జిల్లాలో కొత్తగా ఏర్పాటు కానున్న ప్రధాన పరిశ్రమల పురోగతిపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. స్టేట్ ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ బోర్డ్ సిద్ధం చేసిన నాలుగు పరిశ్రమలు అయినా రాధిక వెజిటబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్, మా మహామాయ ఇండస్ట్రీస్ లిమిటెడ్ , జెఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రీస్ పార్క్ లిమిటెడ్ ల భూసేకరణ పై సమీక్షించారు అలాగే ఎం ఓ యూస్ తో సిద్ధంగా ఉన్న స్టీల్ ఎక్స్చేంజ్ ఇండియా లిమిటెడ్, స్టీల్ ఎక్స్చేంజ్ ఎన్‌ఫ్రా లాజిస్టిక్స్ లిమిటెడ్, అన్నుమి స్పేస్ కార్పొరేషన్, , వైశాఖి గ్రోత్ కారిడార్, రుషిల్ డెకర్స్, ఎలైట్లాజిక్స్ ఎగ్జిమ్ ఏజెన్సీ ఇండియా లిమిటెడ్ వంటి కంపెనీలు కావలసిన భూమి వివరాలు మరియు వారి సంసిద్ధతపై సమీక్షించారు. పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందిస్తూ పరిశ్రమల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం ఎం.వి. కరుణాకర్, విజయనగరం ఆర్డీవో వెంకటేశ్వరరావు, చీపురుపల్లి ఆర్డీవో ఎం సుధారాణి జీ సెక్షన్స్ సూపరిండెంట్ తదితరులు పాల్గొన్నారు.



## ఏప్రిల్ నాటికి వంశధార ఎత్తిపోతల పూర్తి

### - జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

హీరమండలం, మార్చి 6: గొట్టా బ్యారేజీ వద్ద వంశధార ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేసి, రానున్న ఏప్రిల్ నాటికి పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన హీరమండలం మండలంలో పర్యటించి, జలాశయానికి నీటిని తరలించే ఎత్తిపోతల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పథకానికి సంబంధించిన విద్యుత్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, జలాశయం భవిష్యత్తులో జిల్లాకే తలమానికంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా, హీరమండలం జలాశయ ప్రాంతాన్ని ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆయన వెల్లడించారు.

జలాశయం ద్వారా ఉద్దాన ప్రాంతంతో పాటు పలు నియోజకవర్గాలకు శాశ్వత మంచినీటి పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ధీమా వ్యక్తం చేశారు. జల జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు మంచినీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, దీనివల్ల పాతపట్నం, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాలకు సాగు, మంచినీటి లభ్యత పెరుగుతుందని వివరించారు. ఈ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు.

## నియోజకవర్గాల లో గుర్తించిన అవసరాల పై సవివరంగా నివేదికలివ్వండి

### - జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి



**విజయనగరం (మనసులో మాట.. జిల్లా ప్రతినిధి) మార్చ్ 6:** నియోజక వర్గాలలో శాసన సభ్యులు గుర్తించి పరిష్కరించమని కోరిన పనులకు, ప్రాజెక్టులకు శాఖల వారీగా సవివరమైన నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. నియోజక వర్గం వారీగా శాసన సభ్యులు పెట్టుకున్న వినతులలో ముఖ్యమైన వాటిని, ఆర్థికపరంగా మంజూరులు చేయవలసిన పనులకు, ప్రాజెక్టులకు ఎంతెంత ఖర్చు అవుతుంది, దానివలన ఎంతమందికి ప్రయోజనం చేకూరుతుంది వంటి అంచనాలతో కూడిన నోట్స్ ను వివరంగా ఆయా శాఖలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే మంజూరైన పనులకు నిధులు రాకుండా ఉన్న వాటి వివరాలను కూడా పొందుపర్చలన్నారు. త్వరలో ముఖ్యమంత్రి తో జిల్లా అబివృద్ధి పై. ప్రజాప్రతినిధులు, ఇంచార్జ్ మంత్రి, జిల్లా కలెక్టర్ తో సమావేశం ఉన్నందున ఈ వివరాలన్నింటి పై 1 పేజీ నోట్స్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జేసీ సేదు మాధవన్, సి.పి.ఓ బాలాజీ, ఆర్ అండ్ బి, ఆర్.డబ్ల్యు.ఎస్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, వైద్య ,విద్య ఉద్యాన, వ్యవసాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈ -పంటను త్వరగా పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం (మనసులో మాట.. జిల్లా ప్రతినిధి) మార్చ్ 6:** ఈ పంటను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం డెంకాడ మండలంలో పర్యటించారు. పెదతాడివాడ గ్రామ పొలాలను పరిశీలించారు. ఈ పంట సూపర్ వైజరీ తనిఖీ నిర్వహించారు. రైతులు కిలారి ఎల్లారావు, కోరాడ రఘు పొలాల్లో వేసిన నువ్వుచేలు, ఈ పంట నమోదును పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వరి పంటకు బదులు ఉద్యాన పంటలను వేయడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చునని సూచించారు. ఈ పర్యటనలో ఉద్యానశాఖ డిడి చిట్టిబాబు, వ్యవసాయశాఖ ఎడిలు నాగభూషణరావు, ఆర్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి టి.సంగీత, ఉద్యాన అధికారి ఉమాభారతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## 70 శాతం ఇంటి పన్నులు వసూళ్లు

కోటవురట్ల మండలంలో ఇప్పటివరకు 70% ఇంటి పన్నులు వసూళ్లు చేసినట్లు డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు శుక్రవారం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ 25 పంచాయతీల్లో రూ. 77 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా రూ.54 లక్షలు వసూళ్లు చేసామన్నారు. పన్నుల వసూళ్లలో రామన్నపాలెం పంచాయతీ ముందంజలో ఉందన్నారు. ఈ పంచాయతీలో 90 శాతం ఇంటి పన్నులు వసూళ్లు అయినట్లు తెలిపారు. లింగాపురం, కైలాసపట్నం పంచాయతీలు వెనుకబడి ఉన్నట్లు తెలిపారు. నెల 15వ తేదీలోగా శత శాతం ఇంటి పన్నులు వసూళ్లు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇంటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించి పన్నులు వసూళ్లు చేయాలన్నారు. పన్నులు పంచాయతీల అభివృద్ధికి దోహదపడతాయన్నారు.

## కండ్ల కలకను నిర్లక్ష్యం చేయొద్దు

**- డాక్టర్ కె.త్రినాధరావు, నేత్రవైద్య నిపుణులు**
**జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్**




విజయనగరం: (మనసులో మాట..జిల్లా ప్రతినిధి): మార్చ్: 6:: కండ్ల కలకను నిర్లక్ష్యం చేయవద్దని, జిల్లా సర్వజన ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ కె.త్రినాధరావు సూచించారు. కండ్ల కలక, ఇతర కంటి వ్యాధులు సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఇటీవల కొన్ని జిల్లాల్లో కండ్ల కలక విజృంభిస్తున్న కారణంగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు సూచనలు చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు : కంటి ఎర్రబారడం, దురద లేదా నీరు కారడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా కంటి వైద్యుడిని సంప్రదించాలని కోరారు. సరైన సమయంలో చికిత్స తీసుకుంటే వ్యాధి త్వరగా తగ్గిపోతుందనీ మరియు ఇతరులకు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చునని సూచించారు. కంటి ఆరోగ్యం మన ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని, పరిశుభ్రత పాటించి కంటి వ్యాధులను దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సీజనల్ కంటి వ్యాధులు : ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా ప్రజల్లో సీజనల్ కంటి వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కంజంక్టివిటిస్ (మీుసతీుం జుఎవ) వంటి వైరల్ కంటి ఇన్ఫెక్షన్లు ఈ కాలంలో వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఈ వ్యాధి చిన్నపిల్లలు, విద్యార్థులు మరియు గుంపులుగా ఉండే ప్రాంతాల్లో త్వరగా వ్యాపించే అవకాశం ఉంది. అందువల్ల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించడం అత్యంత అవసరం. సీజనల్ కంటి వ్యాధులు రావడానికి గల కారణాలు : సీజన్ మార్పులు, ధూళి, కాలుష్యం, వైరల్ మరియు బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు ప్రధాన కారణాలు. పరిశుభ్రత లోపం, మురికిగా ఉన్న చేతులతో కంటిని తాకడం, వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోవడం వంటి అలవాట్లు కూడా ఈ వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయి. కండ్ల కలక ప్రధాన లక్షణాలు : కంటి ఎర్రబారడం, కంటిలో దురద లేదా మంట, నీరు కారడం, కంటి చుట్టూ వాపు, వెలుతురు చూసేటప్పుడు ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. వ్యాధి వ్యాప్తి చెందే విధానం : ఈ కంటి వ్యాధులు ముఖ్యంగా వైరస్ ద్వారా ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి సులభంగా వ్యాప్తి చెందుతాయి. ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తి ఉపయోగించిన తువాలు, రుమాలు, దిండు కవర్లు లేదా ఇతర వస్తువులు ఉపయోగించినప్పుడు కూడా వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పాఠశాలలు, హాస్టల్స్, కార్యాలయాలు వంటి గుంపులలో వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. తీసుకోవలసిన జాగ్రత్తలు : ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. చేతులను తరచుగా సబ్బుతో కడుక్కోవాలి. కంటిని చేతులతో రుద్దకూడదు. వ్యక్తిగత తువాలు, రుమాలు వేరుగా ఉపయోగించాలి. బయటకు వెళ్లేటప్పుడు ధూళి నుండి రక్షణ కోసం కళ్లద్దాలు ధరించడం మంచిది. కంటి సమస్యలు ఉన్నప్పుడు డాక్టర్ సూచించిన మందులు మాత్రమే వాడాలి.

### అనకాపల్లి లో ఘనంగా నూకాంబిక అమ్మవారి ఆలయంలో

# దేవతాహ్వాన మహోత్సవం



**అనకాపల్లి, మార్చి 6 (మనసులో మాట ):** ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం దేవతాహ్వాన మహోత్సవం , విఘ్నేశ్వర పూజా తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అధ్వర్యంలో ఈనెల 8 న జరిగే అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ట, రాజగోపుర ప్రతిష్ట, కలశ స్థాపన, మహాసంప్రోక్షణ మహోత్సవాలు పురస్కరించుకొని నూతన ప్రధాన ఆలయ మండపంలో విఘ్నేశ్వరపూజ, భగవతి పుణ్యాహ వచనం , రుత్విక్ వరుణ, రక్ష సూత్రధారణ, దీక్షాధారణ, అగ్ని ప్రతిష్ట నిరాజనం, మంత్రపుష్పం, వేద పారాయణం, మృత్స గ్రహణం, అంకురార్పణ, హోమం , దేవతాహ్వానం, జలాధి వాసనం తదితర పూజా కార్యక్రమాలు సహస్రాధిక ప్రతిష్టాపనా చార్యులు శ్రీమాన్ రేజేటి శ్రీరామచార్యులు సంపూర్ణ పర్యవేక్షణలో రేజేటి సీతారామాచార్యులు, రేజేటి గోప అప్పలచార్యులు(చక్రవర్తి ) తదితర వేదపండితులతో ఘనంగా నిర్వహించారు. కాగా రాష్ట్ర పండుగ గా గుర్తింపు పొందిన అమ్మవారి జాతర ను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు విస్తృతంగా జరుగుతున్నాయి. మరొక ప్రక్క ప్రతిష్టా పూజాకార్యక్రమాలు వెరశి ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఇదిలావుంటే దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆర్ జే సి వేంద్ర తినాదరావు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత తదితరులు ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారి ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్లబాబు), ఆలయ సహాయ కమిషనర్, కార్యానిర్వహణాధి కారి యాళ్ళ శ్రీధర్, జిల్లా సహాయ కమిషనర్ కె.ఎల్ సుధారాణి, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కుమార్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్,వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, దేవాదాయ ధర్మాధాయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, అధికసంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యాన

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా మెటీరియల్

**- సంఘ వ్యవస్థాపకులు ఆళ్ల ప్రవీణ కుమార్ అందజేత**



**అనకాపల్లి, మార్చి 6 (మనసు లో మాట ):** అనకాపల్లి పట్టణం లోగల బిసి బాలుర వసతి గృహంలో శుక్రవారం అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బిసి, డిఎస్టి, నేతాజీ సుభాష్ చంద్రబోస్, హాస్టల్స్ లలో గల పదవ తరగతి చదువుచున్న 80 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. ముఖ్యఅతిథిలుగా అనకాపల్లి రూరల్ ఎస్సై జి.నాగేశ్వరరావు, మాజీ జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ జై భీమ్ సేన జిల్లా అధ్యక్షులు రేబాక మధుబాబు, హెచ్ బ్ల్యుటీ సత్యనారాయణ, రామయ్య సత్యనారాయణ, రాజు, శ్రీను, అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆర్గనైజర్ చింతా లక్ష్మణరావు, సోషల్ మీడియా ఇంచార్జ్ ఆడారి పవన్, రవి బృహస్పతి తదితరులు పాల్గొన్నారు. ముందుగా అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సై నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థులకు పదో తరగతి తొలిమెట్టు ని విద్యతోపాటు సంస్కారం కూడా నేర్చుకోవాలన్నారు. పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకున్న తర్వాత ఇంటర్లో జాయిన్ అయ్యే ముందు వేసే అడుగు పై అవగాహన ఉండాలని, ఎవరికైనా తెలియకపోతే ఉపాధ్యాయుల్ని అడిగి తెలుసుకోవాలన్నారు. మధుబాబు మాట్లాడుతూ అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో యువత ను చైతన్య పరిచే ఎన్నో కార్యక్రమాలు చేయడం నేటి యువతకి ఈ సంఘం మరియు సంఘం చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆదర్శంగా ఉంటున్నారని అన్నారు. అబ్దుల్ కలాం సేవ సంఘం నుంచి అనకాపల్లి జిల్లాలో అనేకచోట్ల మహనీయుల విగ్రహాలు, ప్రతిష్ఠించడం తోపాటు యువతలో చైతన్యం తీసుకువచ్చే, రాష్ట్రస్థాయి జిల్లాస్థాయి, క్రీడా కార్యక్రమాలు,అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అలాగే పదో తరగతి పూర్తి చేసిన వెంటనే ఉన్నత విద్య కై ప్రభుత్వం అనేక వెసులుబాటులు కల్పించిందని, దానిని పూర్తిగా వెనుకబడిన తరగతులు వారు చక్కగా వినియోగించుకొని ఉన్నతమైన స్థాయికి చేరుకోవచ్చన్నారు. అనంతరం ఎస్సై నాగేశ్వరావు ను అబ్దుల్ కలాం సేవా సంఘం ఛైర్మెన్ ప్రవీణ్ కుమార్, సంఘ సభ్యులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కనీస వేతనాల అమలుకై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**- సిఐటియు డిమాండ్**




**అనకాపల్లి, మార్చి 6 (మనసు లో మాట ):** వివిధ పరిశ్రమలు, సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల అమలుకై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి కృషి చేయాలని సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కనీస వేతనాల సలహా మండలి రాష్ట్ర చైర్మన్ పి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన విశాఖపట్నంలో కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, కోశాధికారి గనిశెట్టి సత్యనారాయణ లు చైర్మన్ కు విన్నవించడం జరిగింది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అనకాపల్లి జిల్లాలో అనేక పరిశ్రమల్లో కనీస వేతనాలు అమలు చేయడం లేదని, వీరిపై ప్రభుత్వం పర్యవేక్షణ గాని, చర్యలు కానీ తీసుకోవడం లేదని వారు మండల కి తెలియజేశారు. 12 గంటలు పని చేయించుకొని ఎనిమిది గంటల వేతనాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న స్కీం వర్కర్స్ అంగన్వాడి, ఆశ, వెలుగు వివోఏలు, మధ్యాహ్న భోజనం, స్కూలు ఆయాలు సైతం కనీస వేతనాలు లేక అలమటిస్తున్నారని ప్రభుత్వం వీరందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని వారు కోరారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న ఫార్మా, ఎస్ సి జెడ్, ఎన్ఏఓబి తదితర పారిశ్రామిక వాడల్లో కూడా కనీస వేతనాలు అమలు చేయని యాజమాన్యాలు, కాంట్రాక్టర్ పై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం సలహా మండలి సమావేశాలు తరచూ నిర్వహించడం, పర్యవేక్షించటం కనీస వేతనాలు అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవడం చేయాలని వారు బోర్డు చైర్మన్ ని కోరారు.

## మార్కెట్ ఫెడ్ సమావేశంలో పాల్గొన్న మాడుగుల నాయకులు



**వి మాడుగుల మార్చి 6 (మనసులో మాట)..** విజయవాడ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య (మార్క్ ఫెడ్) వారి 13 వ సర్వసభ్య సమావేశానికి మాడుగుల మండలం నుంచి కింతలు పిఏసిఎస్ చైర్ పర్సన్ మరియు జిల్లా పార్టీ ఆర్గనైజేషన్ సెక్రటరీ ఉండూరు దేవుడు,, మాడుగుల పిఏసిఎస్ చైర్ పర్సన్ కొట్నాల త్రినాథ్ వీరనారాయణ పిఏసిఎస్ చైర్పర్సన్ పతివాడ వరహాల నాయుడు,, కేజీ పురం పిఏసిఎస్ చైర్పర్సన్ సెరగడం ఆది బాబు శుక్రవారం హాజరవడం జరిగింది.. ఈ సమావేశం మార్క్ఫెడ్ చైర్మన్ కుర్రోతు బంగారు రాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మార్క్ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ నాయుడు,, తులసి రెడ్డి,, శశిభూషణ్ రెడ్డి,, ఆప్కాబ్ సీఈవో తో పాటు రాష్ట్రంలో ఉన్న కోఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్లు సీఈవోలు సుమారు 800 మంది హాజరైనారు. ఈ సమావేశంలో చర్చించిన అంశములు.... 1. 2025-26 సంవత్సరములో సుమారు 6 వేల కోట్లతో పౌరసరఫలాల శాఖ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ చేయడం జరిగింది.. 2. ప్రభుత్వం ప్రకటించిన కనీసం మద్దతు ధరలతో కందులు, మినుములు, పెసలు, సెనగలు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న, రాగులు కొర్రలు తదితర వాణిజ్య పంటలన్నీ కొనుగోలు చేసి విత్తనాలు సప్లై కూడా చేయించడం జరిగింది.. 3. మార్క్ఫెడ్ ద్వారా పొగాకు రైతులని మద్దతు ధరతో కూటమి ప్రభుత్వ ఆదేశం ప్రకారం రైతుల నుంచి పొగాకు సేకరణ కూడా చేపట్టడం జరిగింది.. 4. మార్క్ఫెడ్ ద్వారా పిఏసిఎస్ రైతులందరికీ ఇరువులు సప్లై విషయంలో కలెక్టర్ గారి ఆదేశాల ప్రకారం పంపిణీ చేయడం జరిగిందని ఇటుపైన ఇంకా రైతులు కోపరేటివ్ సొసైటీలు రైతు సేవా కేంద్రాల ద్వారా ఇరువుల్ని తీసుకునేలాగా రైతులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే ధ్యేయమని తెలియజేయడం జరిగింది... అలాగనే సొసైటీల ద్వారా పశువులకు తక్కువ ధరకి మంచి పోషకాలు ఉన్న పశుదానా సప్లై చేయమని కోరడ




## గ్రామ సర్వేల నిరసన

**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, మనసులో మాట మార్చి 6:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ కార్యాలయం ఎదుట గ్రామ సర్వేయర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. "విలేజ్ సర్వేయర్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ" ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సర్వేయర్లకు నెలకు రూ.30,000 రూపాయలు స్థిర జీతం చెల్లించాలని, తమకు సూపర్వైజర్ ప్రమోషన్ ఛానల్ కల్పించాలని, సర్వేయర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే గ్రామ సర్వేయర్లకు తగిన గుర్తింపు మరియు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. విధుల నుండి తొలగించిన సర్వేయర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని గ్రామ సర్వేయర్లు హెచ్చరించారు.

### గర్భిణీలు బాలింతల కు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అందించిన

## పథకాలను సద్వినియోగం చేసుకోండి




**వి మాడుగుల మార్చి 6 (మనసులో మాట)..** వి మాడుగుల ఎంకోడూరులో కిషోర్ బాలికలకు మార్చి 2 నుండి 20 వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం మాడుగుల మండలంలోశిశు సంక్షేమ శాఖ ద్వారా అందించిన పథకాలను సద్వినియోగం పరుచుకోవాలి ని ప్రతిజ్ఞ నిర్వహించారు. శుక్రవారం గర్భిణీలకు బాలింతలకు స్త్రీ శిశు సంక్షేమ శమఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కిషోర్ బాలికలకు మిషను శక్తి ద్వారా అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకొని మార్చి నెలలో 18 రోజులపాటుఈ ప్రోగ్రామ్ చేయడం జరుగుతుందని ఈ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశము కిషోర్ బాలికలకు గర్భస్థ శిశువు లింగనిర్ధారణ.వన్ స్టాప్ సెంటర్ గురించి తల్లి లందరికీ హెల్ప్ లైన్ గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ ప్రోగ్రాం సిడిపిఓ మేడం జి ఎర్రయ్యమ్మ, మరియు సూపర్వైజర్లు వి ఈశ్వరమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు ఆర్ రామలక్ష్మి, ఎస్ కుమారి ,ఎల్ ఎం ఎం పిఏ హేమ, మరియు ఆశ కార్యకర్తలు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

## పన్ను చెల్లింపుకు డ్వాక్రా మహిళలు సహకరించాలి



**ఎస్. రాయవరం, మార్చి 6,(మనసులో మాట):** మండలంలోని గ్రామపంచాయితీ లపరిధిలో ఇంటిపన్నులు వసూలుకు డ్వాక్రామహిళలు సహకరించాలని డిప్యూటీ ఎంపిడిఓ బి. సత్యనారాయణ కోరారు. శుక్రవారం మండలంలోని వమ్మవరంగ్రామంలో డ్వాక్రామహిళలుతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇంటిపన్నులు చెల్లించనివారు పన్నుచెల్లించి సహకరించాలని కోరారు.ఎస్.రాయవరం, తిమ్మాపురంగ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఇంటి పన్నులు వసూలు ను డిప్యూటీ ఎంపిడిఓ పరిశీలించారు. ప్రతీ పంచాయతీలో శత శాతం ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలని,గృహ యజమానులు పంచాయతీకి ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేసారు. . ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు జాన్సీ రాణి,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ఆధ్వర్యంలో సిసి రోడ్లు నిర్మాణాలు



**వి మాడుగుల మార్చి 6 (మనసులో మాట)..** మాడుగుల మండలంలోవీరనారాయణ ము గ్రామంలో అభివృద్ధి పనులు సిసి రోడ్లు నిర్మాణం కూటమి ఆధ్వర్యంలో జరుగుతున్నది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్లపు కొండ అప్పారావు జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దాసరి అచ్యుతరావు గ్రామ శాఖ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాపేటి జగ్గారావు కార్యదర్శి తెలుగుదేశం పార్టీ నాయకులు కాళ్ళ కన్నారావు వార్డు మెంబర్ జిల్లా పరిషత్ హై స్కూల్ కమిటీ చైర్మన్ బంగారు నాయుడు అగ్రపు వరప్రసాద్ మాజీ కోపరేటివ్ ప్రెసిడెంట్ దాడి మోది నాయుడు కాళ్ల జగ్గారావు తూరుబిల్లి రామారావునాయకులు పాల్గొన్నారు

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



శ్రీదేవి ఆలయంలో

## ఘనంగా కలస ప్రతిష్ఠాపన

**- 35 వేలుతో కలశం తయారు చేయించిన దాతకోన శ్రీను (రెడ్డి)తాపీ మేస్త్రి**



**విమాడుగుల మార్చి 6 (మనసులో మాట)..** మండల కేంద్రమైన మాడుగుల బస్టాండ్ ఆవరణలో ఉన్న శ్రీదేవి అమ్మవారి ఆలయానికి నూతనంగా శుక్రవారం ఆలయ శిఖరం పై కలస ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులందరూ తమ శక్తి కొలది బూరెలు తీపి పదార్థాలను తీసుకువచ్చి నూతనంగా ఆలయ శిఖరం పై నెలకొల్పిన కలశంపై వాటిని దారగా పోశారు వేద పండితుల నడుమ శాస్త్రవేత్తంగా ఈ కలశ స్థాపనను గ్రామ పెద్దలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సమన్వయంతో పండగ విజయవంతం




మునగపాక:మండలంలోని తోటాడ ,గవర్ల అనకాపల్లి గ్రామాల ఆరాధ్య దైవం మరిడిమాంబ అమ్మవారి జాతర అందరి సమన్వయశీతో ఘనంగా నిర్వహించామని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తెలిపారు.రెండు గ్రామ కమిటీల ఆహ్వానం మేరకు అమ్మవారి దర్శనానికి వచ్చిన అతిథులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మండల పోలీసులు తీసుకున్న చొరవ అభినందనీయం అన్నారు.అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు.జాతర విజయానికి సహకరించిన రెండు గ్రామాల ప్రజలకు నాయకులకు ధన్యవాదాలు తెలియజేసారు

## మండల వైఎస్సార్ సీపీ ఎస్సి విభాగ అధ్యక్షులుగా దిమ్మల శివ గణేష్



**మునగపాక, ఫిబ్రవరి 6, మనసులో మాట..** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ ఆశీస్సులతో, ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ కరణం ధర్మశ్రీ , వారి ఆధ్వర్యంలో, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఎస్సీ విభాగం అధ్యక్షులుగా దిమ్మల శివ గణేష్ ను నియమించడం జరిగింది, ప్రస్తుతం మునగపాక అంబేద్కర్ కాలనీ, అంబేద్కర్ యువజన సేవా సంఘం ప్రెసిడెంట్గా, మరియు రామాలయం ఉత్సవ కమిటీ చైర్మన్ గా ప్రస్తుతం కొనసాగడం జరుగుచున్నది. నాపై నమ్మకం ఉంచి నన్ను మండల ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షునిగా నియమించినందుకు వైఎస్సార్సీపీ ముఖ్య నేతలు అందరికీ శివ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి తన శక్తివంచ నలేకుండా కృషి చేస్తానని దిమ్మల శివ గణేష్ అన్నారు.

# ప్రాధమిక స్థాయిలో గుర్తిస్తే కేన్సరును అధిగమించవచ్చు

**- జిల్లా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత**

**- మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో**

**- మహిళా ఉద్యోగులకు ఉచిత కేన్సర్ స్క్రీనింగు, గైనిక్ మరియు సాధారణ వైద్య పరీక్షలు**




**విజయనగరం (మనసులో మాట.. జిల్లా ప్రతినిధి) మార్చ్ 6:** మహిళా సాధికారత వారోత్సవాలు జిల్లాలో ఘనంగా కొనసాగుతున్నాయని, ఇందులో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మహిళా పోలీసు ఉద్యోగులు, మహిళా సంరక్షణ కార్యదర్శిలు, పోలీసు కుటుంబాలకు చెందిన మహిళలకు మహేంద్ర ఆసుపత్రి మరియు మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి సంయుక్తంగా మార్చి 6న కేన్సర్ స్క్రీనింగు, గైనిక్ మరియు సాధారణ వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ముఖ్య అతిధిగా హాజరై, స్క్రీనింగు పరీక్షలను ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత మాట్లాడుతూ – మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఆదేశాలతో జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న మహిళా పోలీసు ఉద్యోగులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు మరియు పోలీసు కుటుంబాలకు చెందిన మహిళలకు ఉచితంగా సర్వైకల్ కేన్సర్ మరియు ఛాతీ కేన్సర్ స్క్రీనింగు, గైనిక్ మరియు సాధారణ వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్య పరీక్షలను విజయనగరం పట్టణానికి చెందిన మహేంద్ర ఆసుపత్రి మరియు విశాఖపట్నంకు చెందిన మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి వైద్యులు సంయుక్తంగా నిర్వహించారన్నారు. ఇటీవల కాలంలో మహిళలు ఎక్కువగా కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. మహిళలు తమ ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించాలని, సర్వైకల్, చాతీ కేన్సర్ పరీక్షలను సకాలంలో చేయించు కొంటే సులభంగా కేన్సరును జయించవచ్చునన్నారు. మహిళలు సర్వైకల్, చాతీ కేన్సర్ స్క్రీనింగు పరీక్షలు చేయించుకొనేందుకు ఎటువంటి సిగ్గు పడాల్సిన అవసరం లేదన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకొని, ప్రాధమిక స్థాయిలో కేన్సర్ మరియు తీవ్ర వ్యాధులకు వైద్యం పొందవచ్చునన్నారు.మహేంద్ర హాస్పిటల్ వైద్యులు డా.మహేంద్ర గిరి బెవర మాట్లాడుతూ కుటుంబానికి మహిళలే కీలకమన్నారు. మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించకపోతే ఆ భారం కుటుంబంపై పడుతుందన్నారు. కావున, ప్రతీ మహిళ వైద్యుల సలహాతో స్వీయ పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆరోగ్యం విషయంలో ఏమాత్రం అనుమానం ఉన్నా వెంటనే తమ హాస్పిటల్ వైద్యులను సంప్రదించాలని, తప్పకుండా తగిన వైద్య సహాయాన్ని అందిస్తామన్నారు. మహేంద్ర హాస్పిటల్ గైనకాలిజిస్టు డా.బి.ప్రశాంతి, మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి వైద్యులు డా.యామిని ప్రసంగించి, మహిళల ఆరోగ్యం పట్ల, కేన్సర్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి మహిళా పోలీసు ఉద్యోగులకు వివరించి, అవగాహన కల్పించి, స్క్రీనింగు పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు, మహేంద్ర హాస్పిటల్ వైద్యులు డా.మహేంద్రగిరి బెవర, డా.బి.ప్రశాంతి, మహాత్మా గాంధీ కేన్సర్ ఆసువత్రి వైద్యులు డా.యామిని, మహిళా పిఎస్ ఇన్స్పెక్టరు ఈ.నర్సింహమూర్తి, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, డిటిసి సిఐ బి.లలిత, ఆరఐ ఎన్.గోపాల నాయుడు, మహాత్మా గాంధీ ఆసుపత్రి మార్కెటింగు మేనేజరు వీరబాబు, క్యాంపు కో-ఆర్డినేటరు స్వాతి, మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు, పోలీసు కుటుంబ మహిళలు పాల్గొన్నారు.

## రిజన మత్స్యకారులకు ఉచిత వలలు,బోట్లు ఇవ్వాలని కోరిన దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి



అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మనసులో మాట మార్చి 6 :అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం దారెలా పంచాయతీ పరిధిలో గల గిరిజన మత్స్యకారులను ఉద్దేశించి మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి శ్రీవాసరావు ను దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి కలిసి పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి మాట్లాడుతూ ముంచంగిపుట్టు మండలం పరిధిలో గల గిరిజన మత్స్యకారులను ఉచితంగా వలలు బోట్లు మంజూరు చేయాలని అలాగే ప్రభుత్వ గుర్తింపు లైసెన్స్ ఇవ్వాలని ప్రభుత్వం మంజూరు చేసే రాయితీ తో కూడిన రుణాలు మంజూరు చేయాలనీ మైదాన ప్రాంతంలో ఉండే మత్స్యకారులకు వర్తించే నిబంధనలను గిరిజన ప్రాంతంలో ఉండే గిరిజన మత్స్యకారులకు వర్తించేలా చూడాలని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ను కోరారు. దీనికి మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు స్పందిస్తూ సమస్యలను పరిష్కరించేలా చూస్తానని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ తో పాటు టీడీపీ యువ నాయకుడు త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

**ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీటిఎఫ్ ఆధ్వర్యాన టెట్ రద్దు కోరుతూ**

# 10 న డిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా




**అనకాపల్లి, మార్చి 6 (మనసు లో మాట ):** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అనకాపల్లి, విశాఖ,అల్లూరి సీతారామరాజు జిల్లాల ఫెడరేషన్ కార్యకర్తలు ఢిల్లీ లో జంతర్ మంతర్ వద్ద ఈనెల 10 న జరిగే ధర్నా కు అధికసంఖ్యలో ఫెడరేషన్ ఉపాధ్యాయులు బయలుదేరాలని ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు వై. శ్రీనివాసరావు, ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010 కి ముందు నియామకమయిన ఉపాధ్యాయులు టెట్ పరీక్ష పాస్ అవ్వాలని, 2 సంవత్సరాల సమయం ఇవ్వడం వలన ఉపాధ్యాయులలో ఆందోళన నెలకొందని, ఇది సరైంది కాదని,
ఆర్ టిసి చట్టం నందు సవరణ చేసి 2010 కి ముందు నియామకం పొందిన ఇన్సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు. ఫెడరేషన్ సభ్యులు ఇంతమంది రాజధాని ఢిల్లీ కథం తొక్కారంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చన్నారు.ఈ ధర్నా కి ఉమ్మడి జిల్లాల అధ్యక్షకార్య దర్శులు, పూర్వ రాష్ట్రకార్యదర్శి బి. వెంకటపతిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. త్రినాథ్ , వివిధ మండల బాధ్యులు, స్టేట్ అకాడమిక్ సభ్యులు ఎం. రామ్మూర్తి, ఎం.ఎం నాయుడు, జి. టి. నాయుడు, సబ్ కమిటీ బాధ్యులు బి. దేముడుబాబు, పడాల అప్పారావు, డి. కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి న్యాయం చేయగల మంచి న్యాయవాదులుగా ఎదగాలి

**- దిశ నిర్దేశం చేసిన జిల్లా జడ్జ్ వి నరేష్, పి నాగేశ్వరరావు**




**అనకాపల్లి రూరల్, మార్చ్ 6 (మనసులో మాట):** సమాజానికి న్యాయం చేయగల మంచి న్యాయవాదులుగా ఎదగాలని అలాగే విద్యార్థులు విద్య జీవితంలో నేర్చుకున్న విలువలను భవిష్యత్తులో అమలు చేయాలని అనకాపల్లి జిల్లా పదవ అదనపు జిల్లా జడ్జి వి నరేష్, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జ్ పి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారంఅనకాపల్లి, గవరపాలెం దాశరిగడ్డ రోడ్డులో ఉన్న శ్రీ షిరిడి సాయి న్యాయ కళాశాల చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనకాపల్లి పదవ అదనపు జిల్లా జడ్జి వి.నరేష్, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి పి.నాగేశ్వరరావు హాజరయ్యారు.
విద్యార్థులను ఉద్దేశించి పదవ అదనపు జిల్లా జడ్జి నరేష్ మాట్లాడుతూ న్యాయశాస్త్రం చదువుతున్న విద్యార్థులు ప్రతి విషయం పట్ల సంపూర్ణ అవగాహన ఉండాలని అప్పుడు మాత్రమే న్యాయవాదిగా, న్యాయమూర్తులుగా రాణించగలరు. పుస్తక పఠనం అనేది ఒక వ్యసనంలాగాఅలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. దేశ భవిష్యత్తు ముఖ్యంగా సమాజం లో అందరికీ న్యాయం జరగాలంటే న్యాయవాదులదే కీలకపాత్ర అన్నారు. ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి పి నాగేశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, న్యాయశాస్త్రం అభ్యసిస్తున్న విద్యార్థులు, విషయం పట్ల సునిసిత పరిశీలన కలిగి ఉండాలని, ప్రజలకు సేవచేయాలనుకునే వారికి ఇదొక మంచి అవకాశం అన్నారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ అద్యక్షులు పిళ్ళా హర శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయ శాస్త్రం యొక్క విలువ, ప్రపంచానికి న్యాయశాస్త్రం యొక్క అవసరం, వగైరా అంశాలపై విద్యార్థులకు సూచనలు చేసారు. సీనియర్ న్యాయవాది బొడ్డేడ రాజగోపాల్ (బి ఎస్ వి) మాట్లాడుతూ న్యాయ శాస్త్రం అభ్యసిస్తున్న విద్యార్థులకు భారతదేశంలో ఉండే ఉపాది అవకాశాలు, ఈ రంగాల్లో ఏవిధంగా స్థిరపడొచ్చు, ప్రస్తుత కృత్రిమ మేధ రాజ్యమేలుతున్న పరిస్తితుల్లో విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలు సంబంధించిన విషయాలు తెలియజేసారు. ముఖ్యంగా టెక్నాలజీ అందిపుచ్చుకోవాలని ఆయన కోరారు. తదుపరి కాలేజి కరస్పాండెంట్ పి.వెంకటరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర రావు, వైస్ ప్రిన్సిపాల్ జె.భారతిలక్ష్మి, అతిధులను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో న్యాయశాస్త్రం అభ్యసిస్తున్న విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా, సామజిక కార్యకర్త బొడ్డేడ అప్పారావు హాజరు అయ్యారు.



అనకాపల్లి పట్టణం 83 వ వార్డు లో

## నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభం

**- ముఖ్య అతిధిగా హజరైన రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మెన్ మళ్ళ సురేంద్ర**

**అనకాపల్లి, మార్చి 6 (మనసు లో మాట ):** అనకాపల్లి ఫైర్ స్టేషన్ సమీపం లోని 83 వ డివిజన్ లో శుక్రవారం టీడీపీ ఇంచార్జి బొద్దపు ప్రసాద్ ఆధ్యర్యంలో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయం ప్రారంభించారు. ముఖ్యఅతిధి గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, కూటమి నాయకులు సమక్షం లో ప్రారంభించారు. ఈ సందర్భంగా బొద్దపు ప్రసాద్ కు కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ రాబోయే జీవీఎంసీ ఎన్నికల్లో 83 వ డివిజన్ లో కూటమి పార్టీ అభ్యర్థి ని గెలిపించి, కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తాడి రామకృష్ణ, పోలవరపు త్రినాథ్, సబ్బవరపు గణేష్, యంద్ర రామకృష్ణ, కొణతాల గణేష్,దాడి జగన్,కొణతాల వాసు,రియాజ్,అధిక సంఖ్యలో కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఘనంగా**

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**విజయనగరం: (మనసులో మాట..జిల్లా ప్రతినిధి): మార్చ్: 6:** విజయనగరం లోని మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఉమెన్ ఎంపవర్మెంట్ అండ్ జెండర్ సెన్సిటైజేషన్ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సంవత్సరానికి నిర్ణయించబడిన థీమ్ "గివ్ టు గైన". ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పి. సౌమ్య లత , అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, విజయనగరం హాజరయ్యారు. గౌరవ అతిథులుగా జి. హిమబిందు (ఎంపెనెల్డ్ ట్రైనర్, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, విజయనగరం), డాక్టర్ బి. చండీప్రియ (కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్ అండ్ కాస్మెటాలజిస్ట్, విజయనగరం) బి. ఉష (అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్, కామన్వెల్త్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్) పాల్గొన్నారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మహిళల సాధికారత, ఆత్మవిశ్వాసం మరియు సమాన అవకాశాల ప్రాముఖ్యతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థిని తన సమస్యలను భయం లేకుండా వ్యక్తపరచాలని, తీసుకునే నిర్ణయాలలో ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థినులు ఉత్సాహపూర్వకంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం చివరిలో నిర్వాహకులు ముఖ్య అతిథులు మరియు గౌరవ అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు

## అరకులో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ

**- ఖచ్చితమైన కొలతలతో, ప్రభుత్వ రాజముద్రతో పుస్తకాల పంపిణీ**

**- జోగులపుట్టు గ్రామంలో రీ-సర్వే ప్రక్రియ విజయవంతం**

**- రెవిన్యూ డివిజనల్ అధికారి ఎం వి ఎస్ లోకేశ్వరరావు**



అరకులోయ, మార్చి 6 (మనసులో మాట): అరకులోయ నియోజకవర్గం హుకుంపేట మండల పరిధిలోని ములియాపుట్టు పంచాయతీలో శుక్రవారం రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. జోగులపుట్టు గ్రామంలో రీ-సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో, ప్రభుత్వం జారీ చేసిన కొత్త పాసు పుస్తకాలను రెవిన్యూ డివిజనల్ అధికారి ఎం వి ఎస్ లోకేశ్వర రావు లబ్ధిదారులకుఅందజేశారు.
రీ-సర్వే అనంతరం ఖచ్చితమైన కొలతలతో,ప్రభుత్వరాజముద్రతో ముద్రించిన 41 పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బోడ శ్యామ్ జోగులపుట్టు గ్రామ సర్పంచ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా బోడ శ్యామ్ మాట్లాడుతూ.. రైతుల భూములకు భద్రత కల్పించడమే లక్ష్యంగా రీ-సర్వే నిర్వహించి, రాజముద్రతో కూడిన అధికారిక పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ పుస్తకాల వల్ల రైతులకు బ్యాంకు రుణాలు పొందడంలోనూ, భూ వివాదాల పరిష్కారంలోనూ ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. చేతుల్లోకి అధికారిక పాసు పుస్తకాలు రావడంతో జోగులపుట్టు గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక



# అగ్ని విహార్ రిక్రూట్మెంట్ ర్యాలీ..




**అల్లూరి సీతారామరాజు జిల్లా/ పోలవరం జిల్లా రంపచోడవరం,మనసులో మాట మార్చి 6:-** పోలవరం జిల్లాలోని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్ని వీర్ వాయు రిక్రూట్మెంట్ ర్యాలీ -2026 ఆసక్తిగల యువతీ యువకులు ఈనెల 9వ తేదీ,12వ తేదీన గుంటూరులో పాల్గొనవచ్చని పోలవరం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పోలవరం ఇంచార్జ్ కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్ని వీర్ వాయువు ఓపెన్ రిక్రూట్మెంట్ ఉద్యోగాలకు ఈనెల 9 తారీఖున, 12వ తారీకున,15, తారీఖున గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉద్యోగాల భర్తీకి ర్యాలీ జరుగుతుందని అదేవిధంగా ఈనెల 9వ తారీఖున ఆంధ్ర తెలంగాణ మహిళ అభ్యర్థులకు అగ్ని వీర్ ఎంపిక ప్రక్రియ జరుగుతుందని అదేవిధంగా ఈ నెల 12వ తారీకున పురుష అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియ జరుగుతుందని అదేవిధంగా ఈనెల 15వ తారీకున తెలంగాణ అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ర్యాలీలో పాల్గొనే మహిళా అభ్యర్థులు జూలై 2వ తారీకు 2005 నుండి 2 జనవరి 2009 సంవత్సరం మధ్య జన్మించిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులవుతారని ఆయన అన్నారు. ఈ అగ్ని వీర్ ఉద్యోగాలకు పదవ తరగతి నుండి ఆపై చదువులు చదువుకున్న అభ్యర్థులు ర్యాలీలో పాల్గొనవచ్చని ఆయన అన్నారు. కనీసం ఎత్తు 152 సెంటీమీటర్లు తప్పనిసరిగా ఉండాలని ఆయన అన్నారు. కనీసం మొత్తం మార్కులు 50%తో, అదేవిధంగా ఇంగ్లీషులో 50%తో మార్కులతో ఉత్తీర్ణులు అయినవారిని ఎంపిక చేస్తారని ఆయన అన్నారు. ఒరిజినల్ లేదా డీజీ లాకర్ ద్వారా విద్యా అర్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు, డొమిసైల్ సర్టిఫికెట్లు, ఎన్సిసి సర్టిఫికెట్లున్నాయెడల ఎన్సిసి సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఈమెయిల్ ఐడి, మొబైల్ నెంబర్లు, ఇటీవల తీయించుకున్న 10 కలర్ పాస్ ఫోటోలు, ప్రతి సర్టిఫికెట్ ఆరు కాపీలు చొప్పున ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులు తప్పనిసరిగా సమర్పించవలసి ఉంటుందని ఆయన తెలిపారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్ని వీర్ వాయువు ర్యాలీలో పాల్గొనే యువతి యువకుల అభ్యర్థులు ఉదయం 6 గంటలకి రిపోర్ట్ చేయవలసి ఉంటుందని ఆయన అన్నారు. అదేవిధంగా ఈ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులు ఎటువంటి ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నేరుగా ర్యాలీలో ఈ నెల 9, 12వ తారీకు, 15వ తారీకు తేదీలలో పాల్గొనవచ్చని ఆయన అన్నారు. అదేవిధంగా వివరాలకు ~= కోడ్ స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ విధివిధానాలు యువతకు తెలియజేయాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి వారికి ఆదేశించడం జరిగిందని ఆయన తెలిపారు.

## దేముడు మాస్టర్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ



**దేవరాపల్లి, మార్చి 6, (మనసులో మాట) :** సీనియర్ కాంగ్రెస్ నాయకులు , విశ్రాంత ఉపాధ్యాయుడు బీల దేముడు మాష్టారుని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శుక్రవారం పరామర్శించారు. దేవరాపల్లి మండలం వేచలం గ్రామంలో ఉంటున్న ఆయన గత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ధర్మశ్రీ అతని ఇంటికి వెళ్లారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుడిగా కొన్నేళ్ల పాటు విద్యారంగానికి సేవలందించిన బీల దేముడు మాష్టారుకి రాజకీయం అంటే మక్కువ. అనేక మంది నాయకులకు ఆయన సూచనలు, సలహాలు ఇచ్చే వారు. ఉద్యోగ విరమణ అనంతరం అతడిని సీడీసీ డైరక్టరుగా ఎమ్మెల్యే ధర్మశ్రీ నియమించారు. అంతే కాకుండా ముకలాపల్లి కోపరేటివ్ సొసైటీ సభ్యుడిగా ఆయన పనిచేశారు. దేముడు మాష్టారుని పరామర్శించిన వారిలో వేచలం సర్పంచి నాగిరెడ్డి శరారినాయుడు, రెడ్డి బలరాం, జగ్గారావు తదితరులున్నారు.

# వినతుల పరిష్కారం వేగవంతం చేయాలి

**- సమస్యల పరిష్కారానికి అధికారుల చొరవ చూపించండి - పిజిఆర్ఎస్ కు 54 అర్జీలు**

**- అందులో రెవెన్యూ క్లినిక్ కు 13 అర్జీలు - అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్**



**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, మనసులో మాట మార్చి 06 :** సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 54, రెవెన్యూ క్లినిక్ కు 13 వినతులు వచ్చాయని అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ తెలిపారు. ఈ వినతుల స్వీకారణలో పాడేరు ఇంచార్జ్ ఆర్డివో ఎమ్ వివిఎస్ లోకేశ్వరరావు, కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ బి. నీలకంఠం రావు, సంయుక్తంగా వివిధ మండలాల, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను తక్షణమే పరిష్కరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ని నిర్వహించడం జరుగుతుందని మండల రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తాసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,సర్వేయర్లు,విలేజి రెవెన్యూ ఆఫీసర్లు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఫిర్యాదులను స్వీకరించడం, పరిష్కరించడం జరుగుతుందని కొన్ని రకాల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం, పరిష్కరం కానీ ఫిర్యాదులను ఎంత గడువు గడువులోగా పరిష్కరిస్తారో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా మండల పరిధిలో గల భూ సంబంధిత, ఇతర సమస్యలను మండల స్థాయిలో పరిష్కార దిశగా చూడాలని సూచించారు.

అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి, అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనిశీఖిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదించవచ్చున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అర్జీదారులకు అసిస్టెంట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని ఐ వి ఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను తీసుకుంటుందని, ప్రజల యొక్క ఫిర్యాదులు పరిష్కరించి వారి యొక్క సంతృప్తి స్థాయిలు పెంచాలని, ఈ ప్రక్రియలో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఏ సచివాలయం నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయో ఆ సచివాలయాల పరిధిలో ఉన్నటువంటి ఫిర్యాదుదారులు లతో నిర్దేశించిన సిబ్బంది స్వయంగా ఫోన్ చేసి అర్జీ దారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సమస్య ఎందుకు పరిష్కారం కాదో అందుకు తగిన ఆధారాలతో బాధ్యతగా ఫిర్యాదు దారుణకు వివరించాలన్నారు. ప్రత్యేకంగా భూ సంబంధిత సమస్యలపై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించేటప్పుడు కచ్చితంగా ఫిర్యాదు దారుని భూ రికార్డులను ప్రత్యక్షంగా తనిఖీ చేయాలని, ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతో క్రోడీకరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వాన్ని వీడాలన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో జిల్లాలో ఉన్న ప్రతి మండలంలో పి జి ఆర్ ఎస్ లో పాల్గొని అర్జీలను స్వీకరించడం జరుగుతుందని, అర్జీదారులు దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కరించడం వలన అర్జీదారులకు జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వ్యయ ప్రయాసలు , దూరాభారం తగ్గుతుందన్నారు.మండల స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించుటలో కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు.స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని, అనంతగిరి మండలం పినకోట పంచాయతీ వెలగల పాడు గ్రామానికి చెందిన పందిరి జమున, కురియ భీమ్మలమ్మ, పందిరి దేవుడమ్మ గ్రామస్థులు తీవ్ర త్రాగు నీటి ఎద్దడి తో బాధపడుతున్నామని సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గెడ్డ నుంచి మోత ద్వారా నీటి అవసరాలు తీర్చుకుంటున్నామని గ్రామంలో త్రాగు నీటి సదుపాయం కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. ముంచింగి పుట్టు మండలం మాకవరం పంచాయతీ అరబీరు గ్రామానికి చెందిన కరసాని మోహన్, సన్నపు సోమనాథ్ గ్రామానికి ఆనుకుని ఉన్న నల్ల రాయి క్వారీ వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతూ అనారోగ్యానికి గురి అవుతున్నారని క్వారీ కాలుష్య ప్రభావం నుంచి గ్రామస్తులను కాపాడాలని విన్నవించారు. వాకుంపేట మండలం తాడిపుట్టు పంచాయతీయు బొద్దపుట్టు గ్రామానికి చెందిన జి.రహేలు, కె. భార్గవి, టి. శ్రీజ, వి. నీరజ , టి విజయ, జి ఎన్ ఎం కోర్సు పూర్తి చేశామని స్కాలర్షిప్ మంజూరు చేయకపోవటం వలన ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. అనంతగిరి మండలం పైనంపాడు పంచాయతీ బల్లిమామిడి గ్రామానికి చెందిన సీదిరి చెల్లమ్మ సర్పంచ్, కొర్ర తమ్మన్న వైస్ సర్పంచ్, బల్లి మామిడి గ్రామం నుండి ఎగువ సునభ వరకు రెండు కిలోమీటర్ల మేర బిటి రోడ్డు నిర్మించవలసిందిగా కోరారు. దుంబ్రిగుడ మండలం ఆర్మ పంచాయతీ పూలుగుడ గ్రామానికి చెందిన వంటలు చిన్నమ్మ, వంతల రాధమ్మ అన్నదాత సుఖీభవ నాలుగవ విడత నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.పాడేరు మండలం వనుగుపిల్లి పంచాయితీ వరంకుర గ్రామానికి చెందిన అమృత స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాంగి భద్రన్న ఫీల్డ్ కోఆర్డినేటర్, మత్రి సన్యాసిరావు, సీదిరి రాము, మాతంగి బంధ నుండి వరంకుడా వరకు రెండు కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

అనంతగిరి మండలం దీనవాడు పంచాయతీ గ్రామానికి చెందిన లింగబోని జమ్మరాజు, సురేష్, గంగాధర్, సింహాచలం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం, పాఠశాల భవనం నూతనంగా నిర్మించాలని, గ్రామంలో సిసి రోడ్లు నిర్మించాలని కోరారు. చింతపల్లి మండలం చౌడేపల్లి గ్రామస్తులు భూ సమస్యపై వచ్చామని,గత రెండు సంవత్సరాల నుండి వస్తున్నామని, మా సమస్య త్వరగా పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందించి కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ , డిఆర్ డిఎ పిడి వి.మురళి, భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్.వి. రమణా రావు, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల నోడల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, డిపివో కె.పి. చంద్ర శేఖర్ , డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎ .జయప్రకాష్, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఝాన్సీ రామ్ పడాల్, ఆర్ డ బ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, పలువురు తాహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు కార్యాలయంలో విద్యార్థులకు ఓపెన్ హౌస్

**- జిల్లా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత**



**విజయనగరం: (మనసులో మాట.. జిల్లా ప్రతినిధి): మార్చ్: 6:** జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఆదేశాలతో జిల్లాలో నిర్వహిస్తున్న మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాల, భాష్యం, శ్రీ చైతన్య, ఎస్.కే.డిగ్రీ కళాశాల విద్యార్థులు మార్చి 6న జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ప్రారంభించి, విద్యార్థినులకు మహిళలు, బాలల రక్షణకు ఉపయోగపడే టోల్ ఫ్రీ నంబర్లు, చట్టాలుపై, జిల్లా పోలీసుశాఖ నిర్వహిస్తున్న వివిధ రకాల విధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత మాట్లాడుతూ - అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా మార్చి 1 నుండి 7 వరకు మహిళా సాధికారత వారోత్సవాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'ఓపెన్ హౌస' కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు పోలీసుశాఖ వినియోగిస్తున్న వివిధ ఆయుధాలు, సాంకేతికత, కమ్యూనికేషను, డ్రోన్స్, బి.డి.టీమ్స్, బాడీ వోర్న్ కెమెరాలు గురించి విద్యార్థినులకు వివరించి, పోలీసుశాఖ పట్ల విద్యార్థులను చైతన్యపర్చామన్నారు. జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించేందుకు విచ్చేసిన పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాల, భాష్యం, శ్రీ చైతన్య, ఎస్.కే.డిగ్రీ కళాశాల విద్యార్థినులతో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత మమేకమై, విద్యార్థినులతో మాట్లాడి, వారి ఆసక్తిని గమనించి, వారు వేసిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి, వారిని ఉత్సాహపరిచారు. విద్యార్థినులు, మహిళలు, బాలల రక్షణకు, ఆపద సమయాల్లో పోలీసుల సహాయం పొందేందుకు ఉపయోగపడే డయల్ 100/112, చైల్డ్ హెల్ప్ లైను 1098, ఉమెన్ హెల్ప్ లైను 181, సైబరు క్రైం ఫిర్యాదు కొరకు 1930 టోల్ ఫ్రీ నంబర్లు పట్ల అవగాహన కల్పించామన్నారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లను ఆయా ప్రాంతాల్లోని విద్యార్థినులు సందర్శించి, పోలీసులు నిర్వర్తించే విధులు, వినియోగించే ఆయుధాలు, సాంకేతికత, కమ్యూనికేషను, చట్టాలు గురించి, రక్షణగా నిలిచే టోల్ ఫ్రీ నంబర్లు పట్ల అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.ఆర్. డిఎస్పీ ఇ.కోటిరెడ్డి, ఎస్బి సిఐ ఎ.వి.లీలారావు, ఆరఐలు ఎన్.గోపాలనాయుడు, రమేష్, కమ్యూనికేషను సిఐ శ్రీకాంత్, ఆరఎసఐలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# యువ పారిశ్రామికవేత్తలు టెక్నాలజీ అందిపుచ్చుకోవాలి

**యువ పారిశ్రామికవేత్తల కోసం టెక్నాలజీ ఇన్నోవేషన్ అవగాహన వర్క్‌షాప్ - డైరెక్టర్ ఎన్ విజయానంద రెడ్డి**



**అనకాపల్లి రూరల్, మార్చి 6 (మనసులో మాట):** నూతన టెక్నాలజీ అందిపుచ్చుకొని యువ పారిశ్రామికవేత్తలు ముందుకు వెళ్లాలని డైరెక్టర్ విజయానంద రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్టార్టప్స్ అభివృద్ధికి దోహదపడే విధంగా టెక్నాలజీ ఇన్నోవేషన్, మేధో సంపత్తి హక్కులు, టెక్నాలజీ ట్రాన్స్ఫర్ మరియు కమర్షియలైజేషన్ అంశాలపై ప్రత్యేక వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని నేషనల్ రీసెర్చ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (చీ=ణజ) సైన్స్ & టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిన్న తరహా పరిశ్రమల శాఖ డైరెక్టర్ ఎన్ విజయానంద రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థలో రంగం కీలకమైనదని, దేశంలో ఉద్యోగావకాశాలు, పారిశ్రామికాభివృద్ధికి ఈ రంగం ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇన్నోవేషన్, స్టార్టప్ సంస్కృతి మరియు మేధో సంపత్తి హక్కుల రక్షణ ద్వారా చిన్న వ్యాపారాలు పెద్ద సంస్థలుగా ఎదగగలవని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమం ఈ రంగాన్ని బలోపేతం చేయడానికి ముఖ్యమైన ప్రణాళికగా పనిచేస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ కేవన్ కె ప్రసాద్, ప్రీతి నిహారిక, శ్రీ సుధా, శ్రీ శాంతమ్ తదితరులు పాల్గొన్నారు.



# గెడ్డపాలెంలో స్వచ్ఛరథం సేవలు

**ఎస్.రాయవరం, మార్చి6,(మనసులో మాట):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ రథం సేవలు మండలంలోని గెడ్డ పాలెం, వమ్మవరం గ్రామ పంచాయతీలలో శుక్రవారం అందించారు. గ్రామ పంచాయతీలలో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత సాధన లక్ష్యాలను సాధించేందుకు స్వచ్ఛ రథం ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుంది. ప్రజల వద్ద ఉన్న పాత సామాన్లు తీసుకుని వాటి విలువ ఆధారంగా ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు షాంపూ, టీపొడి, ఉప్పు, సబ్బులు వంటివి అందచేసారు.గెడ్డ పాలెం గ్రామ పంచాయతీలోస్వచ్ఛ రథం నుండి ఆగ్రామ సర్పంచ్ తన్నీరు ఏరకయ్య, ఉప సర్పంచ్ సత్తిబాబు నిత్య అవసరాల కొనుగోలుచేసారు. ప్రజలకు చాలా ఉపయోగకరంగాఉండే స్వచ్ఛరథం సేవలను వినియోగించుకోవాలని డిప్యూటీ ఎంపిడిఓ సత్యనారాయణ సూచించారు.

# పర్యావరణ ముప్పుపై అవగాహన ర్యాలీ



**దుంబ్రిగుడ, మార్చి 06, (మనసులో మాట):** మండలంలోని అరకు వారపు సంతలో పర్యావరణ ముప్పుపై అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అటవీశాఖ రేంజ్ అధికారి కోటేశ్వరరావు ఆధ్వర్యాన హైస్కూల్ జంక్షన్ నుంచి సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అంతరం ఆయన మాట్లాడుతూ అడవులకు నిప్పు – సమస్త జీవులకు – పర్యావరణానికి వాటిల్లో ముప్పు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అడవులు ఉండడం వల్ల సమాజానికి పర్యావరణానికి ఎంతో దోహద పడుతున్నా యాన్నరు. అడవుల్లో మంటలు వేయకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ పి ఉద్దంగి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

**- కోరాడ కాలనీ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ**

**- గడువు తీరిన చిక్కీలపై ఆగ్రహం.. హెచ్ఎంకు షోకాజ్ నోటీసు**



హిరమండలం, మార్చి 6 : మండలంలోని కోరాడ కాలనీ (సుబలాయి పునరావాస కేంద్రం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, ప్రజల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. స్వయంగా తన ప్లేటును తానే శుభ్రం చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. మెనూ ప్రకారం అందిస్తున్న గుడ్డు కూర, అన్నం రుచిగా ఉన్నాయని వంట ఏజెన్సీని అభినందించారు.

భోజనం అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న వేరుశనగ చిక్కీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ క్రమంలో ఒక ప్యాకెట్ గడువు తీరిపోయినట్లు గుర్తించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు గాను పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు కె. ఎస్తేర్ రాణికి అక్కడికక్కడే షోకాజ్ నోటీసు జారీ చేశారు. స్టాక్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, గడువు తీరని పదార్థాలనే పిల్లలకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

**మౌలిక వసతులకు పెద్దపీట**

పాఠశాల ఆవరణ పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు లక్ష రూపాయలు, అలాగే భద్రతా పరంగా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ. 25 వేల నిధులను మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఈ నిధులను తక్షణమే ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పలువురు మండల స్థాయి అధికారులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

# అనుమానాస్పదంగా యువకుడు ఆత్మహత్య



**చీడికాడ, మార్చి6, (మనసులో మాట)..** మండలంలోని తంగుడుబిల్లి గ్రామానికి చెందిన బల్జి అరవింద్ అనుమానస్పదంగా ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఈ ప్రాంతంలో కలకలం సృష్టించింది. జి కొత్తపల్లి తంగుడుబిల్లి గ్రామాల మధ్య గల గిడసారం చెరువు సమీపానగల మామిడి చెట్టుకు గురువారం రాత్రి యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం జి కొత్తపల్లి గ్రామస్తులు ఉపాధి పనులకు వెళ్లగా ఉరివేసుకొని మృతి చెందిన దృశ్యం చూసి తంగుడుబిల్లి గ్రామస్తులు సమాచారం అందించారు. తంగుడుబిల్లి గ్రామస్తుల ఫిర్యాదు మేరకు చీడికాడ ఎస్సై సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టంకు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## ఘనంగా శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం

- సమన్వయంతో పండగ విజయవంతం
- అమ్మవారిని దర్శించుకుంటున్న తోటాడ సర్పంచ్ దొడ్డి మంగ వేణి కోటేశ్వరరావు

మునగపాక, మార్చి 6, మనసులో మాట

మండలంలోని తోటాడ,గవర్ల అనకాపల్లి గ్రామాల ఆరాధ్య దైవం మరిడిమాంబ అమ్మవారి జాతర అందరి సమన్వయశీతో ఘనంగా నిర్వహించామని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తెలిపారు.రెండు గ్రామ కమిటీల ఆహ్వానం మేరకు అమ్మవారి దర్శనానికి వచ్చిన అతిథులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మండల పోలీసులు తీసుకున్న చొరవ అభినందనీయం అన్నారు.అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు.జాతర విజయానికి సహకరించిన రెండు గ్రామాల ప్రజలకు నాయకులకు కోటేశ్వరరావుధన్యవాదాలు తెలియజేసారు.

## ఉద్యోగాలతో పేరుతో మోసం

**వైసీపీ మండల అధ్యక్షుడు నిర్వాహకంతో**
**లబోదిబోమంటున్న బాధితులు**
**గత్యంతరం లేక స్టేషన్ను ఆశ్రయించిన బాధితులు**



**డుంబ్రిగుడ, మార్చి 06, (మనసులో మాట):** ప్రభుత్వం మాది మీకు నచ్చిన శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వైసీపీ మండల అధ్యక్షుడు ఘరాన మోసానికి తెరలేపిన సంఘటన మండలంలో ఆలస్యంగా చోటు చేసుకుంది అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఉన్నారనే బలమైన సంకల్పంతో ఆయనను నమ్మి గిరిజన నిరుద్యోగ యువతి, యువకులు లక్షలాది రూపాయల ముట్టజెప్పి నట్టేట మోసపోయిన నిరుద్యోగుల బాధితులు స్థానిక పోలీసు స్టేషన్కు ఆశ్రయించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి డుంబ్రిగుడ మండలంలో వైసీపీ మండల అధ్యక్షుడిగా ఆయన ఇప్పటికి కొనసాగుతున్నారు ఐటీడీఏ పరిధిలో వ్యవసాయ శాఖ విభాగంలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులతోపాటు బ్యాంకు ఉద్యోగాల కల్పనకు ఇప్పిస్తానంటూ లక్షలాది రూపాయలను వసూలు చేసి మోహం చాటేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో నిరుద్యోగులను తీసుకెల్లి అక్కడికి ప్రేవేటు వ్యక్తులతో ఇంటర్వ్యూలను చేయించి నకిలీ నియామక పత్రాలను సృష్టించి బురడి కొట్టించారు. తీరా సంవత్సారాలు గడుస్తున్నా ఇప్పటికి ఉద్యోగాలు రాకపోవడంతో ఆయనను సంప్రదిస్తే ముఖం చాటేశారని నిరుద్యోగ యువత అవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మండల కేంద్రానికి చెందిన సంతవలస గ్రామానికి చెందిన గొల్లోరి రాందాస్ ఈనెల 14న పోలీసు స్టేషన్కు ఆశ్రయించారు బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసు యంత్రాంగం ఆయనను పిలిపించగా తీసుకున్న నగదును వారం రోజుల్లో ముట్టజేస్తానని హామీనిచ్చి ముఖం చాటేశారు పోతంగి పంచాయతీ ఉయ్యలగుడ గ్రామానికి చెందిన తాంగుల కోటేశ్వరరావు అనే యువకుడికి 2023లో బ్యాంకులో మేనేజరు పోస్టు పేరుతో నకిలీ నియామక పత్రాన్ని సృష్టించి మోసం చేశారని అవేదన వ్యక్తం చేశారు. ఆయన నిర్వాహకంతో దుంగుడ, అరకులోయ మండలాల్లో బాదితులు ఉన్నారని బాధితులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైసీపీ మండల అధ్యక్షుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నర్సీపట్నంలో పోలీసుల సామాజిక సేవా కార్యక్రమాలు

- సిబ్బందికి మహిళలకు మెడికల్ క్యాంప్.....మెగా రక్తదాన శిబిరం
- విశాఖ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి వైద్యులతో ఆరోగ్య పరీక్షలు
- రక్తదానం చేసిన అడిషనల్ ఎస్పీ, డి.ఎస్.పి సహా పలువురు సిఐలు, ఎస్సైలు, సిబ్బంది





నర్సీపట్నం రూరల్, మార్చి 6, ( మనసులో మాట ) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం నర్సీపట్నం సబ్ డివిజన్ పోలీసులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు.

నర్సీపట్నం డిఎస్పీ పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ , రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక డిఎస్పీ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి వైద్యులు మహిళా పోలీసులకు, పోలీసు కుటుంబాలకు, విద్యార్థినీ విద్యార్థులకు ఈసీజీ, ఎకో 2డి తదితర 5 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అనకాపల్లి అడిషనల్ ఎస్పీ ఎల్ మోహనరావు, నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు సహా పలువురు సిఐలు, ఎస్సైలు, సిబ్బంది, పలువురు కళాశాలల విద్యార్థిని విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మోహన్ రావు మాట్లాడుతూ, రక్తదానం, అవయవ దానం చేయడం ప్రజలు అలవాటు చేసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం కొంటే దొరకదని, స్వచ్ఛందంగా ముందుగా రక్తదానం చేయడం వల్ల అటువంటి వారికి ప్రాణదానం చేసిన వారు అవుతారన్నారు. రక్తదానం చేయడం దాతల ఆరోగ్యానికి మేలు చేయడమే కాక సమాజానికి కూడా మేలని ఆయన పిలుపునిచ్చారు.

నర్సీపట్నం డి.ఎస్.పి పి శ్రీనివాసరావు మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి పోలీసు వెల్ఫేర్ ఫండ్ ద్వారా ఉన్నతస్థాయి చికిత్స అందించాలని ఎస్పీ నిర్ణయించారన్నారు. ఈ శిబిరంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, 100 యూనిట్ల వరకు రక్తాన్ని సేకరించి ప్రభుత్వ ఆసుపత్రికి అందజేస్తామన్నారు. శిబిరాన్ని విజయవంతానికి సహకరించిన అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ సిఐలు షేక్ గఫూర్, ఎల్ రేవతమ్మ, సబ్ డివిజన్లోని సిఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై అవగాహన సదస్సు

- అవగాహన కల్పిస్తున్న మునగపాక ఎస్ ఐ పి ప్రసాద్ రావు



**మునగపాక, మార్చి 6, మనసులో మాట..** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా మహిళలలో పోలీసులపై నమ్మకం పెంపొందించడం మరియు మహిళల భద్రతపై అవగాహన కల్పించేందుకు మునగపాక పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో ప్రగతి మరియు ప్రణతి పాఠశాలలకు చెందిన ఆడపిల్లలు పోలీస్ స్టేషన్ను సందర్శించారు. పోలీస్ అధికారులు విద్యార్థినులకు మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసే విధానం, అత్యవసర సహాయ నంబర్లు (112) మరియు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

అలాగే ప్రమాదకర పరిస్థితుల్లో ధైర్యంగా స్పందించడం, ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించడం గురించి వివరించారు. మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రగతి, ప్రణతి పాఠశాలలకు చెందిన విద్యార్థినులు, ఉపాధ్యాయులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనకాపల్లి లో విద్యార్థులతో నిర్వహించిన బాలోత్సవ్ వేడుకలకు విశేష స్పందన

- పన్నెండు వందల మంది విద్యార్థులతో సాంస్కృతిక పదర్శనలు
- అబ్బురపర్చిన విద్యార్థుల సాంస్కృతిక, సాంఘిక,సామాజిక పోటీలు
- నేడు విజేతలైన విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం



**అనకాపల్లి, మార్చి 6 (మనసు లో మాట ):** అనకాపల్లి న్యూకాలనీ లోని రోటరీ హాలులో శుక్రవారం అనకాపల్లి బాలోత్సవ కమిటీ అధ్వర్యంలో విద్యార్ధులకు మొట్టమొదటిగా నిర్వహించిన సాంస్కృతిక పోటీలకు విశేష స్పందన లభించింది. 1200 మంది విద్యార్థిని, విద్యార్థులు హజరైన ఈ కార్యక్రమం లో వివిధ రకాల సాంస్కృతిక, సాంఘిక, సామాజిక పోటీలను నిర్వహించారు. ముందుగా బాలోత్సవ్ కమిటీ గౌరవాధ్యక్షులు

బి.ఎస్.గుప్తా పోటీలను ప్రారంభించారు. అనంతరం

జిల్లా లో 1 నుంచి 10 వ తరగతి చదువుకున్న సుమారు 1200 మంది విద్యార్థిని, విద్యార్థులు వివిధ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను, ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమాలకు శ్రీ రామాబాలానంద సంఘం , రోటరీ క్లబ్ , భవ్యశ్రీ సంస్థలు పూర్తి సహాయ సహకరాలను అందించారని నిర్వహకులు తెలిపారు.

అలాగే బాలోత్సవ్ కమిటీ అధ్యక్షులు కె.వి.ప్రకాష్ మాట్లాడుతూ ఈ ఏడాది వలె ప్రతి ఏటా ఈ బాలోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కమిటీ కన్వీనర్ కడిమిశెట్టి త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో మంచి క్రమ శిక్షణ నైతిక విలువలు, సృజనాత్మకతలను వెలికి తీయాలన్న సదుద్దేశ్యంతో ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. కమిటీ కార్యదర్శి బొప్పే ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్యక్రమాలకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. బాలోత్సవ్ కమిటీ ప్రచార కార్యదర్శి , బాలోత్సవ్ కమిటీ కన్వీనర్ కడిమిశెట్టి సుభాషిణి సారధ్యంలో ఎంతో ఉత్సాహంగా మొదటి రోజు బాలోత్సవ్ ప్రథమ వేడుకలు విజయ వంతంగా జరిగాయి. కాగా పోటీలలో గెలుపొందిన విజేతలకు శనివారం సాయంత్రం ముఖ్య అతిధుల చేతుల మీదుగా బహుమతులను అందజేస్తారని కమిటీ ప్రచార కార్యదర్శి బల్లా నాగభూషణం తెలియజేసారు.ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినధులు కె.వి.గౌరీపతి, ఎమ్.ఎస్.వి, ఎస్.పి,వర్మ , ఎమ్.శంకర వరప్రసాద్, జి.ఎల్,ఎన్.శాస్త్రి,కె.రామమోహనరావ్, శిష్టల తమ్మిరాజు, ఐ.చక్రపాణి, ఎమ్.రమేష్, జె.సురేష్, తేజస్విని, జి.రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

## కెమికల్ ట్యాంకరులో దిగి స్పృహ కోల్పోయిన ముగ్గురు వ్యక్తులు

- ఫైర్ సిబ్బంది, స్థానికులుసహకారంతో పోలీసులు సహాయ చర్యలు
- భాదితులుకు చికిత్సకోసం నక్కపల్లి ఆసుపత్రికి తరలింపు
- స్పృహ కోల్పోయిన వారినిరక్షించేందుకు 45 నిమషాలు పాటు యత్నం





**ఎస్. రాయవరం, మార్చి 6, (మనసులో మాట):** మండలంలోని గోకులపాడుగ్రామం సమీపంలో జ్యోతి సర్వీసింగ్ సెంటరు వద్ద కెమికల్ ట్యాంకరు క్లీన్ చేసేందుకు ట్యాంకరులో దిగిన ముగ్గురు వ్యక్తులు ట్యాంకులోపలే స్పృహ కోలిపోయి పడివటంతో ఈప్రాంతంలో సంచలనంగా మారింది. ఎస్ఐ విభీషణరావుఅందచేసిన వివరాలు ప్రకారం శుక్రవారం హైదరాబాద్ నుండినక్కపల్లిలోని హెట్రో డ్రగ్స్ కంపెనీ యూనిట్ కుఎండిసి అనే కెమికల్ నుట్యాంకరులారీలో తీసుకువచ్చారు. ఈ కెమికల్ కంపెనీలో అన్లోడ్ చేసిన తర్వాత టి ఎస్05 యు ఇ9095 నెంబరు గల ట్యాంకరువాహానాన్ని ఎలమంచిలి తాతారావు అనే డ్రైవరు ఎస్ రాయవరం మండలం గోకులపాడు పరిధిలోగల వాటర్ సర్వీసింగ్ సెంటర్ కుతీసుకువచ్చారు. సాయంత్రం 5 గంటలప్రాంతంలో ట్యాంకర్ క్లీన్ చేస్తూ లోపల భాగం క్లీన్ చేయడానికి బీహార్ కు చెందిన ఎం.బి సాహెబ్( 24 ) అనే వ్యక్తి ట్యాంకరులోదిగి ఊపిరి ఆడకుండాపడి ఉండటాన్ని గమనించిన వాటర్ సర్వీసింగ్ సెంటర్ యజమాని అయిన పాకలపాటి బుచ్చి వెంకట శివ మురళి రాజు లోనికి దిగారు. ఎండి సాహెబ్ ను బయటకు పంపించిన మురళి రాజు స్పృహతప్పి పడిపోయారని తెలిపారు. ఇది గమనించిన మూడో వ్యక్తి అయిన ఎం.బి ఫరియాజ్ లోపలికు దిగి స్పృహ కోల్పోయి పడిపోయినట్లు ఎస్ ఐ తెలిపారు. ఈసమాచారం అందిన నక్కపల్లి సిఐ రామకృష్ణ, ఎస్ ఐ విభీషణరావు సంఘటన స్థలికిచేరుకున్నారు. ఫైర్ సిబ్బందితోపాటుసిసిఎల్ కంపెనీలో టెక్నీషియన్ గా పనిచేస్తున్న శివాజీ అనే వ్యక్తి సహాయంతో ట్యాంకర్ లోపల స్పృహ కోల్పోయిన ఇద్దరు వ్యక్తులను రోప్ సహాయంతో 45 నిమషాలుపాటు ప్రయత్నించి బయటకు తీసి వైద్యం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భాదితులు నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. సహాయక చర్యల్లో ధర్మవరం గ్రామానికిచెందిన ఎం అప్పలరాజు, సుంకర శ్రీనివాస్, బండినాగేష్, రాము, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.





### మహిళా సాధికారతకు బాటలు :

## అనకాపల్లి జిల్లా పోలీసుల 'వాకథన్', క్రీడా సంబరాలు..

**అనకాపల్లి. జిల్లా మార్చి : 7 మనసులో మాట ప్రతినిధి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2026ను పురస్కరించుకుని, మహిళా సాధికారత మరియు రక్షణే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ శుక్రవారం వినూత్న కార్యక్రమాలను చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్త ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ.తుహిన్ సిన్హా ఐపీఎస్ పర్యవేక్షణలో జిల్లా ఆర్మ్ రిజర్వ్ సిబ్బంది ఆధ్వర్యంలో భారీ 'వాకథన్' ర్యాలీ మరియు ఉత్సాహభరితమైన క్రీడా పోటీలు నిర్వహించారు.

**ఉత్సాహంగా సాగిన 'వాకథన్'**

ఆర్మ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయం నుండి కైలాసగిరి జంక్షన్ మీదుగా పోలీస్ క్వార్టర్స్ వరకు ఈ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మధరావు మరియు సంజీవరావు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఈ ర్యాలీలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది, ఆర్ఎస్ఐలు ఆదినారాయణ, ప్రసాద్ మరియు ఇతర సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొని మహిళా హక్కులపై నినాదాలు చేశారు.

## వైభవంగా సత్తెమ్మతల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం



దేవరాపల్లి, మార్చి 6, (మనసులో మాట) : మండల కేంద్రంలోని రాజుల వీధిలో సత్తెమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ మేరకు శుక్రవారం ఆలయ ప్రతిష్ట మహోత్సవ వేడుకల్లో భాగంగా ఆలయ శిఖర పూర్ణ త్రిశూల కలశం ఊరేగింపు గ్రామ పురవీధుల్లో అమ్మవారి నామ సంకీర్తన భజనలతో కలశం ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ప్రతిష్ట వేడుకలు వేద పండితులు ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరిగింది. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో కొల్లి ఈశ్వరరావు, వాలేటి నాగరాజు, కొల్లి సురేష్, అల్లు అబద్ధం, సబ్బవరపు మాలిబాబు, వంజంగి సూర్యనారాయణ, కాకినాడ సిద్దు, అనిమిరెడ్డి పోతురాజు, అరిపాక జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీలు కు అనకాపల్లి జిల్లా జట్టులో సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కు చెందిన 1) ఎం. వర్షిత్ 2) కో. జాయ్దాప్ 3) దాసరి జాహ్నవి 4) దీప శ్రీ విజయోస్తులే ఎంపిక



**అచ్చుతాపురం మార్చి 6 మనసులో మాట..** గత జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రగ్బీ ఆట లో జిల్లా జట్టుకు ఎంపిక అవడం పట్ల అర్షం వ్యక్తం చేశారు రేపు శనివారం ఎనిమిదో తేదీనా గన్నవరం, కృష్ణా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగబోతున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కుంద్రపు వెంకీ నాయుడు తెలియజేయడంతో స్కూల్ యాజమాన్యం శంకర్ , కృష్ణ వ్యాయామ ఉపాధ్యాయుల వెంకటను అభినందించి పిల్లల మరి ఎన్నో విజయాలు సాధించాలని అభినందనలు తెలియజేశారు

## జాతీయ లోక్ అదాలపై అధికారులతో న్యాయమూర్తుల సమావేశం



నర్సీపట్నం రూరల్, మార్చి 6, ( మనసులో మాట) : ఈనెల 14న జరిగే జాతీయస్థాయి లోక్ అదాలత్ లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా ఇప్పటినుండే చర్యలు చేపట్టాలని నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జ్ పి షియాజ్ ఖాన్ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో ఎలమంచిలి ఇన్చార్జి న్యాయమూర్తి ఎన్ స్పందన, ఎలమంచిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమేష్ లతో కలసి ఆయన అధికారులతో సమావేశం అయ్యారు. లోక్ అదాలత్ లో పెండింగ్ కేసులను అత్యధికంగా పరిష్కారమయ్యేలా చూడాలని ఆయన కోరారు. ఇప్పటినుండే ఇరు వర్గాల కక్షిదారులను సంప్రదించి ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ షేక్ గఫూర్, రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ, పలువురు ఎస్సైలు, స్థానిక మున్సిపల్ అధికారులు, బ్యాంకు అధికారులు, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## శ్రీశ్రీశ్రీ వరహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం సింహాచలం

### ఇంజనీరింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆలయ ఈఓ

**సింహాచలం, మార్చి 06, 2026:** శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం ఈఓ జె. వెంకటరావు నేడు కొండపై జరుగుతున్న వివిధ అభివృద్ధి మరియు ఇంజనీరింగ్ పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం చేపడుతున్న పలు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

ఆలయం వెనుక భాగంలో కొత్తగా నిర్మిస్తున్న 100 ఖూ సామర్థ్యం కలిగిన =జజ వాటర్ ట్యాంకు పనులను ఈఓ పరిశీలించారు. నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు సూచించారు.

కొండపైన గల సత్తమ్మ తల్లి గుడి నుండి ఎం.వి.వి.ఎస్ మూర్తి కాటేజ్ వరకు గల ప్రాంతాన్ని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన కాలినడకన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారు.

అనంతరం మెట్ల మార్గం ద్వారా కాలినడకన క్రిందికి దిగుతూ, సాకి ధార నుండి వచ్చే సహజ సిద్ధమైన నీటిని ఏ విధంగా మళ్లించాలి మరియు కిందకు పంపించే విధానంపై అధికారులతో చర్చించారు. వర్షాకాలంలో ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఆలయ ఇంజనీరింగ్ విభాగం అధికారులు డి.ఇ.అ/ఎ రామరాజు, ఏ.ఇ. రవిరాజు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అభివృద్ధి పనుల పురోగతిని ఈఓ కి వివరించారు.

## జిల్లా జేఏసీ ఏర్పాటు సమావేశానికి హాజరు కావాలి

**పాడేరు రూరల్ మార్చి 6 మనసులు మాట..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీ స్టేట్ జేఏసీ ) రాష్ట్ర కార్యవర్గ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో నూతన జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఏ పీ ఎం జి జి ఓ ఎస్ అసోసియేషన్ జిల్లా నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం (మార్చి 8) మధ్యాహ్నం 2 గంటలకు పాడేరు ఏ పీ ఎం జి జి ఓ ఎస్ అసోసియేషన్ భవనంలో సమావేశం నిర్వహించనున్నట్లు పత్రికా ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు, డిమాండ్లు (జీతాల పెంపు, పెన్షన్ విధానం, భత్యాలు) ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు బలమైన జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ కార్యవర్గాన్ని ఈ సమావేశంలో ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని గుర్తింపు పొందిన ఏ పీ ఎం జి జి ఓ ఎస్ అనుబంధ అన్ని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగుల ఐక్య గొంతును వినిపించేలా సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏ పీ ఎం జి జి ఓ ఎస్ అసోసియేషన్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి మరియు కార్యవర్గ సభ్యులు పత్రికా ప్రకటనలో తెలిపారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 5.19 కోట్లు మంజూరు

### - ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



**దేవరాపల్లి, మార్చి 6, (మనసులో మాట) :** నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 24 పంచాయతీల్లో సీసీ డ్రైన్లతో పాటు సీసీ రోడ్ల (27 పనులు) నిర్మాణానికి రూ. రూ.5 కోట్ల 19 లక్షల 62 వేలు మంజూరు చేసినట్లు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ నిధులతో 12,041 మీటర్ల మేర సిమెంటు పని చేపడతారన్నారు. దేవరాపల్లి పంచాయతీలో రూ.30 లక్షల వ్యయంతో డ్రైన్లు, సీసీ రోడ్డు నిర్మిస్తారు. నాగయ్య పేటకు రూ. 25 లక్షలు వేచలంకి రూ.20 లక్షలు మంజూరు చేశారు. కె.కోటపాడు మండలం అకి రూ. 25 లక్షలు, దాలివలస, గుల్లేపల్లి, కొరువాడ, మేడిచర్ల, రొంగలినాయుడు పాలెం పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున మంజూరయింది. కింతాడకు రూ.26 లక్షలు, కె.జె.పురానికి రూ.13 లక్షలు, ఆర్.వై. అగ్రహార రంకి రూ. 10 లక్షలు మంజూరు చేశారు. చీడికాడ మండలం శిరిజాం, జి. కొత్తపల్లి, చుక్కపల్లి, అర్జునగిరి, తురువోలు పంచాయతీ లకు ఒక్కొక్కదానికి రూ. 20 లక్షలు కేటాయించగా చీడికాడకు రూ.30 లక్షలు, బైలపూడికి రూ. 25 లక్షలు ఇచ్చారు. మాడుగల మండలంలో ఒమ్మలి పంచాయతీకి రూ.15 లక్షలు, మాడుగులకు రూ. 40 లక్షలు, కె.జె. పురానికి రూ. 20 లక్షలు, పోతంపూడికి రూ.10 లక్షలు, వీరనారాయణం పంచాయతీకి రూ. 30 లక్షలు మంజూరు చేశామన్నారు. వీబీజీరాంజీనిధులతో పనులు పూర్తి చేస్తారని పేర్కొన్నారు.

### బాక్సాఫీస్ వద్ద 'రాయుడు గారి తాలూకా' సందడి

# చిన్న సినిమా.. పెద్ద హిట్!



విశాఖలో చిత్ర యూనిట్ సందడి

**విశాఖపట్నం, జగదాంబ :** తెలుగు చిత్ర పరిశ్రమలో కథాబలం ఉన్న చిన్న సినిమాలకు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారని మరోసారి నిరూపితమైంది. ఉలిశెట్టి మూవీస్ బ్యానర్‌పై శ్రీనివాస్ ఉలిశెట్టి, సత్య ఈషా జంటగా నటించిన 'రాయుడు గారి తాలూకా' చిత్రం శుక్రవారం ఘనంగా విడుదలై, మొదటి ఆట నుండే సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. కొత్తదనంతో కూడిన కథ, ఉత్కంఠభరితమైన స్క్రీన్ ప్లే ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి.

ఉర్రూతలూగించిన సస్పెన్స్..

అద్భుతమైన క్లైమాక్స్!

దర్శకుడు కొర్రపాటి నవీన్ తెరకెక్కించిన ఈ చిత్రం ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ముఖ్యంగా కథలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహకందని విధంగా సాగే స్క్రీన్ ప్లే సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. క్లైమాక్స్ సన్నివేశాలు ప్రేక్షకుల అంచనాలకు మించి ఉండటంతో థియేటర్లు చప్పట్లు, కేరింతలతో హోరెత్తుతున్నాయి.

సినిమా విడుదల పురస్కరించుకొని చిత్ర యూనిట్ విశాఖపట్నంలోని వెంకటేశ్వర థియేటర్‌లో సందడి చేసింది. హీరో శ్రీనివాస్ ఉలిశెట్టి, ఇతర నటీనటులు ప్రేక్షకులతో కలిసి సినిమా వీక్షించారు. ఈ సందర్భంగా హీరో శ్రీనివాస్ మాట్లాడుతూ.. "మా కష్టానికి ప్రతిఫలం లభించింది. నేను మాట్లాడటం కంటే, సినిమా చూసి బయటకు వస్తున్న ప్రేక్షకుల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందమే మా సక్సెస్" అని భావోద్వేగంగా పేర్కొన్నారు.

నగేష్ గౌరేష్ అందించిన నేపథ్య సంగీతం సస్పెన్స్ సీన్లను ఎలివేట్ చేసిందని

గౌతమ్ విజువల్స్ సినిమాకు రిచ్ లుక్ ఇచ్చాయన్నారు...

హీరో శ్రీనివాస్, హీరోయిన్ సత్య ఈషా జంట చూడముచ్చటగా ఉండటమే కాకుండా పరిణతి చెందిన నటనను కనబరిచారని ప్రేక్షకులు చెబుతున్నారు పలాసా రామారావు,అమ్మరాజు, రమణ రెడ్డి, రవి శెట్టి, పైడిరాజు, నాగరాజు, శ్రీహరి, సుమన్, కిట్టయ్య, ఆర్కే నాయుడు, ఫణి స్వామి,సృజన తదితరులు తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు..

సినిమా చూసిన ప్రముఖులు సైతం ఇదొక 'ఫుల్ సస్పెన్స్ ప్యాక్డ్ ఎంటర్టైనర్' అని ప్రశంసలు కురిపిస్తున్నారు. వీకెండ్ కావడంతో ఈ సినిమా మరిన్ని వసూళ్లు సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మాటలు సూర్య, మేకప్ సంజన, కొరియోగ్రఫీ సంజు మాస్టర్.

## దొంగతనం కేసులో పరారీ లో ఉన్న ముద్దాయి అరెస్ట్



**కశింకోట పోలీస్ స్టేషన్ అనకాపల్లి జిల్లా..** కశింకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని బయ్యవరం గ్రామంలో గల శ్రీ లక్ష్మీ ఏజెన్సీలో జరిగిన దొంగతనం పై పిర్యాది దరిమిరెడ్డి దిలీప్ కుమార్ ఇచ్చిన పిర్యాదు పై కశింకోట పోలీస్ స్టేషన్ ఎస్.ఐ ల్రా.మనోజ్ కుమార్ కేసు నమోదు చేసారు. అంతట సీఐ అల్లు స్వామి నాయుడు ఆధ్వర్యంలో రెండు బృందాలుగా నియమించి, సదరు కేసు చేదనలో బాగంగా రెండు బృందాలు అహర్నిశలు శ్రమించి, సిసిటివి ఫూటేజ్ మరియు టెక్నికల్ డాటా ఆధారముగా, దొంగతనం చేసిన ముద్దాయిని బత్తిన సింహాచలం ఏపండు, తండ్రి రాముగా గుర్తించగా, అతని కదలికలపై నిఘా ఉంచి, నేడు 06.03.2026 తేదీన కశీఃకోట =జ బస్ స్టాప్ వద్ద కసింకోట పోలీస్ ఇన్స్పెక్టర్ అల్లు స్వామి నాయుడు సూచనల మేరకు కె. లక్ష్మణరావు, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మరియు వారి సిబ్బంది డి. గోపి, బి.శ్రీనివాసరావు, బి. మహేశ్వరరావు కలిసి అరెస్ట్ చేయడం జరిగింది. అరెస్టు సమయంలో ముద్దాయి వద్ద నుండి దొంగలించిన సొత్తును రూ.65,000/- నగదు స్వాధీనం చేసుకోవడం జరిగింది. కేసు విషయంలో మరింత విచారణ కొనసాగుతోంది. ముద్దాయిని న్యాయస్థానంలో జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం హాజరుపరిచారు.

## భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం వద్దని రాష్ట్ర పతి కి వినతి పత్రం పోస్ట్ ఆఫీస్ ద్వారా పంపించిన రైతులు



**అచ్యుతాపురం మార్చి 6 మనసులో మాట.** జిల్లా అనకాపల్లి అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట పోస్ట్ ఆఫీస్ వద్ద భారత రాష్ట్రపతికి ప్రదర్శనగా వెళ్లి పంపించిన వినతి పత్రం మన రైతాంగానికి హానికరమైన భారత అమెరికా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయవద్దని ప్రధానంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంపు మన దేశానికి దిగుమతయ్యే పారిశ్రామిక వ్యవసాయ వస్తువులపై సొంకాలను పూర్తిగా రద్దు చేస్తారు ఏటా తొమ్మిది లక్షల కోట్లు విలువైన వస్తువులు ఆహార పదార్థాలు దిగుమతి అవుతాయి. గోధుమలు, మొక్కజొన్న ,పత్తి, సోయాబీను పండ్లు, కూరగాయలు ప్రాసెస్ అయిన ఆహార పదార్థాలు పాల ఉత్పత్తులు దిగుమతి అవుతాయి. మన రైతుల పండించిన పంటల ధరలు పడిపోతాయి. గత ఏడాది పత్తిపై పన్ను ఎత్తివేసిన ఫలితంగా మన దేశంలోని టెక్స్టైల్స్ కంపెనీలు అంది విదేశాల నుండి పత్తి దిగుమతి చేసుకొని మన రైతుల పండించిన పత్తిని మద్దతు ధర కన్నా 2000 రూపాయలు తగ్గించుకో న్నారు. మనదేశంలో 11 కోట్ల రైతు కుటుంబాలు 9 కోట్ల పాడి రైతులు దివాలా తీస్తారు. ఈ ఒప్పందం ప్రకారం మన దేశం నుండి ఏ గు మతి అయ్యే వస్తువులపై రెండున్నర శాతం ఉన్న పన్నును 18 శాతానికి పెంచుతారు. గత సంవత్సరం అమెరికా విధించిన పనుల వలన మన రైతుల పండించిన మిర్చి, పొగాకు, రొయ్యలు, శనగలు, మామిడి గుజ్జు, ధరలు పడిపోయి రైతులు వెలివెలలాడిపోయారు. అగ్రిమెంట్ పూర్తిగా అమలులోకి వస్తే రైతాంగం పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడం కష్టం. ఈ ఒప్పందం ప్రకారం మన దేశం రష్యా నుండి చౌకుగా వచ్చే దిగుమతి చేసుకోవడం మానివేయాలి. అధిక ధరలకు అమెరికా నుండి ముడి చమురు వల్ల పెట్రోలు, డీజిల్ ధరలు పెరుగుతాయి. ట్రాక్టర్ల, హార్వెస్టర్ , పవర్ స్పేర్లు ఖర్చులు పెరిగి వ్యవసాయం మరింత భారం అవుతుంది. కావున దేశవ్యాప్తంగా అనే గ్రామాల్లో సంతకాలు చేయించి భారత రాష్ట్రపతికి పంపిస్తున్నాం .ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు కవులు సంఘం జిల్లా కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ రైతు సంగం నాయకులు కే రామ సదాశివరావు, కనుమ నాయుడు, జరగడం దొరప్పల నాయుడు పాల్గొని మూడు గ్రామాలు సంతకాలు 270 జత చేసి పోస్ట్ మాస్టర్ ద్వారా రాష్ట్రపతికి పంపించడం అయినది.

# ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్స్ 2026

### - దక్షిణ భారత విజేతలకు ఒడిశా గవర్నర్ సత్కారం



**విశాఖపట్నం,** సమాజంలోని వివిధ రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచి, తమ అంకితభావంతో దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వ్యక్తులను గుర్తించేందుకు ఆసియా టుడే రీసెర్చ్ & మీడియా ఆధ్వర్యంలో 'ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్ 2026 - సదరన్ ఇండియా' కార్యక్రమం విశాఖపట్నంలో నోవాటల్ హోటల్లో ఘనంగా నిర్వహించబడింది.

ఈ విశిష్ట కార్యక్రమానికి ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ వేడుకలో కేంద్ర మంత్రి ఎస్.పి. సింగ్ భగేల్, ఎంపీ గొల్ల బాబురావు తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

ప్రైడ్ ఆఫ్ నేషన్ - 2026 అవార్డు గ్రహీతలు వీరే:

వైద్యం, విద్య, వ్యాపార మరియు సామాజిక సేవా రంగాలలో విశేష కృషి చేసిన కింది ప్రముఖులు ఈ ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు:

వైద్యం & సామాజిక సేవ: కల్నల్ ఎన్.ఎస్. న్యాయపాటి (కేర్ ఇండియా మెడికల్ సొసైటీ), డా. శక్తి కుమార్ త్రిపాఠి (స్కిన్-ఫెర్టిలిటీ ఇన్‌స్టిట్యూట్), డా. మాణిక్య ప్రసన్న కుమార్ పలింకి (విజయశ్రీ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్).

ఆంకాలజీ & హాస్పిటల్స్: మణిపాల్ హాస్పిటల్ విజయవాడ నుండి డా. జి. కృష్ణా రెడ్డి, డా. వి. ధర్మేంద్ర కుమార్, డా. రామకృష్ణ వంగర; రెనోవా హాస్పిటల్స్ నుండి జి.వి.ఎన్ రవీంద్రనాథ్.

దంత వైద్యం: ఎపి సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్లు డా. చక్రపాణి నిమ్మగడ్డ, డా. లావణ్య నిమ్మగడ్డ.

రియల్ ఎస్టేట్ & ఇండస్ట్రీ: ప్లానెట్‌గ్రీన్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు వినయ్ రామ్ .ఎన్, కోటేశ్వరరావు .జి; ఐ-ఫామ్ అల్యూమినియం & డిజైన్ ఎల్ఎల్‌పి వ్యవస్థాపకులు మల్లేష్ వంగ, వెంకటేష్ కండికట్టి.

విద్యారంగం: శనివారపు కొండారెడ్డి (ౠణ= వరల్డ్ స్కూల్), ధరణి కర్రి (21ర్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ), డా. రితిక్ బాలాజీ (రెమో ఇంటర్నేషనల్ కాలేజ్), ఎం. పీటర్సన్ ల్యూక్ (సెయింట్ లూక్స్ స్కూల్ & కాలేజ్ ఆఫ్ నర్సింగ్), బి. సుగుణ్ శీలరావు (ఘా×మీా).

ఇతర రంగాలు: ఆనంద్ తంగవేలు (జీయోల్ ప్రైమ్ ఫ్యూయల్), అమిత్ కిషన్ జి.ఎస్ (హెబ్బెవు ఫామ్స్).

గవర్నర్ ప్రసంగం:

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, "దక్షిణ భారతదేశం ప్రతిభకు పుట్టినిల్లు అని, విభిన్న రంగాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రాణిస్తున్న వీరిని గౌరవించడం దేశానికే గర్వకారణం" అని పేర్కొన్నారు. ఆసియా టుడే రీసెర్చ్ & మీడియా చేస్తున్న ఈ ప్రయత్నాన్ని ఆయన అభినందించారు.



### సంజీపురంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి

# శంకుస్థాపన

దేవరాపల్లి, మార్చి 6, (మనసులో మాట) : మండలంలోని ఏ.కొత్తపల్లి పంచాయతీ శివారు గ్రామం సంజీపురంలో రూ.17.20 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కృషితో ఈ నిధులు మంజూరు అయినట్లు కూటమి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పోతల పాత్రు నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, దేవరాపల్లి కోపరేటివ్ అధ్యక్షులు పూడి సత్యారావు, ముసిడిపల్లి మాజీ సర్పంచ్ సోమిరెడ్డి గోవింద, కె .యం.పాలెం మాజీ సర్పంచ్ గంధం జగన్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్కరాజు వెంకట సత్యవతి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాజునాయుడు, అల్లు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# పేకాట శిబిరాలు పై దాడి

### -9 మంది జూదరులు అరెస్ట్



**ఎస్. రాయవరం, మార్చి6,(మనసులో మాట):** ఎస్. రాయవరం మండలం కోనవానిపాలెం, ధర్మవరం గ్రామాల్లో పేకాడుతున్న 9మందిని అరెస్టు చేసినట్లు ఎస్ ఐ ఎ విభీషణరావు తెలిపారు. కోనవానిపాలెం గ్రామ శివారు పేకాడుతున్న సమాచారంతో సి ఐ రామకృష్ణ, ఎస్ ఐ విభీషణరావులు తమసిబ్బందితోకలిసి దాడిచేయగా అయిదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని, వారివద్ద 12,300రూపాయులు నగదు, పేకముక్కలు స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. ధర్మవరం గ్రామంలో పేకాడుతున్న సమాచారంతో తమసిబ్బందితో కలిసి దాడిచేయగా నలుగురు జూదరులను అదుపులోకితీసుకుని 4,300రూపాయలు స్వాధీనంచేసుకున్నట్లు ఎస్ ఐ తెలిపారు. మండలంలో ఎక్కడైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు, జూదం, కోడిపందాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ ఐ విభీషణ రావుహెచ్చరించారు.

## పలువురు నేతలకు శుభాకాంక్షలు తెలిపిన నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే గణేష్



**నర్సీపట్నం రూరల్, మార్చి 6, ( మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా నియమితులైన బొడ్డేడ ప్రసాద్ ను, అదేవిధంగా వైయస్సార్ పార్టీ శ్రీకాకుళం, మన్యం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ గా నియమితులైన బూడి ముత్యాల నాయుడు లను నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ శుక్రవారం స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల పార్టీ అధ్యక్షులు కొరుప్రోలు ఫణి శాంతారాం, శానాపతి వెంకటరత్నం, యాక శివప్రసాద్, మాకవరపాలెం ఎంపీపీ రుత్తల సర్వం, చిటికెల రమణ, జిల్లా కార్యదర్శి రుత్తల సత్యనారాయణ, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ తమరాన శ్రీను, మాకవరపాలెం బూత్ అధ్యక్షుడు వాసు, కోలా ఈశ్వరరావు, కళ్ళెంపూడి లోకేష్, సుర్ల అప్పలనాయుడు లాయర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## కొనసాగుతున్న లక్ష సంతకాల సేకరణ



**దేవరాపల్లి, మర్చి 6, (మనసులో మాట) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై వైసీపీ నాయకులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా చేపట్టిన లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతుంది. తారువ టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు అల్లు సరోజ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఏ. కొత్తపల్లి శివారు సంజీవపురం గ్రామంలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. సీఎం చంద్రబాబుపై అసభ్యకర పదజాలాలతో దూషించిన వైసిపి నాయకులు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పోతల పాత్రునాయుడు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, పోలిపి రెడ్డి ఆశబాబు, రావాడ శ్రీనివాసరావు, జి. జగ్గారావు జి. అప్పారావు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు
శనివారం 7 మార్చి 2026


# 'తూర్పు'లో పులి రీ ఎంట్రీ!

- గోకవరం మండలం మల్లవరం అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు సమాచారం
- పులి పాద ముద్రలను గుర్తించిన అటవీ శాఖ అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని మల్లవరం గ్రామంలో మైక్ ల ద్వారా హెచ్చరికలు
- భయాందోళనలో గోకవరం మండల ప్రజలు
- పులిని బంధించేందుకు రంగం సిద్ధం చేసిన అటవీ శాఖ అధికారులు



**గోకవరం/ రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:..** తూర్పు గోదావరి జిల్లాలోకి పెద్ద పులి రీ ఎంట్రీ ఇచ్చింది. గోకవరం మండలం మల్లవరం గ్రామ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు ప్రాథమిక ఆధారాలను బట్టి అటవీ శాఖ అధుకారులు నిర్ధారించారు. శుక్రవారం మల్లవరం గ్రామంలో పులి పాద ముద్రలను గుర్తించిన గ్రామస్థులు అటవీ శాఖకు సమాచారం ఇవ్వటంతో సంబంధిత శాఖ అధికారులు సిబ్బందితో మల్లవరం గ్రామానికి చేరుకున్నారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు అటవీ శాఖ అధికారులు చెప్పారు. కాగా మల్లవరం గ్రామ పంచాయతీ అటవీ శాఖ అధికారుల సూచనల మేరకు మైక్ ద్వారా ప్రజలకు సమాచారాన్ని చేరవేసింది. పులి సంచరిస్తున్న కారణంగా ఎవరూ ఒంటరిగా బయటకు వద్దని, గుంపులు గుంపులుగా సంచరించమని సూచించారు. శ్రీశైలం నుంచి అటవీ శాఖ అధికారులు పులిని బంధించేందుకు రంగంలోకి దిగారు. బోన్లను సైతం సిద్ధం చేశారు. మల్లవరం, భూపతిపాలెం, సూరంపాలెం మీదుగా అటవీ ప్రాంతంలో సంచరిస్తోందని చెబుతున్నారు. వెదురు పొదల్లో నక్కి ఉందని, చీకటి పడిన తరువాత కానీ అది ముందుకు కదలదని అంటున్నారు.

తూర్పు గోదావరి జిల్లా కూర్మాపురం గ్రామంలో గత నెలలో బంధించిన పెద్ద పులిని విశాఖ జూలో ఉంచి..వారం రోజుల తరువాత దేవీపట్నం మండలం పాపికొండలు ఫారెస్టులో అధికారులు వదిలిన విషయం తెలిసిందే. ఈ పులికి 'ఎక్స్ ప్లోరర్' అని నామకరణం కూడా చేశారు. దీని మెడలో జియో ట్యాగ్ కెమెరాను అమర్చారు. దాని ద్వారా పెద్ద పులి కదలికలను పరిశీలించే అవకాశం ఉంటుంది. మొదట దీనిని నల్లమల ఫారెస్టులో వదలాలని అధికారులు భావించారు. అయితే అక్కడ పులుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పాపికొండలు అడవిలో వదిలారు. అయితే ఈ పెద్ద పులి అభయారణ్యంలోకి వెళ్ళకుండా జన సమీప గ్రామాల ప్రాంతాల గుండా తిరుగుతున్నట్టు అటవీశాఖ అధికారులు గుర్తించారు.

పదిహేను రోజుల క్రితం రంపచోడవరం సమీప ప్రాంతాలలో తిరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. రంపచోడవరం మండలం చెరువుపాలెం గ్రామ సమీపంలో పెద్ద పులిని చూసినట్టు స్థానికులు చెప్పారు. ఇందులో ఎంత వరకూ వాస్తవం అవాస్తవం ఉందనేది పక్కన పెడితే..

ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం మల్లవరం అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తోందనే ప్రచారం మాత్రం గోకవరం మండల ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

**అసలే సింగారమ్మ జాతర..**

గోకవరం – జగ్గంపేట సరిహద్దు సమీపంలో గల సింగారమ్మ జాతర జరిగే సమయంలో 'పెద్ద పులి' సంచారం ప్రజలను కలవరపాటుకు గురి చేస్తోంది. గ్రామ దేవతగా, కోరిన కోరికలు నెరవేర్చే కొంగు బంగారంగా సింగారమ్మను ఈ ప్రాంత ప్రజలు, ముఖ్యంగా గిరిజనులు ఆరాధిస్తారు. ఈ జాతర మహోత్సవాలకు గోకవరం, జగ్గంపేట తదితర ప్రాంతాల నుంచే కాకుండా పరిసర అటవీ ప్రాంతాలలోని గ్రామాల నుంచి కూడా గిరిజనులు విశేషంగా తరలి వస్తారని చెబుతున్నారు. ఈ సమయంలో పెద్ద పులి గోకవరం మండలంలోని అటవీ గ్రామాలలో సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

**ఆ పులేనా..ఇది మరొకటా..**

తూర్పు గోదావరి జిల్లా కూర్మాపురం గ్రామంలో బంధించి పాపికొండలు ఫారెస్టులో విడిచిపెట్టిన 'ఎక్స్ ప్లోరర్', పదిహేను రోజుల క్రితం రంపచోడవరం మండలం పెద్దగెద్దాడ సమీపంలో కనిపించిన పులి..ఇప్పుడు తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం మల్లవరం అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్ద పులి ఒకటేనా..వేరువేరా అనేది తెలియాల్సి ఉంది.

గత నెల ఫిబ్రవరి నెలలో తడోబా నుండి వచ్చిన పెద్ద పులి దాదాపు 650 కిలోమీటర్లు ప్రయాణించి పది రోజులకు పైగా అటవీ శాఖ అధిజారులకు, ప్రజాప్రతినిధులకు.. ముఖ్యంగా పాడి రైతులకు కంటిపై కునుకు లేకుండా ముప్పుతిప్పలు పెట్టింది. పదిహేను ఆవులు, ఆవు దూడలపై దాడిచేసి హతమార్చింది. చివరికి కూర్మాపురం గ్రామంలోని పశువుల పాకలో దానిని అటవీశాఖ అధికారులు చాకచక్యంగా బంధించి.. పాపికొండ అభయారణ్యంలో విడిచిపెట్టారు. ఆ పులే పదిహేను రోజుల క్రితం రంపచోడవరం మండలం పెద్ద గెద్దాడ సమీపంలో రీ ఎంట్రీ ఇచ్చిందని కథనాలు వచ్చాయి. ఈ విషయంలో అటవీ శాఖ అధికారులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. అది వేరు..ఇది వేరని. కాదూ..ఆ పులే ఈ పులని అటవీ శాఖకు చెందిన కొందరు అధికారులు చెప్పారు. సరే..ఏ పులైనా..మొత్తంపై పెద్ద పులి. జనారణ్యంలోకి వచ్చింది. ప్రజలకు, పశువులకు ఎటువంటి నష్టం కలగకుండా ఎంత త్వరగా దానిని బంధిస్తే అంత మంచిది. అప్పటి వరకూ ప్రజల్లో నెలకొన్న ఆందోళన కొనసాగుతూనే ఉంటుంది.



## సకాలంలో ఇంటి పన్నులు చెల్లించనివారికి..
## పంచాయితీ సేవలు నిలుపుదల

**-జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** జిల్లాలోని గ్రామాలలో ఇంటి పన్నులు, ఇతర పన్నులు సకాలంలో చెల్లించి గ్రామ పంచాయితీలకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని 342 గ్రామ పంచాయితీలలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, ఇతర పన్నులు, గత సంవత్సరాల బకాయిలతో కలిపి మొత్తం రూ. 126.71 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ. 64.07 కోట్లు మాత్రమే వసూలు చేయడం జరిగిందన్నారు. ఇంకా రూ. 62.86 కోట్లు వసూలు చేయాల్సి ఉన్నందున ప్రజలు మిగిలిన ఇంటి పన్నులు, ఇతర పన్నుల మొత్తాన్ని వెంటనే చెల్లించాలని సూచించారు. ప్రస్తుతం ప్రజలు తమకు అనుకూలమైన ప్రదేశం నుంచే మొబైల్ ఫోన్ ద్వారా 'స్వర్ణ పంచాయత్' వెబ్‌సైట్ లోకి వెళ్లి పన్నులు నేరుగా చెల్లించవచ్చన్నారు. నిర్ణీత గడువులోగా పన్నులు చెల్లించని పక్షంలో నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. దీనిలో భాగంగా గ్రామ పంచాయితీ అందించే పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, వీధిదీపాల నిర్వహణ, గ్రామ పంచాయితీ జారీ చేసే ధృవపత్రాలు, ఇతర సేవలను నిలిపివేయడం జరుగుతుందన్నారు. అందు వల్ల ప్రజలందరూ సకాలంలో అన్ని రకాల పన్నులు, పన్నేతర బకాయిలతో సహా చెల్లించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కీర్తి చేకూరి పిలుపునిచ్చారు.

## బొమ్మూరు బిలాల్ మసీదులో ఇఫ్తార్ విందు

**-ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు బిలాల్ మసీదులో శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ సలహాదారు, శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, తెలుగుదేశం పార్టీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, టీడీపీ రాష్ట్ర నూర్ బాషా సాధికార కమిటీ అధ్యక్షుడు షేక్ సుభాన్ హాజరయ్యారు. టీడీపీ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ అతిథులను ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. మసీద్ లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొని అనంతరం మగ్రీబ్ నమాజ్ లో పాల్గొన్నారు. అనంతరం మసీద్ పెద్దలు ముఖ్య అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బీమరశెట్టి రమేష్, క్లస్టర్ కామిని భాస్కర్, జనసేన సీనియర్ నాయకులు షేక్ బాజ్జి, తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు సయ్యద్ ఉమర్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు రాయుడు సునిల్, నడిగట్ల కామేష్, నరాలశెట్టి శ్రీనివాస్, దుగ్గిరాల రాజేష్, ఆతావుల్లా, ఫరూక్, బషీర్, జనసేన నాయకులు అడ్డాల శ్రీనివాస్, కోట్ల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## రాజమండ్రి జీజీహెచ్ ను సందర్శించిన జడ్జి శ్రీలక్ష్మి

**-మానసిక చికిత్సా విభాగంలో రోగుల పరిస్థితి, అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా..**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్ శ్రీలక్ష్మీ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని మానసిక చికిత్స విభాగంలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలు, వారికి అందుతున్న వైద్య సదుపాయాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మానసిక రుగ్మతల నుండి పూర్తిగా కోలుకున్న వారిని తిరిగి వారి కుటుంబ సభ్యులతో కలిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పూర్తి సహకారం అందిస్తామని శ్రీలక్ష్మి తెలిపారు. అనంతరం మానసిక చికిత్స విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఆసుపత్రి అందిస్తున్న సదుపాయాలు, వైద్యులు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్న కార్యదర్శి, వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే రోగులు త్వరగా కోలుకునే అవకాశముందని అన్నారు.



## నియోజవర్గ అభివృద్ధికి సహకరించండి

**- పవన్ కళ్యాణ్ కు మంత్రి సుభాష్ వినతి**

**అమలాపురం(మనసులో మాట) మార్చి 6:** అమరావతిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి పవన్ కళ్యాణ్ తో మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధి పై పలు అంశాలపై డిప్యూటీ సీఎంతో మంత్రి సుభాష్ చర్చించారు. రామచంద్రపురం అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని మంత్రి వినతి పత్రం అందజేసారు. అలాగే నియోజకవర్గం లో గ్రామీణ రహదారుల నిర్మాణం, పాత రోడ్ల మరమ్మత్తులకు మంత్రిశుభాష్ పవణ్ కళ్యాణ్ ను అదనపు నిధులు కోరారు. కొత్త సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని స్మశానవాటికల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మంత్రి సుభాష్ అభ్యర్థించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై డిప్యూటీ సీఎంతో మంత్రి చర్చచారు. రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీటి సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా పవణ్ కళ్యాణ్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కళ్యాణ్ మంత్రి శుభాష్ కు హామినిచ్చారు. రామచంద్రపురం అభివృద్ధికి నిధుల కేటాయింపుపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం హామీ. నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్. అభివృద్ధికి సహకరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు మంత్రి సుభాష్ కృతజ్ఞతలు.

## గోదావరి పుష్కరాల కోసం రహదారుల అభివృద్ధి

**- ఘాట్లకు రోడ్డు కనెక్టివిటీ, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**





**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు అనువుగా ఉండేలా రహదారులను అభివృద్ధి పరచాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. రానున్న 2027 పుష్కరాల నేపథ్యంలో శుక్రవారం క్రౌడ్ మేనేజ్‌మెంట్, రైల్వే స్టేషన్ల నుండి ఘాట్లకు రోడ్డు కనెక్టివిటీ, ట్రాఫిక్ మళ్లింపుపై జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనాతో కలసి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కర్ ఘాట్, కోటిలింగాల ఘాట్ పరిసర ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి రూట్లను పరిశీలించారు. గత పుష్కరాల సమయంలో ఏర్పడిన ఇబ్బందుల దృష్ట్యా ఈసారి అటువంటి పరిస్థితులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. ప్రధానంగా ఘాట్లకు రాజమండ్రి, గోదావరి రైల్వే స్టేషన్లను అనుసంధానించే రహదారులను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. తద్వారా భక్తులు అధికంగా ఉండే రోజులలో కూడా ట్రాఫిక్ రద్దీ లేకుండా నియంత్రించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వంటి ఎమర్జెన్సీ వాహనాలు సైతం సులభంగా ప్రయాణించేందుకు మార్గాలు సుగమం కావాలని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో ఆర్ అండ్ బీ, మున్సిపల్, ట్రాఫిక్, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. లేకపోతే అత్యవసర సేవలు అందించడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశముందన్నారు. కేవలం పుష్కరాల కోసం మాత్రమే కాకుండా నగర ప్రజలకు దీర్ఘకాలిక భద్రత, మెరుగైన రహదారులను అందించే దిశగా పనులు చేపట్టాలని ఎస్పీ డీ నరసింహ కిషోర్ సూచించారు. అనంతరం గోదావరి రైల్వే స్టేషన్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ పర్యటనలో ఎస్ఈ (ఇరిగేషన్) జీ శ్రీనివాస్ రావు, ఎస్ఈ (ఇంజనీరింగ్) రీటా, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, సీఐ (ట్రాఫిక్) నబీ తదితర అధికారులు పాల్గొన్నారు.

## డార్క్ స్టోర్స్ పర్యవేక్షణ ఎవరు చేస్తున్నారు?

- వేగవంతమైన డెలివరీ పేరుతో అందించే వస్తువుల నాణ్యత ఎంత?
- తాజాగా కల్తీ పాల సంఘటనతో ప్రాణాలు పోయిన వైనం.. - అసెంబ్లీలో ప్రస్తావించిన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** ఆన్‌లైన్ ఆర్డర్‌లను వేగంగా డెలివరీ చేయడానికి స్విగ్గీ... ఇన్ స్టామా, బ్లింకిట్ వంటి సంస్థలు నడిపే డార్క్ స్టోర్స్ పర్యవేక్షణ ఎవరు చేస్తున్నారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈ అంశం గురించి ఎమ్మెల్యే వాసు అడిగారు. డార్క్ స్టోర్స్ లో సాధారణ ప్రజలకు ప్రవేశం ఉండదని గుర్తు చేశారు. అలాంటప్పుడు పండ్లు, కూరగాయలు, మాంసం వంటి నాణ్యత ఎంత, అవి ఎంత కాలం ఉంటాయి వంటి విషయాలను ఎవరు తనిఖీ చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో కల్తీ పాల సంఘటనను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. 15 ఏళ్ల నుంచి పాల సరఫరా చేస్తున్న ఒక వ్యక్తి చేసిన తప్పు వలన ఎన్ని ప్రాణాలు కోల్పోయామో చూశామని ఎమ్మెల్యే వాసు గుర్తు చేశారు. ఇప్పుడు అధికార యంత్రాంగం, ఉలిక్కిపడిందని, తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవడం ద్వారా మన ప్రభుత్వం చిత్త శుద్ధి నిరూపించుకుందని అన్నారు. మరి డార్క్ స్టోర్స్ లో నిల్వ చేసే పాలు వంటి వాటికి పర్యవేక్షణ, అజమాయిషీ ఎవరు చేస్తారని ఎమ్మెల్యే వాసు ప్రశ్నించారు. ఎందుకంటే తప్పు జరగక ముందే చర్యలు ఉండాలని ఆయన అన్నారు. సాధారణ కిరాణా షాప్ కి వెళితే కళ్ళతో చూసుకుని వస్తువులు కొనుగోలు చేస్తామని, మరి డార్క్ స్టోర్స్ లోకి వెళ్ళడానికి వీలు కానప్పుడు వాటి నాణ్యత, వాటి జీవితకాలం ఎలా తెలుస్తాయని అన్నారు. క్విక్ కామర్స్ వంటి వ్యాపార సంస్థలు ఎంత ముఖ్యమో ప్రజల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ఆయన అన్నారు. అందుకే ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని ఆయన కోరారు.

**కల్తీ పాలఘటనతో తనిఖీలు ముమ్మరం..**
**రాష్ట్రంలో నాలుగు చోట్ల ఫుడ్ సేఫ్టీ లాబ్స్ పెడ్తున్నాం అవకతవకలపై కఠిన చర్యలు తీసుకుంటాం**
**ఎమ్మెల్యే వాసు ప్రశ్నలకు మంత్రి సత్యకుమార్ సమాధానం..**

ఎమ్మెల్యే వాసు ప్రశ్నకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ స్పందిస్తూ కల్తీ పాలఘటన దురదృష్టకరమని, అయితే తనిఖీలు ముమ్మరం చేశామని చెప్పారు. 2023-24లో 572 తనిఖీలు నిర్వహించగా, 2024-25 లో 688 తనిఖీలు చేయగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 745తనిఖీలు నిర్వహించినట్లు మంత్రి వివరించారు. తనిఖీలు చేయడంతో పాటు తేడాలుంటే ఎక్కడికక్కడ పెనాల్టీలు కూడా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. గిడ్డంగులనే డార్క్ స్టోర్స్ గా చెబుతారని, వీటిపై నిరంతరం విజిలెన్స్ ద్వారా తనిఖీలు జరుగుతుంటాయన్నారు. స్విగ్గీ లాంటి సంస్థలు డెలివరీ చేసే వస్తువులపై జీవితకాల గడువు గురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉందని అన్నారు. ఎఫ్ ఎస్ ఎస్ ఐ ద్వారా ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్ పొందడం, వాటి నిబంధనలు పాటించటం చేయాలని అన్నారు. అయితే నిబంధనలు పూర్తి స్థాయిలో పాటించడం లేదన్నది వాస్తవమన్నారు. డాక్ స్టోర్స్ కి సంబంధించి 2023-24లో 17 తనిఖీలు 2024-25లో 27తనిఖీలు, 2025-26లో24తనిఖీలు జరిపినట్లు మంత్రి సత్యకుమార్ వివరించారు. తనిఖీలు నిర్వహించి పెనాల్టీలు వేస్తున్నప్పటికీ ఇనిస్ట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) మీద పర్యవేక్షణ కోసం అవకాశం లేకుండా పోయిందని, రాష్ట్ర విభజన వలన ఈ విభాగానికి తగినంత సిబ్బంది లేరని ఆయన చెప్పారు. 723మంది సిబ్బందికి 144మంది సిబ్బంది మాత్రమే ఉన్నారని, కూటమి ప్రభుత్వం వచ్చాక అనుమతి తీసుకుని 150నియామకాలు చేసినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఫుడ్ సేఫ్టీ తనిఖీకి లాబ్స్ కూడా లేవని ఆయన అన్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్ పంపాల్సి వచ్చేదని, ఇపుడు కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖ, తిరుపతి, గుంటూరు, కర్నూల్ లో కూడా ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ పెడుతున్నట్లు ఆయన చెప్పారు. దీని వలన శాంపిల్స్ వెంటనే పరీక్షించి, కల్తీ వంటివి ఉంటే వెంటనే చర్యలు తీసుకోడానికి వీలవుతుందని ఆయన సూచించారు. అవకతవకలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# మైనారిటీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ పొందే సువర్ణావకాశం..

**- టీడీపీ నూర్బాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సౌకర్యం కల్పిస్తుందని గన్నవరం నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు, టీడీపీ నూర్బాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్ అన్నారు. లక్ష్యాలను చేరుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశమన్నారు. ఆఫ్ లైన్ , ఆన్ లైన్ కోర్సులు ఉన్నాయన్నారు. ప్రవేశ పరీక్షలకు నిపుణులైన అధ్యాపకులచే శిక్షణ ఇస్తారన్నారు. ఐఐటీ, జెఈఈ, నిట్, ఎం సెట్, బిట్ సెట్, సీయూ సెట్ లకు శిక్షణ ఇస్తారన్నారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన్ పార్సీ మతాలకు చెందిన మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విజయవాడ బెంజ్ సర్కిల్ సాయిబాబా ఆలయం రోడ్ ఆర్టీసీ కాలనీ రోడ్ నెంబర్ 1, ప్లాట్ నెంబర్ 31లో ఉన్న విన్నర్స్ అకాడెమీలో శిక్షణ ఇస్తారన్నారు. ఉచిత శిక్షణ పొందేందుకు డైరెక్టర్ ను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్పీసీపీ మార్కాపురం జిల్లా అధ్యక్షునిగా గొట్టిముక్కల యోహాన్ నియామకం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలం అంబేద్కర్ నగర్ కు చెందిన నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే యువ నాయకుడు గొట్టిముక్కల యోహాన్ ని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ (ఆర్పీసీపీ) వ్యవస్థాపకుడు మేడా శ్రీనివాసరావు ఆ పార్టీ మార్కాపురం జిల్లా అధ్యక్షునిగా ఎంపిక చేసి, పార్టీలోనికి ఆహ్వానించారు. గుంటూరులోని పార్టీ ఆఫీసులో నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యోహాన్ మాట్లాడుతూ నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయనన్నారు. మా పశ్చిమ ప్రకాశం జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనపై నమ్మకంతో ఈ కీలక పదవిని అప్పగించిన పంగులూరి బుచ్చిబాబుకి ధన్యవాదములు తెలిపారు. పలువురు యువకులు పాల్గొన్నారు.

# మైనారిటీ విద్యార్థులకు సువర్ణావకాశం



**మండపేట (మనసులో మాట )మార్చ్ 6..** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (మైనారిటీ సంక్షేమ శాఖ) ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సౌకర్యం కల్పిస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ అన్నారు. లక్ష్యాలను చేరుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశమన్నారు. అఫ్ లైన్ , ఆన్ లైన్ కోర్సులు ఉన్నాయన్నారు. ప్రవేశ పరీక్షలకు నిపుణులైన అధ్యాపకులచే శిక్షణ ఇస్తారన్నారు. ఐఐటీ, జె ఇ ఇ, నిట్ ,ఎం సెట్, బిట్ సెట్ సి యూ సెట్ లకు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన్ పార్సీ మతాలకు చెందిన మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విజయవాడ బెంజ్ సర్కిల్ సాయిబాబా ఆలయం రోడ్ ఆర్టీసీ కాలనీ రోడ్ నెంబర్ 1, ప్లాట్ నెంబర్ 31లో ఉన్న విన్నర్స్ అకాడమీ లో విన్నర్స్ అకాడమీ లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఉచిత శిక్షణ పొందేందుకు డైరెక్టర్: ముజీర్ షేక్ ఫోన్:8309010226 ను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సలీం పాల్గొన్నారు.

# కావ్య భాషలో సాటిలేని మేటి మధునాపంతుల

**- 106వ జయంతి సభలో కీర్తించిన బులుసు వేంకటేశ్వర్లు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** కళాప్రపూర్ణ, ఆంధ్రపురాణ కర్త మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి కావ్య భాషలో సాటిలేని మేటి అని విశాఖ జిల్లా చిట్టివలసకు చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త బులుసు వేంకటేశ్వర్లు అన్నారు. ఒక అక్షరం ఎక్కువ తక్కువ అనే తేడా లేకుండా సమపాళ్ళలో ఆయన కవిత్వంలో అక్షరాల పొందిక ఉంటుందని అన్నారు. మధునాపంతుల 106వ జయంతి సభ స్థానిక శ్రీ గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. మహా మహోపాధ్యాయ, రాష్ట్రపతి పురస్కార గ్రహీత విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వేంకటేశ్వర్లు ప్రధాన ప్రసంగం చేస్తూ నన్నయ లక్షణాలు మధునాపంతుల పుణికి పుచ్చుకున్నారని అన్నారు. ఆయన రాసిన పద్యాలు చదివి వినిపిస్తూ పద్య సౌరభాన్ని కొనియాడారు. దేశ రాజధానిలో సైతం శత జయంతి నిర్వహించుకున్న ధన్యులు మధునాపంతుల అని బులుసు ప్రస్తావించారు. విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ మధునాపంతుల వారి రచనలు భవిష్యత్తు తరాలకు అందించడం, మాతృ భాష పట్ల మక్కువ ఏర్పరచడం వంటి ఆశయాలతో మధునాపంతుల ట్రస్టు ఏర్పడిందని తెలిపారు. ఏటా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తూ లబ్ద ప్రతిష్టులతో ఉపన్యాసం ఇప్పిస్తున్నామని తెలిపారు. ప్రధాన వక్తను వేదుల శేషగిరి వరప్రసాద్ సారథ్యంలో సత్కరించారు. మధునాపంతుల ట్రస్టు కార్యదర్శి ప్రయాగ సుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. ప్రముఖ సాహితీవేత్త తెలుగు వెలుగు అరిపిరాల నారాయణరావు, మధునా మూర్తి, ఏవీవీఎస్ కామరాజు, పీ విజయకుమార్, సుంకర రవికుమార్, యర్రాప్రగడ రామకృష్ణ, జమ్మి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా జిల్లా పర్యటన

**- ఓఎన్జీసీ గోదావరి భవన్‌లో జిల్లా ఓఎన్జీసీ అధికారులతో సమీక్షా సమావేశం**
**- బైక్ ర్యాలీ, డాక్టర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ, బహిరంగ సభలో పాల్గొనడం, అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం**
**- పర్యటన వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తూర్పు గోదావరి జిల్లా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఈ నెల 7, 8 తేదీల్లో జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా పర్యటించనున్నారని కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ షెడ్యూల్ ప్రకారం మక్వానా నేడు (శనివారం) ఉదయం 9 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుని, అక్కడ నుంచి బయలుదేరి స్థానిక ఓఎన్జీసీ అతిథి గృహానికి చేరుకుంటారు.

**నేటి కార్యక్రమాలు..**

నేటి (శనివారం) ఉదయం 11 గంటలకు రాజమహేంద్రవరం లోని ఓఎన్జీసీ గోదావరి భవన్ లో తూర్పు గోదావరి జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థికాభివృద్ధి, అమలులో ఉన్న ప్రభుత్వ పథకాలు, సమస్యల పరిష్కారం, రక్షణాత్మక చర్యలపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, పోలీసు సూపరింటెండెంట్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొననున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎండీ గయాజుద్దీన్ తెలిపారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు ఓఎన్జీసీ కార్యాలయం నుండి బైక్ ర్యాలీగా బయలుదేరి ధవళేశ్వరం వర్క్‌షాప్‌లోని ఓఎన్జీసీ ప్రాంగణానికి చేరుకుని, మధ్యాహ్నం 12 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. తదుపరి మధ్యాహ్నం 1 గంటకు ధవళేశ్వరం నుండి బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు రాజమహేంద్రవరంలోని ఓఎన్జీసీ అతిథి గృహానికి చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు ఓఎన్జీసీ అతిథి గృహం నుండి బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు గోల్ఫ్ వ్యూ బిల్డింగ్, ఓఎన్జీసీకి చేరుకుని ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ఓఎన్జీసీ మేనేజ్‌మెంట్‌తో ప్రత్యేక సమావేశంలో పాల్గొంటారు.

**డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు పయనం..**

తదుపరి సాయంత్రం 5 గంటలకు అక్కడి నుండి బయలుదేరి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు బయలుదేరి వెళ్ళతారు. నేటి సాయంత్రం రాజోలు మండలం దిండి ప్రాంతానికి చేరుకుని సాయంత్రం 6 గంటలకు సామాజిక సంక్షేమ వసతి గృహాలు, సమీప ఎస్సీ కాలనీలను సందర్శిస్తారు. దిండి ప్రాంతంలోనే రాత్రి బస చేస్తారు.

**మార్చి 8 వ తేదీ కార్యక్రమాలు..**

రేపు (ఆదివారం) ఉదయం 11 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్, ఇతర ఉన్నతాధికారులతో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు కోనసీమ జిల్లా నుండి బయలుదేరి సాయంత్రం 7 గంటలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుండి రాత్రి 9.05 గంటలకు విమానంలో బయలుదేరి న్యూ ఢిల్లీ చేరుకుంటారు.

ఈ మేరకు పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించినట్లు తెలిపారు.

# బీజేపీ కార్యాలయంలో జనతా వారధి

**- పలు సమస్యలపై అందిన అర్జీలు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** 'మీ సమస్య..మా బాధ్యత' అనే నినాదంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక క్వారీ ఏరియాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ఆ పార్టీ శ్రేణులు నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు. గ్రామాల్లో వికలాంగుల పింఛన్ల తదితర సమస్యలపై అనేక వినతి పత్రాలు అందాయి. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని కార్యవర్గ సభ్యుడు పరిమి రాధ తెలిపారు. ప్రజా సేవే పరమావధిగా ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా నిరంతరం బీజేపీ కృషి చేస్తోందని తెలిపారు. శుక్రవారం తమ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. జనతా వారధి జోనల్ ఇన్చార్జ్ బొమ్మల దత్తు, జిల్లా కన్వీనర్ శివరామరాజు, కో కన్వీనర్ బండి సత్య ప్రసాద్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, పార్టీ జోనల్ కో ఇన్చార్జ్ పడాల హత్తి రామ్, పార్టీ జిల్లా కార్యదర్శి స్వామి సూరి కిరణ్, మీనాక్షి, కాలేపు సత్య సాయిరాం, కొల్లాపూర్ శీను, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆఖరి మజిలీ లోను అవస్తలే...

**- యానాంలో అద్వానంగా స్మశాన వాటికలు - సౌకర్యాలలేమితో ఇబ్బందులు**
**- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం - ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు**



**యానాం (మనసులో మాట) మార్చి 06:** యానాం నియోజకవర్గంలో స్మశాన వాటికలు అద్వానంగా తయారయ్యాయి. పలు వాటికల్లో చెత్తాచెదారాలు, చేపల వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతుంది. ప్రజలకు ఆఖరి మజిలీ లోను అవస్థలు తప్పడం లేదు. ఎవరైనా మృతి చెందితే ఆ మృతదేహాన్ని ఖననం చేసేందుకు కుటుంబ సభ్యులు అష్ట కష్టాలు పడుతున్నారు. యానాం నియోజకవర్గం కూరసాం పేట లో వున్న ప్రధాన స్మశాన వాటికలో సౌకర్యాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మృతదేహాన్ని ఖననం చేసే (క్రిమిసం బెడ్స్) బెడ్లు పాడైపోవడంతో ఖననం చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా నీటి సౌకర్యం లేకపోవడంతో పదరాని పాట్లు పడుతున్నారు. చెంతనే ఉన్న ఆత్రేయ గోదావరిలో స్నానాలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. గోదావరిలో కాలుష్యాలు పెరిగిపోవడం చెత్తాచెదారాలతో ఉండడంతో స్నానాలు చేసేందుకు వెనకాడుతున్నారు. అదేవిధంగా స్మశాన వాటికలో సరైన నిర్వహణ లేకపోవడంతో దుర్గంధం మెదజల్లుతూ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితిలో ముక్కు మూసుకుని మృతదేహాల ఖననం చేయాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. యానం పట్టణంలో వేలాదిమంది నివసిస్తున్నారు. పట్టణంలో కూరుసాంపేట, భీమ నగర్ తదితర స్మశాన వాటికల దగ్గర ఖననం చేయాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వారి బాధలు మరి ఎక్కువగా ఉంటున్నాయి. స్మశాన వాటికలో పరిస్థితిపై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. స్వచ్ఛంద సంస్థలు స్మశాన



వాటికలను శుభ్రం చేయడం, పచ్చదనం పరిశుభ్రం కార్యక్రమాలు నిర్వహించడం మినహా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. ఆఖరి మజిలీలో కూడా ప్రజలకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నారన్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యానాం నియోజకవర్గంలో ఇద్దరు ప్రజా ప్రతినిధులు ఉన్నప్పటికీ కనీసం స్మశానవాటికలను కూడా అభివృద్ధి చేయలేకపోవడంపై సర్వత్ర విమర్శలు వెలివెత్తుతున్నాయి.



## వెంకట పాపాచార్యులు మృతికి
# విశ్వబ్రాహ్మణుల సంతాపం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** రాజమహేంద్రవరం నగర, రూరల్ స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షుడు, ఆధ్యాత్మిక వేత్త అములోజు వెంకట పాపాచార్యులు మృతికి నగర విశ్వ బ్రాహ్మణ సంఘం సంతాపం తెలియజేసింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. పాపాచార్యులు చిత్రపటానికి సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. సంఘ పటిష్టతకు, సభ్యుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా ప్రస్తుతించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు లక్కోజు వీరభద్రరావు (లక్కోజి), ప్రధాన కార్యదర్శి అమలోజు శివప్రసాద్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు అనుపోజు వెంకటరమణ, జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు గుంటముక్కల రాజు, నగర, రూరల్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ముక్కామల స్వామి, ప్రధాన కార్యదర్శి పోలమూరి సతీష్, విశ్వ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు అంబవరపు గంగాధరం, కోసూరి గోపాల రత్నం (గోపి), కాగితపు శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఈ నెల16 నుంచి ఏప్రిల్ 1 వరకు
# ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలు

**- జిల్లాలో 138 కేంద్రాల్లో విస్తృత ఏర్పాట్లు - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**




**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** పదవ తరగతి పబ్లిక్ (ఎస్ఎస్ సీ) పరీక్షలు -2026 ఈ నెల 16 నుండి వచ్చే నెల ఏప్రిల్ 1వ తేదీ వరకు జిల్లాలోని 138 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఒకే సెషన్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 24,538 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. అందులో రెగ్యులర్ అభ్యర్థులు 13,322 మంది, ప్రైవేట్ అభ్యర్థులు 11,216 మంది ఉన్నారన్నారు. వారిలో అబ్బాయిలు 12,555 మంది, అమ్మాయిలు 11,983 మంది ఉన్నారని తెలిపారు. పరీక్షలను ప్రశాంతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించి తగిన సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మార్చి2026 ఎస్-ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసిందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. పరీక్షల నిర్వహణకు పోలీసు శాఖ ద్వారా కట్టుదిట్టమైన బందోబస్తు, స్ట్రాంగ్ రూమ్‌లకు 24 గంటల భద్రత, ప్రశ్నపత్రాల రవాణాకు ఎస్కార్ట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షల సమయంలో కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని తహసీల్దార్లను ఆదేశించామన్నారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు పరీక్షా కేంద్రాల్లో పరిశుభ్రత, తాగునీరు, ఫర్నిచర్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా ఆయా రూట్లలో ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని, వైద్య శాఖ ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు కల్పించాలని, విద్యుత్తు శాఖ నిరంతర విద్యుత్తు సరఫరా అందించాలని ఆదేశించారు.

**వాట్సాప్ ద్వారా హాల్ టికెట్లు..**

పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం వాట్సాప్ గవర్నెన్స్ సేవల ద్వారా హాల్ టికెట్లు పొందే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఇందు కోసం 95523 00009 నంబర్‌కు "హాయ్" (హెచ్ఐ) అని మెసేజ్ పంపాలన్నారు. తదుపరి అందుబాటులో వచ్చే సేవల్లో "విద్యా సేవలు" ఎంపిక చేసి, "ఎస్ఎస్సీ హాల్ టికెట్" పై క్లిక్ చేయాలి. అనంతరం విద్యార్థి అప్లికేషన్ నెంబర్, పుట్టిన తేదీ నమోదు చేస్తే హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. హాల్ టికెట్‌లో పేరు, పుట్టిన తేదీ, ఫొటో, సంతకం వంటి వివరాలు సరిగా ఉన్నాయో లేదో విద్యార్థులు పరిశీలించుకోవాలని తెలిపారు. ఏవైనా తేడాలు ఉంటే వెంటనే సంబంధిత ప్రధానోపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. అదే విధంగా పాఠశాలల లాగిన్ ద్వారా కూడా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

# టెన్త్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించండి

**-డీఈవో వాసుదేవరావు**

**-సత్య సాయి గురుకులంలో ప్రధానోపాధ్యాయులకు పరీక్ష నిర్వాహకులతో సమీక్షా సమావేశం**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** ఈ నెల 16 నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు అధికారులను ఆదేశించారు. స్థానిక ఆల్కాట్ గార్డెన్స్ ఐఎల్టీడీ సెంటర్ వద్ద గల సత్య సాయి గురుకులం లో శుక్రవారం జిల్లాలోని అందరు ఎంఈఓ -1, ఎంఈఓ -2, అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పదవ తరగతి రెగ్యులర్ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్ మెంటల్ ఆఫీసర్లు అందరితోనూ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ వాసుదేవరావు మాట్లాడుతూ పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, ఏ సెంటర్లోనూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా అన్ని వసతులను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తక్షణం తమ దృష్టికి తీసుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ఏడీ వెంకటరాజు, డీసీఈబీ సెక్రెటరీ దేవా అనిత, కొవ్వూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి బీ దిలీప్ కుమార్, అన్ని మండలాల ఎంఈఓ 1, 2 లు, ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక



# భారీ నాగుపాము ను బంధించిన స్నేక్ క్యాచర్

**అయినవిల్లి( మనసులోమాట) మార్చి 6 :** అయినవిల్లి మండలం మాగాపువారిపేట గ్రామంలో గత మూడు రోజులుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఐదు అడుగుల భారీ గోధుమ తాచు పామును ఎట్టకేలకు పట్టుబడింది. గ్రామంలో కి వచ్చిన నాగుపాము రెండు రోజులుగా జనావాసాల్లోకి ప్రవేశించిగ్రామస్తులను భయాభ్రాంతులకు గురి చేసింది. ఈ పాము ఎప్పుడు ఎటువైపు నుండి వస్తుందోనని స్థానికులు కంటిమీద కునుకు లేకుండా గడిపారు. సమాచారం అందుకున్న భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మ, శుక్రవారం ఆ పామును అత్యంత చాకచక్యంగా పట్టుకుని డబ్బాలో బంధించారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకోవడమే కాకుండా, ధైర్యంగా ముందుకు వచ్చి పామును పట్టుకున్న గణేష్ వర్మను అభినందించారు. ఈ సందర్భంగా గణేష్ వర్మ మాట్లాడుతూ వేసవి తాపాన్ని తట్టుకోలేక విష సర్పాలు చల్లని ప్రాంతాలకు వస్తాయని ఎవరూ బయపడి వాటికి ప్రాణహాని కల్గించవద్దని నాకు తెలియపరిస్తే వాటిని బంధించి సురక్షిత ప్రాంతాల్లోకి తీసుకెళ్ళి విడిచిపెడతామన్నారు.

# సమతులాహారం సేవిచడం ఎంతో మంచి ఆరోగ్యం



**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..** సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని పోషకాహార నిపుణులు పి. పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నిత్యాహారంలో ఫైబర్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. దీనివల్ల అదనంగా ఉన్న కొవ్వును, ఇతర వ్యర్థ పదార్థాన్ని విసర్జింప చేస్తుందన్నారు .బరువు పెరగకుండా ఉండటంతో పాటు జీర్ణ యంత్రాంగ మార్గంలో క్యాన్సర్ రాకుండా కాపాడుతుందన్నారు. పప్పులు, కూరగాయలు, ఆపిల్, అరటి పండ్లు, బత్తాయి ద్వారా ఫైబర్ లభిస్తుందని పార్థసారథి తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్ ,ప్రసాద్ నాయుడు, సూర్యనారాయణ , చింతపల్లి సుబ్బారావు, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణన సమర్ధవంతంగా నిర్వహించేందుకే

# మూడు రోజులు శిక్షణ

### - జనాభా లెక్కల పరిశోధన అధికారిణి రమాదేవి




**అమలాపురం(మనసులోమాట) మార్చి 6:** దేశవ్యాప్తంగా నిర్వహించ నున్న 16వ జనగణన ప్రణాళిక బద్దంగా సమర్థ వంతంగా నిర్వహించేందుకై మూడు రోజులు పాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు 2027 జనాభా లెక్కల సీనియర్ పరిశోధన అధికారి ఎంబి రమాదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు మూడు రోజులు పాటు నిర్వహించనున్న జనాభా లెక్కల సేకరణకు సంబంధించి మొదటి రోజు శిక్షణ తరగ తులను ఆమె గోదా వరి భవన్ నందు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ జనగణన కార్యక్రమం దేశ నిర్మాణం లో అత్యంత కీలకమైనదని జనగణన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టను న్న 16వ జనగణన కార్యక్రమం దేశ నిర్మా ణంలో అత్యంత కీలకమైన ప్రక్రియని, ప్రతి ఒక్క వ్యక్తిని ఖచ్చితంగా లెక్కించడం అవసరమన్నారు. జనగణన కార్యక్రమం దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ప్రతి ఒక్క వ్యక్తిని ఖచ్చితంగా లెక్కించడం అవస రమన్నారు. జన గణన ద్వారా సేకరించే ప్రతి సమాచారం దేశం, రాష్ట్రం, జిల్లా మరియు గ్రామ అభివృద్ధికి అత్యంత ప్రాముఖ్యమైనదని పేర్కొన్నారు. ఒక రాష్ట్రం లేదా దేశం అభివృద్ధిని అంచనా వేయడానికి ప్రపంచ వ్యాప్తంగా అత్యంత విశ్వసనీయమైన ఆధారం జనగణన మాత్రమే అని తెలిపారు. అక్షరాస్యత రేటు, లింగ నిష్పత్తి, జనాభా సంఖ్య వంటి కీలక అంశాలు అన్నీ జన గణన ఆధారంగానే నిర్ణయించబడతాయని ప్రతి ఎన్యూమరేటర్ సేకరించే సమాచారం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. జనగణన ప్రక్రియ 1872 సంవత్సరం నుంచి కొనసాగుతుండగా ఇప్పటి వరకు అనేక సార్లు నిర్వ హించబడిందని, ప్రతి దశలోనూ దేశ ప్రణాళికలు రూపొందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే ఆర్థిక నిధుల కేటాయింపులో కూడా జనాభా ఒక ప్రధాన ప్రమాణంగా ఉండడంతో ప్రతి వ్యక్తిని లేక్కించడం చాలా ముఖ్యమ న్నారు. ఎన్యూమరేటర్లు కొంతమంది వ్యక్తులను లెక్కించకుండా వదిలేస్తే అది పెద్ద మొత్తంలో జనా భా తగ్గినట్లుగా నమోదవుతుందని దీని ప్రభావంగా రాష్ట్రానికి రావాల్సిన వేల కోట్ల రూపాయల నిధులు తగ్గే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈసారి జన గణన పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వ హించబడుతుందని, అందువల్ల గతంలోలాగా ఫలితాలు రావ డానికి ఎక్కువ సమయం పట్టదని, సాధారణంగా ఏడాది పట్టే ప్రక్రియ ఇప్పుడు డిజిటల్ విధానంలో సుమారు ఆరు నెలల్లోనే పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. కుల గణన కూడా నిర్వహించబడిఉన్నందు న అది సామాజిక న్యాయం సాధనలో కీలక పాత్ర పోషి స్తుందన్నారు సమాజంలోని ప్రతి వర్గం యొక్క నిజమైన జనాభా వివరాలు తెలిసి నప్పుడే, సరైన ప్రాతినిధ్యం మరియు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం సాధ్య మవుతుందన్నారు. జన గణన కార్యక్రమాన్ని ప్రతి ఎన్యూ మరేటర్ బాధ్యతగా తీసుకొని, ప్రతి ఒక వ్యక్తిని ఖచ్చితంగా లెక్కించాలన్నారు. ఈ ప్రక్రి యను నిజమైన నేషన్ బిల్డింగ్ ఎక్సర్సైజ్ గా భావించి అందరూ సహకరించి విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ జన గణన ఆప రేషన్కు ఎంత ప్రాముఖ్యత కలదో మనందరికీ స్పష్టంగా తెలుస్తోందన్నారు. చట్టబద్ధమైన ఈ జనగణన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకొని అత్యంత నిబద్ధతతో నిర్వహించాలని, ముఖ్యంగా చార్జ్ ఆఫీసర్స్ పాత్ర చాలా కీలకమైనదని తెలిపారు. క్షేత్ర స్థాయిలో వచ్చే సందేహాలను చార్జ్ ఆఫీసర్స్ ముందుగా పరిష్కరించేలా సబ్జెక్ట్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి చిన్న సమస్యకైనా ఉన్న తాధికారులను సంప్రదించా ల్సిన అవసరం లేకుండా స్వయంగా ఎన్యూమరేటర్లకు మార్గనిర్దేశనం చేయగలిగేలా ఉండాలన్నారు. జన గణన కార్యక్రమం ప్రారంభానికి ఇప్పుడు చాలా తక్కువ సమయం మాత్రమే ఉందని ఏప్రిల్ 16 నుండి సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రారంభ మవుతుందని మే1 నుండి హౌస్ లీస్టింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని అందు వల్ల అందించే సమాచారం పూర్తిగా అధ్యయనం చేసి, ఎన్యూమెటీర్స్ మరియు సూపర్వైజర్కు చార్జ్ ఆఫీసర్లలు సరైన మార్గనిర్దేశం చేయాల న్నారు. జన గణన సమయం లో ముఖ్యమైన అంశం ప్రజల నమ్మకమని ప్రతి ఇంటి వద్దకు వెళ్లే సమయంలో వారు చెప్పే సమాధానాన్ని గౌరవంగా స్వీక రించాలని వారి వ్యక్తిగత వివరాలు ఎటువంటి ఇతర ప్రయోజనాలకు ఉపయోగించ బడవని వారికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారు చెప్పిన సమాచారాన్ని నిజాయితీగా నమోదు చేసి స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు ప్రముఖుల సహకారం కూడా తీసుకుంటే మంచి డేటా సేకరించడం సులభం అవు తుందన్నారు. ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్ లు క్షేత్ర స్థాయిలో చేసే పనిని ఛార్జ్ ఆఫీసర్లు సమర్ధవంతంగా పర్యవేక్షించాలని, వారిపై అనవసర ఒత్తిడి లేకుండా, సానుకూలంగా ప్రోత్సహిస్తూ పనిచేయిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమానికి పారితోషికం ఇతర సదుపాయాలు కల్పి స్తోందని, ఇది అందరికీ ఒక ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. జన గణనలో హౌస్ లిస్టింగ్ హౌసింగ్ కార్యకలాపాలపై పూర్తి దృష్టి పెట్టాలని తర్వాత దశలో జరిగే పాపు లేషన్ ఎన్యూమ రేషన ఇంకా సమయం ఉందన్నారు. ఈ ట్రైనింగ్ నిర్వహణ ద్వారా మీరు అందరూ జనగణన కార్యక్రమాన్ని విజయవం తంగా నిర్వహించాలన్నారు
2027 జనాభా లెక్కలు ప్రణాళికా బద్ధంగా సమర్థ వంతంగా చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. తొలి దశలో హౌస్ లిస్టింగ్, హౌ సింగ్ సెన్సస్ కార్యక్ర మా నికి సంబంధించి అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు ఏర్పాటు చేసి నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు జిల్లా, మండల స్థాయి సెన్సస్ అధికారు లకు జనగణన నిర్వహణ కు సంబంధించిన విధివిధానాలు, బాధ్యతలు, హౌస్ లిస్టింగ్ ప్రక్రియ, డేటా సేకరణ విధానం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. లేఅవుట్ మ్యా పింగ్ ద్వారా డిజిటల్ గణాంకాల సేకరణవివిధ రకాల డాష్‌బోర్డ్‌ల వాడకం, గణనాధికారుల పాత్ర సూపర్‌వైజర్ యాప్‌ని ఉపయోగించి డేటా ధృవీ కరణలో సూపర్‌వైజర్ పాత్ర. డేటా ఎంట్రీని సులభ తరం చేయడం.డేటా నీతి, గోప్యత, భద్రత ఉండా లన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారులు చంటి వెంకటరమణ బి భాగ్యప్ప గణాంక ఇన్వెస్టిగేటర్లు సోను యాదవ్, హటీరీ తరుణ్ తాహసిల్దార్లు ఎంపీడీవోలు ఉప తాసిల్దార్లు సహాయ గణాంక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెరంబలూరులో తెలుగు విద్యార్థుల సత్తా

# ఈ- క్యూర్ యాప్ కు ప్రథమ బహుమతి

### తొలి ప్రయత్నంలోనే సొంతం - పలువురు ప్రశంసలు - క్యూలో నిలబడకుండా డాక్టర్లు అపాయింట్మెంట్ యాప్ తయారీకి తను అనుభవించిన నరకయాతనే - హేమంత్





**కాజులూరు (మనసులో మాట) ఫిబ్రవరి 7..** వివిధ వినూత్న ప్రాజెక్టుల మధ్య తమిళనాడు రాష్ట్రంలోని పెరంబలూరులో శ్రీరామకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈవెంట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన కేసన హేమంత్ కుమార్ పట్టాభి టీమ్ ద్వారా ఏర్పాటు చేసిన ఈ- క్యూర్ యాప్ కు అక్కడ జరిగిన ఈవెంట్లో నిర్వహించిన ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో కేసన హేమంత్ కుమార్ పట్టాభి టీమ్ తొలి ప్రయత్నంలోనే ఆహూతుల మన్ననలు పొంది ప్రథమ బహుమతిని సొంతం చేసుకుంది. హేమంత్ కుమార్ పట్టాభి తమిళనాడు రాష్ట్రంలో తిరుచినాపల్లి (త్రిచ్చి)లో సమయపురంవద్ద గల ధనలక్ష్మి శ్రీనివాసన్ విశ్వవిద్యాలయంలో బిటెక్ (సిఎస్ఇ)తృతీయ సంవత్సరం విద్యార్థి .కాగా హేమంత్ టీమ్ తయారు చేసిన ఈ-క్యూర్ యాప్ ద్వారా హేమంత్ టీమ్ తయారు చేసిన హెల్త్‌కేర్ పోర్టల్ వర్చువల్ కన్సల్టేషన్లు, వేగవంతమైన ఫలితాల కోసం అల్-పవర్డ్ డయాగ్నస్టిక్స్ మరియు సజావుగా ఔషధ డెలివరీ ద్వారా ఆరోగ్య సంరక్షణకు అనుకూలమైన ప్రాప్యతను అంధిస్తుంది. ఇందులో రోగులు డాక్టర్ ప్రొఫైల్‌లను సమీక్షించవచ్చు, అపాయింట్‌మెంట్‌లను బుక్ చేసుకోవచ్చు అలాగే అల్-అసిస్టెడ్ డయాగ్నస్టిక్‌లను పొందవచ్చు. సంప్రదింపుల తర్వాత, రోగులు ఔషధ డెలివరీని ఎంచుకోవచ్చు. తక్షణ మందుల ఫైండర్, స్పెషలిస్ట్ ఫైండర్, ఆరోగ్య రికార్డుల నిర్వహణ బీమా ఏకీకరణ ఈ ప్లాట్‌ఫామ్ ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి, సమర్థవంతంగా, వినియోగదారు -స్నేహపూర్వకంగా చేస్తుందని టీమ్ సభ్యులు కె.హేమంత్, ఎహిమంత్, ఆర్ జయశంకర్,ఎల్ సాయి కార్తీక్ లు పేర్కొన్నారు.
వర్చువల్ కన్సల్టేషన్ల ద్వారా యాక్సెస్ చేయగల ఆరోగ్య సంరక్షణను అందిస్తుందని, వినియోగదారులను ఎక్కడి నుండైనా అర్హత కలిగిన వైద్యులతో అనుసంధానిస్తుందని పేర్కొన్నారు. వైద్యులను సులభంగా కనుగొనడానికి, మందులను ఆర్డర్ చేయడానికి , వర్చువల్ సంప్రదింపులను నిర్వహించడానికి లక్షణాలతో ఆరోగ్య సంరక్షణ నిర్వహణను క్రమబద్ధీకరిస్తుందని పేర్కొన్నారు. తద్వారా రోగులు ,వైద్యులకు సమయం ఆదా అవుతుందని,ఎక్కడి నుండైనా నాణ్యమైన ఆరోగ్య సంరక్షణకు ప్రాప్యతను మెరుగుపరుస్తుందని, యూజర్ అనుభవాన్ని సులభంగా రికార్డ్ చేసే యాక్సెస్‌ను మెరుగుపరుస్తుందన్నారు. ఇది ఇలా ఉండగా యాప్ తయారీకి తాను ఒకానొక సందర్భంలో డాక్టర్ అపాయింట్మెంట్ కోసం వెళ్ళి గంటలతరబడి వెయిటింగ్ చేసినా ఫలితం లేకపోవడంతో స్వయంగా తాను తోటి విద్యార్థులతో చేసిన చిన్న తొలి ప్రయత్నంలోనే ఇక్కడ ప్రథమ బహుమతి దక్కడం చాలా ఆనందంగా ఉందని హేమంత్ పేర్కొన్నారు. బుధవారం పెరంబలూరులో జరిగిన సాంకేతిక ప్రదర్శనల్లో 17 కళాశాలల నుంచి కళాశాల 270 మంది విద్యార్థులు పాల్గొన్న ఈవెంట్లో ప్రథమ బహుమతిని స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా హేమంత్ టీమ్ అందుకు న్నారు. దీంతో యాజమాన్యం, యూనివర్శిటీలోఅధ్యాపకులువిద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. హేమంత్ టీమ్ సభ్యులు తల్లిదండ్రులు సైతం ఆనందం వ్యక్తం చేస్తూ, వారి కృషికి తొలి ప్రయత్నంలోనే గుర్తింపు దక్కినందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. అలాగే సీనియర్ జర్నలిస్టు కేసన గంగరాజు కుమారుడు కె. హేమంత్ కుమార్ పట్టాభి రూపొందించిన "ఈ-క్యూర్ యాప్" ప్రదర్శనకు తొలి ప్రయత్నంలోనే గుర్తింపు తెచ్చుకున్నందుకు తనకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి పొందిన హేమంత్ ను స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు , కూటమి నాయకులు ,పాత్రికేయులు అభినందించారు.



# గ్రామ సర్వేయర్ల నిరసన

### -తమ విధులకు సంబంధించిన ముఖ్యమైన సమస్యలపై..

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** తూర్పు గోదావరి జిల్లాలో పనిచేస్తున్న గ్రామ సర్వేయర్లు తమ విధులకు సంబంధించి ముఖ్యమైన సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రమోషన్ ఛానల్ ఫిక్సింగ్, బేసిక్ పే ఫిక్సింగ్ అంశాలపై ప్రభుత్వం త్వరితగతిన స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండు చేస్తున్నారు. గ్రామ స్థాయిలో భూ సర్వేలు నిర్వహించడం, భూ రికార్డులను నిర్వహించడం, ప్రజలకు భూ సంబంధిత సేవలు అందించడం వంటి కీలక బాధ్యతలను గ్రామ సర్వేయర్లు నిర్వర్తిస్తున్నప్పటికీ, ఇప్పటి వరకు వారికి సరైన ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బేసిక్ పే ఫిక్సేషన్ విషయంలో కూడా స్పష్టత లేకపోవడంతో వారి ఉద్యోగ భద్రత, భవిష్యత్తు పురోగతి విషయంలో అనిశ్చితి నెలకొంది. అందు వల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ సర్వేయర్లకు స్పష్టమైన ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేయాలని, బేసిక్ పేను న్యాయంగా ఫిక్స్ చేసి అమలు చేయాలని, వారి సర్వీస్ మ్యాటర్స్‌ను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ తూర్పు గోదావరి జిల్లా గ్రామ సర్వేయర్లు నిరసన ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. వారి మాటల్లో.. "మేము మా విధులను నిబద్ధతతో నిర్వర్తిస్తున్నాండ కానీ మా హక్కులు మాత్రం మాకు అందడం లేదు. వెంటనే ప్రమోషన్ ఛానల్, బేసిక్ పే ఫిక్సేషన్ అమలు చేయాలి" అని వారు కోరారు.

## వాడపల్లి ఆలయం నికి బంగారు మఖర తోరణం (రూ60 లక్షలు) బహూకరణ



**కొత్తపేట మనసులో మాట మార్చి 6..** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి కి తణుకు చెందిన పుణ్యమూర్తుల రామచంద్రస్వామి, సావిత్రి,దంపతులు 350 గ్రాముల బంగారంతో,రూ 60 లక్షలు విలువైన మఖర తోరణం ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు కు అందజేశారు. అర్చకులు సాయి కృష్ణ, ఖండవల్లి శేషావతారం, దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి వేద ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందజేశారు. సంప్రోక్షణ అనంతరం స్వామివారికి అలంకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి మాజీ సర్పంచ్ పోచిరాజు బాబురావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అడపా దుర్గాప్రసాద్ కు పీహెచ్డీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియో సైన్సెస్ నుండి అడపా దుర్గాప్రసాద్ పీహెచ్డీ అందుకున్నారు. దుర్గాప్రసాద్ కు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి అవార్డును ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన తెలియజేస్తూ "పశ్చిమ భారత దేశంలోని కచ్‌లోని మిలియోలైట్ నిక్షేపాల నుండి లేట్ క్వాటర్నరీ పాలివో ఎన్విరాన్మెంట్ చిక్కులు" అనే తన థీసిస్ పై పరిశోధన పూర్తి చేశారని చెప్పారు. ఎక్స్‌ట్రా మ్యూరల్ కేటగిరిలో ఫుల్ టైం పీహెచ్డీ చేశారని, గైడ్స్ గా గుజరాత్ లోని ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సీస్మోలాజికల్ రీసెర్చ్ డాక్టర్ ఫల్గుణి భట్టాచార్య, ఆదికవి నన్నయ యూనివర్సిటీ జియో సైన్సెస్ ప్రొఫెసర్ వై శ్రీనివాసరావు మార్గ నిర్దేశం చేశారని చెప్పారు. విభాగ అధ్యాపకులు దుర్గాప్రసాద్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## కే.జీ.ఆర్.ఎల్ ఫార్మసీ కళాశాలలో ఘనంగా

# జాతీయ ఫార్మసీ ఎడ్యుకేషనల్ డే



భీమవరం, (మనసులో మాట) మార్చ్ 5 : దేశవ్యాప్తంగా జరుపుకునే జాతీయ ఫార్మసీ ఎడ్యుకేషనల్ డే సందర్భంగా, ఫార్మసీ విద్యా పితామహుడిగా పేరుగాంచిన ప్రొఫెసర్ మహాదేవ్ లాల్ ష్రాఫ్ జయంతిని కే.జీ.ఆర్.ఎల్ ఫార్మసీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెమినార్ హాల్లో డైరెక్టర్ డా. కవల నాగేశ్వరరావు, అధ్యాపకులు మరియు విద్యార్థులు ముందుగా ప్రొఫెసర్ మహాదేవ్ లాల్ ష్రాఫ్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డా. కవల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫార్మసీ విద్యాభివృద్ధికి ప్రొఫెసర్ మహాదేవ్ లాల్ ష్రాఫ్ చేసిన సేవలను స్మరించుకున్నారు. భారతదేశంలో ఫార్మసీ విద్యకు బలమైన పునాది వేసిన మహనీయుడు ఆయన అని తెలిపారు. ఈ సందర్భంగా ఫార్మసీ విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్తులో ఫార్మసీ రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలు చేసి సమాజానికి సేవ చేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.కవల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా.డి రాఘవ,అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ట్రాఫిక్ కు అంతరాయం కలిగించే ఎటువంటి చర్యలను ఉపేక్షించేది లేదు

- ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల పక్కన ఉంచే పాత వాహనాలను గుర్తించి, వెంటనే తొలగింపుకు చర్యలు తీసుకోవాలి
- వాహన రాకపోకులకు అంతరాయం కలిగించే చర్యలను తక్షణమే నిలువరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు
- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం, (మనసులో మాట) మార్చి 6 :** భీమవరం పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల పక్కన దీర్ఘకాలంగా నిలిపి ఉంచిన పాత వాహనాలను తొలగించి ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రెవిన్యూ, మున్సిపల్, పోలీస్, ట్రాఫిక్ సిబ్బందిని ఆదేశించారు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం శుక్రవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రెవిన్యూ, పోలీస్, ట్రాఫిక్ శాఖలు టీములుగా ఏర్పడి భీమవరం పట్టణంలోని జువ్వలపాలెంరోడ్డు, టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా , టౌన్ హాల్ రోడ్డు, వివిధ కూడలిలో రోడ్ల పక్కన దీర్ఘకాలికంగా నిరుపయోగంగా ట్రాఫిక్ కు అవరోధముగా ఉన్న వివిధ రకముల 11 పాత వాహనములను ప్రోక్లైనర్ ద్వారా ఖాళీ ప్రదేశమునకు తరలించడం జరిగింది. అలాగే పట్టణంలో ట్రాఫిక్ కు అంతరాయంగా ఉన్న 30 హోర్డింగులను తొలగించడం, ట్రాఫిక్ అంతరాయంగా నిలుస్తున్న ఆవులను తరలించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల పక్కన పాత వాహనాలు వదిలిపెట్టడం వల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు పారిశుద్ధ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయి అన్నారు. ప్రధాన రహదారులు, కూడళ్ళ వద్ద చాలా కాలంగా నిరుపయోగముగా వదిలివేసే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వలన ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు ప్రకారం రోడ్ల పక్కన పాత వాహనాలు వదిలే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రఘువీర్ విష్ణు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, పట్టణ సీఐ నాగరాజు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఏ రాంబాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎం.శ్రీలక్ష్మి, మున్సిపల్ ఇంజనీర్స్ తాతబ్బాయి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి



**మండపేట (మనసులో మాట ) మార్చ్ 6..** మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలోని చినద్వారపుడి లో పంచాయతీకి చెందిన చెరువుగట్టులో ఉన్న వృక్షాలను నరికిన అక్రమార్కులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ద్వారపూడి పంచాయతీ సభ్యులు చెల్లుబోయిన సత్యవతి,కడలి శ్రీను, చెల్లుబోయిన దుర్గా ప్రసాద్ లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ద్వారపూడి పంచాయతీ కార్యదర్శి ఆకుల వీర వెంకటరమణకు ఫిర్యాదు అందజేశారు. పంచాయతీకి చెందిన చెట్లను తొలగించే హక్కు వారికి ఎవరిచ్చారని నిలదీశారు. పంచాయతీ అనుమతులు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. ఎలాటి అనుమతులు లేవని కార్యదర్శి ఆకుల రమణ పేర్కొన్నారు. తక్షణమే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి సంబంధిత నిందితులను గుర్తించి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము జిల్లా కలెక్టర్ కు స్వయంగా ఫిర్యాదు చేస్తామని, గ్రీన్ ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

### కిమ్స్ వైద్య కళాశాలలో ప్రధమ సంవత్సరం

## విద్యార్థులకు ఆత్మహత్య నివారణ గేట్‌కీపర్ శిక్షణ



**అమలాపురం (మనసులోమాట) మార్చి6:** కిమ్స్ వైద్య కళాశాలలో ప్రధమ సంవత్సరం విద్యార్థులకు డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ ప్రతినిధులు, భావోద్వేగ ఆత్మహత్య నివారణ గేట్‌కీపర్ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం కిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించినట్లు కిమ్స్ డీన్ డా.ఆనంద్ ఆచార్య తెలిపారు. మానసిక క్షోభకు గురైన వారిని తోటి విద్యార్థులు లేదా ఉపాధ్యాయులు వెంటనే గుర్తిస్తే ఆత్మహత్యలను ఆపగలమని ఆయన తెలిపారు. గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలలో 28 శాంతం ప్రధానంగా 15-39 సంవత్సరాల వయస్సు గల వారి ఆత్మహత్యలు భారత దేశం లోనే జరుగుతున్నాయని, ఈ ఆత్మహత్యలు ప్రతి సంవత్సరం 4 శాతం పెరుగుతూ, 2022లో 1.71 లక్షల మంది, 2019లో 10,335 మంది, 2020లో 12,526 మంది, 2021లో 13,000 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు కిమ్స్ వైస్ ప్రిన్సిపాల్ డా.రేణు సులఖే తెలిపారు దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో 120కి పైగా వైద్య విద్యార్థుల ఆత్మహత్యలకు పాల్పడ్డారని, వారిలో చాలామంది హెచ్చరిక సంకేతాలను ప్రదర్శించారని, కొందరు మరణానికి ముందు మానసిక వైద్య సహాయం కోరుతున్నారని కిమ్స్ మానసిక వైద్య విభాగాధిపతి డా. అబ్దుల్ సలాం తెలిపారు. పరీక్షలలో ఒత్తిడి నిర్వహణ, మానసిక క్షోభకు సంబంధించిన హెచ్చరిక సంకేతాలను గుర్తించడం మరియు సహాయం కోరడం, భావోద్వేగ ప్రథమ చికిత్స అందించడం సానుకూల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ద్వారా, అటువంటి లక్షణాలను ముందుగా గుర్తించి తగిన సహాయాన్ని అందించడం, ద్వారా అనేక మంది విద్యార్థుల ప్రాణాలను కాపాడగలమని డా.సలాం తెలిపారు. ఇటువంటి మానసిక క్షోభకు గురైన వారికి సహాయం కోసం హెల్ప్ లైన్ నెంబర్ 14416 ఏర్పాటు చేయబడినదని దీనిపై విద్యార్థులందరికీ అవగాహన కల్పించాలన్నారు. డా. ఎన్.టి.ఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, ఆంధ్రప్రదేశ్ మరియు ~ూ=× ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ల మధ్య 5 సంవత్సరాల అవగాహన ఒప్పందంలో భాగంగా మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు మానసిక మరియు ఆత్మహత్యల బాధను ఎదుర్కొంటున్న విద్యార్థుల కోసం ముందస్తు గుర్తింపులో శిక్షణ ఇవ్వడం తద్వారా ఆత్మహత్యలను నివారించడం ఈ కార్యక్రమ లక్ష్యమని ఈ శిక్షణ కార్యక్రమ సమన్వయ కర్త డా.రేఖా కుమారి తెలిపారు. ఇప్పటివరకు, 2023 నుండి ఏపిలో 10,వేల మంది మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులు ఈ ఆత్మహత్య నివారణ గేట్‌కీపర్ శిక్షణను పొందారని డా.రేఖా కుమారి తెలిపారు. యూనివర్సిటీ నుండి డా.తేజోవతి , డా. గిరీష ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 200 మంది కిమ్స్ ఎం.బి.బి.ఎస్. ప్రధమ సంవత్సరం విద్యార్థులు మరియు వైద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇటువంటి ఉపయోగకరమైన కార్యక్రమాల నిర్వాహకులను కిమ్స్ చైర్మన్ కె.వి.వి.సత్యనారాయణ రాజు ఎం.డి రవి కిరణ్ వర్మ లు అభినందించారు.

## విద్యార్థుల మానసిక స్థైర్యంపై కౌన్సెలింగ్




**ముమ్మిడివరం(మనసులో మాట ) మార్చి 6..** పశ్చిమాసియా దేశాలైన గల్ఫ్ లో నెలకొన్న యుద్ధ వాతావరణ పరిస్థితుల్లో బాధిత విద్యార్థుల కుటుంబ సభ్యులు ఆత్మస్థైర్యం తో మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ప్రభాకర్ సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక డాక్టర్ ఎం జి ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం లోని డిగ్రీ కళాశాల కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం "గల్ఫ్ సంక్షోభ ప్రాంతాలలో ఉన్న కుటుంబ సభ్యులు ఆందోళనలో ఉన్న విద్యార్థులకు సంరక్షణ మరియు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాల విద్యార్థులు మానసిక ధైర్యం పెంపొందించుకుని, ఆత్మవిశ్వాసంతో మానసిక ఆందోళనలను అధిగమించి చదువుపై దృష్టి సారించాలని మార్గనిర్దేశం చేశారు. అనంతరం బాధిత కుటుంబాలకు చెందిన విద్యార్థులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారికి దిశానిర్దేశం చేశారు. బాధిత కుటుంబ సభ్యులు అవసరమైన సమాచారం మరియు సహాయం తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్ లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె చిట్టిబాబు, ఐ క్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్ తులసి లక్ష్మీ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యేలు పిల్లి దంపతులు



**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..** కాకినాడ రూరల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు విజయవాడలోని సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ను మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమై అసంపూర్తిగా మిగిలిపోయిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ ను కూడా వారు మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఇదే సందర్భంగా పురపాలక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ ను కూడా పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి దంపతుల వెంట మాజీ జడ్పీటీసీ బుంగా సింహాద్రి, క్లస్టర్ లు తాతపూడి రామకృష్ణ, కొమరిశెట్టి నరసింగ రావు తదితరులు ఉన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం



**తాళ్ళరేవు (మనసులో మాట) మార్చి 06:** లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని, లింగ వివక్ష చూపిన వారికి కఠిన శిక్షలు తప్పవని ఐసిడిఎస్ సిడిపిఓ తెలిపారు. కాకినాడ జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీ ఆదేశాల మేరకు తాళ్ళరేవు మండలం జార్జ్పేట శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ చిన్నబాబు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్న బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2026 పురస్కరించుకొని జిల్లాస్థాయి, మండల స్థాయిలో ఈ నెల 2 నుండి 20 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సురక్షిత, మాతృత్వం ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ నిభావాని మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం డి ఆర్ డి ఏ వెలుగు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్స్ కనకరత్నం నాగలక్ష్మి మాట్లాడుతూ ఐసిడిఎస్ అందించే సేవలు గురించి స్త్రీలు కుటుంబానికి పెద్దదిక్కుగా ఉంటూ కుటుంబాన్ని నడిపించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ట్ ఎన్జీవో నూకరత్నం, పారా లీగల్ వాలంటీర్స్ అబ్దుల్, మల్లికార్జున, ఆశా వర్కర్లు అంగన్వాడీ వర్కర్స్, స్థానిక మహిళలు, మండల యానిమేటర్సు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల మధ్యలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుపై స్థానికుల ఆగ్రహం



**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..** 13వ డివిజన్ సాంబమూర్తి నగర్ రెండవ వీధిలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుపై స్థానిక సాంబమూర్తి నగర్ జ్యోతుల కాలనీ రెవెన్యూ కాలనీ వెంకటేశ్వర కాలనీ వాసులకు చాలా అసౌకర్యంగా ఉంటుందని అదేవిధంగా అటుగా క్రిస్టియన్ బరీలు గ్రౌండ్ మరియు ముస్లిం బరిల గ్రౌండ్ అదేవిధంగా రామాలయం సాయిబాబా టెంపుల్ కనకదుర్గ అమ్మవారి టెంపుల్ శివాలయం కృష్ణలయం వెంకటేశ్వర టెంపుల్ అన్ని ఆ రోడ్డు గానే వెళ్లాలి అదేవిధంగా బ్రిడ్జి డౌన్ గా ఉండడంతో అక్కడ రానుబోను ట్రాఫిక్ జామ్ కూడా ఎక్కువగా ఉండడంతో అదేవిధంగా ఆదిత్య మహిళా డిగ్రీ కాలేజ్ నారాయణ శ్రీ చైతన్య వంటి ఉన్నతమైన కాలేజీ పిల్లలందరూ కూడా అదే రూటు లో వెళ్లడం జరుగుతూ ఉంటుంది అదేవిధంగా ఈఎస్ఐ హాస్పిటల్ 100 అడుగుల దూరంలో ఉండడం వల్ల ఆస్పత్రికి వచ్చే పేషెంట్స్ గాని వాళ్లు కూడా ఉన్న అటెండర్స్ కూడా చాలా ఇబ్బందికరంగా ఉంటుంది అదేవిధంగా సాంబమూర్తి నగర్ ఇండస్ట్రియల్ కానీ కమర్షియల్ కాంప్లెక్స్ కూడా అతి తక్కువగా ఉన్న ప్లేస్ అక్కడ అంతా కూడా గృహిణిలు ఉద్యోగులు తప్ప మరొకరు ఎవరు అక్కడ ఉండరు కనుక ఆ ప్రాంత వాసులందరూ కూడా దీని వ్యతిరేకిస్తున్నట్లు 13వ డివిజన్ ఇంచార్జ్ గాది శివరామకృష్ణ మరియు మహిళా మండలి సభ్యులు మీడియాతో తెలియజేశారు దాని నిమిత్తమే ఈరోజు అనగా శుక్రవారం సాయంకాలం నాలుగు గంటలకు ధర్నా నిర్ణయించబడుతుందని మీడియా వారి కి తెలియజేయడం మైనది.



### పాలకొల్లు టౌన్ రైల్వే గేటు ఆర్‌యుబి నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేసి

## నివేదికలను వెంటనే సమర్పించాలి

### - జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు ఆదేశించారు

పాలకొల్లు, (మనసులో మాట) మార్చ్ 5 : పాలకొల్లు పట్టణంలో రైల్వే గేటు సంబంధించిన ఆర్ యు బి నిర్మాణానికి సంబంధించి శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, రెవిన్యూ, రైల్వే, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖ అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించి సంబంధించిన మ్యాప్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ యు బి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ మరియు భవనాలు తొలగింపులు సంబంధించిన నష్టపరిహారాలు అంచనాలను త్వరితగతిన తయారుచేసి వెంటనే సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రాజెక్ట్ అమలు వేగవంతంగా చేయడానికి అవసరమైన భూములు వివరాలు సమగ్రంగా సేకరించి నష్టపరిహారం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భవనాల తొలగింపునకు ముందు చట్టబద్ధమైన ప్రక్రియను పాటించాలన్నారు. ప్రక్రియను త్వరగా పూర్తిచేసి నివేదికలను వెంటనే సమర్పించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం పాలకొల్లు తహాసిల్దార్ కార్యాలయమును జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాలకొల్లు టౌన్ కు సంబంధించి 22- ఎ నిషేధిత జాబితాల లో పెట్టినటు వంటి ఆస్తులుకు సంబంధించి జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంలో ఆర్డిఓ దాసిరాజు తహాసిల్దార్ వై.దుర్గా కిషోర్, ఆర్ అండ్ బి ఇఇ ఏ.శ్రీనివాస్, మున్సిపల్ రిజిస్ట్రేషన్, రైల్వే శాఖ అధికారులు ఉన్నారు.

### జగన్నాధపురం ఆదిత్య పాఠశాలలో

## అవిన్య అకాడమిక్ ఫేర్వెల్



**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..** స్థానిక జగన్నాధపురం ఆదిత్య పాఠశాలలో అవిన్య అకడమిక్ ఫెయిర్ తాడి గణపతి సుబ్బారావు( ఎంఇఓ-1) కాకినాడ చేతుల మీదుగా ఘనంగా శుక్రవారం ప్రారంభమైనది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థులలో వివిధ నైపుణ్యాలు, సైన్స్ పట్ల పూర్తి అవగాహన కలుగుతాయని, ఇవి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మరియు సమాజం పట్ల వారి బాధ్యతను తెలియజేస్తాయని తెలిపారు. ఈ అకడమిక్ ఫెయిర్ నందు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మేథ్స్, సైన్స్, సోషల్ కు సంబందించి సుమారు 250 ప్రాజెక్టులను ను ఎల్.కే.జి నుంచి 9 వ తరగతి వరకు సుమారు 900 మంది విద్యార్థులు వారి ఉపాధ్యాయుల పర్యవేక్షణలో స్వయంగా తయారుచేసి, ప్రదర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శృతి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న వివిధ నైపుణ్యాలను వెలికి తీసి, వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పడడానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని, ఈ అవిన్య 2.0 విద్యార్థుల తల్లిదండ్రులందరిని 6,7 వ తారీఖులలో రావల్సినదిగా ఆహ్వానిస్తున్నామని తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుప్రజారాణి మాట్లాడుతూ విద్యార్థులలోని నైపుణ్యాలను వారిలో నిగూఢమైన శక్తిని వెలికి తీసి వారి సర్వతాముఖాభివృద్ధికి కృషి చేయడమే మా ధ్యేయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్, సత్యనాగవేణి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కార ధ్యేయంగా

## ప్రజా దర్బార్



**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..** కాకినాడ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. 44 వ వారపు ప్రజా దర్బార్ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుల కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణ్ మూర్తి పార్టీ నాయకులతో కలిసి అర్జిదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కాకినాడ జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను తెలియజేశారు. ముఖ్యంగా సీఎంఆర్ఎఫ్ సహాయం, పెన్షన్లు, తల్లికి వందనం పథకం, ఉపాధి అవకాశాలు, రేషన్ కార్డులు, ఇల్లు పట్టాలు వంటి పలు అంశాలపై అర్జీలు సమర్పించారు. అర్జీలను పరిశీలించిన కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణ్ మూర్తి వాటిని సంబంధిత అధికారులకు పంపించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అర్జిదారులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, నాయకులు న్యూటన్ ఆనంద్, జొన్నూరు బాబ్జి, గింజల శ్రీనివాస్ ,సిరియాల కొండబాబు, సురేష్ ,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రాజీనామా చేయాలి

- ప్రభుత్వ ఉద్యోగులును సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటారా?
- వేట్లపాలెం పేలుడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలి
- త్వరలో ముఖ్యమంత్రి ని కలవనున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్

**కాకినాడ (మనసులో మాట ) మార్చి 6..** సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో శ్రీ సూర్య ఫైర్ వర్క్స్ భారీ పేలుడు ఘటనలో సంఘటన స్థలంలో 20 మంది చనిపోగా ఇప్పటివరకు మరో ఎనిమిది మంది వైద్య చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించారు. మరో ఇద్దరు పరిస్థితి కూడా ఇంకా విషమం గానే ఉంది.ఇది ఎంతో బాధాకరమైన సంఘటన కు భాధ్యత వహిస్తూ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రాజీనామా చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు

ఈ సందర్భంగా ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ ఈ ఘటనలో చనిపోయిన వారిలో 17 మంది దళితులు, ఎనిమిది మంది బీసీలు, మిగిలిన ఇతర కులాలకు చెందిన వారు ఉండగా వీరిలో 12 మంది మహిళా కార్మికులు చనిపోవడం మరో మహిళా కార్మికురాలు ఇక ఆసుపత్రిలోనే విషమంగా ఉండడం ఎంతో విచారకరం అని మధు అన్నారు

సాక్షాత్తు హోం మంత్రి అనిత అసెంబ్లీలో మాట్లాడుతూ ఎనిమిది మంది కార్మికుల పని చేయాల్సిన చోట 40 మందితో పని చేయిస్తున్నారని అవి కూడా పని అనుభవం లేని వారితో చేయిస్తున్నారని 15 కేజీలు ఎక్స్పోజర్ ఉండాల్సిన చోట మూడు రెట్లు అధికంగా ఉన్నాయని స్వయంగా అసెంబ్లీలో మంత్రి ప్రకటించారని అన్నారు అంతేకాకుండ సంఘటన స్థలానికి ముఖ్యమంత్రి వచ్చి ఎక్స్గ్రేషియా ప్రకటించారని ఉద్యోగస్తులను సస్పెండ్ చేసి చేతి దులుపు కోవడం సరికాదన్నారు అధికారులది ఎంత తప్పు ఉందో పాలకులది కూడా అంతే తప్పు ఉందని అని మధు అన్నారు అసలు ఎనిమిది మంది పనిచేయాల్సిన చోట 30 మంది ఎలా పనిచేస్తున్నారు. అది కూడా పని అనుభవం లేని కార్మికులను ఎలా పెట్టారని దీనంతటికీ కార్మిక శాఖ మంత్రి ఎవరైతే ఉన్నారో ఆయన బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేయాలని మధు డిమాండ్ చేశారు. భాదిత కుటుంబాలకు 50 లక్షలు చెల్లించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తూ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య త్వరలో ముఖ్యమంత్రి ని కలుస్తారని ఆయన అన్నారు

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు అవగాహన సదస్సు



**రౌతులపూడి, (మనసులో మాట) మార్చి 06:** ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా రౌతులపూడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గర్భిణీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు ఎటువంటి పోషక ఆహారం తీసుకోవాలి ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో మొదలకు విషయాలపై వెంకటలక్ష్మి గర్భిణులకు వివరించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ పౌష్టికరమైన ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ మరియు తల్లి ఆరోగ్యకరంగా ఉంటారని కనుక ప్రతి ఒక్కరూ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఆమె తెలిపారు. అనంతరం గైనిక్ డాక్టర్ సౌమ్య గర్భిణీలకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సూపర్డెంట్ ఉమామహేశ్వరరావు రెడ్డి, రత్నకుమారి, మరియు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పట్టణ ప్రాంతాల్లో చేపట్టిన ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ పనులను పరిశీలన

### - జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్






**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..** కాకినాడ జిల్లా వివిధ పట్టణ ప్రాంతాల్లో చేపట్టిన ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి పరిశీలించారు.

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని కాకినాడ సామర్లకోట కెనాల్ రోడ్ ఇంద్రపాలెం, ప్రతాప్ నగర్ జంక్షన్ మీదుగా సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం మండలం కుమారపురం, గొల్లప్రోలు పట్టణాల్లో రోడ్డుకు ఇరువైపులా ప్రదేశాలను శుభ్రపరిచేలా చేపట్టిన పారిశుధ్య పనులు జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పట్టణాల్లోకి ప్రవేశించే మార్గాలకు మీరు ప్రక్కల ఎప్పటి నుంచో పేరుకు పోయిన చెత్త, పిచ్చి మొక్కలు, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్న పనులను పరిశీలించారు. అధికారంతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్నిచోట్ల పారిశుధ్య పనుల్లో పురోగతి కనబడకపోవడంతో జిల్లా కలెక్టర్ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. పట్టణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించే ఉద్దేశంతో జిల్లాలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టడం జరిగిందన్నారు. ఈ పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసు కోవాలన్నారు. రోడ్డుకు ఇరుపక్కల చెత్త పేరుకుపోకుండా తరచూ శుభ్రపరిచేలా అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. పట్టణాల్లో శుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు చేపట్టిన ఈ పారిశుద్ధ్య పనులు వేగవంతం చేసి పనులలో పురోగతి కనబరచాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ పారిశుద్ధ్య పనుల నిర్వహణలో అలక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలన లో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ నగర పాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరావు, ఎంహెచ్వో డా.పృథ్వీచరణ్, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు పురపాలక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## 200 యూనిట్ల ఉచిత విద్యుత్ను నాయీ బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలి

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్.. - రుద్రకోటి సదాశివం పిలుపు



**కాకినాడ (మనసులో మాట) మార్చి 6 ..** ఆంధ్ర రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన 22 నెలల పాలనలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఇందులో భాగంగానే సెలూన్ షాపులకు 150 యూనిట్లు ఉచిత విద్యుత్తు 200 యూనిట్లకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసిందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం చెప్పారు. గురువారం కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం కాకినాడ లో విస్తృతంగా పర్యటించారు. కాకినాడలో సెలూన్ షాపులను సందర్శించి 200 యూనిట్లు ఉచితం విద్యుత్ అమలవుతున్న తీరును పరిశీలించారు. ఈసందర్భంగా విలేకరులతో కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అధోగతిపాలైందని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పుల ఊబిలో చిక్కుకున్న రాష్ట్రాన్ని ప్రగతి వైపు పరుగులు పెట్టిస్తూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తెలియజేశారు. ఇందులో భాగంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రజలు సైతం సంతృప్తిగా ఉన్నారని వెల్లడించారు. 2026- 27 బడ్జెట్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయించడం జరిగిందని తెలియజేశారు. గత బడ్జెట్లో కన్నా ఈ ఏడాది నిధులు శాతం పెంచడం హర్షిణీయమన్నారు. వీటిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు అసత్యాలను ప్రచారం చేస్తూ తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమవుతుందని చెప్పారు. దీనికి తోడు దేవాలయాల పాలక మండళ్లలో నాయీ బ్రాహ్మణులకు ఒకరికి అవకాశం కల్పించడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. అంతేకాకుండా దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు 25 వేలు రూపాయలు వేతనం ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి కి ఆదరణ 3 కింద అధునాతన పరికరాలను త్వరలో అందించనుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో బీసీల రక్షణకు కూటమి ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకురానుందని తెలియజేశారు. కాకినాడ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు వేపాడ శ్రీనివాసరావు, సెక్రెటరీ తానవరపు సాయిబాబా, కేశవరపు ప్రసాద్, రమేష్, సతీష్, ఎం దుర్గారావు, బి జానకి రామ్, పట్నాల శ్రీను, సిహెచ్ మురళి, పి సురేష్, కాజా ప్రసాద్, డిటిఎస్ పాల్గొన్నారు

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ దంత వైద్యుల దినోత్సవం

### డాక్టర్ అడ్డాల సేవలు ఆదర్శనీయం - అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు




**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..** కాకినాడ స్థానిక లక్ష్మీనారాయణ నగర్ లో ఉన్న ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ దంత వైద్యుల దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రి కళాశాలలో జాతీయ దంత వైద్యుల దినోత్సవం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ దంత వైద్య నిపుణులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ నోటి పరిశుభ్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. తదుపరి అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు మాట్లాడుతూ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ గత మూడు దశాబ్దాలుగా ఆయన స్థాపించిన శ్రీ సత్య దంత వైద్యశాలలో అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నే, కాకినాడ మరియు పరిసర గ్రామ ప్రాంతాల్లో ఎన్నో వైద్య శిబిరాలు నిర్వహించి ఎంతో మంది కి దంత వైద్య సంరక్షణ పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఆయన దంత వైద్య ప్రతిభ మరియు సామాజిక సేవలకు గాను మన రాష్ట్ర ప్రభుత్వంచే రెండు సార్లు ఉత్తమ దంత వైద్యునిగా ప్రశంస పత్రాలు, అలాగే జాతీయ స్థాయిలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జాతీయ సమావేశాలలో నాలుగు సార్లు ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. ఆదిత్య కళాశాలవిద్యార్థులకే కాకుండా కళాశాల ఎన్ఎస్ఎస్ ద్వారా ప్రత్యక్ష శిబిరాలు ఏర్పాటు చేసినప్పుడు దత్తత గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాల ద్వారా గ్రామ ప్రజలకు రెండు దశాబ్దాలకు పైగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారని అన్నారు. తన వృత్తి తో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ అడ్డాల సేవలు ఆదర్శనీయమని డాక్టర్ నాయుడు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ అడ్డాలను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, , ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, డి అశ్విని మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థినీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన మహిళా పోలీసులు



**కోటనందూరు( మనసులో మాట) మార్చి 6..** కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఆదేశాల మేరకు, తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. చెన్నకేశవరావు పర్యవేక్షణలో, కోటనందూరు ఎస్ఐ టి. రామకృష్ణ ఆధ్వర్యంలో మహిళా పోలీసులు మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోటనందూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్లిపూడి గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థినీలకు పోక్సో చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టం వంటి బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలపై తమ మహిళా సిబ్బంది అవగాహన కల్పించారనీ అలాగే విద్యార్థినీలు తమ హక్కులు, భద్రత, మరియు ఎటువంటి సమస్యలు ఎదురైనా పోలీసులను సంప్రదించాల్సిన అవసరంపై వివరించారనీ తెలియజేశారు.

ఇక త్వరలో జరగబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు దృష్టిలో పెట్టుకొని చదువుతున్న విద్యార్థినీలకు ప్రోత్సాహం కల్పించే ఉద్దేశంతో, సుమారు 40 మంది విద్యార్థినీలకు ఉచితంగా రైటింగ్ ప్యాడ్‌లు (ప్లాంకులు) అందజేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి రాజేశ్వరి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది మరియు విద్యార్థినీలు పాల్గొన్నారు.



## కాకినాడ జిల్లాలో పకడ్బందీగా జనగణన

### శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్..

**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 16వ జనాభా గణన ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ వివేకానంద హాల్ లో ఏర్పాటు చేసిన మొదటి దశ 'గృహాల జాబితా, గృహ వసతుల గణన' శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పాల్గొని, శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ మార్చి 6 నుండి 8 వరకు మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ శిక్షణలో జనగణన డేటా సేకరణపై అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. మన గణన మన భవిష్యత్తు అనే నినాదంతో జరుగుతున్న ఈ మహా యజ్ఞం దేశ ప్రగతికి దిక్సూచి వంటిదని, సేకరించే ప్రతి అంకె అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు పునాది అని ఆయన స్పష్టం చేశారు. గృహ నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్డి, విద్యుత్, ఇంటర్నెట్ వంటి 33 కీలక అంశాలపై సమగ్ర సమాచారం సేకరించాల్సి ఉంటుందని, సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడం చట్టరీత్యా బాధ్యతని జేసీ అపూర్వ భరత్ స్పష్టం చేశారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.తిప్పేనాయక్, జనగణన జాయింట్ డైరెక్టర్ సాయి శేకర్, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో పీత్రినాథ్, ఏడీసీ కేపీ. సుధాకర్, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు కలెక్టరేట్ వివిధ విభాగాల అధిపతులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వాన్ని చాటుకుంటున్న దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ వారు



**భీమవరం, (మనసులో మాట) మార్చి 5 :** పశ్చిమగోదావరి జిల్లా చిన్నమీరం విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడైన నాగవర్ధిరాజు భీమవరం మండల అధ్యక్షుడు అశోక్ కలిసి పరీక్ష ఫ్యాడ్లు అందజేసినారు. ఈ దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ సుమారు 12 ఏళ్లుగా అనేక ధార్మిక కార్యక్రమాలు చేస్తూ అందులో భాగంగా పేద విద్యార్థులకు పుస్తకాలు ప్రతి సంవత్సరం ఫ్యాడ్లు అందజేస్తూ వస్తుందని, ఈనాటి విద్యార్థి విద్యార్థులకు స్వదేశీ భావజాలం చాలా అవసరం అని, అలా లేకపోతే దేశ విద్రోహ శక్తులతో కలిసి దేశద్రోహులుగా మారే అవకాశం ఉందని అందువలన స్వదేశీ భావజాలం కలిగి దేశం పట్ల ప్రేమ అభిమానాలు కలిగి ఉండాలని అన్నారు. ఈనాటి విద్యార్థులు దేశ భవిష్యత్తును నిర్మించే పనిలో భాగస్వాములు కావాలని అందుకు చదివే ఉత్తమ మార్గం అని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ ప్రిన్సిపాల్ ఓంకార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## "బోన్ మారో" తో బాధపడుతున్న ముంకాల గీతిక సాయి హర్ష కు ఆర్థిక సాయం

### - అందించిన శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు



భీమవరం, (మనసులో మాట) మార్చ్ 5 : బోన్ మారో సమస్యతో బాధపడుతున్న బాలుడు ముంకాల గీతిక సాయి హర్షకు సహాయం అందించేందుకు భీమవరం శ్రీ ఆదిత్య డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ముందుకు వచ్చారు. బాలుడి చికిత్స కోసం విద్యార్థులు స్వచ్ఛందంగా నిధులు సేకరించి మొత్తం రూ. 48,230/- మొత్తాన్ని బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ. అనూరాధ, వైస్ ప్రిన్సిపాల్ బి. మావుళ్లు, ఎన్. ఎస్. ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం అధ్యాపకులు లక్ష్మీకాంత్, లక్ష్మీ సుధా పాల్గొని విద్యార్థుల సేవాభావాన్ని అభినందించారు. సమాజంలో అవసరమైన వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సామాజిక బాధ్యతను చాటుతూ బాలుడి త్వరితగతిన ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కాకినాడ లో ఉత్సాహంగా జనసేన సభ్యత్వ నమోదు



**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..** జనసేన పార్టీ ఐదో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం కాకినాడ లోని రమణయ్య పేట లో గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక వేత్త వి. సుభాకర్ మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతం చేయాలన్నారు. జనసేన పార్టీ కార్యకర్తల సంక్షేమమే పరమావధిగా చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మంగా తీసుకొని ఉద్యమం గా చేపట్టాని ఆయన అన్నారు. గత నెల 26 తేది న ప్రారంభమైన సభ్యత్వ నమోదు ఈనెల 10 వరకు జరుగనుందని అన్నారు .అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఒక పండుగ వాతావరణంలో సభ్యత్వం తీసుకోవడం పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిబద్ధతకు నిదర్శనమని సుభాకర్ తెలిపారు. పార్టీ నాయకులు తాటికాయల వీరబాబు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ ,ఎస్. శ్రీ నగేష్ ,శిరీష, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, ఎన్ .వెంకటేశ్వరరావు, పి. ధర్మచంద్ర రాజు ,సిహెచ్. సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, రాజా శ్రీలక్ష్మి ,విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక



## వాలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**తాళ్లరేవు (మనసులో మాట) మార్చి 06:** గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం వాలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని విశ్వజన కళామండలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు యడ్ల కుటుంబరావు కోరారు. (20192024) కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ / వార్డ్ వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని మొత్తం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,56,000 వరకు వాలంటీర్లు పనిచేశారనీ తెలిపారు. ప్రతి వాలంటీర్‌కు సుమారు 50 ఇళ్ల బాధ్యత ఇచ్చి వారికి నెలకు రూ. 5,000 గౌరవ వేతనం ఇచ్చేవారని, పింఛన్లు, రేషన్, పథకాల సమాచారం వంటి 25కి పైగా ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే అందించడమే ఈ వ్యవస్థ లక్ష్యంగా పనిచేసేవారన్నారు. గత 2024 ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం వాలంటీర్లు గా పనిచేసిన వారిని వాలంటీర్లుగా కొనసాగిస్తామని, గౌరవ వేతనం పది వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. వాలంటీర్లు గా పనిచేసిన వారందరూ ప్రస్తుతం సరైన ఉపాధి లేక, ప్రభుత్వం వాలంటీర్లను కొనసాగిస్తాం అనే తీపి కబురు వస్తుందని ఎదురు చూస్తున్నారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాలంటీర్లు విషయం లో మాట్లాడడం లేదని, దీనిపై పునరాలోచన చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వాలంటీర్లను కొనసాగిస్తూ వారికి గౌరవ వేతనం పది వేల రూపాయలు ఇచ్చి వారి సేవలను కొనసాగించాలని యడ్ల కుటుంబరావు ప్రభుత్వాన్ని కోరారు.

## బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులుకి చిట్టా మధు అభినందనలు..



**పిఠాపురం (మనసులో మాట) మార్చి 6:** కాకినాడ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులుగా గొల్లప్రోలు పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు మలిరెడ్డి నారాయణరావు, బుర్రా సీతారామాంజనేయులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా గొల్లప్రోలు పట్టణ బీజేపీ అధ్యక్షుడు చిట్టా మధు వారిని కలిసి అభినందనలు తెలిపారు.

అనంతరం మధు మాట్లాడుతూ.. పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడుతున్న సీనియర్లకు సముచిత స్థానం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ నాయకత్వాన్ని గుర్తించి ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు పి.ఎన్. మాధవ్, జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వీరి నియామకం పట్టణ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని ఆయన పేర్కొన్నారు.

## చట్టాలు పక్కన పెట్టి... వృక్ష సంపద నాశనం...

**- చిన ద్వారపూడి లో చెట్లు నరికివేత... పంచాయతీ చెట్లు అమ్ముకునేందుకు కుట్ర**

**- అడ్డుకున్న గ్రామస్తులు...**



**మండపేట( మనసులో మాట ) మార్చ్ 6..** ఒక వైపు చట్టాలు చెట్ల ను రక్షించాలని చెబుతుంటే మరో వైపు ప్రకృతి కి తూట్లు పొడుస్తూ వృక్షాలను అక్రమార్కులు అడ్డంగా నరికేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం ద్వారపూడి గ్రామపంచాయతీ పరిధిలో గల చిన్న ద్వారపూడి గ్రామంలో ఎన్నో సంవత్సరాల నుండి పంచాయితీ చెరువు గట్టు పై ఉన్న చెట్లు గత రెండు రోజులుగా నరికేస్తున్నారు. విలువైన ఈ కలప తరలించడానికి ప్రయత్నం చేసారు. దిన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. భారీ వృక్షాలను తొలగించి ట్రాక్టర్ పై విక్రయించే ప్రయత్నం చేయగా గ్రామస్తులు అడ్డుపడ్డారు. అసలు ఎవరికి అడ్డు లేని ఈ మహా వృక్షాలు నరికేశారు. దీనికి కారణాలు ఏమిటో పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని చెబుతున్నారు. కాగా గతం లో వృక్షాలు తొలగిస్తే ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం తో అక్రమార్కులు సులువుగా ఈ వృక్షాలు నరికి విక్రయిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఆక్వా సాగు చేసే చెరువులన్నీ ఏపి సడా చట్టం కింద నమోదు కావాలి

**- ఆక్వా రైతులకు రుణాలు, రాయితీలకు ఏపి సడా చట్టం కింద నమోదు తప్పనిసరి**

**- అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సమీక్ష**



**ఏలూరు, మార్చి , 6(మనసులో మాట)..** జిల్లాలో ఆక్వా సాగు చేసే చెరువులన్నీ 'ఏపి సడా' చట్టం కింద నమోదు కావాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం రెవిన్యూ, మత్స్య శాఖాధికారులతో ఏపి సడా చట్టం అమలుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఏపి సడా చట్టం కింద 64 వేల 193 ఎకరాలు నమోదు చేయవలసి ఉండగా, ఇంతవరకు కేవలం 4693 ఎకరాలు మాత్రమే నమోదు కావడంపై అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన చెరువుల వివరాలను ఏపి సడా చట్టం కింద వెంటనే నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్వా చెరువుల యజమానులు వివరాలను, ఆధార్ అనుసంధానం చేసి 'ఏపి సడా' చట్టం కింద నమోదు చేయాలనీ, ఇందుకోసం అదనపు సిబ్బందిని కూడా డెప్యూటేషన్ పై అందిస్తామని కలెక్టర్ చెప్పారు. సన్న, చిన్నకారు ఆక్వా రైతులకు రుణాలు, రాయితీలు అందించేందుకు ఏపి సడా చట్టం కింద నమోదు తప్పనిసరన్నారు. మండలాల వారీగా ఆక్వా సాగు విస్తీర్ణంను గుర్తించి మత్య శాఖాధికారులు సర్వే రెవిన్యూ శాఖాధికారులతో సమన్వయము చేసుకుని నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని కలెక్టర్ మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు.

## మరిడమ్మ తల్లికి స్వర్ణ పుష్పాభిషేకం



**పెద్దాపురం (మనసులో మాట) మార్చి 6;** యావత్ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ తల్లికి శుక్రవారం వెండి, స్వర్ణ పుష్పాలతో విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అర్చకులు విజయ్, నాని, ప్రసాద్ శర్మ, వెంకట శాస్త్రి, శంకర శాస్త్రి తదితర పండితులు మరిడమ్మ తల్లికి హరిద్రాభిషేకం, కుంకుమ పూజలు, వెండి, బంగారు పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. లోకకళ్యాణార్థం అమ్మవారికి విశేష పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయలక్ష్మి తెలిపారు. మరిడమ్మ తల్లిని దర్శించి, ప్రతి ఒక్కరు అమ్మ దయకు పాత్రులు కావాలని కోరారు. పూజల అనంతరం భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ ప్రతినిధులు రమణ, క్రాంతి, శివా తదితరులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు

## ఇంటర్ పరీక్షలలో ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా

# సిసి కెమెరాలతో నిఘా పెట్టాలి

**ఎక్కడైనా మాస్ కాపీయింగ్ జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్, కేంద్రం పర్యవేక్షకులపై చర్యలు**

**ఏలూరులోని పిడిబిటి కళాశాలలో ఇంటర్ పరీక్షల నిర్వహణను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**



**ఏలూరు, మార్చి , 6(మనసులో మాట)..** ఇంటర్ పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరగకుండా సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక అశోక్ నగర్ లోని పిడిబిటి కళాశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్షల నిర్వహణను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీ రూమ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఇంటర్ పరీక్షలను 130 కేంద్రాలలో ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 34,615 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రతీ పరీక్షా కేంద్రాల హాల్స్ లో సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటుచేయడం జరిగిందని, ఎక్కడైనా మాస్ కాపీయింగ్ జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్ పై చర్యలు తీసుకుంటామని, ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు పర్యవేక్షించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో సెల్ ఫోన్ లను ఎట్టిపరిస్థితులలోనూ అనుమతించవద్దన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్ నెట్ సెంటర్ల ను ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష ముగిసేవరకు ఆయా షాపులను మూసివుంచాలన్నారు. పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు, పారిశుద్యం ఏర్పాట్లను ప్రతిరోజు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ 08812-230197 ఫోన్ నెంబరుతో ఏర్పాటు చేయడం జరిగిందని, ఏదైనా సమస్య ఉంటె కంట్రోల్ ఫోన్ చేయవచ్చని కలెక్టర్ చెప్పారు. అనంతరం కళాశాలలోని సిసి కెమెరాల పర్యవేక్షణ విభాగాన్ని కలెక్టర్ పరిశీలించారు.

## ఓపెన్ హౌస్ నిర్వహించిన పల్నాడు జిల్లా పోలీసులు



**పల్నాడు, మార్చి 6, (మనసులో మాట):** మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం ఓపెన్ హౌస్ పల్నాడు జిల్లా పోలీసులు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు, నరసరావుపేట పోలీసు ప్రధాన కార్యాలయం నందు, పల్నాడు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల నందు సిఐ అండ్ ఎస్సై మహిళా దినోత్సవ వారోత్స వాలను ఘనంగా నిర్వహిస్తు న్నారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ ల నందు విద్యార్థినులకు ఓపెన్ హౌస్ నిర్వహణ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు పోలీస్ స్టేషన్‌లోని విభిన్న విభాగాల గురించి తెలిపారు. మహిళా భద్రత, అత్యవసర వ్యవస్థ, డయల్ 100/112, భద్రతా యాప్‌ల ఉపయోగం వంటి అంశాలపై వివరమైన అవగాహన కల్పించారు. పోలీసులు తమ విధుల్లో ఉపయోగించే ఆధునిక ఆయుధాలు, తుపాకులు, పిస్టల్స్ గురించి, కమ్యూనికేషన్ పరికరాలు, సెఫ్టీ గాడ్జెట్‌లు, మిషనరీ సామగ్రి గురించి ప్రాక్టికల్ డెమో ద్వారా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెల్ప్‌లైన్ నంబర్లు, స్వీయరక్షణ పద్ధతులపై మెలుకువలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు పోలీసుల సేవలపై ప్రశ్నలు అడిగి, తమ సందేహాలకు సమాధానాలు పొందారు. మహిళా పోలీసులు సమాజ రక్షణలో పోషించే కీలక పాత్రపై అవగాహన పెంచడంతో పాటు, యువత కూడా భద్రతను కాపాడేందుకు చైతన్యం కలిగి ఉండాలని పోలీస్ అధికారులు సూచించారు. పోలీసు అధికారులు విద్యార్థినులకు నైతిక విలువలు, ధైర్యసాహసాలు, లైంగిక వేధింపులను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రేరణాత్మక ఉపన్యాసాలు ఇచ్చారు. మార్చి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ తరహా కార్యక్రమాలు మహిళలకు శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయరక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని పల్నాడు జిల్లా ఎస్పీ, తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు , సిబ్బంది, హై స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో ఏ ఆర్ అదరపు ఎస్పి వి.సత్తి రాజు, క్రైమ్ అదనపు ఎస్పీ లక్ష్మీపతి ,నరసరావు పేట మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుభాషిణి, అడ్మిన్ ఆర్ ఐ ఎం.కృష్ణ గా సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతపై విద్యార్థినీలకు అవగాహన : ఎస్సై .లక్ష్మీకాంతం



**ప్రత్తిపాడు, (మనసులోమాట) మార్చి 6..** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం విద్యార్థినీలకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతం మాట్లాడుతూ ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను గుర్తించి గౌరవించే రోజు అని, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, మహిళా సాధికారతను చాటడం, మహిళల హక్కుల గురించి అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమని విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్సైలక్ష్మీకాంతం బాల బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లల రక్షణకు ఉన్న చట్టాలు, ముఖ్యంగా ఫోక్సో చట్టం గురించి వివరించారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# కాకినాడ లో ఘనంగా దంత వైద్యుల దినోత్సవం

**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..** స్థానిక రమణయ్యపేట లో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ వైద్యుల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ముఖం నిండుగా అందంగా కనిపించాలంటే దంతాలు సక్రమంగా ఉండాలన్నారు. ముఖం అందంగా ఉండి పలువరస సక్రమంగా లేకపోతే ఆత్మ న్యూనతా భావానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ గత 30 సంవత్సరాలుగా కాకినాడ పరిసర ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి దంత వైద్యంపై అవగాహన కల్పించడంతో జాతీయ స్థాయిలో ఇండియన్ డెంటిస్ట్ సంఘం ఆధ్వర్యంలో నాలుగు సార్లు పురస్కారాలను అందుకున్నారని అన్నారు. అదేవిధంగా రెండుసార్లు ఉత్తమ దంత వైద్యునిగా రాష్ట్ర ప్రభుత్వం చే పురస్కారాలను అందుకున్నారని అన్నారు. డాక్టర్ సువర్ణ రాజు కూడా సేవా భావంతో స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే వైద్య శిబిరాలలో వైద్య సేవలు అందిస్తున్నారని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, డాక్టర్ సువర్ణ రాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్. శ్రీ నగేష్, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు,పి. ధర్మచంద్రరాజు, రాజా, పి. పార్థసారథి, పి. మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## దోమాడలో వైభవంగా వాసవి మాత ఆలయ శంకుస్థాపన



**పెదపూడి (మనసులో మాట) మార్చి 7;** పెదపూడి మండలం దోమాడ గ్రామంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఒబిలి శెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో వాసవి మాత నూతన ఆలయ నిర్మాణానికి కోలాహలంగా భూమి పూజ నిర్వహించారు. ఉట్రూమిల్లి గ్రామానికి చెందిన సూతపల్లి కాశి విశ్వనాథం దంపతులు అమ్మవారి ఆలయ నిర్మాణానికి 1.20 స్థలం, నగదు అందించారు. సూతపల్లి కాశీ విశ్వనాథం దంపతులు యజ్ఞకర్తలుగా వాసవి మాత ఆలయ నిర్మాణానికి మేళ తాళాలు మంగళ వాయిద్యాలు వేదమంత్రాలతో శంకుస్థాపన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా నేతలు పులవర్తి కుమార్, బచ్చు శేఖర్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండల నేతలు ఒబిలి శెట్టి రామకృష్ణ, సిరివి శెట్టి సూర్యప్రకాశరావు, ఒబిలి శెట్టి గోపాలకృష్ణ, మండలంలోని 18 గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య సంఘం నేతలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**నిరుపేద కుటుంబానికి 25 కేజీల బియ్యం నిత్యవసర సరుకులు**

## వృద్ధాశ్రమానికి పౌష్టికాహారం నిత్యవసర సరుకులు పంపిణీ




**ఆనపర్తి (మనసులో మాట) మార్చి 6:** అనపర్తి ఆత్మ కమిటీ చైర్మన్ వెలుగుబంటి సత్తిబాబు మనవడు, జి. దొంతమూరు గ్రామానికి చెందిన వెంకట శ్రీరామ్ కుమార్ తులసి గార్ల దంపతుల కుమారుడు, పెట్ల దేవాన్ష్ సాయి గోపాల్ పుట్టినరోజు సందర్భంగా రైజింగ్ హ్యాండ్స ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ, ఆధ్వర్యంలో గండ్రేడు మండలం బసవిరెడ్డి పేట కి చెందిన వంటరి మహిళా ఇద్దరి పిల్లల కుటుంబానికి 25 కేజీలా బియ్యం నిత్యవసర సరుకులు పంపిణి మరియు, అనపర్తి లో శ్రీ తేతలి రామిరెడ్డి మంగయమ్మ మహిళా వృద్ధాశ్రమం లో వృద్ధలకు పౌష్టికాహారం రస్కు, బిస్కెట్లు, నిత్యవసర సరుకులు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ నల్లమిల్లి ఆది రెడ్డి తదితరలు పాల్గున్నారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక



## ఎమ్మెల్యే ల ప్రజాదర్బార్ లో అందిన వినతుల పరిష్కారానికి అత్యంత

# ప్రాధాన్యత ఇవ్వాలి

- 10 సూత్రాలు, పీ4 కార్యక్రమాలు పూర్తి లక్ష్య సాధన చేయాలి
- జిల్లాలోని నియోజకవర్గాలను ర్యాంకింగ్ లలో ముందుస్థాయిలో ఉండేలా చూడాలి
- నియోజకవర్గ స్థాయిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి
- వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజలకు విస్తృత అవగాహన కలిగించి ప్రభుత్వ సేవలు వినియోగించుకునేలా చూడాలి
- జిల్లా అధికారులు, నియోజకవర్గ విజన్ యూనిట్ కార్యాలయాల ఇంచార్జ్ లతో జిల్లా కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్

**ఏలూరు, మార్చి , 6(మనసులో మాట)..** నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే లు నిర్వహించే 'ప్రజాదర్బార్' లో అందిన వినతులు నిర్దేశించిన సమయంలోగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి శుక్రవారం ప్రజాదర్బార్ లో వినతులు పరిష్కారం, 10 సూత్రాల అమలు, పీ4 కార్యక్రమం, వాట్సాప్ గవర్నెన్స్ , అంతర్జాతీయ మహిళా దినోత్సం నిర్వహణ, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ విజన్ యూనిట్ కార్యాలయాల అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే లు ప్రజాదర్బార్ లు నిర్వహించి ప్రజల నుండి పెన్షన్లు, భూ సమస్యలు, సామజిక సమస్యలపై వినతులను స్వీకరిస్తున్నారని, వాటి పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, నిర్దేశించిన సమయంలోగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ప్రతీ దశలోనూ సంబంధిత సిబ్బందితో నియోజకవర్గ విజన్ యూనిట్ కార్యాలయ సిబ్బంది పరిశీలించాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న 10 సూత్రాల కార్యక్రమాలను నూరు శాతం లక్ష్యాలను సాధించేలా అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలోని ప్రతీ నియోజకవర్గ స్థాయిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించేలా నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా దినోత్స కార్యక్రమంలో నిర్వహించే కార్యక్రమాలపై సంబంధిత ఎమ్మెల్యేతో చర్చించి కార్యక్రమాల ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు . నియోజకవర్గాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ర్యాంకింగ్ ఇస్తున్న దృష్ట్యా, సిబ్బంది 10 సూత్రాల కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు జరిగి, జిల్లాలోని ప్రతీ నియోజకవర్గం అభివృద్ధిలో ర్యాంకింగ్ లో ముందువరసలో ఉండేలా నియోజకవర్గ విజన్ యూనిట్ కార్యాలయ పర్యవేక్షించాలన్నారు. పీ4 కార్యక్రమంలో నూరు శాతం బంగారు కుటుంబాలను మార్గదర్శులతో అనుసంధానం చేయాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ అందిస్తున్న సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించి, ప్రజలు వినియోగించుకునేలా గ్రామ స్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.

## ఘనంగా కుమారస్వామి విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవము..



**పిఠాపురం, ( మనసులో మాట )మార్చి 6 :** పిఠాపురం పట్టణంలోని స్థానిక బస్టాండ్ సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కుమారస్వామి విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాత సురవరపు దివాణం ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

## 22ఏ భూ సమస్యల పరిష్కారం పై

# ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

- మార్చి నెలలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలి
- కోర్ట్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి.
- రెవిన్యూ కార్యక్రమాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి సమీక్ష



**ఏలూరు, మార్చి , 6 (మనసులో మాట)** జిల్లాలో 22ఏ భూ సమస్యలకు సంబంధించి అందిన విజ్ఞప్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రెవిన్యూ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయ గౌతమీ సమావేశమందిరంలో శుక్రవారం 22ఏ భూ సమస్యల పరిష్కారం, రీ సర్వే, ఆడంగల్ లో భూమి రికార్డునమోదు, కోర్ట్ కేసులు పరిష్కారం ,ఆర్ ఓ ఆర్, తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ తో కలిసి జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో నిషేదిత భూముల జాబితాలో జిరాయితీ భూములు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 22ఏ భూ సమస్యలకు సంబంధించి 229 విజ్ఞప్తులు అందగా వాటిలో 18 పరిష్కరించడం జరిగిందని, 10 కేసులు రిజెక్ట్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన విజ్ఞపులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. మార్చి నెలలో 2249 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేయవలసి ఉండగా, 2184 పాస్ పుస్తకాలు పంపిణీ చేశామని, మిగిలినవి రెండు రోజుల్లోగా పంపిణీ చేయవలసిందిగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో భూమి యాజమాన్యం, సాగు విస్తీర్ణం, హద్దులు, పట్టాదారు పాస్ పుస్తకాలు ఆర్ ఓ ఆర్ కు సంబంధించి ఏ ఒక్క అంశం పెండింగ్. లేకుండా త్వరిత గతిన పూర్తి చేయాలని లని జిల్లాకలెక్టర్ కె. వెట్రి సెల్వి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవిన్యూ శాఖలో కోర్ట్ కేసులకు సంబంధించి వాటికి వెంటనే కౌంటర్ వేయించాలన్నారు.
పీజీ ఆర్ఎస్ లో పెండింగ్ లో ఉన్న ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

# బిజెపి ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా నానాజీ, రాజు

- కంబాల సమక్షంలో వారికి ఘన సత్కారం



**గోకవరం (మనసులో మాట), మార్చి 6 :** మండల కేంద్రం గోకవరం గ్రామానికి చెందిన బత్తుల నరసింహ రావు (నానాజీ), బరకటి అనిల్ కుమార్ (కేబుల్ రాజు ) భారతీయ జనతాపార్టీ కాకినాడ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా నియమితులయ్యారు. వారిని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు గోకవరం సీఎండీ లే అవుట్ వద్ద శాలువాకప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. బత్తుల నానాజీ, కేబుల్ రాజులకు భారతీయ జనతా పార్టీలో అవకాశం కల్పించిన భారతీయ జనతా పార్టీ అధిష్టానానికి, రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, రాజమండ్రి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల కృష్ణ వర్మకి కంబాల శ్రీనివాసరావు , బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంబాల యువసేన అధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం, పెద్దాడ వెంకన్న దొర, దోసపాటి సుబ్బారావు, తాటికొండ సురేష్, సుజాత, నరేష్, మూర్తి, శ్రీను, అధిశేషు, త్రిమూర్తులు, రాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన

# నారీ మణులకు సన్మానం



**గోకవరం (మనసులో మాట), మార్చి 6 :** మానవ హక్కుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపాలెం లోని ఆర్ కన్వెన్షన్ హాల్ లో మానవ హక్కుల ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బోడపాటి దాసు ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ అధ్యక్షురాలు జి అర్చన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల ఫౌండేషన్ మహిళా విభాగ ఉపాధ్యక్షురాలు ఏనుముల రుక్మిణి, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ బొడ్డపాటి దాసు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ యస్ శాంతి బాయి, ప్రముఖ సిద్ధాంతి తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, న్యాయవాది శోభ, ఎన్. టి. ఆర్. జిల్లా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ అర్చన, ప్రముఖ గాయని యాంకర్ డాన్సర్ స్టేట్ బీకామ్. ఆర్డినేటర్ ఉషారెడ్డి, కాకినాడ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ రాజమాణిక్యం, అబ్రహం, రాజమండ్రి హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఎం ఎస్ ఎస్ కుమారి, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ పశ్చిమగోదావరి అధ్యక్షురాలు చండీరాణి, ప్రధాన కార్యదర్శి జయమణి, తూర్పుగోదావరి ప్రధాన కార్యదర్శి సువర్ణవేణి వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన సుమారు వందమంది మహిళలను సన్మానించారు. మానవ హక్కుల ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బత్తిన కు పౌర సన్మానం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తిన రామకృష్ణకు పౌర సన్మానం చేశారు. మానవ హక్కుల ఫౌండేషన్ మహిళా విభాగపు ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బొడ్డపాటి దాస్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తిన రామకృష్ణను మానవ హక్కుల ఫౌండేషన్ లో ఉన్న మహిళలంతా సాలువా కప్పి, పూలమాలలు వేసి కిరీటం పెట్టి పౌర సన్మానం చేశారు

# రవి సీజన్లో ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రణాళిక బద్ధంగా నిర్వహించండి...

- అధికారులను ఆదేశించిన జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్



**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..**కాకినాడ జిల్లాలో రబీ-2025-26 నుకు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. రబీ-2025-26 సీజన్ ధాన్యం సేకరణకు అనుసరించాల్సిన విధానాలపై రెవెన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాలు, మార్కెటింగ్, సహకార, ట్రాన్స్ పోర్ట్, లీగల్ మెట్రాలజీ, భారత ఆహార సంస్థ అధికారులు, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో శుక్రవారం కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ముందస్తు జిల్లా సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా, ధాన్యం సేకరణ కేంద్రాలు, సీఎంఆర్ రైస్, కనీస మద్దతు ధర వంటి అంశాలపై జాయింట్ కలెక్టర్ వారు అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ఇందుకు రెవెన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాలు, మార్కెటింగ్, ట్రాన్స్ పోర్ట్ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. రబీ- 2026 సీజన్‌లో గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ. 2,389 (75 కేజీలకు రూ.1792), సాధారణ రకం క్వింటాకు రూ. 2,369 (75 కేజీలకు రూ. 1,777) లుగా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఈ రబీ సీజన్లో 6,76,773 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనాకు గాను, స్థానిక వినియోగం నిమిత్తం 67,677ల మెట్రిక్ టన్నులు పోను సుమారు 6,09,096 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్ కు రానుందని తెలియజేశారు. ప్రస్తుతము కాకినాడ జిల్లాలో 225 రైతు సేవ కేంద్రముల ద్వారా ధాన్యము సేకరణ చేయుటకు జిల్లా అంతటా కొనుగోలు కేంద్రములు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపియున్నారు. ఈ సీజనులో ప్రత్యేకముగా మధ్యవర్తులు, దళారుల నుండి రైతులు నష్టపోకుండా 225 సాంకేతిక నిపుణులను (టీ ఏ ఎస్ ), 225 డేటా ఎంట్రీ అపరేటర్లను (డి ఈ ఓ ) మరియు 225 హెల్పర్లను రిక్రూట్మెంటు ద్వారా నియమించవలేనని, మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారులు (సి ఓ ఎస్ ) నియమించవలేనని మరియు వీరందరికీ ధాన్యం సేకరణపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వవలసినదిగా తెలిపియున్నారు. ముఖ్యముగా హమాలీలు, గోనె సంచులు మరియు రవాణా ఖర్చులు రైతే ఏర్పాటు చేసుకున్నట్లయితే, ధాన్యం నగదుతో పాటు ఈ ఖర్చులు కూడా వారి ఎకౌంటులోనే నేరుగా జమ అగునని మరియు రైతులకు 7337359375 వాట్సాప్ నెంబర్ ద్వార ఆర్ఎస్కేకి వెళ్ళనవసరం లేకుండా రైతే నేరుగా షెడ్యూలింగ్ చేసుకొనే అవకాశం కల్పించుట జరిగినదని. రైతులు సౌకర్యమును సద్వినియోగం చేసుకోగలరు ధాన్యము యొక్క తేమ శాతం నేరుగా రైతుల రిజిస్టర్ ఫోన్ నెంబర్ కి సందేశం రూపంలో వచ్చునని. మరియు ధాన్యం నాణ్యత విషయములో రైతులు, మిల్లర్లను సంప్రదించకుండా చూడవలెనని తెలిపియున్నారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు ధాన్యం సేకరణలో ప్రభుత్వ అధికారులతో సహకరించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా మిల్లర్ల ప్రతినిధులను కోరారు.

సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలుఎన్.శ్రీధర్, పౌర సరఫరాల సంస్థ మేనేజర్, జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ ఏడి, సహకార, ట్రాన్స్ పోర్ట్, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జీడిమామిడిలో పిక్క ముక్కలు కంటే అంటూ మొక్కలు మేలైనవి

- శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్

**గోకవరం (మనసులో మాట), మార్చి 6 :** జీడిమామిడిలో పిక్క ముక్కలు కంటే... అంటూ మొక్కలు మేలైన వంగడాలని శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్ వివరించారు. గోకవరం మండలం మల్లవరం గ్రామంలో ఉద్యాన శాఖ, కెవికె పందిరిమామిడి వారు సంయుక్తంగా నిర్వహించిన రైతుల శిక్ష కార్యక్రమంలో భాగంగా ఉద్యాన పంటలో ప్రాముఖ్యత పంట యాజమాన్య పద్ధతులు శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్ వివరించారు. కెవికె పందిరిమామిడి ద్వారా బి పి పి 8- బి పి పి -9 అధిక దిగుబడిలిచ్చే రకాలను రైతులకు మొక్క రూ 50 చొప్పున సరఫరా చేస్తామని, కావలసినవారు సంప్రదించాలని శాస్త్రవేత్త డాక్టర్ పుష్ప తెలిపారు. ఉద్యాన అధికారిణి మాట్లాడుతూ నీరు సదుపాయం ఉన్నా రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి పామాయిల్ వేసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న వివిధ రాయితీ వివరాలు ఆమె తెలియజేశారు. అలాగే ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా ఎస్సి రైతులకు కొలుపు, గుప్పు చేసే యంత్రాలను రైతులకు నూరు శాతం రాయితీతో అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లవరం గ్రామ సర్పంచ్ లక్ష్మీ అర్జున్ రావు, గ్రామ ఉద్యాన సహాయకులు రోహిత్, షణ్ముఖ పాల్గొన్నారు

# సురక్షిత మాతృత్వంపై అవగాహన



**పిఠాపురం, (మనసులో మాట)మార్చి 06:** స్థానిక మంగాయమ్మరావుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖ, న్యాయ శాఖ ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 'ప్రధానమంత్రి మాతృ వందన యోజన' 'సురక్షిత మాతృత్వం' అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల హక్కుల పరిరక్షణ సమితి కౌన్సిలర్ బి. దుర్గారాణి మాట్లాడుతూ.. గర్భిణీలు, కిశోర బాలికలు ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాతృ వందన యోజన ద్వారా గర్భిణీలకు పోషకాహారం, వైద్య సహాయం అందుతుందని వివరించారు. వైద్యాధికారి డాక్టర్ యాళ్ల వినయ్ కుమార్ మాట్లాడుతూ.. గర్భిణీలకు సురక్షిత ప్రసవం జరిగేలా నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. గర్భం ధరించిన నాటి నుండి ప్రసవం అయ్యేవరకు సురక్షిత వాతావరణంలో ఆరోగ్య పై శ్రద్ధ వహిస్తే జన్మించే శిశువు ఆరోగ్యవంతులు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయాధికార సేవా సంస్థ ప్యానెల్ అడ్వకేట్లు ఆశా వర్కర్లు, గర్భిణీలు, కౌమార బాలికలు పాల్గొన్నారు.

# ఏలేశ్వరం మండలంలో మొక్కజొన్న పంట పై ఆకు వ్యాధి సోకి ఉంది

### సస్యరక్షణకై వ్యవసాయ అధికారి సూచన



**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 6 ..** ఏలేశ్వరం మండలంలో ఎర్రవరం, పెద్దనపల్లి, సిరిపురం, మర్రివీడు గ్రామాలలో 1307 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి, ఏ. వి. రాజేష్ మొక్కజొన్న పంటలో టార్సీకం లీఫ్ బ్లైట్ తెగులు ఉందని గుర్తించడం జరిగింది. మొక్కజొన్నలో టర్సికమ్ లీఫ్ బ్లైట్ (టీ ఎల్ బి ), ఎక్సెరోహిలమ్ టర్సికమ్ (గతంలో హెల్మిన్థోస్పోరియం టర్సికమ్) అనే ఫంగస్ వల్ల వస్తుంది , ఇది విస్తృతంగా వ్యాపించే ఒక ప్రధాన ఆకుల వ్యాధి. ఇది కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యాన్ని తగ్గించడం ద్వారా గణనీయమైన దిగుబడి నష్టాలను (25-90 శాతం ) కలిగిస్తుంది. పొడవైన, దీర్ఘవృత్తాకార, టాన్ లేదా బూడిద రంగు సిగార్-ఆకారపు గాయాల ద్వారా వర్గీకరించబడిన ఈ వ్యాధి చల్లని, తేమ మరియు తడి పరిస్థితులలో వృద్ధి చెందుతుంది. లక్షణాలు ఈ విధంగా ఉంటాయి అని తెలిపారు.దిగువ ఆకులపై చిన్న, నీటిలో నానబెట్టిన మచ్చలుగా ప్రారంభమై, 2.515 సెం.మీ. పొడవు, నెక్రోటిక్, దీర్ఘవృత్తాకార, బూడిద-ఆకుపచ్చ లేదా లేత గోధుమ రంగు గాయాలుగా అభివృద్ధి చెందుతుంది. తీవ్రమైన సందర్భాల్లో ఇది ఆకులను కాలిపోయేలా చేస్తుంది.

వెచ్చని, తేమతో కూడిన వాతావరణంలో, మంచు లోను ఈ తెగులు సిలింద్రాలు గాలిలో ప్రయాణించి మొక్క జొన్న ఆకులు పై తెగులు లక్షణాలు ను కలుగచ్చేస్తాయి.

రైతులు అప్రమత్తమై ఈ తెగులు నియంత్రణకు అజాక్సిస్ట్రోబిన్+డిఫెంకనాజోలు ( అమిస్టేటర్ టాప్) 1మిలిలీటర్ ఒక లీటర్ నీటికి పిచికారీ చేయాలి, అమిస్టర్ టాప్ పిచికారీ చేసిన 15 రోజులకు టేబుకానాజోలు+ ట్రయ్ ఫాలక్సీ స్ట్రోబిన్ ( నెటివో) అనే తెగులు నియంత్రణ మందు ను 0.4 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పేచీకారీ చేయాలని తెలిపారు



# హెంగార్డ్స్ సంక్షేమానికి కృషి

## - జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్

**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..** కాకినాడ జిల్లా పోలీసు శాఖ లో హెంగార్డుగా పని చేసి, ఇటీవల పదవి విరమణ చేసిన హోమ్ గార్డ్డం హెచ్ జి 445, బి .మురళి కృష్ణ మరియు హెచ్ జి 193. పి.జాన్ లకూ "చేయూత"ను అందించేందుకు హెంగార్డు సిబ్బంది ప్రోగు చేసిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు, జనరల్ హోమ్ గార్డ్స్ మరియు డెప్యూటేషన్ హోం గార్డ్స్ సిబ్బంది నుండి వచ్చిన, చెక్ లను జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఐపిఎస్ మార్చి 6 న జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ – పోలీసుశాఖలో హెంగార్డుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన లేదా ప్రమాదవసాత్తు లేదా అనారోగ్య కారణాలతో మృతి చెందిన హెంగార్డు కుటుంబాలను
ఆర్ధికంగా ఆదుకొనేందుకు కాకినాడ పోలీసు యూనిట్ లో పని చేస్తున్న హెంగార్డ్సు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు మొత్తాన్ని ప్రోగు చేసి, వారి కుటుంబాలకు "చేయూత"గా అందజేయడం అభినందనీయమన్నారు. ఈ తరహా చర్యలు చేపట్టడం వలన పోలీసు ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడంతోపాటు, వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా లభిస్తుందని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లాలో హెంగార్డుగా సుదీర్ఘ కాలం పని చేసి, ఇటీవల పదవి విరమణ చేసిన హెచ్ జి 445, బి.మురళి కృష్ణ మరియు హ్రస్ట్ర 193 పి . జాన్ లను,ఆర్ధికంగా ఆదుకొనేందుకు 'చేయూత'గా హెంగార్డ్సు సమకూర్చిన ఒక్క రోజు డ్యూటీ
అలవెన్సు రూ.4,51,560/- (జనరల్ హోమ్ గార్డ్స్ (636)మంది నుండి హ్రస్ట్ర 445, బి.మురళి కృష్ణ కు,ఫిబ్రవరి నెలకు గాను)మరియు 1,92,410/--(డిప్యుటేషన్ హోం గార్డ్స్ 271 మంది నుండి)ల చెక్కు ను హెచ్జి 193 పి. జాన్ లకు,జిల్లా ఎస్పీ ,పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అందజేసారు. ఈ కార్యక్రమంలో హెంగార్డ్సు ఆర్ఐ ఎమ్. నరసింహామూర్తి పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి రహదారుల నిర్మాణం తక్షణం చేపట్టాలి

### అసెంబ్లీలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ

**మండపేట మార్చ్ 6..** మండపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఆర్ అండ్ బి రహదారులను తక్షణమే నిర్మించాలని ఇందుకు సంబంధించి నిధులు తక్షణమే విడుదల చేయాలని మండపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ 2014- 2019 సమయంలో మండపేట నియోజవర్గంలో రహదారులన్నిటికీ స్వర్ణయోగం అని పేర్కొన్నారు. 2019 లో వైసీపీ అధికారం చేపట్టిన అనంతరం తాను ప్రతిపక్ష టిడిపి ఎమ్మెల్యే అనే కారణంతో రోడ్లను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఆయా రోడ్లు అద్వాన్న స్థితికి చేరాయని అప్పటి ప్రజలు దీనిపై ఆందోళనలు కూడా చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కాగా మండపేట కపిలేశ్వరపురం, మండపేట దుళ్ళ, మండపేట సోమేశ్వరం రాజనగరం, మండపేట జొన్నాడ, వల్లూరు తాపేశ్వరం రామవరం, మండపేట కురకళ్ళపల్లి,ఏడిద ,ఏడిద సీతానగరం, వల్లూరు బంగారు పేట,పామర్రు వుట్రుమిల్లి, తాపేశ్వరం వెలగతోడు, ఇప్పనపాడు మేర్నిపాడు, చెల్లూరు అచ్యుత పురం, పసలపూడి వెంటూరు రాయవరం వెదురుపాక కేదార్లంక అద్దంకి వారిలంక, అర్ అండ్ బి రోడ్లు కాకుండా అనేక రోడ్ లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని చెప్పారు. కాగా వీటి మరమత్తులు కు ఈ రెండేళ్ల లో రూ 20 కోట్లు ఇచ్చారని తెలిపారు. ఇవి గోతులు కప్పి పెట్టడం తో వేసిన ఆరు నెలల్లోనే తిరిగి
పాడైనట్లు వివరించారు. అలాకాకుండా పక్కా
ప్రణాళిక బద్ధంగా రోడ్లు నిర్మించాలని కోరారు. ద్వారపూడి యానాం రహదారి లో ఎక్కువగా ట్రాఫిక్ ఉంటుందని దీంతో 2015 లో ముఖ్యమంత్రి చంద్రబాబు తాపేశ్వరం బైపాస్ రోడ్డు మంజూరు చేశారని పేర్కొన్నారు. దీంతో భూమి సేకరించి రూ8.11 కోట్లు రైతులకు అందజేసినట్లు చెప్పారు. స్వయంగా చంద్రబాబు శంకుస్థాపన చేసిన ఈ తాపేశ్వరం బైపాస్ రోడ్డు నిర్మాణం ను వైసిపి పక్కన పడేసిందనీ విమర్శించారు. 2017 లో మండపేట పట్టణ ట్రాఫిక్ ను దృష్టి లో ఉంచుకొని మారేడుబాక బైపాస్ రోడ్డు మంజూరు అయిందన్నారు. దిన్ని రద్దు చేశారని వివరించారు. తమ ప్రాంతం కోస్తా ప్రాంతామని ఇక్కడి నెల నల్ల రేగడి నేల కావడం తో వర్షాలు వస్తె రహదారులు ఛిద్రం అవుతాయని సమస్యను వివరించారు. వచ్చే పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలో అన్ని అర్ అండ్ బి రోడ్లు, తాపేశ్వరం ,మారేడుబాక బైపాస్ రోడ్డు లు నిర్మించాలని వీటిని ఎప్పటి లోగా నిర్మిస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ద్వారా ప్రశ్నించారు. దీనికి అర్ అండ్ బి మంత్రి బీసీ జనార్ధనరెడ్డి సమాధానం ఇస్తూ వేగుళ్ళ జోగేశ్వరరావు చెప్పినట్లు గత వైసిపి ప్రభుత్వం రోడ్ లను నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. ఆ ప్రభుత్వ హయాంలో అర్ అండ్ బి శాఖ ను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. మండపేట నియోజక వర్గానికి రూ 20.50 కోట్లు ఇచ్చామన్నారు. మిగిలిన
రహదారులు నిర్మాణం నోట్ చేసుకున్నామని చెప్పారు. వీలైనంత త్వరలో నిధులు లభ్యత ను బట్టి రోడ్ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బైపాస్ రోడ్ లు కూడా త్వరలో నిర్మిస్తామని చెప్పారు.ఈ దశలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు కల్పించుకొని వారికి వచ్చే ఏడాది పుష్కరాలు ఉన్నాయి చాలా డబ్బులు వస్తాయి ఆ సొమ్ముతో అన్ని రోడ్ లు వేసుకోవచ్చని చెప్పారు. మంత్రి మాట్లాడుతూ పుష్కరల నిధులు వినియోగించి ఈ రహదారులన్నీ నిర్మిస్తామని మంత్రి బీసీ జనార్ధనరెడ్డి హామీ ఇచ్చారు.

# ప్రేమా... దయాగుణానికి ప్రతీక రంజాన్

## -లో వోల్టేజీ సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్ ఫార్మర్స్ పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** రంజాన్ మాసం ప్రేమ... దయాగుణాలకు ప్రతీకంగా పరిగణించబడుతుందని... ఇది ముస్లింలకు పవిత్రమైన ఉపవాస కాలం, దానధర్మాలు, కరుణ, సానుభూతిని పెంపొందించే సమయమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిం కోసం స్థానిక 1వ డివిజన్ బత్తిన నగర్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) హాజరై అల్ సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహమ్మద్ అబ్దుల్లా, ముస్లిం మైనారిటీ పెద్దలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మైనారిటీల రక్షణకు, సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మసీదులు, ఈద్గాలు, కబర్స్థాన్ల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ముస్లింల అభివృద్ధికి ఎప్పుడూ ముందుంటుందన్నారు. మైనారిటీల అభివృద్ధి, విద్య, ఆర్థిక పురోగతికి ప్రత్యేక పథకాలు అమలు చేయనుందని గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. కులమతాలకు అతీతంగా అందరూ సోదర భావంతో కలసి ఉండాలని పిలుపునిచ్చారు. మానవతా విలువలతో మనిషి మహోన్న తుడిగా మారాలన్నదే ఉపవాసాల అసలు ఉద్దేశ్యం అని, తమ జీవిత సౌదాల్ని సత్యం, న్యాయం, ధర్మం అనే పునాదుల మీద నిర్మింపజేసుకునేందుకు ఉపయోగ పడే సాధనమే ఉపవాస వ్రత పరమార్థమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. కాగా బత్తిన నగర్లో లో వోల్టేజీ సమస్య పరిష్కారం కోసం నూతనంగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్ ఫార్మర్స్ ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిరోజు నీటి పరీక్షలు నిర్వహించాలి

## - కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 6:** ప్రతి రోజు నీటి పరీక్షలు ఖచ్చితంగా నిర్వహించాలని రాజమహేంద్రవరం కమిషనర్ రాహుల్ మీనా సంబంధిత శాఖ కార్పొరేషన్ అధికారులకు ఆదేశించారు. స్థానిక కోటిలింగాల పేటలోని 10 ఎంఎల్డీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను ఇంజినీరింగ్ అధికారులతో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిల్టరైజేషన్ ప్లాంట్ల పని తీరు, నిర్వహణా విధానం, నీటి సేకరణ, శుద్ధి చేసే విధానం, ల్యాబ్ నందు వాటర్ టెస్టింగ్, క్లోరినేషన్ ఎంత పరిమాణంలో కలుపుతున్నది..? తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్తు అంతరాయం సమయంలో నిరంతరాయంగా నీటి సరఫరా, శుద్ధి ప్రక్రియను కొనసాగించడానికి నూతనంగా ఏర్పాటు చేసిన జనరేటర్ ను పరిశీలించారు. ట్యాంకర్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకుంటూ ఉండాలని సూచించారు. అలాగే నగరంలో ఎక్కడా లీకేజీ సమస్యలు లేకుండా, నీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని కమిషనర్ ఆదేశించారు. ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు సరఫరా అవుతుందా లేదా..? అని ఎమినిటీలు ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. అలాగే కంబాల చెరువు మఠం వీధిలో నూతన పైపు లైన్ల పనులకు సంబంధించిన అంచనాలను అందజేయవలసిందిగా సూచించారు. అనంతరం ప్లాంట్ వద్ద నూతనంగా నిర్మించిన అప్రోచ్ రోడ్డును పరిశీలించారు. ఆయన వెంట ఈఈ మాధవి, ఏఈ వెంకటేష్, ఇతర సిబ్బంది ఉన్నారు.

## జి. జి. హెచ్. సెక్యూరిటీ గార్డ్స్ మధ్య వివాదాలు సృష్టిస్తూన్నా సీఐటీయూ పై తప్పుడు ప్రచారం చేస్తున్న ఏఐటియుసి

# సిఐటీయు నినాదమే ఐక్యత పోరాటం

## - జి జి. హెచ్. , ఆర్. ఎం.సి. సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలు పరిష్కరించాలి
## - కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ చిత్తశుద్ది గా వ్యవహరించాలి



**కాకినాడ (మనసులో మాట) మార్చి 6..** కార్మికుల మధ్య వివాదాల సృష్టిస్తూ సిఐటియుపై తప్పుడు ప్రచారం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు వైఖరిని సిఐటియు కాకినాడ నగర కమిటీ తీవ్రంగా ఖండించింది.
ఈ మేరకు సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కో కన్వీనర్స్ పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ లు శుక్రవారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. 2025 జూన్ 1 నుండి జిజిహెచ్ ఆర్ఎంసి లలో కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ సెక్యూరిటీ నిర్వహణ కాంట్రాక్ట్ ప్రారంభించిందన్నారు. కార్మికులకు జీతాలు ఎంత ఇస్తారో చెప్పకుండానే కాంట్రాక్ట్ ప్రారంభించడం గతం నుంచి ఉన్న క్యాజువల్ లీవులు రద్దు చేయడం పట్ల సెక్యూరిటీ గార్డ్స్ అసంతృప్తికి లోనయ్యారని తెలిపారు. ఎఐటియుసి యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తుందని భావించిన కొంతమంది సెక్యూరిటీ గార్డ్స్ సిఐటియుకి అనుబంధంగా సంఘం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. తదుపరి సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై డిమాండ్స్ రూపొందించి కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో సెక్యూరిటీ గార్డ్ సమక్షంలో పలు దఫాలు చర్చలు జరిపామన్నారు. ఇది గమనించిన మరి కొంతమంది సెక్యూరిటీ గార్డ్స్ సిఐటియు లో చేరడం ప్రారంభించారన్నారు. ఇది సహించలేని ఏఐటియుసి నాయకులు కార్మికుల మధ్య వివాదాలు సృష్టిస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగా మహిళా కార్మికులపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ఘర్షణలకు దారి తీసే విధంగా రెచ్చగొడుతున్నారని తెలిపారు. కార్మికులు ఏ సంఘంలో ఉండాలో వారి ఇష్టమని అయితే సమస్యలు పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిఐటియు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ తక్షణమే స్పందించి జిజిహెచ్, ఆర్ఎంసి సెక్యూరిటీ గార్డ్స్ కి పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తుందన్నారు. శుక్రవారం ఉదయం జి.జి. హెచ్. లో ఏఐటీయూసీ సభ్యులపై సీఐటీయూ దాడి అనే ప్రకటనలో వాస్తవం లేదన్నారు. శుక్రవారం ఉదయం షిఫ్ట్ లో సిఐటియు అనుబంధ సెక్యూరిటీ గార్డ్స్ అందరూ తమకు నిర్దేశించిన డ్యూటీ పాయింట్లలోనే ఉన్నారని గమనించాలన్నారు. సిఐటీయు ఎల్లప్పుడూ కార్మికుల ఐక్యత కే ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సిఐటీయు నినాదమే ఐక్యత పోరాటం అన్నారు.

# ప్రజాదర్బార్ కు పోటెత్తిన అర్జిదారులు.

# ప్రజల దగ్గరికి ప్రభుత్వం రావాలి

## - అదే మా నినాదం చెప్పింది చేసి చూపించే కూటమి ప్రభుత్వం ఇదే
## - కోకో ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి)



**కాకినాడ (మనసులో మాట) మార్చి 6** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా కాకినాడ రూరల్ నియోజకవర్గం కోకో ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి) ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ రూరల్ పెనుమర్తి గ్రామంలో విజయ కనకదుర్గ ఆలయం ఎదురుగా ప్రజా దర్బార్ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయుడు, తెలుగుదేశం పార్టీ రథసారథి మంత్రి నారా లోకేష్ బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆదేశాల మేరకు ప్రజా దర్బార్ నిర్వహించడం జరిగింది ప్రధాన సమస్యలు పీఎం కిసాన్ డబ్బులు పడటం లేదు దీపం పథకంలో వర్తించట్లేదని ఉద్యోగ–ఉపాధి అవకాశాలు, ఇల్లు స్థలాలు, డ్రైనేజీ నిర్మాణం, వైద్య సహాయం,బియ్యం కార్డు మంజూరు, కార్డుల్లో పేరు మార్పులు–చేర్పులు, పింఛన్లు, వంటి అంశాలపై మొత్తం 173 వినతులు అందాయి. వాటిలో పలు సమస్యలు వెంటనే పరిష్కరించగా, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్ భీమా బత్తుల సత్యనారాయణ, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్ గౌడ్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లబత్తుల అప్పారావు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కౌజు నెహ్రూ, తెలుగుదేశం పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాందేవు సీతయ్య దొర,ఏటుకూరి నాగమణి, కంచి మూర్తి లావణ్య, పొదరపు ఉమా, గుదాల లోవరాజు, జనసేన నాయకులు బిశెట్టి నారాయణరావు, వానపల్లి వెంకటరమణ, పింకే కిషోర్, పిల్లి వీరభద్రరావు, వాసంశెట్టి సత్తిబాబు, క్రరీ చిన్న, కాలదారి బుచ్చిరాజు,దవులూరి కృష్ణ కాంత్,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు



## ఏలేరు ఎడమ కాలువలోకి

# దూసుకెళ్లిన మోటర్ సైకిల్

## - ఒకరు గల్లంతు మరొకరి పరిస్థితి విషమం



**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 6..** ఏలేశ్వరం పట్టణ శివారు తిమ్మరాజు చెరువు సమీపంలోని సి.రాయవరం వంతెన వద్ద మోటార్ సైకిల్ ఏలేరు కాలువలోకి తీసుకెళ్లిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ మేరకు స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చెందిన గిడుతూరి లోవరాజు, పంగర్తి విజయ్ కుమార్ లు క్వారీ పనులు చూసుకుని మోటార్ సైకిల్ పై తిరిగి వస్తుండగా ఎదురుగా వాహనం రావడంతో అదుపు తప్పి ఏలేరు ఎడమ కాలవలోకి దూసుకుపోయారు. ఈ ప్రమాదంలో గిడుతూరి లోవరాజు (40) గల్లంతు కాగా స్థానికులు పంగర్తి విజయ్ కుమార్ రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చారు. విజయ్ కుమార్ తలకు తీవ్రమైన గాయం తగలడంతో వెనువెంటనే స్థానికులు అతన్ని ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలోకి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అయితే అతను స్థితికి చేరుకోవడంతో మేలైన వైద్యం అందించేందుకు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై పోలీసులు వివరణ కోరగా ఏలేరు ప్రాజెక్టు ఎడమ కాలువ లో అదుపుతప్పి ఇరువురు యువకులు పడిన మాట వాస్తవమేనని ఒక యువకుడు అపస్మారక స్థితిలో ఉండగా అతన్ని స్థానిక ప్రభుత్వానికి తరలించినట్లు తెలిపారు. మరో యువకుడు కోసం పోలీసులు గజతగాళ్ల సహాయంతో రాత్రి వరకు గాలించిన లోవరాజు ఆచూకీ తెలియ రాలేదు. ఈ మేరకు ఎస్సై ఎన్. రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహణ



**కాకినాడ( మనసులో మాట) మార్చి 6..** అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలను పురస్కరించుకొని ఈరోజు కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయం నందు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కాకినాడ సబ్ డివిజన్ పరిధిలోని మహిళా పోలీసు అధికారులు మరియు మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.
కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ప్రారంభించి, మహిళా సాధికారత, మహిళల భద్రత మరియు సమాజంలో మహిళల పాత్రపై అవగాహన కల్పిస్తూ అందరితో కలిసి మహిళా సాధికారత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసు సిబ్బంది తమ అభిప్రాయాలు, సూచనలు మరియు అనుభవాలను పంచుకున్నారు. పోలీసు శాఖలో మహిళల పాత్ర మరింత బలపడాలని, మహిళలు తమ విధుల్లో ధైర్యంగా ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ సూచించారు. కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ శ్రీహరి, సర్కిల్ ఇన్స్పెక్టర్లు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కీలకం

## కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ (మనసులో మాట) మర్చి 6..** జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు కీలకమని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పార్టీని పటిష్టమైన ప్రజా శక్తిగా తీర్చిదిద్దేందుకు సభ్యత్వమే ప్రధాన ఆయుధమని, ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకుని విస్తృత స్థాయిలో నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదులో సాధక్ లు క్రియాశీలకంగా వ్యవహరించి మెరుగైన ఫలితాలు సాధిస్తే భవిష్యత్ లో పార్టీ నిర్మాణంలో కీలక స్థానాలను స్థానాలను చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. శుక్రవారం కాకినాడలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో పిఠాపురం, గొల్లపోలు పట్టణాలకు చెందిన పార్టీ నాయకులు సాధకలతో సమీక్ష నిర్వహించి సభ్యత్వ నమోదు కార్యక్రమ పురోగతిపై చర్చించారు. జిల్లాలోనే అత్యధిక సభ్యత్వాల నమోదుతో కొత్త రికార్డు సృష్టించి, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లి యువతను పెద్ద సంఖ్యలో పార్టీలోకి ఆకర్షించాలన్నారు.
ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు), పిఠాపురం పట్టణ జనసేన ఇంచార్జ్ డాక్టర్ వరలక్ష్మి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మి, గొల్లప్రోలు పట్టణ జనసేన ఇంచార్జ్ మామిడాల సూరిబాబు, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యుద్ధాన్ని వెంటనే ఆపండి!

# ప్రపంచ శాంతి కాపాడండి!!

## - ఐక్య రాజ్యసమితి జోక్యం చేసుకోవాలి

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
శనివారం 7 మార్చి 2026




పలమనేరు మార్చి 6( మనసులో మాట):ఇరాన్ తో అమెరికా ఇజ్రాయెల్ దేశాలు తలపడుతూ యుద్ధం కొనసాగిస్తున్న నేపథ్యంలో వేలాది మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తక్షణం యుద్ధం ఆపేందుకు ఐక్యరాజ్యసమితి జోక్యంచేసుకోవాలని సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజన్ పేర్కొన్నారు భారత కమ్యూనిస్టు పార్టీ పుంగనూరు నియోజకవర్గ కమిటీ ని, అన్నమయ్య జిల్లాలో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా శుక్రవారం భగత్ సింగ్ కాలనీలో రామ్మూర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి మహేష్, చిత్తూరు జిల్లా సహాయ కార్యదర్శి టీ. జనార్దన్ లు హాజరయ్యారు. సమావేశం తొలుత ఇరాన్- అమెరికా ఇజ్రాయిల్ యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్న పలువురు అమాయక ప్రజలకు సంతాపం తెలియజేసింది. అనంతరం జరిగిన సభలో నాగరాజు మాట్లాడుతూ.... ఒకనాడు అలీన దేశాలకు ప్రపంచ శాంతికి కేంద్ర బిందువుగా ఉన్న భారత ప్రభుత్వం యుద్ధాన్ని నివారించేందుకు ఒక దేశ అధ్యక్షుడిని మట్టు పెడితే ఖండించేందుకు గాని పూనుకోక పోవడం దుర్మార్గమన్నారు. యుద్ధం నివారించకపోతే అణుయుద్ధంగా రూపాంతరం చెంది ప్రపంచ మానవాళికే ముప్పు వాటిల్లుతుందనే విషయం గుర్తించకపోవడం దారుణమన్నారు. ఐక్యరాజ్యసమితి సత్వరం జోక్యం చేసుకొని యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.సిపిఐ అన్నమయ్య జిల్లా సెక్రెటరీ పి.మహేష్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ పాలనకు భిన్నంగా ఏమీ వ్యవహరించడం లేదని ప్రజా ఉద్యమాలపై ఉక్కు పాదం మోపుతున్నారని విమర్శించారు. ప్రజా ఉద్యమాలను అణచి వేయాలనుకుంటే ప్రజాగ్రహం చవిచూడక తప్పదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదలకు,టిడ్కోఇండ్లు, ఇంటి స్థలాలు కేటాయించడంలో జరిగే జాప్యంపై ఉద్యమించాలని తెలిపారు.రాష్ట్రం విద్య వైద్యం పూర్తిగా ప్రైవేటుపరం చేస్తున్నారని కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని ఉపాధి హామీని నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు.ఈ నేధ్యంలో పార్టీ ఉద్యమం బలోపేతం చేసేందుకు నిర్మాణం కోసం రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు గడపగడపకు సిపిఐ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తూ నిధులు వసూలు చేసేందుకు కృషి చేయాలని పిలుపిచ్చారు. అనంతరం చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం పుంగనూరు చౌడేపల్లె, సోమల,సదుం మండలాలను అన్నమయ్య జిల్లా సిపిఐ సమితిలో విలీనం చేస్తున్నట్లు నాగరాజు ప్రతిపాదించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా సెక్రెటరీ మహేష్ మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గాన్ని తమ జిల్లాలో కి సాదరంగా ఆహ్వానిస్తూ జిల్లాలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో అన్నమయ్య జిల్లా సహాయ కార్యదర్శి టి. కృష్ణప్ప, ఏఐటియుసి జిల్లా సెక్రెటరీ ఎం సాంబశివ, రైతు సంఘం జిల్లా సెక్రెటరీ వి.రంగారెడ్డి ఏ ఐఎస్ ఎఫ్ జిల్లా సెక్రెటరీ ఎం.మాధవ్ లు పాల్గొని ప్రసంగిస్తూ పుంగనూరు నియోజకవర్గంలోని పలు ప్రజాసంఘాలను అన్నమయ్య జిల్లాలోకి విలీనం చేసుకున్నట్లు ప్రకటించారు. అనంతరం అన్నమయ్య జిల్లా సెక్రెటరీ మహేష్ పుంగనూరు పట్టణంలో పార్టీ సీనియర్ సభ్యులు అయిన డా.టీ జనార్దన్ కు పార్టీ సభ్యత్వం అందజేశారు. సమావేశానికి పుంగనూరు సహాయ కార్యదర్శి మున్నా స్వాగతం పలకగా ఏఐటియుసి కార్యదర్శి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు




## కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రాజీనామా చేయాలనీ బి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాదుల్లా

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రాజీనామా చేయాలని మృతి చెందిన వారి కుటుంబాలకు 20 లక్షల రూపాయలు పరిహారంతో సరిపెట్టకుండా కనీసం 50 లక్షలు రూపాయలు ఇచ్చి వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలనీ ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కేసి.బాదుల్లా డిమాండ్ చేశారు శుక్రవారం స్థానిక హోచిమిన్ భవన్ యందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీ సూర్య ఫైర్ వర్క్స్ భారీ పేలుడు ఘటనలో సంఘటనలో 28 మంది ఇప్పటివరకు చనిపోయిన మరో చతగాత్రుడు వైద్య చికిత్స ఆసుపత్రిలో ఇంకా విషమంగానే ఉంది.ఇది ఎంతో బాధాకరమైన సంఘటనని చనిపోయిన వారిలో వెనుక బడిన దళితులు బీసీలు ఇతర కులాలకు చెందిన వారనీ వీరిలో 12 మంది మహిళా కార్మికులు చనిపోవడం ఎంతో విచారకరం అని అన్నారు.



ధర్మవరం రహదారుల అభివృద్ధికి మంత్రి సత్య కుమార్ యాదవ్ చొరవతో

## రూ.2066.94 లక్షల పనులకు

# ఆమోదం..

ధర్మవరం మార్చి 06 (మనసులో మాట) ధర్మవరం నియోజకవర్గంలో రహదారి సదుపాయాలను మెరుగుపరచడం మరియు దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పిఏ హరీష్ బాబు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని రహదారుల అభివృద్ధికి ఇప్పటివరకు మొత్తం రూ.2066.94 లక్షల విలువైన పనులు మంజూరు చేయబడగా, అందులో భాగంగా తీవ్రంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మత్తుల కోసం రూ.410 లక్షల విలువైన బ్యాడ్ లీ డామేజ్డ్ రోడ్స్ పనులు కూడా మంజూరు చేయబడ్డాయని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలోని పలు ముఖ్య రహదారులపై ఇప్పటికే మరమ్మత్తులు, ప్యాచ్‌వర్క్‌లు మరియు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. వాటిలో ముఖ్యంగా దామజిపల్లి తాడిపత్రి రోడ్ : కిలోమీటర్ 28/500 నుండి 29/0 , 34/0 నుండి 34/4 వరకు అత్యవసర మరమ్మత్తులు, కొదూరు ధర్మవరం రోడ్ : కిలోమీటర్ 59/6 నుండి 61/0 వరకు దెబ్బతిన్న రైడింగ్ సర్ఫేస్ మరమ్మత్తులు, ధర్మవరం కల్యాణదుర్గం రోడ్ : కిలోమీటర్ 0/0 నుండి 4/4 వరకు రహదారి మరమ్మత్తులు, మాల్యవంతం పర్ణపల్లి రోడ్ : కిలోమీటర్ 25/0 నుండి 28/3 వరకు మరమ్మత్తులు, అనంతపురం కదిరి రోడ్ (రామాపురం, మర్రిమాకులపల్లి మార్గంగా) : కిలోమీటర్ 13/0 నుండి 17/250 వరకు రహదారి మరమ్మత్తులు, ధర్మవరం కల్యాణదుర్గం రోడ్ : కిలోమీటర్ 5/6 నుండి 9/0 వరకు ప్యాచ్ వర్క్ పనులు, కొదూరు ధర్మవరం రోడ్ : కిలోమీటర్ 47/0 నుండి 49/6 , 54/2 నుండి 57/2 వరకు రహదారి ప్యాచ్ వర్క్, దామజిపల్లి తాడిపత్రి రోడ్ : కిలోమీటర్ 10/0 నుండి 11/4, 15/6 నుండి 16/2, 17/4 నుండి 18/0 మరియు 18/3 నుండి 6 వరకు ప్యాచ్ వర్క్, చిల్లకొండయ్య పల్లి రామాపురం రోడ్ : కిలోమీటర్ 0/0 నుండి 3/0 వరకు ప్యాచ్ వర్క్, రాళ్ల అనంతపురం కొడవండపల్లి ( గంగిరెడ్డి పల్లి మార్గంగా) రోడ్ : కిలోమీటర్ 2/0 నుండి 4/0 4/0 నుండి 9/0 వరకు మరమ్మత్తులు , ప్యాచ్ వర్క్, సంకేపల్లి కృష్ణాపురం రోడ్ : కిలోమీటర్ 4/6 నుండి 5/0 వరకు ప్యాచ్ వర్క్, ముదిగుబ్బ చిన్నకొట్ల రోడ్ : కిలోమీటర్19/4 నుండి 19/8 వరకు ప్యాచ్ వర్క్, అదేవిధంగా రహదారులపై అడవిచెట్లు, పొదలు పెరిగి రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఆర్ అండ్ బి ధర్మవరం, బత్తలపల్లి , ముదిగుబ్బ సెక్షన్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా చేపట్టినట్లు వారు తెలిపారు.

మంత్రి సత్య కుమార్ యాదవ్ నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని వారు తెలిపారు.

## సంఘ భవన దాతలకు రుణపడి ఉంటాం



**పలమనేరు మార్చి 6( మనసులో మాట) :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రత్నారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రత్నారెడ్డి మాట్లాడుతూ.... మన సంఘ దాతలైన కుసుమ కుమారి క్రీ,శ, మునుస్వామి కుమార్తె ఉమారాణి జ్ఞాపకార్థంగా భవనము నిర్మించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. 20 సంవత్సరాలుగా మన ఆనవాయితీ ఉమారాణి జ్ఞాపకార్థంగా వారి చేసిన సేవలను కొనియాడారు. గత నెలలో మరణించిన సీనియర్ సభ్యులు సుబ్రమణ్యం పిళ్ళే ఆత్మ శాంతి కోసం సభ్యులు మౌనం పాటించారు. అనంతరం కుసుమకుమారి మాట్లాడుతూ... తమ బిడ్డ జ్ఞాపకార్థం పదిమందికి ఉపయోగపడేలా భవనం నిర్మించామని తెలిపారు. అనంతరం కార్యదర్శి గురుమూర్తి మాట్లాడుతూ..... లైఫ్ సర్టిఫికెట్ లో ఈనెల 18 వ తేదీ వరకు సమర్పించుటకు అవకాశం ఉందన్నారు. నేడు ప్రపంచం యుద్ధ వాతావరణంలో నిండిపోయిందని విద్యార్థులు పౌరులు సైనికులు మరణించడం ప్రపంచ మానవాళికి జీవకోటి ఉనికి ప్రకృతి విధ్వంసానికి కారణమవుతుందని రాజీమార్గంలో యుద్ధం ముగించాలని కోరినారు. పిఆర్సి కమిషన్ వేసి ఐఆర్ 30 శాతంగా ప్రకటించాలని అనేక ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాలు పోరాటాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ రెడ్డి, పోన్నుడి, విజయ్ కుమార్, శేఖర్, కస్తూరి, సోమ సుందరం రెడ్డి, పాండురంగయ్య, రాజారెడ్డి, శ్రీనివాసులు, సూర్యనారాయణ రెడ్డి, రాజన్న, సుబ్రహ్మణ్యం, బాలరాజు, దొరస్వామి నాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ వార్డు సచివాలయ సర్వేయర్ ల

## సమస్యలు పరిష్కరించాలని నిరసన



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ వార్డు సచివాలయ సర్వేయర్ ల సమస్యలను పరిష్కరించాలని నిరసన చేపట్టారు ఈ నేపద్యంలో కడప జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామ వార్డు సచివాలయ సర్వేయర్ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు అనంతరం ఎడి గారికి వినతిపత్రం ఇచ్చారు.

ఈ సందర్భంగా సర్వేయర్ లు మాట్లాడుతూ తాము 6 సంవత్సరాల క్రితం విధుల్లోకి వచ్చామని అదే విధంగా వారితో పాటు గ్రామ వార్డు సచివాలయ సిబ్బందితో పాటు మరో 11 రకాల సిబ్బందిని నియమించిన ప్రభుత్వం వారికి అమలు చేసే పే స్కేల్ ను సర్వేయర్ లకు అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. అంతేకాకుండా రేయి పగలు తేడా లేకుండా కష్ట పడి పొలాల్లో పాము కాటుకు ఎంతో మంది బలి అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు అని తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరగా ఈ రోజు చేస్తున్న నిరసన అడ్డుకునే విధంగా జిల్లా సర్వే అధికారి ఎడి హరినాథ్ రెడ్డి అనే సర్వేయర్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారనీ మీరు చేసే సస్పెండ్ లకు సర్వేయర్ లు భయపడమని కావాలంటే జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్వేయర్లను సస్పెండ్ చేసినా తాము వెనకడుగు వేయమని హెచ్చరించారు. ఏదైతే సర్వేయర్ హరినాథ్ రెడ్డి నీ సస్పెన్షన్ వెనక్కి తీసుకోవాలని లేదంటే పోరాటానికి శ్రీకారం చుడతామని అవసరమైతే విజయవాడ ధర్నా చౌక్ నందు మా గళం విప్పి మా సమస్యలు పరిష్కరించుకుంటామని అన్నారు.

## ప్రతి గడపలో కనిపించే ఆర్డీటీని కాపాడాలి

### - ఆర్డీటీపై ప్రతికూల చర్యలు ఆపాలి: దాసగానపల్లి కుల్లాయప్ప



**ధర్మవరం, మార్చి 06: (మనసులో మాట)** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని ఎన్‌జీవో భవన్‌లో అఖిలపక్ష కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో "ఆర్డీటీని రక్షించుకుందాం ఆర్డీటీని దూరం చేయకండి" అనే నినాదంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సీ జన సంఘం జాతీయ అధ్యక్షులు దాసగానపల్లి కుల్లాయప్ప మాట్లాడుతూ, ఆర్డీటీ సంస్థ పేదవాడి గుండె చప్పుడు, అనంతపురం ప్రాంత ప్రజల జీవనాడిగా మారిందని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా అనంతపురం మరియు పుట్టపర్తి జిల్లాల్లో ప్రజలతో మమేకమై సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థ ప్రతి ఇంటిలోనూ, ప్రతి గడపలోనూ కనిపించే స్థాయికి చేరుకుందని తెలిపారు.
అలాంటి సేవా సంస్థకు ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసంఘాలు, దళితగిరిజన సంఘాలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆర్డీటీ సంస్థను తప్పనిసరిగా కాపాడుకుంటామని స్పష్టం చేశారు.
ఆర్డీటీ సంస్థపై తీసుకుంటున్న ప్రతికూల చర్యలను వెంటనే ఆపాలని దాసగానపల్లి కుల్లాయప్ప డిమాండ్ చేశారు. ఆర్డీటీ సంస్థను దూరం చేసే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తూ, ఆర్డిటి సంస్థకు అనంతపురం జిల్లా, శ్రీ సత్యసాయి జిల్లా ప్రజల సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు

## ధర్మవరం తాసిల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు

### ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు - రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన తాసిల్దార్ సురేష్ బాబు




**ధర్మవరం, మార్చి 6: (మనసులో మాట)..** వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించేలా ధర్మవరం పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తాసిల్దార్ సురేష్ బాబు రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ప్రతి రోజు వివిధ పనుల నిమిత్తం తాసిల్దార్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కార్యాలయానికి వచ్చే ప్రజలు దాహార్తితో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా తాసిల్దార్ సురేష్ బాబు స్వయంగా అక్కడికి వచ్చిన ప్రజలకు చల్లని త్రాగునీటిని అందించి సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీరు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని, ప్రజలకు కొంతైనా ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో తాసిల్దార్ కార్యాలయంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన- జిల్లా కలెక్టర్



**పలమనేరు మార్చి 6( మనసులో మాట):** నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలంలో ఉన్న పెద్దపంజాణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఐఏఎస్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు,అనారోగ్య సమస్యల తో వచ్చు ప్రజలకు అందిస్తున్న చికిత్స విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఔషధాల నిల్వలు, వైద్య సిబ్బంది హాజరు వివరాలను తనిఖీ చేశారు.అనారోగ్య సమస్యల తో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.ఆసుపత్రిలో పరిశుభ్రతను పాటిస్తూ హాస్పిటల్ కు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## ఎస్సై చేతుల మీదుగా పరీక్షా ప్యాడ్లు పంపిణీ

### దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ



శిరివెళ్ల: - మండల కేంద్రంలోని కస్తూరి బా బాలికల విద్యా వసతి గృహంలో ఎస్సై మధుసూదన చేతుల మీదుగా 10వ తరగతి విద్యార్థినిలకు పరీక్ష ప్యాడులను లను పంపిణీ చేశారు. దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వర్ రెడ్డి తరఫున కస్తూరిబా గాంధీ పాఠశాలలోని 50మంది విద్యార్థులతోపాటు ఆయా జిల్లా పరిషత్ హై స్కూల్లో చదువుతున్నటువంటి వందలాదిమంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లను దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేయడం జరిగిందని అన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రశాంతమైన వాతావరణంలో కృషి పట్టుదలతో ఇష్టపడి చదువుతూ ఉత్తమ మార్కులు సాధించాలని ఎస్సై మధుసూదన పిలుపునిచ్చారు. పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఇది ఒక ప్రోత్సాహకర బహుమతిగా భావించి పోటీపడి చదివి అధిక మార్కులు సాధించి తల్లిదండ్రులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్సై మధుసూదన సూచించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలందరూ మంచిగా చదివి పరీక్ష కార్డుల కొరకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండాలి అనే ఉద్దేశంతో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు ఈటుకూరు వెంకట్ ఈ ప్యాడ్లు దాతల సహాయ సహకారాలతో అందజేయడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమం లో నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగమల్లే శ్వర రెడ్డి మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రైవేట్ విద్యాసంస్థలకు తొత్తుగా మారిన మండల విద్యాశాఖ అధికారి వెంకయ్య పై

# విచారణ జరిపి సస్పెండ్ చేయాలి

**- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీర పోగు రవి**

పోరుమామిళ్ల మండలంలోని ప్రైవేట్ విద్యా సంస్థలకు అమ్ముడుపోయిన మండల విద్యా శాఖ అధికారిపై (ఎంఈఓ ) వెంకటయ్య పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అన్నారు. పోరుమామిళ్లలో శుక్రవారం ఎస్.ఎఫ్. ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి మాట్లాడుతూ.....

చదువు పేరుతో పోరుమామిళ్ల మండలంలోని పుట్ట గొడుగులాగా ప్రవేట్ పాఠశాలలకు ప్రభుత్వ అనుమతులు లేకుండా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న మండల విద్యాశాఖ అధికారి వెంకటయ్య పై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో ఎన్నిసార్లు చెప్పినా చూసి చూడనట్టు వదిలేయడం దుర్మార్గం అన్నారు. ప్రైవేట్ యాజమాన్యానికి ఎంఈఓ గారు అమ్ముడుపోయారు. పళ్ళు అనుమానాలు వ్యక్తం చేశారు. చదువు పేరుతో మోసం చేసే వారికి బుద్ధి చెప్పాల్సింది పోయి ఒక మండల అధికారిగా ఉంటూ వారికి అమ్ముడు పోయారు అన్నారు. ఈ విధంగా ప్రవర్తించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎక్కడ ఎక్కడ పనిచేశారో అప్పటినుంచి కూడా అవినీతి అక్రమాలపై విచారణ జరపాలి అన్నారు. ఒక మండలానికి ఉన్నత బాధ్యతలో ఉంటూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్న ఎంఈఓ వెంకటయ్య పై చర్యలు తీసుకోవాలి అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కౌసిక్, మండల నాయకులు ప్రశాంత్. తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో ఆరవ తరగతికి ప్రవేశాల కొరకు

# దరఖాస్తు చేసుకోండి

**- ఎంఈఓ రాజేశ్వరి దేవి**



ధర్మవరం మార్చి 06 (మనసులో మాట) పట్టణములోని మోటుమర్ల గ్రామం వద్దగల కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో (కేజీబీవీ) ఆరవ తరగతి ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ రాజేశ్వరి దేవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్లైన్ దరఖాస్తులు మార్చి 12వ తేదీ నుండి ప్రారంభమవుతుందని, దరఖాస్తులు ఏప్రిల్ ఒకటవ తేదీ వరకు మాత్రమే స్వీకరించబడుతాయని తెలిపారు. అనంతరం ఎంపిక జాబితా ఏప్రిల్ 13న విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి పాఠశాలలో ఆరవ తరగతిలో చేరుటకు 40 సీట్లు మాత్రమే కలవు అని తెలిపారు. ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న బాలికలు మాత్రమే అర్హులని తెలిపారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతంలో ఉండు కుటుంబం వారు వార్షిక ఆదాయము 1,20,000 లోపు ఉండాలని తెలిపారు. అదేవిధంగా పట్టణ ప్రాంతంలో ఉండు కుటుంబంలో వారు 1, 44,000 రూపాయలు లోపు ఉండాలని తెలిపారు. రిజర్వేషన్ల ప్రకారం ఓసికి 15 సీట్లు, ఎస్సీకి 5 సీట్లు, బీసీకి 10 సీట్లు ఉంటాయన్నారు. ప్రవేశములో బడిబయట ఉన్న బాలికలకు, అనాధలకు, దివ్యాంగులకు ప్రవేశ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఉచిత నివాసంతో కూడిన నాణ్యమైన విద్యను పొందే అవకాశం ఉందన్నారు.

## జిల్లా సచివాలయాల్లో

# డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలి

**- సోషల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పణ**






**పుట్టపర్తి, మార్చి 6 (మనసులో మాట)** శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండల కేంద్రాలు, గ్రామ సచివాలయాల ప్రాంగణాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఎస్సీ జనసంగం జాతీయ అధ్యక్షుడు దాసగానిపల్లి కుళ్లాయప్ప మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, ఎమ్మార్వో కార్యాలయాల ప్రాంగణాల్లో అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడానికి ప్రత్యేక నిధులు కేటాయించి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అంబేద్కర్ విగ్రహాలు కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా సమాజంలోని ప్రతి వర్గానికీ స్ఫూర్తిగా నిలిచేలా ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రతి మండల కేంద్రం, గ్రామ సచివాలయం స్థాయిలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించి విగ్రహాల ఏర్పాటు చేపట్టాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూర్చాలని వారు పేర్కొన్నారు. ఈ విగ్రహాల పునఃప్రతిష్ట, సంరక్షణ, పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కూడా డిమాండ్ చేశారు.

అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు కోసం ప్రభుత్వం ఇప్పటికే జారీ చేసిన గవర్నమెంట్ ఆర్డర్లను ఉపయోగించవచ్చని తెలిపారు. ముఖ్యంగా జి.ఓ. నం.2 (సోషల్ వెల్ఫేర్ శాఖ, 26-01-2013) ద్వారా ఎస్సీ ఎస్టీ నిధులను వినియోగించుకోవచ్చని, అలాగే జి.ఓ.ఎంఎస్ నం.322 (పంచాయతీ & రూరల్ డెవలప్‌మెంట్ శాఖ, 13-08-2014) ప్రకారం గ్రామ సచివాలయాలు, మండల కేంద్రాల అభివృద్ధి నిధులను ఉపయోగించవచ్చని వివరించారు.అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు ద్వారా ప్రజల్లో రాజ్యాంగ విలువలపై అవగాహన పెరుగుతుందని, యువతకు స్ఫూర్తి కలుగుతుందని, సమాజంలో సమానత్వం, న్యాయం, గౌరవం వంటి విలువలు బలపడతాయని వారు తెలిపారు.

ఈ వినతిపత్రానికి సోషల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ జనసంగం నాయకులు మాల్యావంతం రామ్ ప్రసాద్, సాకే వినయ్ కుమార్, బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గట్టు రామాంజినేయులు, జై భీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఓబుళయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ధర్మవరం పట్టణంలో అంబేద్కర్ భవనం ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సాకే వినయ్ కుమార్ కోరారు.

# మా సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలి

**8వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు. జయకృష్ణ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ కుళ్లాయప్ప యాదవ్.**



**ధర్మవరం మార్చి 06 (మనసులో మాట)..** మా సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలని, అంతవరకు రిలే నిరాహార దీక్షలు ఆపము అని జయకృష్ణ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ కుల్లాయప్ప యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు తాసిల్దార్ కార్యాలయ ముందు దీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ దీక్షా శిబిరం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ మాట్లాడుతూ ఆనాటి నుండి ఈనాటి వరకు హిందూ దేవాలయాలలో జరుగుతున్న అన్యాయాలు, పరిష్కరించని సమస్యలపై హిందూ సమ్మేళనా కమిటీ పోరాటం చేస్తుందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా తాము హిందూ ధర్మం కాపాడడం కోసం అనేక పోరాటాలు సల్పడం జరిగిందని, సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఈ నిరాహార దీక్షల చేస్తున్నామని తెలిపారు. దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుండి తొలగించాలని, స్వతంత్ర హిందూ సనాతన బోర్డు ఏర్పాటు చేయాలని, విద్యా సంస్థలలో హిందూ ధర్మ బోధన అనుమతించాలని, దేవాలయ మాన్యాలు ఆక్రమణలు తొలగించాలని, హిందూ మైనారిటీ విద్యాసంస్థలు ఏర్పాటుకు అనుమతించాలని, పూజారులకు 15వేల రూపాయలు నెలసరి వేతనం ఇవ్వాలని, పల్లెటూరు లలో ప్రజల ప్రాణాలు కాపాడడానికి పల్లెటూరు హాస్పిటల్ లో 24 గంటల పాటు ఎంపీపీ ఎస్ డాక్టర్ అందుబాటులో ఉండాలని, ప్రతి పీహెచ్సీ లో ముగ్గురు ఎంపీపీ ఎస్ డాక్టర్లను ప్రభుత్వం వెంటనే నియమించాలని వారు డిమాండ్ చేశారు. మా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఈ దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తాసిల్దార్ రామ్మోహన్, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పుల్లాయప్ప, జనసేన నాయకులు డిష్ రాజు, ఏ సిబిఐ విద్యాధికారి విశ్వనాథ్, కాంగ్రెస్ నాయకుడు తుంపర్తి పరమేష్ పాల్గొన్నారు.

# కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వమే జీతాలు ఇవ్వాలి

**- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్**



ధర్మవరం మార్చి 06 (మనసులో మాట) అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగాలను పర్మినెంట్ చేసి, ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించేటట్లు తీర్మానం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు/సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగామున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ( సిఐటియు) యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా శ్రామిక మహిళ కన్వీనర్ కామ్రేడ్ డి.దిల్షాద్ దీక్షలను ప్రారంభించారు. ధర్మవరం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు మేకల బాబు, ముకుంద అధ్యక్షతన జరిగిన దీక్షలో శ్రామిక మహిళ కన్వీనర్ కామ్రేడ్ దిల్షాద్ , సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అయూబ్ ఖాన్, కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని ఇది చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కూటమి ప్రభుత్వంలోని నాయకులు గత ప్రభుత్వ హయాంలో కార్మికులు 16 రోజుల పాటు చేపట్టిన దీక్షలకు మద్దతు తెలిపి, ఈసారి ఎన్ డి ఏ కూటమిని గెలిపించండి మేముఅధికారం చేపట్టిన వెంటనే మీ సమస్యలు మొత్తం పరిష్కారం చేస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ నాయకుల పాలన నూటికి నూరుశాతం సుపరిపాలనగా కొనసాగుతుందనే మాటలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని విమర్శించారు.

కార్మికులకు కనీస వేతనం కరువైందని, కార్మికులు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారని, కుటుంబంలో ఒక ఉద్యోగం లేకపోయిందని, ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల జీతాలు పెంచడంలో నిర్లక్ష్యం దాపరించిందని, ఇది కార్మికులకు నమ్మకద్రోహం తలపెట్టినట్టేనని అన్నారు. కావున ఇకనైనా మంత్రులు, అధికారులు స్పందించి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, జీవో ఆర్టీ నెంబర్ 1615 ప్రకారం పిఆర్సి, చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, కరువుభత్యం, మధ్యంతరభృతి, ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ జీతాలు - జీతాల చెల్లింపు చేయాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, పిల్లలకు ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు ఇవ్వాలని అలాగే ఎన్ఎంఆర్ బదిలీ, కోవిడ్, డైలీవేజ్, ఎం-బుక్, అడిషనల్ వర్కర్స్, క్లాప్ డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న,

సిఐటియు పట్టణ నాయకులు ఆదినారాయణ, మున్సిపల్ రెగ్యులర్ కార్మిక సంఘం నాయకులు, శ్రీరాములు, పుల్లన్న,

యూనియన్ నాయకులు చెన్నకేశవులు, వెంకటేష్, పట్టణ శ్రామికమహిళా కన్వీనర్ పెద్దక్క, సాలమ్మ, జయమ్మ, పి.పెద్దక్క, యశోదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డిటిపై ప్రతికూల చర్యలు ఆపాలి

**- అఖిలపక్ష కమిటీ డిమాండ్**



**ధర్మవరం మార్చి 06 (మనసులో మాట)..** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని ఎన్జీవో హోంలో అఖిలపక్ష కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో "ఆర్డిటిని రక్షించుకుందాం ఆర్డిటిని దూరం చేయకండి" అనే నినాదంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ సభ్యులు, నాయకులు మాట్లాడుతూ ఆర్డిటి సంస్థ పేదవాడి గుండె చప్పుడు, అనంతపురం ప్రజల జీవనాడిగా మారిందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా అనంతపురం జిల్లాలో ప్రజలతో మమేకమై సేవలందిస్తున్న ఆర్డిటి సంస్థ ప్రతి ఇంటిలోనూ, ప్రతి గడపలోనూ కనిపించే స్థాయికి చేరుకుందని తెలిపారు. అయితే అలాంటి సేవా సంస్థకు ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంఘాలు, దళిత, గిరిజన సంఘాలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఆర్డిటి సంస్థను తప్పనిసరిగా కాపాడుకుంటామని వారు స్పష్టం చేశారు. ఆర్డిటి సంస్థను దూరం చేసే ప్రయత్నాలను ఖండిస్తూ, ఆర్డిటి సంస్థకు ప్రజల సంపూర్ణ మద్దతు ఉంటుందని మీడియా ద్వారా తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ జన సంఘం జాతీయ అధ్యక్షులు దాసగానిపల్లి కుళ్లయప్ప, ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు కేశగాల వెంకటేష్, ఎస్సీ జన సంఘం రాష్ట్ర ఇంచార్జ్ మాల్యవంతం రాంప్రసాద్, రైతు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నారిగోల్ల కుళ్లయప్ప, బహుజన్ సమాజ్ పార్టీ ఇంచార్జ్ సాకే వినయ్ కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కమతం కాటమయ్య, ఎస్సీ జన సంఘం సభ్యులు చెర్లోపల్లి ఓబులయ్య, కార్యదర్శి నిడిగల్లు దను, గర్షణపల్లి బాబు, జై భీమ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గట్టు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్డిటిని రక్షించుకుందాం

# పేద ప్రజలను కాపాడుకుందాం

**- సాకే వినయ్**

**ధర్మవరం మార్చి 06 (మనసులో మాట)..** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని ఎన్‌జీవో భవన్‌లో దళిత, గిరిజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అఖిలపక్ష కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ ధర్మవరం నాయకుడు సాకే వినయ్ మాట్లాడుతూ ఆర్డిటి సంస్థను రక్షించుకోవాలని, పేద ప్రజలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతపురం మరియు శ్రీ సత్య సాయి జిల్లాల్లో బడుగు, బలహీన వర్గాలు అయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనార్టీ ప్రజలకు ఆర్డిటి సంస్థ అనేక విధాలుగా అండగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. అలాంటి ఆర్డిటి సంస్థను దూరం చేసే ప్రయత్నాలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఆర్డిటి సంస్థకు ప్రజల పూర్తి మద్దతు ఉందని, ప్రజాసంఘాలు, దళిత, గిరిజన సంఘాలు అన్నీ కలిసి ఆర్డిటి సంస్థను కాపాడుకోవడానికి ముందుకు రావడం ఆనందదాయకమని అన్నారు. బత్తలపల్లి మండల కేంద్రంలో ఆర్డిటి సంస్థ ఆసుపత్రులు స్థాపించి ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తోందని చెప్పారు. అలాగే మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న మహిళలకు ఉచితంగా పక్కా గృహాలు నిర్మించి అందజేసిందని గుర్తుచేశారు. అదేవిధంగా పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలు అందిస్తూ పేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందించిందన్నారు. అలాంటి ఆర్డిటి సంస్థ ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్డిటి సంస్థను కాపాడుకోవడానికి ప్రతి రాజకీయ నాయకుడు ముందుకు వచ్చి తమ మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పొలాలపై ఒంటరి ఏనుగు దాడి



పలమనేరు మార్చి 6 ( మనసులో మాట):పలమనేరు రూరల్ మండలంలోని కృష్ణాపురం గ్రామంలోని కొంతమంది రైతుల పంటలపై గురువారం రాత్రి 8.30 గంటలకు ఒంటరి ఏనుగు గ్రామానికి ఆనుకుని ఉన్న అడవిలో నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు గ్రామానికి చెందిన వినాయకం అనే రైతు అతని భూమితో పాటు పక్కన ఉన్న భూమిని కూడా కౌలుకు తీసుకుని అందులో పశుగ్రాసం అరటి తదితర పంటలను సాగు చేసుకుంటు జీవనం సాగిస్తున్న నేపథ్యంలో గురువారం రాత్రి 8.30 గంటలకు పొలానికి ఆనుకుని ఉన్న అడవి నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు పశుగ్రాసం తోపాటు అరటి చెట్లను ధ్వంసం చేయడమే కాకుండా పైపులను ధ్వంసం చేసి పొలానికి వేసిన ఫెన్సింగ్ లను విరిచి నష్టం చేయడమే కాకుండా పక్కనున్న రైతుల పొలాల్లో మిరప పశుగ్రాసం తదితర పంటలను తిని ధ్వంసం చేస్తున్న సమయంలో తమ పొలాల వద్ద చాలా మంది ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న ఇళ్ల వద్ద కుక్కలు అరవడంతో అక్కడున్న రైతులందరూ ఈ ఏనుగును చూసి భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఏనుగు ఇళ్లపైకి వస్తే పిల్లాపాపలను.పాడి పశువులను ఎలా కాపాడుకోవాలని భయాందోళనలకు గురై గ్రామస్తులందరూ ఏనుగును తరిమెందుకు ప్రయత్నం చేశారు. కొందరు ఇళ్లపైకి ఎక్కి చూస్తున్నారు. కొందరు ఈ ఏనుగును తరిమెందుకు రాత్రంతా అనేక ప్రయత్నాలు చేశారు. కానీ అడవిలోనికి వెళ్ళలేదు. అష్ట కష్టాలు పడి తెల్లవారుజామున.అడవిలోనికి మళ్లించారు.వ్యవసాయానికి రాత్రిపూట కరెంటు ఇవ్వడం వలన రైతులు రాత్రివేళ తమ పొలాలకు నీరు పెట్టేందుకు ఏనుగుల వలన భయాలకు పొలాలకు వెళ్లలేకపోతున్నారు. కాబట్టి ప్రభుత్వం స్పందించి పంట పొలాలపై ఏనుగులు రాకుండా తగు చర్యలు తీసుకుని అటవీ సమీపంలోని ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేపట్టాలని అదేవిధంగా తమ వ్యవసాయ భూములకు అటవి శాఖ అధికారుల ఆమోదంతో రైతులకు వంద శాతం పూర్తి సబ్సిడీతో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ఎప్పటి నుంచో పలుమార్లు అధికారులకు తెలియపరుస్తున్నా కూడా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా పంట పొలాలపై ఏనుగులు రాకుండా ఇంద్రానగర్ నుంచి చెత్త పెంట గ్రామం వరకు సోలార్ ఫెన్సింగ్ వెంటనే ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



# తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ

### పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ



**హైదరాబాద్, మార్చి 6:** తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సీనియర్ నాయకురాలు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత ఉండటం వల్ల అధిష్ఠానం ఆమెపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎర్రబెల్లి స్వర్ణకు వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతూ వస్తున్న ఆమె, ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా కూడా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేశారు.

### మొట్టమొదటి మహిళా మేయర్ గా..

గతంలో ఆమె వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా పనిచేశారు. 2002లో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు ఎన్నికైన ఆమె, నగరానికి మొట్టమొదటి మహిళా మేయర్ గా సేవలందించి నగరాభివృద్ధిలో తనదైన ముద్రవేశారు. పరిపాలనలో మంచి మార్కులు తెచ్చుకున్నారు. తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ నియామకం పట్ల జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న సీనియర్ నాయకురాలికి అధిష్ఠానం తగిన గుర్తింపు ఇచ్చిందని కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# మనం గొర్రెలు మేపాలా.. వాళ్ల పిల్లలు రాజ్యం ఏలాలా?



## మాటలు, మూటలతో గెలిచి రాలేదు.. కేవలం ప్రజల మద్దతుతోనే వచ్చాం

- మా వద్ద ఎలాంటి అక్రమ సంపాదనా లేదు.. పేదల పక్షపాత ప్రభుత్వం మనది
- ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మొదటి నుంచి అండగా నిలిచా
- మిత్రధర్మానికి కట్టుబడి కర్ణుడిలా మాదిగల వెంట ఉన్నా
- సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత వర్గీకరణ ప్రకటించిన తొలి రాష్ట్రం తెలంగాణే
- విద్యా వ్యవస్థ ప్రక్షాళన కోసమే విద్యాశాఖ నా వద్దే పెట్టుకున్నా
- హైదరాబాద్ శిల్పకళా వేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ నేతల పిల్లలు రాజ్యం ఏలుతుంటే, బడుగు బలహీన వర్గాలు మాత్రం బర్రెలు, గొర్రెలు మేపాలా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో జరిగిన మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తాము గత పాలకుల మాదిరిగా మాటలు, మూటలతో గెలిచి రాలేదని, కేవలం ప్రజల పూర్తి మద్దతుతోనే అధికారంలోకి వచ్చామని స్పష్టం చేశారు. తమది పూర్తిగా పేదల పక్షపాత ప్రభుత్వమని, తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదని తేల్చి చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ జాతి చేసిన సుదీర్ఘ పోరాటానికి తాను మొదటి నుంచి అండగా నిలిచానని గుర్తు చేశారు. మహాభారతంలో మిత్రుడి కోసం కర్ణుడు చివరికంటా నిలబడిన తరహాలోనే, మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని ఉద్వేగంగా ప్రకటించారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత వర్గీకరణను ప్రకటించిన తొలి రాష్ట్రం తెలంగాణనే అని స్పష్టం చేశారు. దళితులకు, పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే ఏకైక లక్ష్యంతో విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని రేవంత్ రెడ్డి వివరించారు.**

**హైదరాబాద్, మార్చి 6:** గత బీఆరఎస్ ప్రభుత్వం దళితులకు, బడుగు బలహీన వర్గాలకు బర్రెలు, గొర్రెలు ఇచ్చి మోసం చేసిందని.. మనం గొర్రెలు మేపాలా, వాళ్ల పిల్లలు రాజ్యం ఏలాలా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాము మాటలు, మూటలతో గెలిచి రాలేదని, కేవలం ప్రజల మద్దతుతోనే అధికారంలోకి వచ్చామని ఆయన స్పష్టం చేశారు. పేదల పక్షపాత ప్రభుత్వమైన తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదనా లేదని తేల్చి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో జరిగిన మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి.. ఎస్సీ వర్గీకరణకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని, మిత్రధర్మానికి కట్టుబడి కర్ణుడిలా మాదిగల వెంట ఉంటానని ఉద్ఘాటించారు.

### అక్రమ సంపాదన లేదు.. మార్పు కోసమే వచ్చాం

ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని, మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని ప్రకటించారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే ఈ ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని వివరించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. గత ఎన్నికల్లో తాము కేవలం మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల అండదండలతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదని స్పష్టం చేశారు. చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని, ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు.

### కర్ణుడిలా అండగా నిలబడ్డా..

వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో సుదీర్ఘంగా పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 ఏళ్ల నుంచీ ఈ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం తాను మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని ఆయన భరోసా ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని రేవంత్ వివరించారు. మహాభారతంలో మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని ఆయన గుర్తు చేశారు. అదే కర్ణుడి మాదిరిగా తాను కూడా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ ఉద్వేగంగా పేర్కొన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపే న్యాయం ఉందని అన్నారు. అందుకే ఎన్ని రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత దేశంలోనే వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు.

### విద్యా వ్యవస్థ ప్రక్షాళన కోసమే..

తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని సీఎం రేవంత్ ప్రశంసించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకొచ్చామన్నారు. ప్రగతి ప్రణాళికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులకు హితవు పలికారు. తెలంగాణలో ప్రస్తుతం ఆర్థిక సమస్యలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్నారు. ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉందని స్పష్టం చేశారు. మాదిగలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ ప్రధాన ఆలోచన అని ఆయన పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆరఎస్ ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ మనకు ముందే తెలియవా, వీళ్లు కొత్తగా ఇచ్చిందేంటి అంటూ ఆ పార్టీ నేతలపై సీఎం రేవంత్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మనం బర్రెలు, గొర్రెలు మేపుకోవాలా, వాళ్ల పిల్లలు మాత్రం రాజ్యం ఏలుతారా అంటూ బీఆరఎస్ నేతలను సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రణాళిక.. మరో డైవర్షన్ డ్రామా!

- ప్రజలను ఏమార్చేందుకే కాంగ్రెస్ సర్కార్ కొత్త ప్లాన్
- రెండేళ్లుగా రాష్ట్రంలో అదే జరుగుతున్నది
- మరోమారు ప్రజలను మోసం చేసే యత్నం
- గతంలో ఇచ్చిన దరఖాస్తులకే ఇంకా దిక్కులేదు
- 800 రోజుల వైఫల్యాలను కప్పిపుచ్చుకునే వ్యూహం
- 99 రోజుల ప్రజాపాలనపై మండిపడ్డ హరీశ్ రావు



**హైదరాబాద్, మార్చి 6:** గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి తీసుకున్న లక్షలాది దరఖాస్తులు పరిష్కారం కాక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దరఖాస్తులకు ఎలాంటి దిక్కు లేదు కానీ, మళ్లీ ఇప్పుడు పది వారాల పాటు పది రకాల నాటకాలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. రెండున్నరేండ్లలో అసలు ఏం చేశారని ప్రచారం నిర్వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి మీ వైఫల్యాలు మీరే ప్రచారం చేసుకుంటారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై హరీశ్ రావు మండిపడ్డారు.

### డైవర్షన్ ప్లాన్ తో డ్రామాలు

యాక్షన్ ప్లాన్ పేరిట పాలనా వైఫల్యం నుంచి దృష్టి మరల్చేందుకు డైవర్షన్ ప్లాన్ తో సరికొత్త డ్రామాకు తెర తీశారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఇదంతా కేవలం ప్రచారం కోసమేనని, దీనివల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని అన్నారు. దాదాపు 800 రోజుల పాలనలో చేసిందేం లేక, 99 రోజుల ప్రణాళిక పేరిట రేవంత్ రెడ్డి మరో డ్రామాకు తెరతీశారని ఆరోపించారు. రెండున్నరేండ్ల పాలన పూర్తయిన తర్వాత ఇప్పుడు ప్రగతి ప్రణాళికలు గుర్తుకు వచ్చాయా అంటూ నిలదీశారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలనా వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాములు, ప్రజల ఛీత్కారాల నుంచి దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మరో డైవర్షన్ ప్లాన్ ఇదని తీవ్రంగా విమర్శించారు.

### రైతులు, యువతకు మోసం

కోతల సమయం వచ్చినా ఈ సీజన్ కు సంబంధించి ఇప్పటి వరకు రైతు భరోసాకు దిక్కు లేదని హరీశ్ రావు గుర్తు చేశారు. గత సీజన్ పంట బోనస్ ఇవ్వక చేతులెత్తేశారని మండిపడ్డారు. చివరకు యూరియా కూడా సక్రమంగా సరఫరా చేయలేక రైతులను నడిరోడ్డు మీదకు ఈడ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. నమ్మించి గొంతు కోసిన ఈ మోసాల గురించి పల్లెల్లో రైతులకు వివరిస్తారా అని నిలదీశారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చాక యువతను నిలువునా మోసం చేశారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ను కాస్తా జాబ్ లెస్ క్యాలెండర్ గా మార్చేశారని ఎద్దేవా చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా మూసీ బ్యూటిఫికేషన్ పేరిట ప్రజాధనం లూటీకి తెగబడ్డారని ఆరోపించారు.

### పబ్లిసిటీ గారడీలను గమనిస్తున్నారు

రాజీవ్ యువ వికాసం పేరిట తీసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయో, వాటికి ఎందుకు దిక్కు లేకుండా పోయాయో చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. అవన్నీ పక్కనపెట్టి యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం అంటూ కాంగ్రెస్ నేతలు కొత్త పాట పాడుతున్నారని దుయ్యబట్టారు. అందని గ్యారెంటీల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది బాధితుల సంగతేంటో ముందు చెప్పాలన్నారు. సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ అడ్డుకట్ట లాంటివన్నీ పత్రికల్లో పబ్లిసిటీ ఇచ్చుకునేందుకు పెట్టుకున్న పేర్లు తప్ప, వీటి అమలులో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. పాలన గాలికి వదిలేసి పబ్లిసిటీ పేరిట చేస్తున్న మీ గారడీలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ఈ దుర్మార్గ పాలనను నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్ధంగా ఉన్నారని హరీశ్ రావు హెచ్చరించారు.

# సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక లాంఛనం





**హైదరాబాద్, మార్చి 6:** రాజ్యసభ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాల పరిశీలన శుక్రవారం పూర్తయింది. ఈ సందర్భంగా ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన సాయి అనే వ్యక్తి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక దాదాపు ఏకగ్రీవం కానుంది.

### స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

రాజ్యసభ అభ్యర్థిగా బలపరుస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు నామినేషన్ పత్రాలపై తప్పనిసరిగా ఉండాలని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. కానీ ఆ సంతకాలు సాయి దాఖలు చేసిన నామినేషన్ పత్రాలపై లేవని అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చారు. నిబంధనల ప్రకారం కనీస మద్దతు లేకపోవడం వల్ల ఈ పత్రాలను తిరస్కరించినట్లు వారు తెలిపారు.

### సింఘ్వీ, వేం ఏకగ్రీవం

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎన్నిక లాంఛనంగా మారింది. అభిషేక్ మను సింఘ్వీకి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వరుసగా మరోసారి అవకాశం కల్పించింది. ఇక రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని తొలిసారిగా రాజ్యసభకు ఎంపిక చేసింది.

### వేం వైపే అధిష్ఠానం మొగ్గు

రాజ్యసభ సీటు ఒకటి అభిషేక్ మను సింఘ్వీకి కేటాయిస్తున్నట్లు పార్టీ అధిష్ఠానం గతంలోనే ప్రకటించింది. ఇక మరో రాజ్యసభ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో చాలా మంది నేతలు తీవ్రంగా పోటీ పడ్డారు. దాదాపు 16 మందితో కూడిన జాబితాను సిద్ధం చేసి సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తీసుకు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతో ఆయన సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి వివాదరహితుడు కావడంతో ఆయన వైపు అధిష్ఠానం మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి!

కాట్రియాల గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు
ప్రారంభించిన సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా
ప్రజా పాలన ప్రగతి నివేదికలో భాగంగా చెత్తాచెదారం తొలగింపు
పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన
పాల్గొన్న ఉప సర్పంచ్, గ్రామపంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు



**రామాయంపేట, మార్చి 6 (మనసులో మాట):**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా తెలిపారు. ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారం, రోడ్ల మీదికి వచ్చిన చెట్ల పొదలను సిబ్బందితో తొలగించారు. వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ విధిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ సూచించారు. ఎవరికి వారు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాబు నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, వార్డు సభ్యులు, స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి నడిపితే కఠిన చర్యలు!

వెల్దుర్తిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
వాహనదారులను హెచ్చరించిన ఎస్సై రాజు
ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ఆదేశాలతో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం
ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్, కారులో సీట్ బెల్ట్ తప్పనిసరి
ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్




**వెల్దుర్తి, మార్చి 6:** మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వెల్దుర్తి ఎస్సై రాజు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాల వద్ద 'అరైవ్ అలైవ్' కార్యక్రమం నిర్వహించి రోడ్డు భద్రతపై వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే వెంటనే ఆయా వాహనాలను సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తరచుగా ప్రమాదాలు జరిగి, అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు కచ్చితంగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడిపినా, మద్యం సేవించి డ్రైవింగ్ చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రజా పాలనలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో పనుల పరిశీలన
పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై ఎంపీడీవో రవీందర్ రావు సమీక్ష
తిరుమలాపూర్, రంగధాముని పల్లిలో అధికారుల తనిఖీలు



**గొల్లపల్లి, ఫిబ్రవరి 6 (మనసులో మాట):**

ప్రజా పాలన ఉ ప్రగతి ప్రణాళికలో భాగంగా గొల్లపల్లి మండలంలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీడీవో రవీందర్ రావు, ఎంఈఓ రాజేందర్, ఎంపీఓ ప్రదీప్.. తిరుమలాపూర్ గ్రామపంచాయతీ, రంగధామునిపల్లితో పాటు స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా గ్రామాల్లో చేపట్టిన వివిధ పారిశుద్ధ్య, అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించారు. అలాగే రంగధామునిపల్లి గ్రామంలోని సర్వ శిక్షా అభియాన్ పాఠశాల పనుల పురోగతిని కూడా సమీక్షించారు. గ్రామంలో అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, కొనసాగుతున్న ఇతర కార్యక్రమాలపై అధికారులతో చర్చించి, వాటి అమలు తీరును పర్యవేక్షించారు.

# మంత్రిని కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వక కలయిక
- రామాయంపేట పట్టణ అభివృద్ధిపై మంత్రితో సుదీర్ఘ చర్చ
- పుష్పగుచ్ఛం అందజేసిన చైర్ పర్సన్ లావణ్య నాగరాజు, కౌన్సిలర్లు
- పట్టణాభివృద్ధికి సహకారం అందించాలని విన్నపం
- సానుకూలంగా స్పందించిన మంత్రి వివేక్ వెంకటస్వామి




**రామాయంపేట, మార్చి 6 (మనసులో మాట):**

మెదక్ జిల్లాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి, జిల్లా ఇన్ చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిని రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గడవాడ లావణ్య నాగరాజు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## పట్టణ అభివృద్ధిపై చర్చ

ఈ సందర్భంగా రామాయంపేట పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న మున్సిపల్ సేవలు, పట్టణానికి అవసరమైన మౌలిక వసతుల గురించి మంత్రితో వారు సుదీర్ఘంగా చర్చించారు. పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా సహకారం అందించాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఈ సందర్భంగా మంత్రిని కోరారు.

## అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

దీనిపై మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రామాయంపేట పట్టణ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోచమ్మల నవనీత గణేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వాహనదారులకు ఉచిత కంటి వైద్య శిబిరం

- 'అరైవ్ అలైవ్' లో భాగంగా బిచ్కుందలో కార్యక్రమం
- లయన్స్ క్లబ్ బోధన్ సహకారంతో నిర్వహణ
- ప్రమాదాలు విధి రాత కాదు.. మన నిర్లక్ష్యమే అన్న డీఎస్పీ విట్టల్ రెడ్డి
- డ్రైవర్లు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచన
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలని హెచ్చరిక
- పాల్గొన్న సీఐ రవికుమార్, ఎస్సై రాజు, 120 మంది ఆటో డ్రైవర్లు



**బిచ్కుంద, మార్చి 6 (మనసులో మాట):**

రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా కామారెడ్డి జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'అరైవ్ అలైవ్' (2026) రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా.. శుక్రవారం బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బాన్సువాడ డీఎస్పీ బి. విట్టల్ రెడ్డి ఆధ్వర్యంలో, బిచ్కుంద సీఐ రవికుమార్, ఎస్సై రాజు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ బోధన్ ప్రతినిధులు తమ పూర్తి సహకారాన్ని అందించారు.

## ప్రమాదాలు విధి రాత కాదు..

ఈ సందర్భంగా బాన్సువాడ డీఎస్పీ బి. విట్టల్ రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు అనేవి విధి రాత కాదని, అవి కేవలం మన నిర్లక్ష్యం వల్ల కలిగే ఫలితాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రమాదం వెనుక ఒక కుటుంబం కన్నీరు ఉంటుందని, ప్రమాదాలు కుటుంబాలను ఆర్థికంగా, మానసికంగా కుంగదీస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా భావించి పాటించినప్పుడే సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలమని పిలుపునిచ్చారు.

## కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ముఖ్యంగా డ్రైవర్ల ఆరోగ్యానికి సంబంధించి డీఎస్పీ కీలక సూచనలు చేశారు. వయస్సు పెరిగే కొద్దీ కంటి చూపు మందగించడం సహజమని, ప్యాసింజర్ వాహనాలను నడిపే డ్రైవర్లు తమ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చే బాధ్యత డ్రైవర్లపైనే ఉందని, చూపు సమస్యలతో వాహనం నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులను అలవాటు చేసుకోవాలని సూచించారు.

## ఉల్లంఘిస్తే కఠిన చర్యలే

ఈ శిబిరంలో సుమారు 120 మంది ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదని అవగాహన కల్పించారు. అతివేగం, ఓవర్ లోడింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ వాడటం లాంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వైద్య బృందం, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.




# రామాయంపేటలో 'ప్రజా పాలన -ప్రగతి నివేదిక'

- మున్సిపాలిటీలో 99 రోజుల కార్యక్రమానికి శ్రీకారం
- ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య నాగరాజు

**రామాయంపేట, మార్చి 6 (మనసులో మాట):**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ఉ ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా లాంఛనంగా ప్రారంభించారు.

## మెరుగైన సేవల కోసమే..

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రజా పాలన ప్రతిజ్ఞ చేశారు. రామాయంపేట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## స్వచ్ఛ మున్సిపాలిటీగా..

పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని మరింతగా ప్రోత్సహిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ తెలిపారు. స్వచ్ఛమైన మున్సిపాలిటీ నిర్మాణానికి ప్రజలందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రఘువరన్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీత, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, భైరం స్వప్న, రవి నాయక్, దేవుని రంజిత్, మద్దెల మాధవి, కుక్కు ప్రవీణ్, దాకి శ్యామలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఆధునిక ప్రెస్ క్లబ్ నిర్మాణానికి చర్యలు

## మంత్రి పొంగులేటి



**మనసులో మాట, ఖమ్మం:** ఖమ్మం జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన ఆధునిక ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శనివారం ఖమ్మంలోని తన నివాసంలో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ప్రతినిధులు మంత్రిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ప్రెస్ క్లబ్ భవనం జర్నలిస్టుల అవసరాలకు సరిపోవడం లేదని, పార్కింగ్ మరియు సమావేశాలకు స్థలాభావం ఉందని తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సౌకర్యార్థం ఆధునిక హంగులతో కొత్త భవనాన్ని నిర్మిస్తామని, ఇందుకోసం తగిన స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గ కేంద్రాల్లో ప్రెస్ క్లబ్ భవనాలు పూర్తయ్యే వరకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను లేదా ఇందిరమ్మ మోడల్ హౌస్‌లను తాత్కాలికంగా కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన 'తెలంగాణ మీడియా అక్రిడేషన్ రూల్స్‌ఉ 2025' వల్ల క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను యూనియన్ నాయకులు మంత్రికి వివరించారు. ముఖ్యంగా చిన్న పత్రికలకు అక్రిడేషన్ కార్డుల మంజూరు, ఫోటోగ్రాఫర్లు, డెస్క్, వెబ్‌సైట్ మరియు కేబుల్ టీవీ జర్నలిస్టులకు కార్డుల కేటాయింపుతో పాటు వివిధ బీట్లలో పనిచేస్తున్న జర్నలిస్టులకు గుర్తింపు కార్డుల సంఖ్య పెంచాలని కోరారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. అలాగే జిల్లా అక్రిడేషన్ కమిటీలో డబ్ల్యూజేఐ ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరగా, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కో-కన్వీనర్లు యెన్నబోయిన శ్రీనివాసరావు, అమరనేని రామకృష్ణ, నియోజకవర్గ కన్వీనర్ కళ్యాణ్ చక్రవర్తి, నాయకులు బొడ్డుపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్య అభివృద్ధికి సకల సదుపాయాలు

## ఎంపీ గడ్డం వంశీకృష్ణ




**మనసులో మాట, మంచిర్యాల:** రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం సకల సదుపాయాలు కల్పిస్తోందని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్సులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ రేఖ, జగతీ దేవిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎంపీ నిధుల నుంచి రెండు బస్సులు, డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి ఒక బస్సు కలిపి మొత్తం రూ. 80 లక్షలతో వీటిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ వైద్య విద్య అభ్యసిస్తున్నారని, ఉన్నత చదువులు చదివి విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలు నిలుపుదల ద్వారా రైల్వే శాఖకు ఈ ప్రాంతం నుండి అధిక ఆదాయం సమకూరుతుందని, విద్యారంగాన్ని పటిష్టపరిచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల కోసం ఇప్పటికే నూతన శాశ్వత భవనాన్ని నిర్మించామని, ప్రస్తుతం దాదాపు వెయ్యి మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వైద్య విద్యకు అవసరమైన తరగతి గదులు, ల్యాబ్స్, ఫ్యాకల్టీ వంటి అన్ని వసతులను సమకూర్చామని, జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రిని కూడా త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఖరీదైన వైద్య విద్యను అర్హత గల పేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ వైద్యులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల హెచ్‌ఓడీ శ్రీకాంత్, ఏడీ తులసీదేవి, డీసీసీ ప్రతినిధి రఘునాథ్ రెడ్డి మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి చర్యలు

## మంత్రి గడ్డం వివేకానంద



**మనసులో మాట, మంచిర్యాల:** ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని రాష్ట్ర కార్మిక, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. శుక్రవారం చెన్నూర్ మున్సిపాలిటీలోని 3వ వార్డులో నిర్వహించిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు సాగే ఈ ప్రణాళికను గ్రామ, మండల, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిల్లో పకడ్బందీగా అమలు చేస్తామని వివరించారు. ముఖ్యంగా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, అధికారులు ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓపికగా విని పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. డిఎంఎఫ్ టి, సిఎస్ ఆర్ నిధుల సహకారంతో చెన్నూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఒక మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలో చేపట్టిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, వీటిని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజాపాలన ప్రతిజ్ఞ చేయించిన అనంతరం, మంత్రి వివేకానంద పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్ అభివృద్ధి కోసం రూ. 50 లక్షల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రంజాన్ మాసం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ నాయకపు వినయ్ కుమార్, కౌన్సిలర్ అంబటి శంకర్ మరియు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

## కలెక్టర్ పి. ప్రావిణ్య



**మనసులో మాట, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని మంగపూర్ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించిన కలెక్టర్, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనులను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ఉ ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతి గ్రామంలోని అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి, వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. స్లాబ్ పనులు పూర్తయిన ఇళ్లకు త్వరగా గృహప్రవేశాలు నిర్వహించి, లబ్ధిదారులు తమ సొంత ఇళ్లలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. నీటి వనరులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట్ల బోర్ల మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని పేర్కొన్నారు. దీని తర్వాత కలెక్టర్ కసాల గ్రామంలోని డీసీఎంఎస్ ఎఫ్ఎస్‌సీ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువుల నిల్వలను పరిశీలించడంతో పాటు రికార్డులు, స్టాక్ బోర్డు వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన సాగు ఉత్పాదకాలను అందించాలని, వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంగపూర్ సర్పంచ్ మన్నే రాధా, ఎంపీడీఓ శంకర్, డిప్యూటీ తహశీల్దార్ కరుణాకర్, ఆర్ఐలు హరిబాబు, రాహుల్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఆడే గజేందర్‌కు ఘన సన్మానం

**మనసులో మాట,, ఇచ్చోడ:** కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జీ ఆడే గజేందర్‌ను ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేష్, మాన్కపూర్ సర్పంచ్ మడావి భీంరావు, దుబార్‌పేట్ సర్పంచ్ కాత్లే విఠల్, కామగిరి సర్పంచ్ శ్రీధర్‌లు ఘనంగా సన్మానించారు. నియోజకవర్గానికి ఆయన చేస్తున్న సేవలను అభినందిస్తూ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కోటేష్ మాట్లాడుతూ ఇచ్చోడ మండలం ఎదుర్కొంటున్న పలు సమస్యలను నియోజకవర్గ ఇంచార్జీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, కల్వర్టులు వంటి అత్యవసర పనులకు నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు. గిరిజన గ్రామాలు, తండాల అభివృద్ధి మనందరి బాధ్యత అని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దోషులు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందే



**మనసులో మాట, తిర్యాణి:** దోషులు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అజ్మీర శ్యాం నాయక్ అన్నారు. తిర్యాణి మండలంలోని తలండి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రామాలయం ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రామచందర్ నివాసంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి కార్యకర్త నిస్వార్థంగా పార్టీ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలోని కొందరు మోసపూరిత వ్యక్తులను ఇటీవలే పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. ఇకపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిస్వార్థంగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కృషి చేయాలని సూచించారు. అర్హులైన పేదలకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే త్వరలోనే కాంగ్రెస్ పార్టీ కొత్త మండల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. గౌరవం అనేది డబ్బుతో రాదని, ప్రజలతో కలిసి ఉండి వారి సమస్యలను పరిష్కరించడంలోనే నిజమైన గౌరవం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వేముల హేమలత, జిల్లా నాయకులు అంకం గౌరయ్య, శోభన్, బుర్ర రమేష్, కూన సురేష్, బొల్లం రాజు, పెందోర్ ధర్ము, మంగి అచ్యుత్ రావు, భోగి శంకర్, తట్ల రాజ్ రెడ్డి, మాడవి దౌలత్ రావు, ఆవునూరి రవి, రెబ్బెన మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ దుర్గం సోమయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పది పరీక్షలు విద్యార్థుల జీవితంలో కీలక ఘట్టం



**మనసులో మాట, సత్తుపల్లి:** పదో తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో కీలక ఘట్టమని ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఆశా స్వచ్ఛంద సేవా సంస్థఉ సత్తుపల్లి, బంగారు తల్లి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేజర్ల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ ఎన్టీఆర్ కాలనీ వేదికగా నిర్వహించిన ఈ సదస్సులో రేజర్ల, ఎన్టీఆర్ కాలనీ, సదాశివపాలెం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఉమ్మడిగా పరీక్షల భయాన్ని పోగొట్టే చిట్కాలను వివరించారు. అనంతరం కల్లూరు జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థినుల కోసం ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించారు. పరీక్షలు విద్యార్థుల జీవితంలో కీలకమైన ఘట్టమని, భయాన్ని వీడి ఏకాగ్రతతో చదివితే ప్రతి విద్యార్థి విజయం సాధించగలరని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా కార్పొరేట్ స్థాయికి ధీటుగా రాణించాలనే లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సమయపాలన పాటిస్తూ క్రమశిక్షణతో తమ లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## అంగన్వాడి కేంద్రాల్లో అక్షరాభ్యాసం, అన్నప్రాసన

**మనసులో మాట, తాండూర్:** తాండూర్ సెక్టార్ పరిధిలోని రేచిని గ్రామంలో ఉన్న 1, 2, 4, 5 అంగన్వాడి కేంద్రాల్లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రేచిని సర్పంచ్ పోతురాజుల రాంబాయి, వార్డు సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ రమాదేవి మాట్లాడుతూ గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా పుట్టి ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. అనంతరం చిన్నారుల బరువులు, ఎత్తులు కొలిచారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్ఎంలు, చిన్నారులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## గజదొంగపై 'పీడీ యాక్ట్' నమోదు

### నిందితుడు చెర్లపల్లి జైలుకు తరలింపు



**మనసులో మాట, ఆదిలాబాద్:** వరుస గృహ చోరీలతో ఉత్తర తెలంగాణ జిల్లాలను వణికించిన గజదొంగ చౌహాన్ రవిపై తెలంగాణ ప్రభుత్వం కఠినమైన 'పీడీ యాక్ట్' (గ్రాణ చాఫ్) నమోదు చేసింది. నిందితుడి నేర చరిత్ర, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పంపిన సిఫార్సుల మేరకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు మావల సీఐ కర్రె స్వామి శనివారం వెల్లడించారు. మావల ప్రాంతంలోని కెఆర్కే కాలనీకి చెందిన చౌహాన్ రవి పక్కా ప్రణాళికతో దొంగతనాలకు పాల్పడేవాడు. 2023 నుంచి 2025 మధ్య కాలంలో ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, మహబూబాబాద్, నిర్మల్ జిల్లాలతో పాటు వరంగల్, రామగుండం, రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఇతనిపై మొత్తం 18 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది బెయిల్పై విడుదలైన తర్వాత కూడా తన బుద్ధి మార్చుకోకుండా, కేవలం 2025 మే నుంచి జూలై మధ్య (తొమ్మిది వారాల్లోనే) ఆదిలాబాద్ జిల్లాలో మరో 8 ఇళ్లలో చోరీలకు పాల్పడటం గమనార్హం. నిందితుడు తన గ్యాంగ్ సభ్యులైన ఆర్య హన్మంత్ దేవకర్, మార్కులే అనిల్తో కలిసి తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకునేవాడు. ఇళ్లలో ఎవరూ లేని సమయాన్ని చూసి ఇనుప రాడ్లతో తాళాలు పగులగొట్టడం, దుకాణాల షట్టర్లు ఎత్తి నగదు అపహరించడం వంటి నేరాలకు పాల్పడేవాడు. మావల, జైనథ్, ఇచ్చోడ, ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇతను లక్షల రూపాయల విలువైన బంగారు, వెండి ఆభరణాలు మరియు నగదును అపహరించినట్లు పోలీసులు తెలిపారు. అనేకసార్లు అరెస్టై జైలుకు వెళ్లినా, బయటకు వచ్చిన వెంటనే మళ్లీ నేరాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నేపథ్యంలో పోలీసులు పీడీ యాక్ట్ అస్త్రాన్ని ప్రయోగించారు. ప్రస్తుతం ఇచ్చోడ కేసులో ఆదిలాబాద్ జైలులో ఉన్న నిందితుడిని హైదరాబాద్లోని చెర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. నేరాలకు పాల్పడే వారిపై జిల్లా పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటుందని సీఐ హెచ్చరించారు.

## రాజ్యసభ సభ్యుడికి శుభాకాంక్షలు



**మనసులో మాట, సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన వేం నరేంద్ర రెడ్డిని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్లోని తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలోని ప్రత్యేక ఛాంబర్లో ఈ భేటీ అయ్యారు. తెలంగాణ హక్కులు, రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంటులో వేం నరేంద్ర రెడ్డి బలమైన గొంతుకగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుల మృతి

**మనసులో మాట, సత్తుపల్లి:** ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన విషాద ఘటన సత్తుపల్లి మండలం సదాశివుని పాలెం గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగింది. సత్తుపల్లి మండలం సిద్దారం గ్రామానికి చెందిన గద్దల కార్తీక్ (18), గంధం మనోజ్ (16) బైక్పై సదాశివుని పాలెం గ్రామానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో సదాశివుని పాలెం సమీపంలో రోడ్డుపక్కన నిలిపి ఉంచిన ట్రాక్టర్ ట్రక్కును వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు ఘటనాస్థలంలోనే మృతి చెందారు. ఇద్దరూ ఒకే గ్రామానికి చెందినవారు కావడంతో సిద్ధారం గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# పల్లె ముంగిటకే 'స్పెషలిస్ట్' వైద్యం

### నేరడిగొండలో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి



**మనసులో మాట, నేరడిగొండ:** గ్రామీణ ప్రాంత ప్రజలకు నిపుణులైన వైద్యులతో కూడిన మెరుగైన చికిత్సను వారి ఇంటి ముంగిటకే చేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన 'స్పెషలిస్ట్ మెడికల్ క్యాంప్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గతంలో స్పెషలిస్ట్ వైద్యం కావాలంటే గ్రామీణులు పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేదని, ఆ ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం రిమ్స్ నుంచి ఆరుగురు నిపుణులైన వైద్యులను నేరుగా పల్లెలకే పంపిస్తోందని పేర్కొన్నారు. మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, క్యాన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులకు ఇక్కడ ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన బాధితులకు రిమ్స్లో మెరుగైన చికిత్స అందేలా ఏర్పాట్లు చేస్తామని, ఇలాంటి శిబిరాలను ప్రతినెలా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించి ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని హామీ ఇచ్చారు. వైద్య సేవల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. "ప్రతి విభాగం అధిపతి ఉదయం రాగానే బయోమెట్రిక్ వేయడంతో పాటు వాట్సాప్ ద్వారా తమ హాజరు రిపోర్ట్ చేయాలన్నారు. సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే బోథ్, ఇంద్రవెల్లి ప్రాంతాల్లో త్వరలోనే డయాలసిస్ సెంటర్లను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అని పేర్కొంటూ.. ప్రజలు జొన్న రొట్టెలు, పప్పు వంటి పోషకాహారం తీసుకోవాలని, నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని, డయాలసిస్ సెంటర్ల ఏర్పాటును వేగవంతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ మండలాల వారీగా ముందస్తు ప్రణాళికతో ఈ క్యాంపులను నిర్వహిస్తున్నామని, ప్రతి రోగి ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేసి ఫాలోఅప్ చేస్తున్నామని వివరించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే టీబి బాధితులకు కిట్లను అందజేశారు. కార్యక్రమానికి ముందు మంత్రికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎస్పీ అఖిల్ మహాజన్లు పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాజీ వేణుగోపాలచారి, స్థానిక సర్పంచ్ ఏలేటి నీలిమ, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాథోడ్ నరేందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రణాళికను విజయవంతం చేయాలి

### 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను పక్కాగా అమలు చేయాలి

### ఫైళ్ల పెండింగ్పై మంత్రి జూపల్లి కృష్ణారావు సీరియస్





**మనసులో మాట, మంచిర్యాల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్ సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల క్లియరెన్స్పై ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. "ఏ కార్యాలయంలోనైనా ఫైళ్లు 15 రోజుల కంటే ఎక్కువ పెండింగ్లో ఉండకూడదు. ప్రతి కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాల్లో ఫైళ్ల క్లియరెన్స్ కోసం ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహించాలి" అని మంత్రి స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని అధికారులను అప్రమత్తం చేశారు. భూభారతి దరఖాస్తులు, అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణాలు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నివేదికలను త్వరితగతిన సిద్ధం చేయాలన్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే 99 రోజుల ప్రణాళికను శాఖల వారీగా సిద్ధం చేశామని తెలిపారు. పారిశుద్ధ్య పనులు ప్రారంభమయ్యాయని, ఈ–ఆఫీస్ ద్వారా ఫైళ్లను పరిష్కరిస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అమృత్ పథకం పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు, వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### మంత్రి జూపల్లి కృష్ణారావు



**మనసులో మాట, ఆదిలాబాద్:** విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ. 4.90 కోట్లతో నూతనంగా నిర్మించిన బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా గురుకులాలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన భవన సముదాయాన్ని, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తుందని, అందుకోసం ప్రత్యేకంగా రూ. 25 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యా వికాసానికి సహకరిస్తున్న ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, ఎంపీ గోడెం నగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్ పర్సన్ అనూష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీ రావ్ పాటిల్, ఆర్డీఓ స్రవంతి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పది విద్యార్థులకు 14416 టోల్ ఫ్రీ సేవలు



**మనసులో మాట, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండల విద్యాధికారికార్యాలయంలో శుక్రవారం ఎస్సెస్సీ పరీక్షలకు సంబంధించిన 14416 విద్యార్థి హెల్ప్లైన్ పోస్టర్ను అధికారికంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాథోడ్ ఉదయ్ రావ్, ఎంఎన్ఓ గోపాల్ సింగ్, కాంప్లెక్స్ హెచ్ఎంలు సంతోష్, దేవదాస్తో పాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ ప్రజాపాలనఉవిద్యా ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎస్సెస్సీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని తగ్గించుకోవడానికి, సందేహాలు నివృత్తి చేసుకోవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 14416 టోల్ ఫ్రీ హెల్ప్లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ హెల్ప్లైన్ ద్వారా విద్యార్థులకు నిపుణుల నుంచి మార్గదర్శనం, కౌన్సెలింగ్, పరీక్షలపై అవసరమైన సమాచారం అందుబాటులో ఉంటుందని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు 14416 నంబర్కు కాల్ చేసి సహాయం పొందవచ్చని చెప్పారు. విద్యార్థులు ప్రశాంతంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# శాస్త్ర సాంకేతిక రంగానికి పూర్తి ప్రోత్సాహం

**మంత్రి శ్రీధర్ బాబు**

**మేడిపల్లిలో నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీస్ కార్యాలయం ప్రారంభం**

**యువ శాస్త్రవేత్తలతో కలిసి పరిశోధనలు చేయాలి**

**కొత్త పేటెంట్లు పొందేలా కృషి చేయాలని పిలుపు**

**20 ఏళ్లుగా సేవలందిస్తున్న సంస్థపై ప్రశంసలు**

**కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు**



**మేడ్చల్, మార్చి 6 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్రంలో శాస్త్ర సాంకేతిక రంగానికి సంబంధించిన నూతన పరిశ్రమలకు పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందిస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మేడ్చల్ జిల్లా బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లిలో నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీస్ నూతన కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు.

**యువ శాస్త్రవేత్తల కృషి అభినందనీయం**

గత ఇరవై ఏళ్లుగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ యువ శాస్త్రవేత్తలు, ఉత్సాహవంతులతో కలిసి పనిచేస్తున్న నెక్స్ట్ జనరేషన్ సంస్థ పనితీరును మంత్రి అభినందించారు. ఎలక్ట్రానిక్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో కొత్త పరిశోధనలు చేస్తూ నూతన పేటెంట్లు పొందేలా యంగ్ సైంటిస్టులతో కలిసి నిరంతరం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యుడు సతీష్ రెడ్డి, నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీస్ ఛైర్మన్ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఎల్లవేళలా సహకరిస్తుందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు.

# మహిళల ఆరోగ్యమే ధ్యేయంగా ప్రగతి ప్రణాళిక!



**పెద్దపల్లి, మార్చి 6 (మనసులో మాట):**

పెద్దపల్లి మండలం రాఘవాపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీ కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ఈ ప్రణాళిక నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. కల్తీ ఆహారం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయని, నూనె వాడకం తగ్గించి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. జబ్బులు ముదిరే వరకు వేచి చూడకుండా తొలి దశలోనే పరీక్షలు చేయించుకొని మెరుగైన చికిత్స పొందాలని కోరారు. షుగర్, బీపీ వంటి వ్యాధులను ఆహార నియమాలతో అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, పేద ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు. కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మారుస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, అధికారులు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బిచ్కుందలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ!



**బిచ్కుంద, మార్చి 6 (మనసులో మాట):**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో శుక్రవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పథకం కింద మంజూరైన లబ్ధిదారు రజియా బేగంతో కలిసి కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఇల్లు లేని పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రతి పేదవాడి సొంత ఇంటి కల నెరవేరుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాహెల్ సెట్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయిని అశోక్, కౌన్సిలర్లు ముజాహిద్, నౌష నాయక్, సీమ గంగారం, యువ నాయకుడు జాదవ్ సుచిత్ కుమార్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సులబ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శ్రీకారం

- చౌరస్తాలో ప్రయాణికుల ఇబ్బందులకు చెక్
- ముఖ్యంగా మహిళల కష్టాలను తీర్చనున్న మూత్రశాలలు
- అఖిల పక్ష నాయకుల పోరాట ఫలితం
- ప్రొసీడింగ్ కాపీ అందజేసిన ఎంపీడీవో మేనకా పాడేల్



**జనగామ, మార్చి 6 (మనసులో మాట):**

దేవరుప్పుల మండల కేంద్రానికి వివిధ మండలాల నుండి నిత్యం అనేక మంది ప్రజలు తమ పనుల నిమిత్తం వస్తూ పోతుంటారు. ప్రయాణికులు సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇక్కడి చౌరస్తాలో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. అయితే ఇక్కడ కనీస మూత్రశాల వసతి లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ చిరకాల సమస్యకు నేటితో పరిష్కారం దొరకబోతోంది.

**అఖిల పక్ష పోరాట విజయం**

పాత బస్టాండ్ స్థలంలోనే సులబ్ కాంప్లెక్స్ నిర్మించాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అఖిల పక్ష నాయకులు బస్టాండ్ ఆవరణలో పెద్ద ఎత్తున ధర్నాలు చేశారు. ప్రజల కష్టాలను గుర్తించిన ప్రస్తుత అధికారులు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. ఎంపీడీవో మేనకా పాడేల్ ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ కు అందజేశారు. అనుమతి పత్రం అందిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ సులబ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రయాణికుల కష్టాలను త్వరలోనే తీరుస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఈసి మోహన్, టీఏలు నర్సింహా, యాదగిరి పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రణాళికను సక్సెస్ చేద్దాం

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..**



**కరీంనగర్, మార్చి 6 :** సన్నాక సమావేశంలో పాల్గొన్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎంపీ ,ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, ఆయా జిల్లాల కలెక్టర్లు, సిపి ఎస్పీలు అదనపు కలెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో 99 రోజులపాటు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ యంత్రాంగము ప్రజా ప్రతినిధులు ప్రజలు, అందరం కలిసి విజయవంతం చేద్దామని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో తీసుకెళ్లి అగ్ర భాగాన నిలుపుతామని పేర్కొన్నారు. ఒకవైపు సంక్షేమాన్ని మరోవైపు అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం పరుగులు పెట్టిస్తున్నదని తెలిపారు. రెండున్నర సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలందరికీ వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు ,ఎమ్మెల్యేలు పెద్దపెల్లి ఎంపీ ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లు సిపి, ఎస్పీలు అడిషనల్ కలెక్టర్లు అన్ని శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇరిగేషన్, ఆర్ అండ్ బి కి సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 99 రోజులపాటు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామాలు పట్టణాల్లో ప్రధాన సమస్యలన పరిష్కారం.. రెండున్నర సంవత్సరాల ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికీ అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో దేశంలోనే మహత్తరమైన అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. దేశానికే తెలంగాణ మోడల్ అభివృద్ధిలో నిలుస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి లక్ష కోట్లు బడ్జెట్ కేటాయించిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనని పేర్కొన్నారు. అత్యధికంగా పంట పండించడంలోనూ అత్యధికంగా ధాన్యాన్ని సేకరించడం లో తెలంగాణ ప్రభుత్వానికి సాటి ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఇరిగేషన్ తోపాటు విద్యుత్ రంగంలోనూ మంచి ఫలితాలు ప్రభుత్వం సాధిస్తుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం ముందుండి 99 రోజుల పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్లు ముందుండి నడిపించాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధికారులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.సన్నాహక సమావేశంలో సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు సమష్టిగా సఫలీకృతంగా ఈ కార్యక్రమాన్ని అందరం కలిసికట్టుగా ఉంటూ 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని పూర్తి చేద్దామన్నారు. తద్వారా కరీంనగర్ జిల్లాను అగ్ర భాగాన నిలుపుదామని పేర్కొన్నారు.

# అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు

# వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి

- రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ





**హైదరాబాద్,మార్చి6:** అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న రూ. 1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి మీద ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. తద్వారా తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలు కూడా తక్కువ సమయంలోనే జాతీయ రహదారులతో అనుసంధానించామని.. ఇది చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ.265 కోట్ల వ్యయంతో ఔఉ163 (గతంలో ఔఉ-202) మీద నగరంలోని అంబర్‌పేట క్రాస్ రోడ్డు వద్ద 1.5 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల ÷÷–ల ఓవర్‌ను నిర్మించిందని గుర్తుచేశారు. 5 మే, 2025 నాడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ ఫ్లై ఓవర్‌ను ఘనంగా ప్రారంభించారని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తనతోపాటుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ ÷÷–ల ఓవర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తి కాలేదని అన్నారు. దీని నిర్మాణం జరిగి, ప్రారంభోత్సవం కూడా పూర్తి చేసుకున్నప్పటికీ దీని కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తిస్థాయిలో జరగలేదని తెలిపారు. భూసేకరణ విషయంలో కొన్ని శక్తులు అడ్డుతగులుతోండటంతో అనవసరంగా తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది 2018లో మంజూరయినప్పటికీ లేని సమస్యలు సృష్టించి భూసేకరణ పూర్తి కాకుండా కుట్రలు చేసి సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో జరగనివ్వకపోవడంతో ఈ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అప్పటి సీఎం కె. చంద్రశేఖరరావు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి అనేకసార్లు తెలియజేశానని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ మంత్రులకు స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా అనేకసార్లు తెలియజేశారని అన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, ఇతర సంబంధిత అధికారుల దృష్టికి తాను కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లి అనేకసార్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసినప్పటికీ, ఈ సమస్య ఓ కొలిక్కి రాలేదని చెప్పుకొచ్చారు. భూసేకరణకు సంబంధించిన భూమికి రూ. 2.54 కోట్ల పరిహారం లబ్దిదారులకు ప్రభుత్వం చెల్లించినప్పటికీ మధ్య దళారులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపించి, సర్వీసు రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత జీహెచ్ఎంసీ, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకొని సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించటానికి సహకరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు.







# విజయవాడలో 'దండి మార్చ్ 2.0'

## డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటించిన యువత

### దేశానికి జాతీయ పతాకాన్ని ఇచ్చింది విజయవాడ అని గర్వంగా చెప్పండి

### గాంధీజీ, కలాం స్ఫూర్తితో ముందుకు సాగాలి యువతకు ఐజీ ఆకే రవికృష్ణ పిలుపు

**విజయవాడ (మనసులో మాట):**

గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం ద్వారా బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన స్ఫూర్తితో, నేటి యువత డ్రగ్స్ మహమ్మారిపై పోరాడాలని ఏపీ ఈగల్ చీఫ్, ఐజీపీ ఆకే రవికృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం విజయవాడలోని పి.బి. సిద్ధార్థ కాలేజీలో 'వైబ్రెంట్స్ ఆఫ్ కలాం' సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన దండి మార్చ్ 2.0 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**చరిత్ర స్ఫూర్తితో నవ సమాజ నిర్మాణం:**

ఈ సందర్భంగా ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ.. 1930లో గాంధీజీ చేపట్టిన దండి యాత్ర అహింసా మార్గంలో ప్రపంచాన్నే ప్రభావితం చేసిందని గుర్తుచేశారు. అలాగే, పరిమిత వనరులతోనే అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తలు భారత్‌ను రక్షణ రంగంలో అగ్రగామిగా నిలిపారని, ఆ పట్టుదల యువతలో ఉండాలని ఆకాంక్షించారు.

**విజయవాడ గర్వకారణం - జాతీయ పతాకం**

జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య గారి గురించి ప్రస్తావిస్తూ.. "విజయవాడ దేశానికి ఏమిచ్చింది? అని ఎవరైనా అడిగితే, గర్వంగా జాతీయ పతాకాన్ని ఇచ్చిందని చెప్పండి" అని విద్యార్థులకు సూచించారు. 1921లో గాంధీజీ విజయవాడ పర్యటనలో పింగళి వెంకయ్య గారు జెండా నమూనాను అందజేసిన చారిత్రక నేపథ్యాన్ని ఆయన వివరించారు.

**'డ్రగ్స్ వద్దు బ్రో' యువత ప్రతిజ్ఞ:**

రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న "డ్రగ్స్ వద్దు బ్రో" ఉద్యమంలో యువత భాగస్వాములు కావాలని ఐజీ కోరారు. గంజాయి లేదా ఇతర డ్రగ్స్ సమాచారం తెలిస్తే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని 100 ప్రాంతాల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని గట్టిగా నినదిస్తూ ప్రతిజ్ఞ చేశారు.

**లక్ష్యం వైపు సాగాలి:**

ఈగల్ ఎస్పీ కె. నాగేష్ బాబు మాట్లాడుతూ.. ఐజీ ఆకే రవికృష్ణ జీవితమే యువతకు ఒక గొప్ప ప్రేరణ అని కొనియాడారు. మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, కుటుంబ గౌరవాన్ని నాశనం చేస్తాయని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ప్రతినిధులు, కళాశాల యాజమాన్యం, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



## వీరపాండ్య కట్టబొమ్మనగా మంత్రి దుర్గేష్

# పరకాయ ప్రవేశం



### సాంస్కృతిక ప్రదర్శనలో అదరగొట్టిన పర్యాటక శాఖ మంత్రి

**విజయవాడ (మనసులో మాట):**

బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నిరంకుశత్వాన్ని ఎదిరించిన విప్లవ వీరుడు వీరపాండ్య కట్టబొమ్మన పాత్రలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అద్భుత నటనతో అలరించారు. అసెంబ్లీ సమావేశాల ముగింపు సందర్భంగా విజయవాడలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన ప్రదర్శించిన ఈ పాత్ర అందరినీ మంత్రముగ్ధులను చేసింది.

**పోరాట పటిమకు నిదర్శనంగా ప్రదర్శన:**

శుక్రవారం సాయంత్రం పటమటలోని ఆంత్రలాక్స్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ "శాసన వ్యవస్థ" ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం "ఆటవిడుపు" క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. ఈ వేదికపై కట్టబొమ్మన ఆహార్యం ధరించి, గంభీరమైన వాచకం, రాజసంతో మంత్రి దుర్గేష్ ఆ పాత్రలో జీవించేశారు. ఆయన వేదికపైకి రాగానే సభలో చప్పట్ల వర్షం కురిసింది. మంత్రి దుర్గేష్ నటనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులు వేనోళ్ల కొనియాడారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. "దేశభక్తికి నిలువెత్తు రూపం వీరపాండ్య కట్టబొమ్మన అని, పాంచాలకురిచ్చి యుద్ధంలో ఆయన చూపిన సాహసం చిరస్మరణీయం అని కొనియాడారు. అటువంటి మహనీయుడి పాత్రను పోషించే అవకాశం రావడం తన అదృష్టమని" భావోద్వేగానికి లోనయ్యారు.

**సందడిగా 'పుణ్యభూమి నాదేశం' ప్రదర్శన**

కట్టబొమ్మన ఏకపాత్రాభినయంతో పాటు, 'పుణ్యభూమి నాదేశం నమోనమామి' పాటకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, సునీల్ కుమార్ తదితరులతో కలిసి మంత్రి దుర్గేష్ చేసిన ప్రదర్శన సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రజాప్రతినిధులందరూ తమ రాజకీయ బాధ్యతల నుంచి కాసేపు విరామం తీసుకుని, కళా ప్రదర్శనలతో ఉత్సాహంగా గడిపారు.





## గంభీర్‌కు గర్ల్‌ఫ్రెండ్‌ను పరిచయం చేసిన

# హార్దిక్ పాండ్యా!

**ఢిల్లీ:** ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్ పోరుకు రంగం సిద్ధమైంది. ఈ మెగా ఫైనల్‌లో తలపడేందుకు టీమ్ ఇండియా శుక్రవారం (మార్చి 6) సాయంత్రం అహ్మదాబాద్ చేరుకుంది. సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై అద్భుత విజయం సాధించిన ఉత్సాహంలో ఉన్న భారత్, ఇప్పుడు కివీస్‌ను ఢీకొట్టేందుకు సిద్ధమవుతోంది. ముంబైలో జరిగిన సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను 7 పరుగుల తేడాతో ఓడించిన టీమ్ ఇండియా, శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు అహ్మదాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా తమ వ్యక్తిగత కార్లలో వెళ్లగా, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇతర ఆటగాళ్లు కలిసి హోటల్‌కు చేరుకున్నారు.

### వైరల్ అవుతున్న హార్దిక్ పాండ్యా వీడియో..

ముంబై ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన ఒక వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా, తన గర్ల్‌ఫ్రెండ్ మాహికా శర్మను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు పరిచయం చేయడం ఈ వీడియోలో కనిపిస్తుంది. మాహికా శర్మ ఈ వరల్డ్ కప్ టోర్నీ అంతటా హార్దిక్ వెంటే ఉంటూ టీమిండియాను ప్రోత్సహిస్తున్నారు. సెమీఫైనల్ మ్యాచ్‌లో హార్దిక్ కుమారుడు అగస్త్యతో కలిసి ఆమె మ్యాచ్ వీక్షించారు. మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరగనున్న మ్యాచ్‌లో భారత్ గెలిస్తే పలు ప్రపంచ రికార్డులు బద్దలవుతాయి. టీమిండియా ఈ ఫైనల్ మ్యాచ్ గెలిస్తే, టీ20 వరల్డ్ కప్ చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ నెగ్గిన మొదటి జట్టుగా చరిత్ర సృష్టిస్తుంది. ఇప్పటి వరకు ఏ దేశం కూడా తమ సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్‌ను గెలవలేదు. భారత్ విజయం సాధిస్తే ఈ ఘనత సాధించిన తొలి దేశంగా చరిత్రపుటల్లో శాశ్వత కీర్తిని సొంతం చేసుకుంటుంది. ఇప్పటికే వరుసగా రెండు టీ20 వరల్డ్ కప్ ఫైనల్స్ ఆడుతున్న మొదటి జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. న్యూజిలాండ్ జట్టుకు నాకౌట్ మ్యాచ్‌ల్లో అద్భుతమైన రికార్డు ఉంది. పెద్ద మ్యాచుల్లో ఎప్పుడైనా గట్టి పోటీనిచ్చి ఫలితాన్ని తారుమారు చేసే సామర్థ్యం కివీస్‌కు ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, 1.30 లక్షల మంది ప్రేక్షకుల మధ్య హోమ్ గ్రౌండ్‌లో ఆడుతుండటం టీమిండియాకు అతిపెద్ద బలంగా చెబుతున్నారు.

# బుమ్రా కూడా మనిషే..

- న్యూజిలాండ్ ప్లేయర్ కీలక వ్యాఖ్యలు
- డెత్ ఓవర్లలో బుమ్రా యార్కర్లు పెద్ద సవాల్
- లూజ్ బాల్ వస్తే బౌండరీకి పంపేందుకు సిద్ధం: కివీస్ వ్యూహం
- వరుణ్ చక్రవర్తి స్పిన్ కూడా సవాల్




**అహ్మదాబాద్:** అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరగనున్న ఫైనల్ మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీకి తెరపడనుంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన గ్లెన్ ఫిలిప్స్, భారత బౌలింగ్ విభాగాన్ని, ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. బుమ్రాను ఒక 'ప్రపంచ స్థాయి ఆపరేటర్'గా అభివర్ణించిన ఫిలిప్స్, అతని వద్ద ఉన్న వైవిధ్యమైన బంతులు, ముఖ్యంగా డెత్ ఓవర్లలో అత్యంత ఖచ్చితత్వంతో వేసే యార్కర్లు ఏ బ్యాటర్ కైనా సవాలేనని అంగీకరించారు. అయితే, బుమ్రా అజేయుడేమీ కాదని, మిగిలిన ఆటగాళ్లలాగే అతను కూడా మనిషేనని, అతనికీ ఏదో ఒక రోజు తడబడే అవకాశం ఉంటుందని ఫిలిప్స్ వ్యాఖ్యానించారు. "బుమ్రా అత్యుత్తమ బౌలర్ అనడంలో సందేహం లేదు, కానీ అతను కూడా మనిషే. అందరిలాగే అతనికి కూడా 'బ్యాడ్ డే' ఉండొచ్చు. ఆ రోజు (ఫైనల్ మ్యాచ్) అతనికి అలాంటి రోజే కావాలని మేము కోరుకుంటున్నాము" అని ఫిలిప్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో బుమ్రా 18వ ఓవర్ వేసి కేవలం 6 పరుగులు మాత్రమే ఇచ్చి భారత్ విజయానికి బాటలు వేసిన తీరును ఆయన గుర్తు చేశారు. బుమ్రా వేసే 4 ఓవర్లను కేవలం డిఫెన్స్ ఆడుతూ వదిలేయలేమని, అతను పొరపాటున లూజ్ బాల్ వేస్తే దానిని బౌండరీకి తరలించడానికి తాము సిద్ధంగా ఉన్నామని కివీస్ వ్యూహాన్ని బయటపెట్టారు. ఒకవేళ బుమ్రా తన పదునైన బౌలింగ్‌తో కట్టడి చేస్తే, దానికి తగ్గట్టుగా మైదానంలోనే తమ ప్రణాళికలను మార్చుకుంటామని ఫిలిప్స్ స్పష్టం చేశారు. కేవలం బుమ్రా మాత్రమే కాకుండా, మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఎదుర్కోవడం కూడా తమకు కీలకమని ఫిలిప్స్ పేర్కొన్నారు. గత ద్వైపాక్షిక సిరీస్‌లలో వరుణ్‌ను ఎదుర్కొన్న అనుభవం తమకు ఉందని, బంతిని బట్టి ఆడుతూ ఒత్తిడిని అధిగమిస్తామని చెప్పారు. లక్షలాది మంది భారత అభిమానుల మధ్య, డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌ను వారి సొంత గడ్డపై ఎదుర్కోవడం 'డేవిడ్ జం గోలియత్' పోరాటంలా ఉంటుందని, కానీ తమ జట్టుకు ఒత్తిడిని తట్టుకుని నిలబడటం తెలుసని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో 2021 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో భారత్‌ను ఓడించిన జ్ఞాపకాలను కివీస్ జట్టు గుర్తు చేసుకుంటోంది. ఆదివారం జరగబోయే ఈ అమీతుమీ పోరులో బుమ్రా తన ప్రతాపం చూపిస్తాడా లేక ఫిలిప్స్ ఆశించినట్లుగా కివీస్ పైచేయి సాధిస్తుందా అన్నది వేచి చూడాలి.

## భారత్-న్యూజిలాండ్ ఫైనల్ మ్యాచ్ రద్దయితే

# విజేత ఎవరు?





**ఢిల్లీ:** 2026 టీ20 ప్రపంచ కప్ ఫైనల్ సమరానికి సర్వం సిద్ధమైంది. మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో భారత్ ఉ న్యూజిలాండ్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. అయితే, ఈ మెగా ఫైనల్‌కు వర్షం ముప్పు పొంచి ఉంటే విజేతను ఎలా నిర్ణయిస్తారు? ఐసీసీ నిబంధనలు ఏం చెబుతున్నాయి? పూర్తి వివరాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**ఫైనల్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగితే ఫలితం కోసం ఐసీసీ కింది నిబంధనలను అమలు చేస్తుంది.**

**రిజర్వ్ డే :** మార్చి 8న వర్షం కారణంగా మ్యాచ్ సాధ్యం కాకపోయినా లేదా అసంపూర్తిగా ఆగినా, మరుసటి రోజు అంటే మార్చి 9ని 'రిజర్వ్ డే'గా కేటాయించారు.

**ఆగిన చోటు నుంచే..:** ఒకవేళ మార్చి 8న టాస్ పడి, కొంత ఆట జరిగిన తర్వాత వర్షం పడితే, రిజర్వ్ డే నాడు మ్యాచ్ మళ్లీ మొదటి నుంచి కాకుండా ఆగిపోయిన పాయింట్ నుంచే కొనసాగుతుంది.

**అదనపు సమయం:** మ్యాచ్ పూర్తి చేయడానికి వీలుగా రెండు రోజులూ 120 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయిస్తారు. ఓవర్ల తగ్గింపు ద్వారా అయినా ఫలితం రాబట్టేందుకు అంపైర్లు ప్రయత్నిస్తారు.

కనీస ఓవర్లు: ఫైనల్ ఫలితం తేలాలంటే రెండు జట్లు కనీసం 10 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది.

### ఒకవేళ రెండు రోజులూ ఆట సాధ్యం కాకపోతే..

దురదృష్టవశాత్తూ మార్చి 8, 9 తేదీల్లో కూడా వర్షం కారణంగా మ్యాచ్ పూర్తి కాకపోతే, ఐసీసీ నిబంధనల ప్రకారం భారత్ ఉ న్యూజిలాండ్ జట్లను 'సంయుక్త విజేతలు'గా ప్రకటిస్తారు. గతంలో 2002 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్-శ్రీలంక మధ్య ఇలాగే టైటిల్‌ను పంచుకోవడం జరిగింది. అయితే టీమ్ ఇండియా వరుసగా రెండోసారి టీ20 ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించాలని పట్టుదలతో ఉంది. ఇప్పటివరకు ఏ జట్టు కూడా వరుసగా రెండు టైటిళ్లు నెగ్గలేదు. కానీ ఐసీసీ టోర్నీల్లో న్యూజిలాండ్‌పై భారత్‌కు అంత మంచి రికార్డు లేదు. ఇప్పటివరకు టీమ్ ఇండియా టీ20 ప్రపంచ కప్‌లో కివీస్‌ను ఓడించలేదు. ఈసారి ఆ రికార్డును తిరగరాయాలని టీమిండియా భావిస్తోంది. ఇదే సమయంలో తొలిసారి టీ20 ప్రపంచ కప్ ట్రోఫీని ముద్దాడాలని న్యూజిలాండ్ కూడా ఎంతో కసితో ఉంది.

# మహ్మద్ అమీర్ కన్నా ఊసరవెల్లి నయం

### భారత్ విజయంతో మాట మార్పు..

**ఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్‌లో భారత్ ఫైనల్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. గురువారం ఇంగ్లాండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో భారత్ 7 పరుగుల తేడాతో గెలిచింది. అయితే, భారత్ సెమీస్‌లో గెలవదు, అసలు సెమీస్‌కే చేరదు అంటూ పాకిస్తాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ అమీర్ అవాకులు చెవాకులు పేలాడు. భారత్‌పై తన అక్కసును వెళ్లగక్కాడు. ప్రస్తుతం భారత్ ఫైనల్స్‌కు చేరడంతో మాట మార్చాడు. సోషల్ మీడియాలో అమీర్‌పై నెటిజన్లు తెగ ట్రోలింగ్ చేస్తున్నారు. టీమిండియాను ఇంగ్లాండ్‌ను ఓడించి ఫైనల్ చేరిన తర్వాత అమీర్‌ను ఆయన చేసిన కామెంట్స్ గురించి ఓ టీవీ ఛానెల్ యాంకర్ ప్రశ్నించారు. దీనికి సమాధానంగా అమీర్ మాట్లాడుతూ.." ఈ రోజు గుడ్ క్రికెట్ ఉంది, నేడు టీం ఇండియా పరిపూర్ణ క్రికెట్ ఆడింది. టీం ఇండియా గత మ్యాచ్‌లు చూస్తే ఇంగ్లాండ్ తో బాగా ఆడింది. ఇంగ్లాండ్ సంజూ శాంసన్ క్యాచ్ వదిలేసింది. అక్షర్ పటేల్ రెండు మంచి క్యాచ్‌లు పట్టుకున్నాడు. అక్షర్ క్యాచ్ పట్టకపోతే ఇంగ్లాండ్ ఒక ఓవర్ మిగిలి ఉండగానే మ్యాచ్ గెలిచేది" అని చెప్పాడు. గతం సూపర్-8లో ఇండియా వర్సెస్ వెస్టిండీస్ కీలక మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలవదని, వెస్టిండీస్ సెమీస్ కు వెళ్తుందని ఆమీర్ అన్నారు. కానీ,అతడి అంచనాలు తప్పని తేలింది. ఆ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించి సెమస్‌కు చేరింది. సెమీస్‌లో ఇంగ్లాండ్ గెలుస్తుందని మళ్లీ ఓ జోస్యం చెప్పాడు. చివరకు భారత్ ఘన విజయం సాధించి ఫైనల్‌లో నిలిచింది. అమీర్ వ్యాఖ్యలు చేయడం, ఆయన వ్యాఖ్యలు తప్పని భారత్ నిరూపించడం జరుగుతూనే ఉంది. కానీ, గెలిచిన తర్వాత మాట మార్చడం చూస్తున్న భారత ఫ్యాన్స్ మాత్రం నీకన్నా ఊసరవెల్లి నయం కదా అని అనుకుంటున్నారు.




# సంజు శాంసన్ సూపర్ ఫామ్ వెనుక సీక్రెట్

### బయటపెట్టిన టీమిండియా మాజీ కోచ్

**ఢిల్లీ:** కీలక మ్యాచ్‌లలో టీమిండియాను గట్టు ఎక్కించింది సంజు శాంసన్.. అసలు.. సంజు.. సూపర్ నాక్ లేకపోతే.. భారత్ ఫైనల్‌కు చేరేదా? అంటే లేదనే చెప్పాలి.. అయితే, ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న సంజుకు ఇంటి సూపర్ ఫామ్ ఎలా సాధ్యమైంది..? అనేది ఇప్పుడు చర్చ.. 2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో భారత వికెట్‌కీపర్




బ్యాట్స్‌మన్ సంజు శాంసన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. కీలక మ్యాచ్‌లలో అతను ఆడిన ఇన్నింగ్స్‌లు టీమ్ ఇండియాకు విజయాన్ని అందించడంలో ముఖ్య పాత్ర పోషించాయి. ముఖ్యంగా వెస్టిండీస్ మరియు ఇంగ్లాండ్‌పై సంజు చేసిన బ్యాటింగ్ అభిమానులను ఆకట్టుకుంది.

ఇప్పుడు టైటిల్ పోరులో భారత్ మరియు న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. ఈ ఫైనల్ మ్యాచ్ మార్చి 8న అహ్మదాబాద్‌లో జరగనుంది. ఈ నేపథ్యంలో భారత మాజీ కోచ్ రవి శాస్త్రి.. సంజు శాంసన్ సూపర్ ఫామ్ వెనుక ఉన్న అసలు సీక్రెట్‌ను బయట పెట్టాడు..

### వెస్టిండీస్‌పై అద్భుత ఇన్నింగ్స్

వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజు శాంసన్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి అజేయంగా 97 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్ కారణంగా భారత్ చిరస్మరణీయ విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో సంజు తన క్లాస్ మరియు ఆత్మవిశ్వాసాన్ని చూపించాడు.

### ఇంగ్లాండ్‌పై పేలుడు ఇన్నింగ్స్

సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా సంజు అద్భుత ప్రదర్శన చేశాడు. అతను 89 పరుగుల విలువైన ఇన్నింగ్స్ ఆడి భారత్‌కు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. భారత్ ఆ మ్యాచ్‌లో 253/7 స్కోరు చేసి చివరికి 7 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం విదితే..

### రవిశాస్త్రి బయట పెట్టిన సంజు విజయ రహస్యం

ఐసీసీ షో రివ్యూలో మాట్లాడిన రవిశాస్త్రి, సంజు విజయానికి ప్రధాన కారణం అతని మానసిక మార్పు మరియు స్థిరత్వం అని చెప్పారు. "సంజు శాంసన్ కు ప్రతిభ ఎప్పటినుంచో ఉంది.. కానీ, ప్రతిభ ఒక్కటే సరిపోదు. స్థిరంగా ప్రదర్శన ఇవ్వడం కూడా చాలా ముఖ్యం. గతంలో అతను కొన్ని సార్లు తప్పు షాట్ ఎంపిక వల్ల పెద్ద స్కోర్లు చేయలేకపోయాడు. ఇప్పుడు అతను తన ఆటను మరింత పరిపక్వంగా మార్చుకున్నాడు అని తెలిపారు. సంజు ప్రతిభపై ఎప్పుడూ సందేహం లేదని రవిశాస్త్రి చెప్పారు. అయితే గతంలో స్థిరత్వం లేకపోవడం వల్ల అభిమానులు కొంత నిరాశ చెందారని అన్నారు. ప్రస్తుతం 31 ఏళ్ల వయసులో సంజు మరింత పరిణతి చెందిన ఆటగాడిగా మారాడు. ఇప్పుడు అతను తన షాట్ ఎంపికలో జాగ్రత్తగా ఉండటం, తన బలాలపై నమ్మకం పెట్టుకోవడం వల్ల మంచి ఫలితాలు సాధిస్తున్నాడని శాస్త్రి తెలిపారు.మొత్తంగా టోర్నమెంట్ ప్రారంభంలో సంజు పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. నమీబియా మరియు జింబాబ్వేతో జరిగిన ప్రారంభ మ్యాచ్‌లలో అతను పెద్ద స్కోర్లు చేయలేదు. దీంతో అతని జట్టులో స్థానం గురించి కూడా ప్రశ్నలు వచ్చాయి. అయితే కీలక సమయంలో సంజు తన అసలైన ప్రతిభను చూపించాడు. వెస్టిండీస్ మరియు ఇంగ్లాండ్‌పై అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడి విమర్శకులకు సమాధానం ఇచ్చాడు. ఇప్పుడు టీమ్ ఇండియా టైటిల్‌కు ఒక్క అడుగు దూరంలో ఉంది. ఫైనల్‌లో సంజు శాంసన్ ఇదే ఫామ్ కొనసాగిస్తే భారత్‌కు కప్ గెలిచే అవకాశాలు మరింత పెరుగుతాయి.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక




## పుట్టినరోజున శ్రీవారిని దర్శించుకున్న జాన్వీ

జాన్వీ కపూర్ తన పుట్టినరోజు సందర్భంగా కలియుగ దైవం శ్రీవారిని దర్శించుకున్నారు. మార్చి 6 తన 29వ పుట్టినరోజును పురస్కరించుకుని తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం కోసం కాలిబాటన తిరుమలకు చేరుకున్నారు. తన పిన్ని నటి మహేశ్వరితో మెట్లమార్గంలో కొండపైకి చేరుకున్న జాన్వీ తెల్లవారుజామున వి.ఐ.పి బ్రేక్ దర్శనంలో స్వామివారిని దర్శించుకుంది. దర్శనం అనంతరం జాన్వీకి రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందించారు. సాంప్రదాయ పట్టు వస్త్రాల్లో మెరిసిపోతున్న జాన్వీని చూసేందుకు భక్తులు ఎగబడగా, ఆమె ఎంతో ఓపికతో వారితో సెల్ఫీలు దిగుతూ కన్పించారు. ప్రస్తుతం తెలుగు సినిమాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఈ భామ, ఇప్పటికే 'దేవర' చిత్రంతో అదరగొట్టి, త్వరలో రామ్ చరణ్ సరసన బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రాబోతున్న భారీ చిత్రం 'పెద్ది' ద్వారా ప్రేక్షకులను పలకరించనున్నారు.



# ఆసక్తిగా సాగే.. 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'



టాలీవుడ్ సీనియర్ నటీనటులు శివాజీ, లయ సుదీర్ఘ విరామం తర్వాత జంటగా నటించిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ క్రైమ్ కామెడీ డ్రామాను శివాజీ స్వయంగా నిర్మించారు. భారీ అంచనాల మధ్య శుక్రవారం విడుదలైంది. హార్శిలి హిల్స్‌లో నివసించే శ్రీరామ్ (శివాజీ) ఒక నిజాయితీ గల పంచాయతీ కార్యదర్శి. తన భార్య ఉత్తర (లయ), రీల్స్ పిచ్చితో వింత పనులు చేసే కొడుకు నితిన్ అలియాస్ బిట్టు (రోహన్)తో కలిసి సాధారణ జీవితం గడుపుతుంటాడు. అయితే, ఆడవాళ్ల పిచ్చి ఉన్న స్థానిక ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్), శ్రీరామ్ లేని సమయంలో ఉత్తరపై కన్నేసి వారి ఇంటికి వస్తాడు. కానీ ఊహించని విధంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. అసలు కథ ఇక్కడే మొదలవుతుంది. ఆ హత్య కేసు నుండి తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి శ్రీరామ్ ఏం చేశాడు? శవాన్ని మాయం చేసే క్రమంలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులేంటి? మరోవైపు కోటి రూపాయల గిఫ్ట్ బ్యాగ్ కోసం ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట ఎందుకు పడింది? ఈ గందరగోళంలో కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్) పాత్ర ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ చిత్రం. దర్శకుడు సుధీర్ శ్రీరామ్ ఒక డార్క్ క్రైమ్ థ్రిల్లర్‌ను వినోదాత్మకంగా మలచడంలో సఫలమయ్యాడని చెప్పవచ్చు. కథలో పెద్దగా కొత్తదనం లేకపోయినప్పటికీ, పాత్రల చిత్రణ మరియు కథనాన్ని నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సినిమా ఆరంభంలో పాత్రల పరిచయం, ఆ తర్వాత వచ్చే మలుపులు ప్రేక్షకుడిని కథలోకి తీసుకెళ్తాయి. అయితే ఎప్పుడైతే హత్య జరుగుతుందో, అక్కడి నుండి కథ థ్రిల్లింగ్ మోడ్‌లోకి మారుతుంది. శవాన్ని మాయం చేసేందుకు హీరో వేసే ప్లాన్లు, మరోవైపు ఎమ్మెల్యే మనుషుల నుంచి తప్పించుకునే సీన్లు ఆసక్తిని కలిగిస్తాయి. అయితే, ద్వితీయార్థంలో అక్కడక్కడా కథనం కాస్త నెమ్మదించినట్లు అనిపిస్తుంది. శివాజీ తనదైన టైమింగ్ మరియు అనుభవంతో శ్రీరామ్ పాత్రలో ఒదిగిపోయారు. మధ్యతరగతి తండ్రి పడే తపనను చక్కగా పండించారు. చాలా కాలం తర్వాత తెరపై కనిపించినా, తన నటనతో అలరించింది లయ. ఇక కొడుకు పాత్రలో రోహన్ తన అల్లరితో నవ్వించగా, ధనరాజ్ పాత్ర చివరిలో సర్ప్రైజ్ చేస్తుంది. శరత్ లోహితాశ్వ, ప్రిన్స్ తమ పరిధి మేరకు నటించారు.

# పెద్ది నుంచి జాన్వీకపూర్ వీడియో విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'లో కథానాయిక జాన్వీ కపూర్ ఈరోజు తన 29వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఆమెకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ ఒక స్పెషల్ వీడియోను విడుదల చేసింది. కాటుక అక్కర్లేని ఆ కళ్లు, ముక్కుపుడక అక్కర్లేని ఆ ముక్కు.. అంటే అలంకరణ అక్కర్లేని అరుదైన చికిరియే ఈ చికిరి.. అంటూ దర్శకుడు బుచ్చిబాబు సనా జాన్వీని ప్రశంసిస్తూ ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో జాన్వీ 'అచ్చియమ్మ' అనే పల్లెటూరి యువతి పాత్రలో నటిస్తుంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సహకారంతో వృద్ధి సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 30 న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో జాన్వీ కపూర్ 'అచియమ్మ' అనే పాత్రలో కనిపించబోతోంది. బుచ్చిబాబు తన ట్వీట్‌లో.. 'నీతో వర్క్ చేయడం చాలా సంతోషంగా ఉంది. స్క్రీన్ మీద అచియమ్మగా నీ పవర్‌ఫుల్ అవతారాన్ని ప్రపంచం చూడబోతున్నందుకు నేను చాలా ఎ÷-జగైటెడ్‌గా ఉన్నాను' అంటూ పేర్కొన్నారు. విడుదలైన పోస్టర్‌లో జాన్వీ లుక్ అందరినీ ఆకట్టుకుంటోంది. గతంలో శ్రీదేవి - చిరంజీవి జోడీ వెండితెరపై సృష్టించిన మ్యాజిక్ గురించి తెలిసిందే. ఇప్పుడు వారి వారసులు రామ్ చరణ్ - జాన్వీ కపూర్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.



# మాస్ రోల్‌లో శర్వానంద్..భోగి




ఇటీవలే 'నారీ నారీ నడుమ మురారి'తో క్లాస్ హిట్ అందుకున్న శర్వానంద్, ఇప్పుడు రూట్ మార్చి పూర్తి స్థాయి మాస్ రోల్‌లో కనిపించబోతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భోగి' చిత్రంలో నటిస్తుండగా. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయి-న్లుగా నటిస్తున్నారు. 'ధమాకా' ఫేమ్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండటంతో పాటలపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన శర్వానంద్ లుక్ చూస్తుంటే, బాక్సాఫీస్ వద్ద ఈసారి మాస్ జాతర ఖాయమనిపిస్తోంది. దీనికి తోడు నేడు శర్వానంద్ పుట్టినరోజును పురస్కరించుకుని మేకర్స్ ఒక స్పెషల్ రఫ్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. దర్శకుడు సంపత్ నంది ఈ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. 'మొన్న గంగని చూశారు.. ఇప్పుడు పెను గంగని చూడండి' అంటూ తన హీరో క్యారెక్టర్‌కు పవర్‌ఫుల్ ఎలివేషన్ ఇచ్చారు. ఈ పోస్టర్‌లో శర్వానంద్ గడ్డంతో, ఇంటెన్స్ లుక్‌లో చాలా డైనమిక్ గా కనిపిస్తున్నారు. శర్వానంద్ కెరీర్‌లోనే ఇది మోస్ట్ మాస్ ఫిల్మ్ అవుతుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇక శ్రీ శ్రీనివాస సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 28, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ప్రజంట్ శర్వ లుక్ వైరల్ అవుతుంది.

# వృషకర్మ గ్లింప్స్ అద్భుతం: సుకుమార్

యువసామ్రాట్ నాగచైతన్య నటిస్తున్న మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' ఫస్ట్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ గ్లింప్స్ చూసిన ప్రముఖ దర్శకుడు సుకుమార్, చిత్ర బృందంపై ప్రశంసల వర్షం కురిపించారు. సుకుమార్ రైటింగ్స్ కూడా ఈ నిర్మాణంలో భాగస్వామి కావడంతో, ఆయన ఈ అవుట్‌పుట్ పట్ల ఎంతో సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.సుకుమార్ అభినందనలపై నాగచైతన్య ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పందిస్తూ.. 'థాంక్యూ సుకుమార్ గారు. మీలాంటి విజనరీ నుంచి ఇలాంటి మాటలు రావడం మాకు ఎంతో గౌరవంగా ఉంది. మీ ప్రశంసలు మాకు ఎంతో స్ఫూర్తినిస్తాయి' అంటూ కృతజ్ఞతలు తెలిపారు. కార్తీక్ దండు రూపొందించిన ఈ సూపర్ నేచురల్ ప్రపంచం సుకుమార్‌ను సైతం ఆశ్చర్యపరిచిందని చైతూ ట్వీట్ ద్వారా స్పష్టమవుతోంది. గతంలో కార్తీక్ దండు రూపొందించిన 'విరూపాక్ష' చిత్రానికి సుకుమార్ స్క్రీన్ ప్లే అందించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'వృషకర్మ'తో తన శిష్యుడు మరో అద్భుతాన్ని వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడని సుకుమార్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. దీంతో ఈ గురు-శిష్యుల బాండింగ్.. చైతన్యతో వారి అనుబంధం సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.



CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861